ఈనాడు

విజయవాడ 18-8-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 9 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్



ఖరారు చేసిన భాజపా పార్లమెంటరీ బోర్డు

ఈ స్థానాన్ని అధిష్ఠించబోతున్న మూడో తమిళ నేత!

దక్షిణాది లోటు భర్తీకి ప్రయత్నం చేసిన కాషాయ నాయకత్వం

ఈనాడు, దిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్(67) పేరు ఖరారైంది. ఆదివారం సాయంత్రం భాజపా ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో జరిగిన భాజపా పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఆయన పేరును ఎంపిక చేశారు. తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. అంతకు ముందు ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ గవర్నర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న రాధాకృష్ణన్ ఓబీసీ నేత, తమిళనాడులో బలమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. రెండుసార్లు కోయంబత్తూరు నుంచి లోక్‌సభ ఎంపీగా విధులు నిర్వహించిన రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు నడ్డా పిలుపునిచ్చారు. లోక్‌సభ, రాజ్యసభ ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీయేకు మెజారిటీ ఉండటంతో రాధాకృష్ణన్ ఎన్నిక దాదాపు ఖాయంగానే కనిపిస్తుంది.

దక్షిణాది రాష్ట్రాల నాయకులపై భాజపా నాయకత్వం చిన్నచూపు చూస్తోందన్న (మిగతా 2లో)

రాధాకృష్ణన్‌కు తెదేపా సంపూర్ణ మద్దతు
- సీఎం చంద్రబాబు

2లో

ఉత్తరాంధ్రకు వైభోగమే

- వాయువేగంతో భోగాపురం విమానాశ్రయం పనులు
- 2026 జూన్‌కు సిద్ధం
- ఇప్పటికే 84 శాతం పని పూర్తి..



రూపుదిద్దుకుంటున్న విమానాశ్రయం

ఈనాడు, విజయనగరం: ఉత్తరాంధ్రవాసుల కల త్వరలో నెరవేరనుంది. విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం శరవేగంతో సాగుతోంది. 2026 జూన్‌కల్లా పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలని నిర్మాణ సంస్థ జీఎంఆర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీంతో గడువుకు ముందే విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ ద్వారా జీఎంఆర్ చేపట్టింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటికి 31.80 శాతమే పనులు అయ్యాయి. కూటమి హయాంలో జులై (మిగతా 2లో)

రెండు దశల్లో నిర్మాణం

- తొలి దశ వ్యయం: రూ.4,592 కోట్లు
- ఏరో బ్రిడ్జ్‌లు: 22
- టెర్మినల్ బిల్డింగ్: 81 వేల చదరపు మీటర్లు
- విమానాశ్రయం విస్తీర్ణం: 2,203 ఎకరాలు. ఇతర అవసరాలకు తాజాగా మరో 500 ఎకరాల అప్పగింత
- రన్‌వేలు: రెండు.. ఒక్కోటీ 3.8 కి.మీ. పొడవు
- ఏటా ప్రయాణికులు: ఆరంభంలో 60 లక్షల మంది. అంచెలంచెలుగా నాలుగు కోట్లకు పెంపు లక్ష్యం
- ప్రధాన జోన్లు: ఏరో స్పేస్, ఇండస్ట్రియల్, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్
- అనుబంధ విభాగాలు: ఏరో సిటీ, విడిభాగాల తయారీ పరిశ్రమలు, ఆరోగ్య, అతిథి రంగాల అభివృద్ధి
- రెండోదశ పనులు: 2030లో ప్రారంభం

జులై 31 నాటికి పనుల ప్రగతి ఇలా

అనుబంధ భవనాలు	మెయిన్ యాక్సిస్ రోడ్డు	టెర్మినల్ భవనం	ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్	టాక్సీవే	రన్‌వే
57.92%	64.02%	74.79%	89.26%	99.06%	99.68%



దిల్లీలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించి, పరిశీలిస్తున్న మోదీ

జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి

రాష్ట్రాలకు ప్రధాని మోదీ పిలుపు

దిల్లీలో రూ.11వేల కోట్ల హైవే ప్రాజెక్టుల ప్రారంభం

భారత్‌కు తిరిగొచ్చిన గగనయాత్రికుడు!

శుభాంశు శుక్లాకు దిల్లీలో ఘనస్వాగతం

నేడు మోదీతో భేటీ

లోపలి పేజీల్లో

ఆధారాలు చూపండి.. క్షమాపణైనా చెప్పండి

- సంతకం చేసిన అఫిడవిట్ వారంలో సమర్పించండి
- లేదంటే మీ ఆరోపణలు నిరాధారమని భావిస్తాం
- మా భుజంపై తుపాకీ పెట్టి రాజకీయాలు చేయొద్దు
- 'జీరో హౌస్ నంబర్' కింద కొందరికి ఓటుహక్కు కల్పిస్తున్నాం
- వారిని నకిలీలంటే పేదల్ని అవమానించినట్లే
- రాహుల్ ఆరోపణల్ని ఖండించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్



దిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్. చిత్రంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి

ఈనాడు, దిల్లీ: ఓట్ల చోరీ జరిగిందంటూ పదే పదే ఆరోపిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దానికి తగ్గ ఆధారాలనైనా సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని 'భారత ఎన్నికల సంఘం' (ఈసీఐ) డిమాండ్ చేసింది. ఆయన వద్ద ఆధారాలుంటే వారం రోజుల్లో ప్రమాణ పత్రం రూపంలో సంతకంతో సమర్పించాలని అల్టిమేటం జారీచేసింది. అలా చేయనిపక్షంలో ఆరోపణల్ని నిరాధారాలుగా పరిగణిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఈసీ భుజాన తుపాకీ పెట్టి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేసేవారి ఆటలు సాగవని తేల్చిచెప్పారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఓటర్లపై నకిలీలనే ముద్రవేసే ఎత్తులను తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు. కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్లపై రాహుల్ ఫిర్యాదు చేసినందున వారంలోపు తప్పనిసరిగా ప్రమాణ పత్రం దాఖలుచేసి, ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఓట్ల చోరీపై రాహుల్ ఆందోళన కార్యక్రమం మొదలుపెట్టిన నేపథ్యంలో ఆదివారం ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్‌సింగ్ సంధు, వివేక్‌జోషీతో కలిసి 85 నిమిషాలసేపు మీడియాతో జ్ఞానేశ్‌కుమార్ మాట్లాడారు.

అందరి సమక్షంలోనే ఎస్ఐఆర్

"బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) కింద ప్రాథమిక ఓటర్ల జాబితాను బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌వోలు), రాజకీయపార్టీల ఏజెంట్లు, సర్పంచుల సమక్షంలోనే తయారుచేశాం. వారందరి సంతకాలు, వీడియో సాక్ష్యాలు ఉన్నాయి. ఏవైనా తప్పులుంటే ఫిర్యాదుచేయడానికి సెప్టెంబరు 1 వరకు సమయం (మిగతా 2లో)

20 ఏళ్లలో మృతులు 22 లక్షలు

సాధారణ ఓటర్ల జాబితా సవరణ జరిగినప్పుడు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వరు. 2003 తర్వాత జరిగిన సవరణల్లో.. మరణించినవారి పేర్లు తొలగించలేదు. ఇప్పుడు మృతులందరినీ ఒకేసారి జాబితా నుంచి తొలగించడంతో 22 లక్షలమంది చనిపోయినట్లు కనిపిస్తోంది. ఇవి గత 20 ఏళ్ల గణాంకాలు తప్పితే ఆరు నెలలవి కాదు.

– సీఈసీ జ్ఞానేశ్ కుమార్

భాజపాను అఫిడవిట్ అడగలేదేం?



ఓటర్ అధికార్ యాత్రలో అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ. చిత్రంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

- ఈసీ బెదిరింపులకు భయపడను
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్
- బిహార్‌లో మొదలైన ఓటర్ అధికార్ యాత్ర

సాసారాం, ఔరంగాబాద్ (బిహార్): ఎన్నికల సంఘం (ఈసీ)పై మీడియా ఎదుట తాను చేసిన ఆరోపణలకు అఫిడవిట్ అడిగారని, అనురాగ్ ఠాకుర్ వంటి భాజపా నేతలు అదే మాట్లాడినా ఈసీ పట్టించుకోదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీశారు. "మోదీ, అమిత్ షా, ఈసీ స్పష్టంగా వినాలి.. మీ అధికారుల బెదిరింపులకు నేను, తేజస్వీ భయపడబోం. ప్రజలకు నిజాలు చెబుతూనే ఉంటాం" అన్నారు. భాజపాతో కలిసి ఈసీ ఓట్ల అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఇప్పుడు యావత్తు దేశానికీ తెలిసిపోయిందన్నారు. బిహార్‌లోని 20 జిల్లాల మీదుగా 1,300 కిలోమీటర్ల మేర కొనసాగే 'ఓటర్ అధికార్ యాత్ర'ను సాసారాం నగరం నుంచి ఆదివారం ప్రారంభించిన (మిగతా 3లో)


అన్నదాతా సుఖీభవకు 20లోగా అర్జీలు ఇవ్వండి

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హత సాధించలేకపోయినవారు ఈ నెల 20లోగా అర్జీలు ఇవ్వాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు కోరారు. గ్రామస్థాయిలోని రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద వినతులు ఇవ్వవచ్చని సూచించారు. గడువు తేదీ దగ్గర పడుతున్నందున వ్యవసాయ అధికారులు దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అమ్మకానికి బ్యాంకు ఖాతాలు

ఈనాడు – ఒంగోలు

డిజిటల్ అరెస్టులు.. ఫేక్ యాప్‌లతో స్టాక్‌మార్కెట్ పెట్టుబడులు.. క్రికెట్ బెట్టింగ్‌లు.. లేదంటే న్యూడ్ కాల్స్.. ఇలా ఎన్నో రకాలుగా సైబర్ మోసగాళ్లు సామాన్యులను ముంచేస్తున్నారు. వారిని బెదిరించో, మభ్యపెట్టో కొన్ని బ్యాంకు ఖాతాల నంబర్లు ఇచ్చి వాటికి సొమ్ము బదిలీ చేయాలంటారు. ఆ ఖాతాలన్నీ అమాయకులవే. అసలు నిందితులు తాము దొరక్కుండా ఇలా అమాయకుల పేరిట మ్యూల్ ఖాతాలను నిర్వహిస్తూ డబ్బులు కొల్లగొడుతున్నారు. ఇలాంటి ఖాతాలను ఇటు దిల్లీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి, అటు వియత్నాం, కాంబోడియా, తైవాన్ తదితర దేశాల నుంచి సైబర్ ముఠాలు తమ మోసాలకు వినియోగించుకుంటున్నాయి. ఏదైనా ఖాతాలో డబ్బులు పడిన మరుక్షణం వేరే ఖాతాలకు బదిలీ చేసేస్తారు దుండగులు. ఒంగోలులో పట్టుబడిన ఖాతాలను పరిశీలిస్తే తైవాన్ నుంచి లావాదేవీలు



నిర్వహించినట్లు తేలింది. ఇలా ఏడుగురి ఖాతాల నుంచి రూ.లక్షల్లో లావాదేవీలు జరిగాయి. పోలీసులు దర్యాప్తు చేసినా దొరక్కుండా ముందుజాగ్రత్తగా ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు నగదు వెంటవెంటనే బదిలీ చేసేశారు. సైబర్ నేరాల కారణంగా అమాయకులైన ఖాతాదారులపై పంజాబ్, దిల్లీలలో కేసులు నమోదయ్యాయి.

అత్యంత పకడ్బందీగా..

- సైబర్ నేరగాళ్లు దక్షిణ భారతదేశానికి చెందిన ఖాతాలను ఉత్తరాది రాష్ట్రాలకు పంపిస్తున్నారు. అక్కడి ఖాతాలను దక్షిణాది రాష్ట్రాల్లో మోసాలకు వినియోగిస్తున్నారు.
- గుంటూరుకు చెందిన ఓ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. ఆయన డబ్బులు బదిలీ అయిన ఖాతా గురించి ఆరా తీస్తే అది జమ్మూకశ్మీర్‌లోని ఓ చిరు (మిగతా 2లో)

ఒంగోలు పీర్ల మాన్యానికి చెందిన ఓ మహిళకు డబ్బులు ఇస్తామని చెప్పి బ్యాంకులో ఖాతా తెరిపించారు. పాస్‌బుక్‌తో పాటు డెబిట్ కార్డు, ఆమె పేరిట కొత్త సిమ్‌కార్డు తీసుకున్నారు. ఇవన్నీ అప్పగించినందుకు ఆమెకు రూ.5వేలు ఇచ్చారు. ఆ ఖాతా ద్వారా తైవాన్ నుంచి రూ.లక్షల్లో లావాదేవీలు సాగాయి. వెంటనే సైబర్ మోసాలకు పాల్పడిన నేరానికి పంజాబ్, దిల్లీ రాష్ట్రాల్లో ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ సంగతులన్నీ పోలీసులు చెప్పేవరకు ఆమెకు తెలియవు. తర్వాత లబోదిబోమంది!

గంజాయి స్మగ్లర్ బరితెగింపు

- వెంటాడిన పోలీసులను కారుతో ఢీకొట్టే యత్నం
- కాల్పులు జరిపి పట్టుకున్న వైనం



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శిస్తున్న 'ఈగల్' ఐజీ ఆకే రవికృష్ణ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: కారులో పరారవుతున్న గంజాయి స్మగ్లరును వెంబడించిన పోలీసులు రెండు రౌండ్ల కాల్పులు జరిపి మరీ అతడిని పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున నెల్లూరు జాతీయ రహదారిపై సినీ ఫక్కీలో ఈ ఘటన చోటు చేసుకుంది. అల్లూరు సీతారామరాజు జిల్లా మన్యం నుంచి కారులో 22 కేజీల గంజాయిని నెల్లూరుకు తీసుకువస్తున్నట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్, ఈగల్ టీంకు సమాచారం అందింది. దీంతో బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్ టీం కానిస్టేబుల్ ఫిరోజ్‌లతో కలిసి కాపు కాశారు. నిందితుడు ఇద్దరు వ్యక్తులకు గంజాయిని అందజేసేందుకు కారును ఆపబోయాడు. పోలీసులు దాన్ని చుట్టుముట్టే క్రమంలో ఆ వ్యక్తులు పరారయ్యారు. స్మగ్లర్ కారుతో పోలీసులపైకి దూసుకొచ్చి ఢీకొట్టబోయాడు. కానిస్టేబుల్ ఫిరోజ్‌కు గాయాలు కాగా, మిగిలినవారు కొద్దిలో తప్పించుకున్నారు. వెంటనే కారును వెంబడిస్తూ రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. నిందితుడు కారు వదిలి పరారవుతుండగా పట్టుకున్నారు. గాయాలైన కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి తరలించారు.

కారు డ్రైవరే స్మగ్లర్: రాజమహేంద్రవరానికి చెందిన బీరక ప్రకాష్ అనే కారు డ్రైవరు మన్యం నుంచి గంజాయిని (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించను
తెదేపా నేతలకు అధినేత చంద్రబాబు హెచ్చరిక

ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం

కూన రవికుమార్, నసీర్ అహ్మద్‌లపైనా అసంతృప్తి

పని ప్రదేశాల్లో ఉద్యోగులతో వేళాకోళాలు వద్దు
అవి సామర్థ్యాలను చంపేస్తాయి

ఐఐఎం లఖ్‌నవూ అధ్యయనంలో వెల్లడి



శ్రీకాకుళం జిల్లా గెడ్డూరు వద్ద అలల తాకిడికి రోడ్డు కోతకు గురై సముద్రంలోకి కొట్టుకుపోతున్న పడవను తాడుకట్టి ఒడ్డుకు లాగుతున్న మత్స్యకారుడు

ఎడతెరిపి లేని వానలు

చిగురుటాకుల్లా వణికిన పలు జిల్లాలు

విశాఖలో 15.3 సెం.మీ...
పలు ప్రాంతాల్లో 10 సెం.మీ.కు పైగా వర్షం

జారిపడిన కొండచరియలు

బంగాళాఖాతంలో వాయు'గండం'

కోస్తాలో అతి భారీ వానలకు అవకాశం

2లో

రక్షిత అడవినే భక్షించాలని..

125 ఎకరాలపై శ్రీకాళహస్తి ప్రజాప్రతినిధి కన్ను

అభ్యంతరం చెబుతున్న అటవీ అధికారులకు బెదిరింపులు

ఈనాడు – తిరుపతి



సింహాచలకండ్రిగ అటవీశాఖ స్థలంలో ఎర్రచందనం, ఇతర చెట్లు

రక్షిత అటవీ భూమిలో రెవెన్యూ అధికారులు రెండు దశాబ్దాల కిందట డీకేటీ పట్టాలు, పాస్ పుస్తకాలు ఇచ్చేశారు. దీనిపై రెవెన్యూ, సర్వే, అటవీశాఖల అధికారులతో సంయుక్త సర్వేకు హైకోర్టు ఆదేశించింది. ఇది రక్షిత అడవేనని నివేదికలో తేటతెల్లమైంది. దాంతో డీకేటీ పట్టాలు రద్దుచేసి భూమిని వెనక్కి తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఏళ్లుగా తాత్సారం చేస్తోంది. ఇప్పుడు పాత పట్టాదారులను ముందుంచి ఆ ప్రాంతంలోని కీలక ప్రజాప్రతినిధి.. రక్షిత అటవీ భూమినే ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. ఇదంతా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతోంది. మిమ్మల్ని బదిలీ చేయించైనా పంతం నెగ్గించుకుంటానని సదరు ప్రజాప్రతినిధి బెదిరిస్తున్నారు.

శుభ్రం చేసేందుకు వెళ్లగా అడ్డగింత

శ్రీకాళహస్తి మండలం ఇలగనూరు పరిధిలో 608 ఎకరాల రక్షిత (మిగతా 2లో)



అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రొంపుల ఘాట్‌రోడ్డులో జారిపడిన కొండచరియలు



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో శివుడు, నందీశ్వరుని విగ్రహాల వద్దకు చేరిన వరద

ఎడతెరిపి లేని వానలు

- చిగురుటాకులా వణికిన ఉత్తరాంధ్ర
- విశాఖలో 15.3 సెం.మీ. వర్షం
- జారిపడిన కొండచరియలు
- బంగాళాఖాతంలో వాయు'గండం'..!
- కోస్తాలో అతి భారీ వానలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం-పాడేరు, దేవీపట్నం, కొవ్వూరు పట్టణం, హరిపురం (మందస), న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. రాష్ట్రంలోనే అత్యధికంగా రాత్రి 7 గంటల వరకు విశాఖ జిల్లా కాపులుప్పాడలో 15.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాంధ్రలో 25కు పైగా ప్రాంతాల్లో 10 సెం.మీ.కు పైగా వర్షం కురిసింది. శ్రీకాకుళం జిల్లా మందస మండలం దున్నూరు పంచాయతీలో నాలుగు పడవలు సముద్రంలోకి కొట్టుకుపోయాయి. గెడ్డూరు మీదుగా భారీగా వరద నీరు సముద్రంలోకి చేరడంతో తీరం కొంతమేర కోతకు గురై ఈ ఘటన చోటుచేసుకుంది. మత్స్యకారులు అప్రమత్తమై వాటికి తాళ్లు కట్టి ఒడ్డుకు చేర్చారు.

● అల్లూరి సీతారామరాజు జిల్లాలో పలుచోట్ల పంటలు నీటమునిగాయి. గూడెంకొత్తవీధి మండలంలోని రొంపుల ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద ఆదివారం గోదావరి ఉద్ధృతి పెరిగింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలతో వరద పోటెత్తడంతో ఆదివారం సాయంత్రానికి గోదావరి నిండు కుండను తలపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గోష్పాద క్షేత్రం ప్రధాన రేవులో నందీశ్వరుని విగ్రహాల వరకు నీరు చేరింది. గామన్ వంతెన, హేవలాక్, రోడ్‌కం రైలు వంతెనల వద్ద వరద నీరు హోరెత్తుతూ సాగుతోంది.



శ్రీకాకుళం జిల్లా గెడ్డూరు వద్ద వరద తాకిడికి తీరం కోతకు గురై సముద్రంలోకి కొట్టుకుపోతున్న పడవ



విశాఖలోని నౌసేనాబాగ్ నేవల్ క్వార్టర్స్ ప్రధాన గేటు వద్ద నిలిచిన వాననీరు

● మరోవైపు ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. మంగళవారం మధ్యాహ్నానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్యలో తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

● కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు మూడో నంబరు హెచ్చరికలు జారీ చేసినట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో బుధవారం వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

హోంమంత్రి సమీక్ష..

రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ప్రజలు అత్యవసరమైతే విపత్తుల నిర్వహణ సంస్థ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని సూచించారు.



విశాఖ పెదగదిలిలో ఇంటి ముందు కుంగిన భూమి

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్

(మొదటి పేజీ తరువాయి)

అపవాదును సరిదిద్దుకొనే ప్రయత్నంలో భాగంగానే సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు కనిపిస్తోంది. దక్షిణాది భాజపాలో అత్యంత సీనియర్ కావడం, ఆరెస్సెస్ మద్దతు ఉండటం, 2026లో తమిళనాడు ఎన్నికలు జరగనుండటం లాంటి కారణాలతో భాజపా రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు పదవీకాలం పూర్తయిన తర్వాత దక్షిణాది రాష్ట్రాలకు సరైన ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం ఎక్కువగా వినిపించింది. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇదే విషయాన్ని ప్రస్తావించడంతోపాటు, దక్షిణాది నుంచి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. . 2022లో లోక్‌సభ, రాజ్యసభకు సభాపతులుగా ఓంబిర్లా, జగదీప్ ధన్‌ఖడ్‌లు ఎన్నికయ్యారు. ఇద్దరూ రాజస్థాన్‌కు చెందినవారే కావడంతో ప్రాంతీయ సమతుల్యం దెబ్బతిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. 17వ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడంతో భాజపా లెక్క సరిచేసుకున్నట్లు కనిపిస్తోంది.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవుల్లో గవర్నర్లకు పెద్దపీట

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు భాజపా నాయకత్వం గవర్నర్లనే ఎంచుకుంటోంది. మోదీ అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి 2017లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికలో అప్పటి బిహార్ గవర్నర్ రామ్‌నాథ్ కోవింద్‌కు అవకాశం కల్పించారు. 2022లో రాష్ట్రపతిగా పోటీచేసిన ద్రౌపదీముర్ము 2015 మే నుంచి 2021 జులై వరకు ఝార్ఖండ్ గవర్నర్‌గా సేవలందించారు. 2022లో ఉపరాష్ట్రపతి పదవికి పోటీచేసిన జగదీప్ ధన్‌ఖడ్ అప్పటికి పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఉన్నారు. ఇప్పుడు వారి సరసన సీపీ రాధాకృష్ణన్ చేరనున్నారు. ఆరెస్సెస్, భాజపాలకు కొత్త అయిన జగదీప్ ధన్‌ఖడ్‌ను రెండో అత్యున్నత రాజ్యాంగ పీఠంపై కూర్చోబెట్టి కొంత చేదు అనుభవాన్ని చవిచూసిన భాజపా నాయకత్వం ఈసారి ఆచితూచి వ్యవహరించింది. ప్రభుత్వం, పార్టీ వ్యవహారశైలి గురించి క్షుణ్నంగా తెలిసిన వ్యక్తిని ఎంచుకొంది.

ఐదేళ్లూ ఉంటారు

ఉపరాష్ట్రపతి పదవికి ఉప ఎన్నిక ఉండదు. పదవిలో ఉన్నవారు మధ్యలోనే రాజీనామా చేసినా, మరణించినా తదుపరి ఎన్నికైన అభ్యర్థి బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఐదేళ్లు పదవిలో ఉంటారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 1న జారీచేసిన ఎన్నికల షెడ్యూల్‌లోనూ పేర్కొంది. రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే 2030 వరకు పదవిలో కొనసాగుతారు. 2027లో ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పదవీకాలం పూర్తయినప్పుడు రాష్ట్రపతి పదవికి ఎన్నిక జరుగుతుంది. ఇదివరకు కాంగ్రెస్ హయాంలో రాష్ట్రపతి పదవికి ఉపరాష్ట్రపతి పేర్లను ప్రతిపాదించిన ఉదంతాలున్నాయి. తమిళనాడుకే చెందిన సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకటరామన్‌లు అలాగే అత్యున్నత పీఠాన్ని చేరుకున్నారు. ఈయనకూ అలాంటి అవకాశం దక్కితే చరిత్ర పుటల్లో వారి సరసన చేరే అవకాశం ఉంటుంది.

తుదిశ్వాస వరకూ దేశ సేవలోనే..

నన్ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు ప్రధాని మోదీ, భాజపా, ఎన్డీయే పక్షాలకు ధన్యవాదాలు. నాపై వారు ఉంచిన నమ్మకం, దేశానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించడం నన్ను కదిలించింది. మాటల్లో చెప్పనలవికాని భావోద్వేగానికి గురయ్యాను. నా తుదిశ్వాస వరకూ దేశం కోసం పనిచేస్తానని హామీ ఇస్తున్నా. జైహింద్.

– సి.పి.రాధాకృష్ణన్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి



దిల్లీలో జరిగిన భాజపా పార్లమెంటరీ బోర్డు సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్

వివాదరహితుడు.. విశ్వాసపాత్రుడు

దక్షిణ భారత భాజపా నేతల్లో సీపీ రాధాకృష్ణన్ అత్యంత సీనియర్. 'తమిళనాడు మోదీ'గా పార్టీలో ఆయనకు పేరుంది. పార్టీకి అత్యంత విశ్వాసపాత్రుడు. పైగా వివాద రహితుడు. అందుకే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా భాజపా ప్రకటించింది. 1957 అక్టోబరు 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించిన సీపీ రాధాకృష్ణన్ 16వ ఏట నుంచి ఆరెస్సెస్, జన్‌సంఘ్‌లతో కలిసి పనిచేశారు. ఇప్పుడు ఆ అనుభవమే దేశ రెండో అత్యున్నత పదవిని అధిష్ఠించేస్థాయికి తీసుకెళ్తోంది. కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 1998, 1999 ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు. 2004 నుంచి 2007 వరకు తమిళనాడు భాజపా అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో 93 రోజుల పాటు తమిళనాడులోని ప్రతి నియోజకవర్గాన్ని చుడుతూ 19వేల కిలోమీటర్లమేర రథయాత్ర నిర్వహించి నదుల అనుసంధానం, అంటరానితనం, ఉగ్రవాదం నిర్మూలన గురించి ప్రచారం చేపట్టారు. మోదీ తొలిసారి ప్రధానమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి 3.89 లక్షల ఓట్లతో రెండోస్థానానికి పరిమితమయ్యారు. 2019 ఎన్నికల్లోనూ అదే స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2023 ఫిబ్రవరి 12న తొలిసారి ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2024 మార్చి 19న అప్పటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో ఆ మరుసటిరోజు నుంచి తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జులై 27న మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయి ప్రస్తుతం అక్కడే సేవలందిస్తున్నారు.. ఈయన ఉపరాష్ట్రపతి పదవి చేపడితే సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకటరామన్‌ల తర్వాత తమిళనాడు నుంచి ఆ పీఠాన్ని అధిష్ఠించిన మూడో వ్యక్తిగా రికార్డులకెక్కుతారు. 2016-20 మధ్యకాలంలో కాయిర్ (కొబ్బరి పీచు) బోర్డు ఛైర్మన్‌గా సేవలందించారు. ఆ సమయంలో భారత్‌నుంచి రికార్డు స్థాయిలో కాయిర్ ఎగుమతులు జరిగాయి. ఆయన వివిధ అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు.

తెదేపా సంపూర్ణ మద్దతు: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఎన్డీయే తరపున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'అనుభవజ్ఞుడైన రాజనీతిజ్ఞుడిగా, గౌరవనీయ నాయకుడిగా ఆయన ఎంతోకాలం దేశానికి సేవలందించారు' అని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇదే అంశంపై మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రక్షిత అడవినే భక్షించాలని..

(మొదటి పేజీ తరువాయి)

అటవీభూమి ఉంది. ఇందులో సింహభాగం ఎర్రచందనం వృక్షాలున్నాయి. భారతమాల పరియోజనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. దీనికోసం భాకరాపేట ఘాట్‌లో 112.975 ఎకరాల అటవీ భూమిని తీసుకోవాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయంగా శ్రీకాళహస్తి మండలం సింహాచలకండ్రిగలో 125 ఎకరాలు, ఏర్పేడు మండలం చింతలపాళ్యంలో 100.95 ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఇందుకోసం గుత్తేదారు సంస్థ డబ్బులు జమచేసింది. సింహాచలకండ్రిగలోని భూమిలో కంపచెట్లను శుభ్రం చేసేందుకు గత నెలలో అటవీశాఖ సిబ్బంది వెళ్లగా కీలక ప్రజాప్రతినిధి ఆదేశాలతో ఆయన అనుచరుడు స్థానికులను రెచ్చగొట్టి తమకు 2008లో పట్టాలిచ్చారని అడ్డుకున్నారు. ఆగస్టులోపు భూమిని చదును చేసి సెప్టెంబరు నాటికి మొక్కలు నాటాలన్నది అటవీశాఖ అధికారుల ప్రణాళిక. అక్టోబరు-డిసెంబరులో ఇక్కడ వర్షాలు పడతాయి కాబట్టి మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కానీ ఈ పనులకు ప్రజాప్రతినిధి అడ్డుపడుతున్నారు.



సింహాచలకండ్రిగలో అటవీశాఖ అధికారులు ఇటీవల తొలగించిన కంపచెట్లు

వైకాపా హయాంలో లేఖ రాసినా స్పందించక

అటవీశాఖ భూమిలో రెవెన్యూ అధికారులు పట్టాలివ్వగా, అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో పట్టాదారులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. 2011, 2014లో న్యాయస్థానం వారికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు కొన్ని పట్టాలు రద్దుచేసినా భూమిని వెనక్కి తీసుకోలేదు. వైకాపా హయాంలో 2022లో అటవీశాఖ అధికారులు.. దీనిపై శ్రీకాళహస్తి తహసీల్దారుకు లేఖ రాసినా నాటి ప్రజాప్రతినిధి ఒత్తిడితో చర్యలు తీసుకోలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి. ఖాళీగా ఉన్న 125 ఎకరాల స్థలంపై కీలకనేత కన్ను పడటమే ఇందుకు కారణం. ఇందులో మొక్కలు వేయకపోతే.. తిరుపతిని రాయలసీమ, కర్ణాటకతో అనుసంధానించే మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారి విస్తరణకు బ్రేకులు పడతాయి.

నాకేం చెప్పొద్దు.. ఆ స్థలాన్ని వదిలేయండి..

సింహాచలకండ్రిగ పరిధిలోని భూమి జోలికి రావద్దని కీలక ప్రజాప్రతినిధి అటవీశాఖ అధికారులకు అల్టిమేటం జారీచేశారు. తమ ఉద్యోగాలకు ముప్పు వస్తుందని.. మొక్కల పెంపకానికి అడ్డుతగిలితే విషయం కేంద్రం వరకు వెళ్తుందని చెబుతున్నా ఆయన లెక్కచేయట్లేదు. 'మీరు నాకేం చెప్పొద్దు.. భూమిని వదిలేయండి' అంటూ హుకుం జారీచేశారు. ఆయన అనుచరుడు 'సార్‌ను కలవండి.. మీరు శ్రీకాళహస్తిలో తిరగాలనుకుంటున్నారా? లేదా?' అంటూ హెచ్చరిస్తున్నారు.

ఆధారాలు చూపండి.. క్షమాపణైనా చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. 90,000 మంది బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి 7.89 కోట్ల మందికి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తే 30 రోజుల్లోపు అందులో 7.24 కోట్ల ఫారాలు వివరాలతో మాకు అందాయి. తొలగించిన 65 లక్షల మంది వివరాలు ఆయా జిల్లాల వెబ్‌సైట్లలో ఉన్నాయి. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటున్నా ఒకచోటే ఓటు వేయగలరు.

సుప్రీం ఆదేశాలు 24 గంటల్లోనే అమలు

ప్రతి జిల్లాకు ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించి, దాంట్లో ఎపిక్ నంబరుతో వెతికేలా సూచిక పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో 24 గంటల్లోపే మేం దాన్ని అమలుచేశాం. ప్రతి జిల్లా వెబ్‌సైట్ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రాథమిక జాబితాను ఆగస్టు 1న ప్రతి రాజకీయపార్టీకి అందించాం. సెప్టెంబరు ఒకటోతేదీ లోపు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా అర్హులను చేర్చడానికి, అనర్హుల్ని తొలగించడానికి కచ్చితంగా ప్రయత్నిస్తాం. రాజ్యాంగం మాకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడానికి ఓటర్ల పౌరసత్వాన్ని తనిఖీ చేస్తున్నాం.

రాజ్యాంగాన్ని అవమానించడం కాదా?

ఏ అభ్యర్థికైనా తాను పోటీచేసిన ఎన్నికపై అభ్యంతరం, అనుమానాలుంటే 45 రోజుల్లోపు మాత్రమే హైకోర్టును ఆశ్రయించి ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడానికి వీలుంటుంది. ఆ తర్వాత నిరాధార ఆరోపణలు చేయడం వెనుక ఉద్దేశమేంటి అన్నది ఓటర్లు, ప్రజలు పూర్తిగా అర్థం చేసుకోగలరు. కొందరు ఓటుచోరీ లాంటి తప్పు మాటలు ఉపయోగిస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి విఫలయత్నం చేస్తున్నారు. ఇది రాజ్యాంగాన్ని అవమానించడం కాకపోతే ఇంకేంటి? లోక్‌సభ ఎన్నికల్లో కోటి మందికి పైగా ఉద్యోగులు, 10 లక్షల మంది బూత్ ఏజెంట్లు, 20 లక్షల మంది బీఎల్‌వోలు పనిచేస్తారు. ఈ పరిస్థితుల్లో ఓటుచోరీకి ఆస్కారం ఉంటుందా?

మెషీన్ రీడబుల్ జాబితా ఎందుకు ఇవ్వడం లేదంటే..

మెషీన్ రీడబుల్ ఓటరు జాబితా, సెర్చబుల్ ఓటరు జాబితా మధ్య తేడా ఉంటుంది. ఈసీ వెబ్‌సైట్‌లోని జాబితాలో ఓటరు గుర్తింపు సంఖ్యతో వివరాలు వెతికి, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెషీన్ రీడబుల్ జాబితా వల్ల ఓటర్ల గోప్యత దెబ్బతినే అవకాశం ఉంటుందని సుప్రీంకోర్టు 2019లో చెప్పింది. ఈ జాబితా ఇస్తే ఒకరి పేర్లు, ఫొటోల స్థానంలో వేరొకరివి చేర్చి ఓటేసే వీల్లేకుండా చేసే పరిస్థితి ఉంటుంది.

ఫారం సమర్పించి సవరణలు కోరవచ్చు

ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై ఫిర్యాదులున్నవారు అదే నియోజకవర్గానికి చెందినవారైతే ఎన్నికల సంఘం నిర్ణయించిన నిర్దిష్ట సమయంలోపు ఫారం-6, ఫారం-7, ఫారం-8 సమర్పించి సవరణలు కోరొచ్చు. ఆ నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీ ఏజెంట్లు ప్రమాణం చేసి ఎన్ని ఫారాలైనా బీఎల్‌వోకి సమర్పించొచ్చు. ఒకవేళ బయటి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓటర్ల జాబితాపైనైతే సాక్షి రూపంలో ఫిర్యాదు చేయొచ్చు. ఈఆర్‌వో వద్ద ప్రమాణం చేయాలి.

ఒకటికి మించిన కార్డులు ఎందుకు ఉంటాయంటే..

వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వేర్వేరు వ్యక్తులకు ఒకే ఎపిక్ నంబరు ఇచ్చి ఉంటే అది డూప్లికేట్ కిందికి వస్తుంది. ఇక్కడ ఒకే ఎపిక్ నంబరు ఉన్నా వ్యక్తులు వేర్వేరుగా ఉంటారు. ఈ ఏడాది మార్చిలో ఇలాంటి సమస్య మా దృష్టికి వచ్చినప్పుడు వెంటనే స్పందించి 3 లక్షల ఎపిక్‌లను మార్చాం. ఒకే వ్యక్తి రెండు మూడు చోట్ల తన పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకొని ఉంటే వారి పేరు మీద ఒకటికి మించిన కార్డులు ఉంటాయి. 2003కి ముందు వెబ్‌సైట్లు అందుబాటులో ఉండేవి కావు కాబట్టి ఓటర్లు ఒకచోటకు మించి ఉన్న తమ పేర్లను తొలగించుకోవడం సాధ్యమయ్యేది కాదు. ఓటరు ఎక్కడెక్కడకు వలస వెళ్తే అన్నిచోట్లా ఓటరు జాబితాలో పేరు ఉండేది. ఒకరి ఫిర్యాదు ఆధారంగా జాబితా నుంచి ఓటరు పేరు తొలగిస్తే నిజమైన ఓటరుకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంటుంది. జాబితాలో వెతికినప్పుడు వేలమంది పేర్లు ఒకేలా కనిపిస్తాయి. ఏది అసలైనది, ఏది నకిలీది అని తెలుసుకోవడం కష్టం. అందుకే గత 20 ఏళ్లలో పెద్దగా ఏ పేర్లనూ తొలగించలేదు. అలాంటి వాటిని తొలగించడానికే ఇప్పుడు ఎస్ఐఆర్ మొదలుపెట్టాం.

ఇంటిసంఖ్య లేకపోతే జీరోగానే ఉంటుంది

పంచాయతీ, పురపాలక సంఘాల్లో అన్ని ఇళ్లకూ నంబర్లు ఉండవు. పెద్ద నగరాల్లోని అనధీకృత కాలనీలకు అక్కడి అధికారులు ఇంటి నంబర్లు ఇవ్వలేదు. అలాగే రోడ్లమీద జీవనం సాగించే చాలామందికి ఇళ్లు లేవు. ఇలా ఇళ్లు, ఇంటి నంబరు లేనివారిని ఓటరు జాబితాలో చేర్చడానికి ఎన్నికల సంఘం నోషనల్ నంబర్ ఇస్తుంది. దాన్ని కంప్యూటర్‌లో నమోదు చేసినప్పుడు జీరోగా కనిపిస్తుంది. అలాంటి వారిని నకిలీ అంటే పేద ఓటర్లను అవమానించడమే. ఎవరికైనా ఓటర్ల జాబితాలో చేరడానికి భారతీయ పౌరసత్వం, 18 ఏళ్లు పూర్తయి ఉండటం తప్పనిసరి తప్పితే చిరునామా కాదు.

నిరాధార ఆరోపణలపై చర్యలు అసాధ్యం

ఆధారాలు, అఫిడవిట్లు లేకుండా లక్షన్నర మంది ఓటర్లను అధికారి ముందు హాజరుకావాలని ఆదేశించి.. మీరంతా నకిలీలని చెప్పగలమా? అలాచేస్తే మీదగ్గర ఉన్న ఆధారాలేమిటని ఆ ఓటర్లు అడగరా? ఓటర్లందర్నీ అపరాధులుగా చేసి మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోం. మహారాష్ట్రలో ఓటర్ల జాబితా పెరిగిందంటున్నవారు ముసాయిదా జాబితాపై నిర్దిష్ట సమయంలోపు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? ఫలితాలు వచ్చిన తర్వాత తప్పు తెలిసిందా? ఎన్నికలు పూర్తయి 8 నెలలైనా ఇప్పటివరకూ అక్కడి ఏ ఓటరు గురించీ సాక్ష్యాధారాలతో సీఈఓకు ఫిర్యాదు చేయలేదు. ఒకేమాటను పదులసార్లు చెబితే అది నిజమవుతుందనుకుంటే పొరపాటు" అని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు.

అమ్మకానికి బ్యాంకు ఖాతాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారిదని తేలింది.

● దూరప్రాంతాల నుంచి పోలీసులు రాలేరనే వ్యూహంతో ఇలాంటి ఖాతాలను వాడుతున్నట్లు తేలింది.

● మ్యూల్ ఖాతాల నుంచి ఒకదాని నుంచి మరొకదానికి బదిలీ చేస్తూ చివరకు తమ ఖాతాకు బదిలీ చేసుకుంటున్నారు. డెబిట్ కార్డులు కూడా సేకరిస్తున్నందున ఏటీఎం నుంచి కూడా సులువుగా డబ్బులు డ్రా చేసుకుంటున్నారు.

● సైబర్ ముఠాలు స్థానిక యువకులను ఏజెంట్లుగా నియమించుకొని కరెంట్ ఖాతాకు రూ.14 వేలు, సేవింగ్స్ ఖాతాకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నాయి. వారు పేదలను మభ్యపెట్టి బ్యాంకు ఖాతాలను తెరిపిస్తున్నారు. ఇప్పటివరకు విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం, కాకినాడ ప్రాంతాల్లో పట్టుబడిన ఖాతాలను పరిశీలిస్తే ఏజెంట్లుగా ఉన్న స్థానిక యువకులే చిక్కారు తప్ప సైబర్ ముఠాలు మాత్రం చిక్కలేదు.

● ఇటీవల అనంతపురం జిల్లాలో ఇలాంటి మ్యూల్ ఖాతాలను నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. కాంబోడియా నుంచి ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

● విజయవాడలో ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజరు అండతో మ్యూల్ ఖాతాలను తెరిచినట్లు తేలింది.

● ఒంగోలులోని పీర్ల మాన్యంలో 65 ఖాతాలను తెరిచినట్లు జిల్లా పోలీసులు గుర్తించారు. వీటిలో 28 ఖాతాలను ఆన్‌లైన్ లావాదేవీలకు సిద్ధం చేశారు. కాకినాడలో కొందరు డబ్బులకు ఆశపడి బ్యాంకు ఖాతాలను అప్పగించినట్లు తేలింది.



ఒంగోలులో స్వాధీనం చేసుకున్న బ్యాంకు పాస్ పుస్తకాలు, ఏటీఎం కార్డులు చూపుతున్న జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

మ్యూల్ ఖాతా అంటే..

● మన బ్యాంకు ఖాతాను మరెవరైనా అక్రమంగా నగదు లావాదేవీలు నిర్వహించడానికి వినియోగిస్తే దానిని మ్యూల్ ఖాతాగా పరిగణిస్తారు.

● వెంటవెంటనే నగదు వేయడం, తీయడం లేదా భారీ ఎత్తున నగదు బదిలీ వంటివి జరుగుతున్న అనుమానాస్పద ఖాతాలపై గత ఏడాది కొన్ని బ్యాంకులు ప్రత్యేక దృష్టిసారించాయి.

● కొంతమంది కళాశాల విద్యార్థులు తమ ఖాతాలను సైబర్ ముఠాలకు అప్పగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎలాంటి అక్రమ లావాదేవీలు జరిగినా శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఉత్తరాంధ్రకు వైభోగమే

(మొదటి పేజీ తరువాయి)

ఆఖరుకు 84 శాతం పనుల్ని పూర్తి చేయడం విశేషం.

రూ.390 కోట్లతో 15 రోడ్ల విస్తరణ

భోగాపురం విమానాశ్రయానికి విశాఖ నగరం నుంచి ప్రయాణికులు 45 నిమిషాల్లో చేరుకునేందుకు వీలుగా సంకల్పించిన బీచ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదన వైకాపా హయాంలో కాగితాలకే పరిమితమైంది. రూ.2,800 కోట్ల వ్యయంతో భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమైంది. విశాఖ పోర్టు నుంచి భీమిలి మీదుగా మూలకొద్ది వద్ద గోస్తనీ నదిపై వంతెన నిర్మించి భోగాపురం చేరుకునేలా బీచ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనకు కూటమి ప్రభుత్వ హయాంలో కదలిక వచ్చింది. మరో పది నెలల్లో విమానాశ్రయం పూర్తి కానుంది. దీనికి అనుగుణంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపట్టనున్నారు. విమానాశ్రయానికి అనుబంధంగా గుర్తించిన 15 అంతర్గత రోడ్లు విస్తరించి కనెక్టివిటీ పెంచాలని వీఎంఆర్‌డీఏ (విశాఖ మహా నగరపాలక సంస్థ) నిర్ణయించింది. వీటిని 4 వరుసల రహదారులుగా మారిస్తే భోగాపురం చేరుకోవడం సులువవుతుంది. విజయనగరం రింగ్‌రోడ్డు-అయినాడ కూడలి, శొంఠ్యాం-అడవివరం, దొరతోట, కాపులుప్పాడ, మద్దిలపాలెం, బోయపాలెం, షీలానగర్ వద్ద రోడ్ల విస్తరణ పనులు కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. వీటికి రూ.390 కోట్లు కేటాయించింది. 15 అంతర్గత రహదారుల్లో అత్యంత ప్రాధాన్యంగా గుర్తించిన ఏడింటి నిర్మాణం 2026 జూన్‌కి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ సంకల్పించింది. రూ.174.64 కోట్ల వ్యయంతో టెండర్లు ఆహ్వానించింది.



సిద్ధమవుతున్న రన్‌వే

రూ.1,600 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్లు

విశాఖ నగర శివారు అగనంపూడి నుంచి కొమ్మాది వరకు 12 కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువ. దీన్ని అధిగమించడానికి అగనంపూడి-లంకెలపాలెం, స్టీల్‌ప్లాంటు-బీహెచ్ఈఎల్, సత్యం కూడలి- హనుమంతువాక, మధురవాడ క్రీడా మైదానం-కొమ్మాది వరకు నాలుగు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టు గడువుకు ముందే పూర్తవుతుందని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ తెలిపారు. ఈ పనుల ప్రగతికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఎప్పటికప్పుడు యాజమాన్య ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్నారని తెలిపారు.

గంజాయి స్మగ్లర్ బరితెగింపు

(మొదటి పేజీ తరువాయి)

విక్రేతలకు సరఫరా చేస్తుంటాడు. అతనిపై నెల్లూరు, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో పలు కేసులు ఉన్నాయి. జైలుకెళ్లి వచ్చినా అతనిలో మార్పు రాలేదు. తాజాగా నెల్లూరుకు చెందిన జకీరాబీకి గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఘటన సమాచారం తెలిసి ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ నెల్లూరు చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి ఆయన పరామర్శించారు. నిందితుడిని పట్టుకున్న పోలీసు సిబ్బందిని, ఈగల్ టీంను అభినందించారు.

గ్రహం అనుగ్రహం

18–8–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం

దశమి: సా.6-14 తదుపరి ఏకాదశి; **మృగశిర:** తె.3-50 తదుపరి ఆర్ద్ర **వర్జ్యం:** ఉ.10-32 నుంచి 12-01 వరకు; **అమృత ఘడియలు:** రా.7-33 నుంచి 9-03 వరకు; **దుర్ముహూర్తం:** మ.12-28 నుంచి 1-18 వరకు తిరిగి 2-59 నుంచి 3-50 వరకు; **రాహుకాలం:** ఉ.7-30 నుంచి 9-00 వరకు; **సూర్యోదయం:** ఉ.5.46; **సూర్యాస్తమయం:** సా.6.21

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఒంగోలు	34.4	27.9
గుంటూరు	31.0	27.0
శ్రీకాకుళం	31.0	26.0
విజయవాడ	30.8	26.4
అనంతపురం	29.8	24.0
తాడేపల్లిగూడెం	29.6	25.8
విజయనగరం	29.0	24.0
నెల్లూరు	28.8	24.5
కర్నూలు	28.5	24.1
విశాఖపట్నం	28.4	25.4
కడప	28.0	24.0
రాజమహేంద్రవరం	27.0	24.5
తిరుపతి	27.0	24.0

సినిమాల్లో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాలి

- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్



ఈనాడు, అమరావతి: సినిమాలు, సీరియళ్లలో మహిళల పట్ల వివక్షను కట్టడి చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసభ్య, అవమానకర సంభాషణలు, లింగ వివక్షను నియంత్రించాలని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "మహిళలను గౌరవించడం నిజమైన నాగరికతకు పునాది. సినిమాలు, సీరియళ్లను పిల్లలు చూసేలా రూపొందించాలి" అని లోకేశ్ పేర్కొన్నారు.

నేడు కేంద్ర మంత్రులతో భేటీ

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల గురించి కేంద్రమంత్రులతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చర్చించనున్నారు. ఆదివారం రాత్రికే ఆయన దిల్లీ చేరుకోనున్నారు. సోమవారం రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రాష్ట్రానికి సెమీ కండక్టర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేయనున్నారు. అనంతరం కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్‌సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, పీయూష్ గోయల్, జైశంకర్‌లతో విడివిడిగా భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రతిపాదనల్ని వారికి అందజేస్తారు.

దేశప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలి

స్వాతంత్ర్య దినోత్సవం రోజు వైకాపా అధినేత జగన్ జాతీయ పతాకం ఎగురవేయకపోవడం దేశాన్ని, స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడమేనని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. దేశ ప్రజలకు జగన్ క్షమాపణలు చెప్పాలని 'ఎక్స్' వేదికగా ఆదివారం డిమాండ్ చేశారు.


నీట్‌లో అర్హత సాధించిన విభిన్న ప్రతిభావంతులకు ఊరట

- భాష సబ్జెక్టుకు మార్కులిచ్చిన ప్రభుత్వం
- మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఉత్తర్వుల జారీ

ఈనాడు, అమరావతి: వైద్యవిద్యలో ప్రవేశాలకు నిర్వహించే నీట్‌లో అర్హత సాధించిన విభిన్న ప్రతిభావంతులకు మినహాయింపు ఇచ్చిన భాష సబ్జెక్టుకు సైతం మార్కులిచ్చేందుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నీట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అభ్యర్థులు కనీసం ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కావాలనే నిబంధన ఉంది. రాష్ట్రంలో చదివే విభిన్న ప్రతిభావంతులకు ఒక భాష సబ్జెక్టు పరీక్ష నుంచి మినహాయింపు ఉంది. దీన్ని చాలామంది వినియోగించుకున్నారు. దీంతో వారు నాలుగు సబ్జెక్టులే అర్హత సాధించినట్లు అవుతోంది. ఈ కారణంగా వారు నీట్ కౌన్సెలింగ్‌కు అర్హత పొందలేకపోతున్నారు. దీనికి పరిష్కారంగా.. మిగతా సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల సరాసరి కలిపి మినహాయింపు పొందిన దానికి ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తిరుపతికి చెందిన దివ్యాంగ విద్యార్థి దాసారెడ్డి హరిహర బ్రహ్మారెడ్డి సబ్జెక్టు మినహాయింపు కారణంగా నీట్‌లో సీటు కోల్పోతున్నట్లు మంత్రి లోకేశ్ దృష్టికి రావడంతో.. ఆయన స్పందించి ఈ ఉత్తర్వులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించను

- తెదేపా నేతలకు అధినేత చంద్రబాబు హెచ్చరిక
- ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం



ఈనాడు-అమరావతి: గ్రూపు తగాదాలు, అంతర్గత విభేదాలతో పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపైనా (జూనియర్ ఎన్టీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసినట్లుగా బయటికొచ్చిన ఆడియో) చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ల వ్యవహారంపై వచ్చిన వార్తలపైనా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం పార్టీ ముఖ్యనేతలతో జూమ్ సమావేశం నిర్వహించిన చంద్రబాబు.. ఈ మూడు ఘటనలపైనా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర అధిష్ఠానాన్ని ఆదేశించారు. ఎమ్మెల్యేలు కేంద్రంగా తలెత్తిన పలు వివాదాలు, ఘటనలపైనా చర్చించారు. నేతలు వ్యక్తిగతంగా చేసే తప్పుల వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని మండిపడ్డారు. 'చిన్న విమర్శకు అవకాశం ఇచ్చేలా కూడా వ్యవహరించకూడదు. ఒకవేళ ఆయా ఘటనల్లో తమ తప్పు లేకున్నా.. తప్పుడు ప్రచారం జరుగుతున్నా వెంటనే బయటకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పాలి' అని స్పష్టం చేశారు.

స్త్రీశక్తిపై వైకాపా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై గందరగోళం సృష్టించేందుకు వైకాపా అనుబంధ మీడియా ప్రయత్నిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని నేతలకు నిర్దేశించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రజల స్పందన, పార్టీ పిలుపు మేరకు 'అన్నదాతా సుఖీభవ' పథకంపై చేపట్టిన కార్యక్రమాలపైనా చంద్రబాబు సమీక్షించారు. పథకాల అమల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు విధిగా భాగస్వాములు అయ్యేలా చూడాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించారు. పథకాల ద్వారా ప్రజలతో మమేకం అయితే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై అన్ని ప్రాంతాల్లోనూ మహిళల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని నేతలు ఆయనకు వివరించారు.

భాజపాను అఫిడవిట్ అడగలేదేం?

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్.. ఈసీపై ఆరోపణలను తీవ్రతరం చేశారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) పేరిట బిహార్‌లో ఓట్ల తొలగింపు, చేర్పుల వంటి కుట్రలకు తెర లేపారని ధ్వజమెత్తారు. 'ఇండియా' కూటమి దీనికి అనుమతించబోదని, ఓటు అధికారాన్ని పేదల నుంచి దూరం కానివ్వబోమని తెలిపారు. 'మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి సత్తా చాటింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే విజయమనే అంచనాలు వెలువడ్డాయి. నాలుగు నెలల్లోనే కోటిమంది కొత్త ఓటర్లు వచ్చి చేరడంతో భాజపా కూటమి గెలిచింది. ఎక్కడైతే ఓట్లు పెరిగాయో అక్కడ కాషాయ పార్టీ గెలిచింది. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్, భాజపా ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే ఈ యాత్రను ప్రారంభించామని రాహుల్ వెల్లడించారు.

ఒత్తిడితోనే కులగణనకు మోదీ అంగీకారం

"మోదీ సిసలైన కులగణనను చేయించరని నాకు తెలుసు. ఇండియా కూటమి మాత్రమే ఆ పని చేయగలదు. కేవలం ఒత్తిడితోనే ప్రధాని కులగణనను ప్రకటించారు.. అది కార్యరూపం దాల్చదు" అని రాహుల్‌గాంధీ ఎద్దేవా చేశారు. ఔరంగాబాద్ సభలో రాహుల్ మాట్లాడుతూ ఆదివారం ఈసీ నిర్వహించిన మీడియా సమావేశాన్ని ప్రస్తావించారు. "ఈసీని నేను ఒక్కటే అడగాలనుకొంటున్నా. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీపై నిబంధనలను ప్రభుత్వం ఎందుకు మార్చింది? మీకు తెలుసా.. 2023లో చేసిన చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్లపై ఎటువంటి కేసును మనం పెట్టలేం. దేశంలోని ఏ కోర్టులోనూ వారిపై కేసు పెట్టకూడదు. ఓటుచోరీలో తమకు సహకరిస్తున్న ఈసీని ఆదుకునేందుకే మోదీ, అమిత్‌షా ఈ చట్టం తెచ్చారు" అని రాహుల్ చెప్పారు. ఇంటి నుంచి బయటికి వెళ్లొద్దని డాక్టర్లు చెప్పినా వినకుండా తన కోసం సభకు వచ్చిన లాలూజీకి మనసారా ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు.



బిహార్‌లోని సాసారంలో ఓటర్ అధికార్ యాత్ర ప్రారంభిస్తున్న మల్లికార్జున ఖర్గే, లాలూప్రసాద్ యాదవ్, రాహుల్‌గాంధీ, తేజస్వీ యాదవ్, కేసీ వేణుగోపాల్ తదితరులు

✦ ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నడిపిన జీపులో రాహుల్ నిలబడి ఉండగా, ఇతర మహాగఠ్‌బంధన్ నేతలు అందులో కూర్చొని సభకు వచ్చారు. రాహుల్‌ను "హమారే బడేభాయ్" అంటూ తేజస్వీ తన ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్, వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముకేశ్ సహానీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సీపీఎంకు చెందిన సుభాషిణి అలీ, సీపీఐ నేత పి. సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆ సమాధానానికి వ్యతిరేకంగా చేయండి

చాలా సందర్భాల్లో పని విషయంలో మీకు అత్యంత చెడు భాగస్వామి.. మీ భావోద్వేగాలే! ఏదైనా ముఖ్యమైన పని చేయాల్సి వచ్చినప్పుడు మీకు మీరు రెండు ప్రశ్నలు వేసుకోండి.

1. ఈ పని పూర్తిచేయడం గురించి నా క్రమశిక్షణ ఏమంటోంది?
2. పని విషయంలో నా భావోద్వేగాలు ఏం చెబుతున్నాయి?

అప్పుడు రెండో ప్రశ్నకు ఏం సమాధానం వస్తుందో.. సరిగ్గా దానికి వ్యతిరేకంగా చేయండి. మీరు విజయవంతమైన వ్యక్తిగా ఎదుగుతారు!

– శరణ్ శ్రీవత్స, వ్యాపారవేత్త

మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి అరెస్టు

పాడేరు, న్యూస్‌టుడే: సీపీఐ(మావోయిస్టు) పార్టీ డివిజనల్ కమిటీ సభ్యుడు, పెదబయలు- కోరుకొండ ఏరియా కమిటీ కార్యదర్శి వైతో నరేష్ అలియాస్ సంతును అరెస్టు చేసినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. అతడి నుంచి పిస్టల్, రైఫిల్, మూడు కిట్ బ్యాగులు, మావోయిస్టు సాహిత్య విప్లవ గీతాల పుస్తకాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పాడేరులోని ఎస్పీ కార్యాలయంలో ఆదివారం వివరాలు వెల్లడించారు. జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ చింతగుప్ప సమీపంలో శనివారం సాయంత్రం పోలీసు బలగాలను చూసిన మావోయిస్టులు ఎదురుదాడికి దిగి.. తప్పించుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో వైతో నరేష్ జి.మాడుగుల పోలీసులకు చిక్కగా.. మరో నలుగురు పరారయ్యారు. నరేష్ ఒడిశాలోని కోరాపుట్ జిల్లా భాలియపుట్టు గ్రామస్థుడు. 2011 నుంచి మావోయిస్టు కార్యకలాపాల్లో ఉన్నాడు. ప్రస్తుతం అల్లూరి మన్యంలో మావోయిస్టుల ప్రభావం తగ్గిందని ఎస్పీ పేర్కొన్నారు.

మూడో రోజూ మహిళల కోలాహలం

- కిటకిటలాడిన ఆర్టీసీ బస్సులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిన మూడోరోజూ ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల కోలాహలం కనిపించింది. పెద్ద సంఖ్యలో నారీమణులు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు 13.30 లక్షల మంది మహిళలు ఈ పథకం కింద ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారులు లెక్కతేల్చారు. దీంతో వారికి రూ.5.46 కోట్ల మేర లబ్ధి చేకూరింది. రాత్రికి అన్ని బస్సులూ డిపోలకు చేరేటప్పటికి మరో 2 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉందని అంచనా. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు 12.18 లక్షల మంది ప్రయాణించగా.. వారికి 4.74 కోట్ల మేర లబ్ధి కలిగింది. సోమవారం కార్యాలయాలు, విద్యా సంస్థలు తెరచుకోనుండటంతో మహిళా ప్రయాణికుల సంఖ్య సుమారు 20 లక్షల వరకు ఉంటుందని అంచనా.

ప్రత్యేక బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

వివిధ ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు నడిపే ప్రత్యేక బస్సుల్లోనూ మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ ఆర్టీసీ ఆదేశాలు జారీచేసింది. పుణ్యక్షేత్రాలకు నడిపే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలోనూ మహిళా ప్రయాణికులకు జీరో ఫేర్ టికెట్లు ఇవ్వాలని ఆదేశాలిచ్చారు.

తిరుమలలో వేడుకగా ఉట్లోత్సవం



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో ఆదివారం ఉట్లోత్సవం అత్యంత వేడుకగా జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరునాడు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీమలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరువీధులలో ఊరేగుతూ వేడుకను తిలకించారు.

ఈనాడు

ప్లాస్టిక్‌పై పోరులో అదే అనైక్యత!

యుద్ధాలు, ఇతర ఘర్షణల సమయంలో వినవచ్చే 'అణు' బెదిరింపులతో మానవాళి తరచూ కలవరపడుతుంటుంది. కానీ, రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచాన్ని అంతకుమించిన పెనువిధ్వంసంలోకి నెట్టుకుపోతోంది. ఇప్పుడు బజారుకెళ్లి రెండు కొత్తిమీర కట్టలు కొన్నా పాలిథిన్ కవర్‌లో తెచ్చుకోవాల్సిందే... టీ కప్పులు, నీటి సీసాల నుంచి కంప్యూటర్ల వరకు సర్వం ప్లాస్టిక్‌మయమే. అలా కుప్పలుతెప్పలుగా పోగుపడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రాణకోటికి ప్రాణాంతకమవుతున్నాయి. గాలి, నీరు, ఆహారం ద్వారా మన ఒంట్లోకి చేరుతున్న సూక్ష్మ ప్లాస్టిక్‌లు గుండెజబ్బులు, క్యాన్సర్లతో పాటు ఎన్నో రోగాలకు కారణమవుతున్నాయి. ఈ దారుణానికి అడ్డుకట్టవేసే లక్ష్యంతో జెనీవాలో 184 దేశాలు జరిపిన సుదీర్ఘ చర్చలు మరోసారి నిష్ఫలంగా ముగిసిపోవడం దురదృష్టకరం! ప్లాస్టిక్ ఉత్పత్తులపై పరిమితి విధించాలనే చమురు ఉత్పత్తి దేశాలు ససేమిరా అంటున్నాయి. దాని తయారీలో విష రసాయనాల వాడకాన్ని నివారించాలన్న ప్రతిపాదనపైనా ఏకాభిప్రాయం కొరవడింది. కమ్ముకొస్తున్న ప్లాస్టిక్ ఉత్పాతాన్ని నిలువరించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలను పట్టాలెక్కించడంలో ప్రపంచ దేశాల వైఫల్యం భావితరాలకు తీరని చేటు చేస్తుంది!

ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు నలభై కోట్ల టన్నుల ప్లాస్టిక్‌వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అలాగే వదిలేస్తే, 2040 నాటికి అవి అంతకు మూడు రెట్లకు పెరుగుతాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా పనికిరాని ప్లాస్టిక్‌లో సుమారు 91శాతం పునర్వినియోగానికి నోచుకోవట్లేదు. దాంతో ఏటా కోటి టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి వచ్చిచేరుతూ, సాగర జీవావరణ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఒక్క ఇండియాలోనే సంవత్సరానికి 35 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, జలవనరులపై మేటవేస్తున్నాయి. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌పై దేశీయంగా నిషేధం విధించినా అది ఎక్కడా సరిగ్గా అమలు కావట్లేదు. పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ సీసాలను విచ్చలవిడిగా విసిరేస్తుండటంతో అవి డ్రైనేజీలకు అడ్డుపడుతున్నాయి. దాంతో వానాకాలంలో వరదల తీవ్రత పెరిగి జనావాసాలు మునిగిపోతున్నాయి. ఎక్కడికక్కడ గుట్టలుగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ చెత్తను తింటున్న పశువులు దయనీయ స్థితిలో మరణిస్తున్నాయి. నదులు సంద్రాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మత్స్యసంపదకు హాని కలిగిస్తున్నాయి. ప్లాస్టిక్ భూతం స్వైరవిహారం దాటికి పాతికేళ్లలో ప్రపంచం 281 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టపోవాల్సి వస్తుందని అంచనా. ఈ మేరకు పరిశోధనల హెచ్చరికల్లోని తీవ్రతను ప్రభుత్వాలు ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాయి?

సమగ్ర పునర్వినియోగం, ప్రమాదకరమైన అనవసరమైన ఉత్పత్తులను నివారించడం, ప్రత్యామ్నాయాలను అందిపుచ్చుకోవడం ద్వారా 2040నాటికి 80శాతం ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించవచ్చునని ఐరాస నివేదిక గతంలో సూచించింది. కానీ, ఎవరు ఆలకిస్తున్నారు? ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించి అక్కడక్కడా తక్కువ ఖర్చుతో రోడ్లు నిర్మిస్తున్నారు. నాణ్యత విషయంలోనూ అవి మేటిగా నిలుస్తున్నాయి. నిర్మాణాల్లో ముడిసరకుగానూ ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చు. పది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆరు వేల లీటర్ల డీజిల్ తయారు చేయవచ్చునని గతంలో తెలంగాణ ఇంజినీర్లు నిరూపించారు. ఇలాంటి ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, వాటిని ఆచరణ రూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. ప్లాస్టిక్ వాడకంతో తలెత్తుతున్న దుష్ఫలితాలపై గ్రామస్థాయి వరకు ప్రజలకు సరైన అవగాహన కల్పించాలి. అప్పుడే ప్లాస్టిక్‌పై పోరులో పురోగతి సాధ్యపడుతుంది!




విమర్శ, వ్యతిరేకత, కష్టాలు... ఇవన్నీ ఉన్నదే అధిగమించడానికి. ఒక్కోదాన్ని దాటుకుని విజయవంతంగా ముందుకు వెళ్తుంటే లభించే ఆనందంతో ఏదీ సాటిరాదు. అంతా సాఫీగా నల్లేరుమీద బండిలా బతుకు సాగిపోతుంటే అందులో మజానే ఉండదు.

– విజయలక్ష్మీ పండిట్

పుష్ప వైభవం

సప్తవర్ణ శోభిత పూదోటల్లో విహరిస్తున్నప్పుడు మనసు పరవశిస్తుంది. భగవంతుడి అద్భుత సృష్టిలోని విశిష్టత బోధపడుతుంది. వివిధ రంగుల పువ్వులు కంటికి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. సువాసనలు వెదజల్లే సుమాలను ఇష్టపడని వారుండరు. పూజాద్రవ్యాలలో పూలకే పెద్దపీట. సహస్ర నామార్చనకు సుమ సౌరభం తోడైనప్పుడు భగవంతుడు ప్రీతిచెందుతాడు.

శ్రీ మహావిష్ణువు అలంకార ప్రియుడు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి అచ్చంగా పువ్వులతో చేసే అలంకరణను తోమాలసేవ అంటారు. స్వామివారికి ఆపాదమస్తకం చేసే ఈ పుష్పాలంకరణ సేవలో పాల్గొన్నవారి మనసు అనే పుష్పం శ్రీవారి పాదాలచెంత చేరి జన్మ ధన్యమవుతుందని చెబుతారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలోనైతే ఆలయ ప్రాంగణమంతా పుష్పాలంకరణతో అలరారుతూ చూపరులకు



నయనానందకరంగా ఉంటుంది. ఆ ఉత్సవాల అనంతరం ఏటా కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రం రోజున శ్రీవారి కల్యాణమండపంలో జరిగే పుష్పయాగమూ చూసి తీరాల్సిందే. ఈ రోజుల్లో దైవార్చనకు వాడిన పువ్వులను వృథాగా పారవేయట్లేదు. వాటితో అగరుబత్తులు, పరిమళద్రవ్యాలు తయారుచేస్తున్నారు. ఆ విధంగా అవి రెండుసార్లు భగవంతుడికి సేవజేసుకునే భాగ్యానికి నోచుకుంటున్నాయి.

అంతర్యామి

కమలనాభుడు విష్ణుమూర్తి. కమల సంభవుడు బ్రహ్మ. శ్రీమహాలక్ష్మికి ఎర్ర తామర పూలంటే ఇష్టం. సరస్వతీ దేవికి అత్యంత ప్రీతికరమైనది తెల్ల తామర. 'చంపకాశోక పున్నాగ సౌగంధికలసత్కచా' అని లలితా సహస్ర నామ స్తోత్రంతో అమ్మవారిని స్తుతిస్తాం. రుక్మిణీదేవి పద్మం వంటి శరీర పరిమళం కలిగి లక్ష్మీదేవి అంశతో జన్మించిందన్నది భాగవత కథనం. దేవదానవులు సముద్రాన్ని చిలుకుతున్నప్పుడు లక్ష్మీదేవి ఆవిర్భవించింది. బ్రహ్మదేవుడు లక్ష్మీదేవిని సృష్టించినప్పుడు వికసించిన ఎర్రతామరల కొలనులో సుగంధం వ్యాపించింది. తుమ్మెదల ఝంకార ధ్వనులతో కూడిన కలువపూల దండ పట్టుకుని లక్ష్మీదేవి మేఘాల నడుమ మెరిసిపోయే బంగారంలా దేవతల మధ్య నిలుచుందని భాగవతం వర్ణించింది. బిల్వ పత్రాలు, ఉమ్మెత్త, జిల్లేడు, గన్నేరు, జాజి, మల్లె, పారిజాత పువ్వులతో శివుణ్ని పూజిస్తే ఉత్తమ ఫలాలనిస్తాడని శివపురాణం చెబుతోంది. భగవంతుడికి ప్రీతి పాత్రమైన పుష్పాలు మనుషుల మనసులనూ మురిపిస్తాయి. అందుకే వాకిట్లో ఓ పూల మొక్క పెట్టుకోవాలని ప్రయత్నించని వారుండరు. ప్రేమను వ్యక్తపరచడానికి గులాబీ సహకరిస్తుంది. శకుంతల కణ్వమహర్షి ఆశ్రమంలో పెరుగుతున్నప్పుడు చెట్లకు బాధ కలుగుతుందని ఒక్క ఆకు కూడా తుంచి ఎరుగదట. అవి మొదటిసారి పుష్పించినప్పుడు శకుంతల పండుగ చేసేదని కాళిదాసు వర్ణించాడు.

కనువిందు చేసే రంగులతో, మైమరపించే సువాసనలతో సూర్యోదయం కాగానే శుభోదయం చెప్పే పూబాలలను భగవంతుడి దరికి చేర్చే భాగ్యం మానవమాత్రులకు మాత్రమే లభించింది. నిర్మలత్వానికి, అమాయకత్వానికి, దైవత్వానికి ప్రతిరూపంలా ఉండే పువ్వులు నిష్కల్మషమైన హృదయానికి ప్రతీకలు. భగవంతుడి పాదాలదగ్గర పువ్వులను ఉంచడమంటే భక్తుడు తన హృదయాన్ని ఆయనకు సమర్పించుకున్నట్లే!

– ఇంద్రగంటి నరసింహమూర్తి

తీరాలు కోసుకుపోతున్నాయ్!

భారత్ వంటి దేశాల్లో నదులపై ఆనకట్టలు అత్యంత అవసరం. సాగునీటి పారుదల, తాగునీటి భద్రత, విద్యుదుత్పత్తి, వరద నియంత్రణ, పారిశ్రామిక అవసరాలకు అవి ఎంతో ఉపయోగపడతాయి. అదే సమయంలో వాటివల్ల నదీ ప్రవాహాలకు ఆటంకం ఏర్పడుతోంది. దాని ఫలితంగా సముద్ర ఆవరణ వ్యవస్థ దెబ్బతిని తీరప్రాంతాలు కోసుకుపోతున్నాయి.



చాలా నదులు అవి ఉద్భవించిన పర్వత ప్రాంతాల నుంచి తీరం వరకు కొన్ని వందల కిలోమీటర్ల మేర ప్రవహిస్తాయి. ఈ క్రమంలో అవి బంకమట్టి, రాళ్లు, ఇసుక వంటి అవక్షేపాలను తీసుకువెళ్తాయి. వీటి ద్వారానే డెల్టాలు, బీచ్‌లు, తీర మైదానాలు వంటివి ఏర్పడతాయి. కొన్ని లక్షల సంవత్సరాలపాటు జరిగే సహజ ప్రక్రియ ద్వారానే ఇవన్నీ ఉద్భవిస్తాయి. అయితే, నదులపై నిర్మించే ఆనకట్టలు అవక్షేపాల సహజ ప్రవాహాన్ని నిరోధిస్తాయి. ఆనకట్ట వెనక ఏర్పడే జలాశయం నది తెచ్చే ఇసుకను నిల్వ చేస్తుంది. దీని ఫలితంగా దిగువన ప్రవహించే నది ఇసుక లేమితో బలహీనపడుతుంది. దాంతో సముద్ర తీరానికి చేరే అవక్షేప పరిమాణమూ తగ్గిపోతుంది. అలాంటప్పుడు సహజంగానే అలలు సమీపంలోని ఇసుకను సముద్రపు లోతులకు లాగుతాయి. బీచ్‌లూ దిబ్బలనూ కోయడం ప్రారంభిస్తాయి. అలా తీరప్రాంతాలు భారీ కోతకు గురై చుట్టుపక్కల మత్స్యకార గ్రామాలకు కోలుకోలేనంత నష్టం వాటిల్లుతుంది. అక్కడి రహదారులు, ఇళ్లకు ముప్పు ఏర్పడుతుంది. పర్యాటక కేంద్రాలు సైతం నాశనమై దానిపై ఆధారపడిన కుటుంబాల ఆదాయం గణనీయంగా పడిపోతుంది.

అన్ని దేశాల్లో ఇదే ప్రమాదం

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నదులన్నీ కలిసి ఏటా రెండు వేల కోట్ల టన్నుల వరకు అవక్షేపాలను సముద్రాల్లోకి చేరుస్తాయి. వీటిలో సగటున 15-25 శాతం ఇసుక ఉంటుంది. ఇది బీచ్ పునరుద్ధరణకు ప్రధాన వనరు. అయితే, పెద్ద ఆనకట్టలు, ఇసుక తవ్వకాలు, నదీ ప్రవాహాల్లో మార్పుల వల్ల ఈ సరఫరా గత శతాబ్దంతో పోలిస్తే ఇప్పుడు 30-40శాతం వరకు తగ్గిపోయింది. దేశీయంగా నదులు ఏటా సముద్రంలోకి సుమారు వంద కోట్ల టన్నుల అవక్షేపాలను చేరుస్తాయని అంచనా. ఇందులో 20-25 కోట్ల టన్నుల వరకు ఇసుకే ఉంటుంది. కృష్ణా, గోదావరి, గంగా, మహానది వంటి ప్రధాన నదులపై వరసగా ఆనకట్టలను నిర్మించడం వల్ల సముద్రంలోకి చేరే ఇసుక 40శాతానికి పైగా తగ్గిపోయింది.

ఆనకట్టల మూలంగా నదుల నుంచి ఇసుక సముద్రంలోకి చేరాల్సినంతగా చేరట్లేదు. దాంతో తీరప్రాంతాలు కోతకు గురికావడంతో పాటు కిలోమీటర్ల కొద్దీ వెనక్కి వెళ్లిపోతున్నాయి. ఉదాహరణకు ఈజిప్ట్‌లోని అస్వాన్ హై ఆనకట్ట మూలంగా నైలు నదిలోని అవక్షేపాలు సముద్రంలోకి చేరాల్సినంతగా చేరలేదు. దాంతో ఈజిప్ట్ తీరాలు క్రమంగా కోతకు గురయ్యాయి. అమెరికాలో హూవర్ ఆనకట్ట కొలరాడో నది ప్రవాహాన్ని తగ్గించి, కాలిఫోర్నియా గల్ఫ్‌లోని డెల్టాను దెబ్బతీసింది. చైనాలోని త్రీ గోర్జెస్ డ్యాం దాటిన తరవాత యాంగ్జీ నదిలో ఇసుక ప్రవాహం తగ్గింది. షాంఘై సమీపంలోని తీరాలు వెనక్కి మళ్లాయి. వియత్నాంలోని మెకాంగ్ నదిపై ఆనకట్టల వల్ల ఇసుక సరఫరా దెబ్బతిని క్రమంగా డెల్టా విస్తీర్ణం తగ్గిపోతోంది.

ప్రతి రాష్ట్రానికీ ముప్పే

భారతదేశంలో గోదావరి డెల్టాలో ఆనకట్టలు, ప్రాజెక్టుల కారణంగా ఇసుక సరఫరా తగ్గి తీర ప్రాంతాలు కోత ముప్పును ఎదుర్కొంటున్నాయి. కృష్ణా డెల్టాలో నాగార్జునసాగర్ తరవాత నది నుంచి ఇసుక సరఫరా తగ్గడం వల్ల తీరం వెనక్కి పోతోంది. నర్మదా సర్దార్ సరోవర్ డ్యాం కారణంగా గల్ఫ్ ఆఫ్ ఖంబాట్ దగ్గర తీరప్రాంతాలు కోతకు గురయ్యాయి. ఒడిశాలోని మహానది డెల్టాలో హిరాకుడ్ ఆనకట్ట మూలంగా ఇసుక సరఫరా కుంచించుకుపోయి పరదీప్ తీరం తీవ్రంగా కోతకు గురైంది. కావేరి నది డెల్టా(తమిళనాడు-పుదుచ్చేరి) బీచ్‌లో ఇసుక తగ్గుతోంది. అక్కడ సముద్రం భూమిని మింగేస్తోంది. కేరళలో చిన్న నదులపై బ్యారేజీల నిర్మాణం వల్ల బీచ్‌లు ఇసుకను కోల్పోతున్నాయి. దీనికితోడు భూతాపం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. భూ ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరుగుతుండటం వల్ల మంచు కొండలు వేగంగా కరిగిపోతున్నాయి. ఆ నీరంతా వచ్చి చేరడంతో సముద్ర మట్టాలు ఏటా సగటున 3-4 మిల్లీమీటర్ల చొప్పున ఎగబాకుతున్నాయి. దీంతో సాగర తీరాల్లో అలలు ఎగసి లోతట్టు ప్రాంతాల్లోకి చొచ్చుకుపోతున్నాయి. మరోవైపు సముద్ర ఆవరణ వ్యవస్థలో మార్పుల మూలంగా తుపానులు తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఇది తీరప్రాంత కోతను మరింత ఉద్ధృతం చేస్తోంది.

ఇసుక తవ్వకాలను అడ్డుకుంటేనే...

అభివృద్ధికి ఆనకట్టలు అవసరమే కానీ, అత్యంత భారీ నిర్మాణాల వల్ల తీరప్రాంతాల్లో సహజ సమతుల్యత దెబ్బతింటోంది. దీన్ని కాపాడుకోవాలంటే నదుల నుంచి ఇసుక సరఫరాకు ఆటంకం లేకుండా జాగ్రత్తపడాలి. అందుకని కొత్త ప్రాజెక్టులను తీవ్రతపరంగా అంచనా వేసి నిర్మించాలి. తక్కువ సంఖ్యలో చిన్న ఆనకట్టలను నిర్మిస్తే నదుల నుంచి వచ్చే ఇసుకను పూర్తిస్థాయిలో అడ్డుకోవడం ఉండదు. వాన నీటిని భూగర్భంలో, చెరువుల్లో ఎక్కువగా నిల్వ చేయడం ద్వారా ఆనకట్టల అవసరాన్ని, వాటి సంఖ్యనూ బాగా తగ్గించుకోవచ్చు. మరీ ముఖ్యంగా అవక్షేపాలను కట్టడి చేయని రీతిలో ఆనకట్టలను రూపొందించాలి. లేదంటే ఫ్లషింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. మడ అడవులను సంరక్షించడం ద్వారా సహజ రక్షణ వ్యవస్థలను పునరుద్ధరించాలి. అధిక మోతాదులో నీరు నిల్వ లేకుండా నదీ ప్రవాహాన్ని ఉపయోగించి విద్యుదుత్పత్తి చేపట్టడం మేలు. నదుల చుట్టూ జరుగుతున్న ఇసుక తవ్వకాలను కఠినంగా అడ్డుకోవడమే కాకుండా, తీరప్రాంతాల్లో కృత్రిమంగా ఇసుకను నింపే ప్రాజెక్టులు చేపట్టాలి. ఇది తీరప్రాంత సమస్య మాత్రమే కాదు- మానవాళి భద్రత, జీవనోపాధులతో ముడిపడిన కీలకాంశమనీ అందరూ గుర్తించాలి.



ఆచార్య నందిపాటి సుబ్బారావు

భూవిజ్ఞాన శాస్త్రవేత్త

ఒక కొత్త పరిశ్రమ ప్రారంభించడం ఈరోజుల్లో అంత కష్టమేం కాదు. ప్రభుత్వాలు అన్ని రకాలుగా సహకరిస్తున్నాయి. బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. ముడిసరకులు దేశీయంగానో, దిగుమతుల ద్వారానో తేలికగానే లభిస్తున్నాయి. కాబట్టి పారిశ్రామిక ఉత్పత్తి సులభం అవుతోంది. కాకపోతే ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన వస్తువులను మార్కెట్ చేసుకోవడమే కష్టసాధ్యం. దానికి పక్కా ప్రణాళికలు, వ్యూహాలు సిద్ధం చేసుకోక తప్పదు. ఈ సందర్భంగా జపాన్‌లో ఒక కాఫీ కంపెనీ అమలుపరిచిన వ్యూహం ఆసక్తికరం.

చాకొలెట్‌తో మొదలెట్టారు...



జపాన్‌లో 70, 80 దశకాలలో కాఫీకి అంతగా ఆదరణ ఉండేది కాదు. జపనీయులు టీని ఇష్టపడటమే కాదు, టీ తాగడాన్ని ఒక ఉత్సవంలా జరుపుకొంటారు. అలాంటి జపాన్‌లో ఒక బహుళ జాతి సంస్థ కాఫీ అమ్మాలని ప్రయత్నించింది. చక్కటి రుచిగల కాఫీని, తక్కువ ధర, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో మార్కెట్లోకి తెచ్చింది. అయినా ఎవరూ దాని వైపు కన్నెత్తి చూసేవారు కాదు. ప్రకటనలు, తగ్గింపులు, ఉచితాలు... ఎన్నిరకాలుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ సంస్థ ఎంతసేపూ తాము తయారు చేసే కాఫీ గొప్పతనంపై దృష్టి పెట్టింది కానీ, వినియోగదారులకు బ్రాండ్స్‌తో భావోద్వేగపరమైన అనుబంధం ఏర్పడుతుందని తెలుసుకోలేకపోయింది. చివరికి ఆ సంస్థ ఒక మనస్తత్వ నిపుణుణ్ని సలహాదారుగా నియమించుకుంది.

పిల్లల మనస్తత్వ నిపుణుడైన ఆయన ఏం సలహా ఇచ్చాడంటే- ఎవరైనా చిన్నతనం నుంచీ ఏ ఆహారం ఇష్టపడతారో పెద్దయ్యాక దాన్నే కొనసాగిస్తారని, అందుకే పెద్దవాళ్లు కొత్తగా కాఫీని అలవాటు చేసుకోలేకపోతున్నారూ అని. జపనీయులకు తమ చిన్నతనంలో కాఫీ రుచి అసలు తెలియదు. అందువల్ల వాళ్లకి కాఫీతో భావోద్వేగ సంబంధం ఏర్పడలేదు. నిపుణుడి సూచన మేరకు సంస్థ కాఫీ ఫ్లేవర్‌తో చాకొలెట్లు తయారుచేసి మార్కెట్లోకి విడుదల చేసింది. అవి పిల్లలకు బాగా నచ్చేశాయి. ఆ చాక్లెట్లు తింటూ పెరిగిన పిల్లలు పెద్దవాళ్లయ్యి ఉద్యోగాల్లో చేరాక ఆ వాసననీ రుచినీ పానీయాల్లో వెతుక్కున్నారు. వాళ్లకు కాఫీ నచ్చింది. అలా ఓపిగ్గా కొన్ని సంవత్సరాలు ఎదురుచూసిన సంస్థ ఉత్సాహంగా కాఫీ అమ్మకాలను పెంచుకుంది. ఈ రోజు కాఫీని ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశాలలో జపాన్ ఒకటి!

ఇది సంస్థలకు మార్కెటింగ్ పాఠమైతే, తల్లిదండ్రులకు పేరెంటింగ్ పాఠం కూడా. బాల్యంలో అయిన అనుభవాలు, నేర్చుకున్న విషయాలు, అలవాట్లు జీవితాంతం మన వెంటే ఉంటాయి. అందుకనే మనం పిల్లలకి ఏం చెబుతున్నాం, ఏం నేర్పిస్తున్నాం అనే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మనం చేసే ఆహారపుటలవాట్లు, నేర్పే మాటతీరు, ప్రవర్తన... అన్నీ వాళ్ల భవిష్యత్తు జీవితానికి పునాది వేస్తాయి. పిల్లల్ని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుకుంటామా, ఫాస్ట్‌ఫుడ్ కంపెనీల వినియోగదారులుగా మారుస్తామా అన్నది మన చేతుల్లోనే ఉంది.

– ఎం.వి.ఎస్.

సుస్థిర సేద్యం కోసం...

అధిక ఫలసాయాన్ని ఆశించి రైతులు పంటపొలాల్లో భారీగా రసాయన ఎరువులు గుమ్మరిస్తున్నారు. దానివల్ల నేల నిస్సారమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎరువుల వినియోగం, భూ యాజమాన్యంలో అన్నదాతలకు మార్గదర్శకంగా నిలిచేందుకు ప్రభుత్వాలు సాయిల్ హెల్త్ కార్డులు అందిస్తున్నాయి. కరోనా కాలం మినహా 2015 నుంచి ఇప్పటిదాకా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రైతులకు 25 కోట్లకు పైగా కార్డులు అందాయి. ఆంధ్రప్రదేశ్‌లో వాటి సంఖ్య 1.53 కోట్లు అయితే, తెలంగాణలో 1.09 కోట్లు. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా సాయిల్ హెల్త్ కార్డులు ఎన్నెన్ని జారీ అయ్యాయంటే... (లక్షల్లో)

2019–20	23.71
2020–21	16.83
2022–23	42.22
2023–24	41.18
2024–25	88.40
2025–26	11.24

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

అడవులు తగ్గి... చిరుతలు పెరిగి...

అడవుల్లో కొంతకాలంగా క్రూరమృగాల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు, మానవ కార్యకలాపాల వల్ల అటవీ ప్రాంతాలు కుంచించుకుపోతున్నాయి. దాంతో ఆవాసాలు సరిపోక వన్య ప్రాణులు సమీప గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయి. ముఖ్యంగా చిరుతపులులు జనావాసాల్లోకి వస్తున్న ఘటనలు తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా అనేక చోట్ల వరసగా చోటుచేసుకోవడం కలకలం సృష్టిస్తోంది.

దేశంలోని 18 రాష్ట్రాల్లో చిరుతపులులు సంచరిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి 14 రాష్ట్రాల్లో కనీసం రెండొందలకు పైగా చిరుతలు ఉంటాయని అంచనా. ఆయా చోట్ల వాటి సంతతి పెరుగుతుంటే- కొండలూ గుట్టల్లో తవ్వకాలు, వ్యవసాయం, చెట్ల నరికివేత కారణంగా ఆ మృగాల ఆవాసాలు దెబ్బతింటున్నాయి. ఆ క్రమంలోనే అవి ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి వస్తూ మనుషులూ పశువులపై దాడులు చేస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ మంచిరేవులలోని ఫారెస్ట్ ట్రెక్ పార్కులో చిరుతపులి తిష్ట వేయడంతో ఐటీ ఉద్యోగులు, వాకర్స్ బెంబేలెత్తిపోయారు. ఆ చిరుతను పట్టుకోవడానికి అటవీ సిబ్బంది 23 రోజులపాటు శ్రమించాల్సి వచ్చింది. కొన్నినెలల క్రితం ఇక్రిశాట్‌లోనూ ఆ విధంగానే ఓ చిరుతపులిని పట్టుకున్నారు. తాజాగా మహబూబ్‌నగర్‌లో రెండు చిరుతలు మనుషులు, గొర్రెలపై దాడులు చేశాయి. తిరుమలలోని బ్యాటరీ స్టేషన్ ప్రాంతంలో మొన్నామధ్య చిరుత సంచారం కలకలం సృష్టించింది. గతేడాది తిరుమల మెట్లదారిలో ఓ బాలికను చిరుతపులి పొట్టన పెట్టుకోవడం భక్తులెవరూ మరచిపోలేరు!



వేటాడుతూ దారితప్పి...

పలు రాష్ట్రాల్లో చిరుతల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2018లో దేశవ్యాప్తంగా 12,852 చిరుతపులులు ఉంటే, 2022 నాటికి అవి 13,874కి చేరాయి. రెండేళ్ల క్రితం దేశంలో చిరుతలు అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 3,907, మహారాష్ట్రలో 1,985, కర్ణాటకలో 1,879, తమిళనాడులో 1,070 చొప్పున ఉన్నట్లు లెక్కించారు. ఆ తరవాత వీటి సంఖ్య మరింత పెరిగింది. తెలంగాణలో చిరుతల సమస్య ఎక్కువవుతోందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ రాష్ట్ర అటవీశాఖ ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టేదే. నల్లమల అడవులు, పరిసరాల్లో చిరుతపులులు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చిరుతల సంచారం పెరగడంతో స్థానికులు హడలెత్తిపోతున్నారు. అడవులు తరుగుతున్న క్రమంలో చిరుతలు వంటి వన్యప్రాణులు చిన్నచిన్న గుట్టలు, పంట పొలాల్లో నివాసానికి క్రమంగా అలవాటుపడుతున్నాయి.


చిరుతలు చాలా తెలివైనవి. ఓపిక ఎక్కువ. రోజుకు 10-20 కిమీ దూరం ప్రయాణిస్తాయి. నీళ్లు లేకుండా రెండుమూడు రోజులైనా తట్టుకుంటాయి. ఆకలి తీర్చుకోవడానికి వేటాడుతూ కొన్నిసార్లు రాత్రివేళల్లో దారితప్పి జనావాసాలవైపు వస్తున్నాయి. ఇవి సాధారణంగా నీల్గాయిలు, కృష్ణజింకలు, సాంబార్ జింకలతో పాటు నక్కలు, పిల్ల మొసళ్లు, పశువులు, మేకలను వేటాడి తింటాయి. జనావాసాల్లోకి వచ్చినప్పుడు పగటివేళ ఎటు వెళ్లాలో తెలియక ఉన్నచోటునే దాక్కుంటున్నాయవి. చుట్టూ జనం గుమిగూడటం, వారి అరుపులూ కేకలతో ఆందోళనకు గురయ్యే చిరుతలు పారిపోయే క్రమంలో అక్కడున్న వారిపై దాడి చేస్తున్నాయి. అటవీ సమీప గ్రామాల్లోనే ఈ సమస్య తీవ్రంగా ఉంది. జనావాసాల్లోకి వచ్చిన చిరుతలను అడవుల్లో విడిచిపెట్టేటప్పుడు వాటికి రేడియో కాలర్లు అమర్చాలి. దానివల్ల అవి ఎక్కడ సంచరిస్తున్నాయో పసిగట్టడం వీలవుతుంది. అయితే, ఈ కాలర్లు దేశీయంగా తయారు కాకపోవడంతో విదేశాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. మహారాష్ట్ర అటవీశాఖ అధికారులైతే పెద్దపులులకు మాత్రమే రేడియో కాలర్లను అమర్చారు. ఫలితంగా అవి ఎన్ని రాష్ట్రాల మీదుగా ఎంతదూరం ప్రయాణించాయి, ప్రస్తుతం ఎక్కడున్నాయనేది తెలుసుకుంటున్నారు.

ఆవాసాలను పరిరక్షిస్తే...

చిరుతలు జనావాసాల్లోకి వచ్చినప్పుడు చుట్టూ జనం గుమిగూడటం, శబ్దాలు చేయడం అస్సలు చేయకూడదు. చిరుతకు దూరంగా ఉంటే దానంతట అదే మెల్లగా వెళ్లిపోతుంది. చూసిన వెంటనే అటవీశాఖకు సమాచారమిస్తే అధికారులు వచ్చి చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయేలా చూస్తారు. అవసరమైతే వాటిని బంధించి అడవుల్లో విడిచిపెడతారు. కానీ, ఈ సమస్యకు సరైన పరిష్కారం- అడవుల పెంపకం! తెలుగు రాష్ట్రాల్లో ఏటా వర్షకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నారు. దానికింద నగరాలూ పట్టణాలూ గ్రామాల్లో భారీగా మొక్కలు నాటుతున్నారే తప్ప... అడవుల జోలికి వెళ్లడంలేదు. సహజ వనాలను సంరక్షించుకోవడం ముఖ్యమని గ్రహించాలి. ఒక్కో పెద్దపులి ఆవాసం 50-60 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంటుంది. చిరుతల ఆవాసాలైతే 8-10 చ.కి.మీ. మేర ఉంటాయి. అవి సంచరించే చోట్ల వాటి వేట జంతువుల సంతతి సమృద్ధిగా పెరిగేలా చూడాలి.

– సుతారపు సోమశేఖర్

బొమ్మల కబుర్లు చెబుతాడు!



హాయ్ ఫ్రెండ్స్..! మనం అమ్మానాన్నలతో బయటికి వెళ్లినప్పుడు.. కొత్తకొత్త ఆట బొమ్మలు కొనిపించుకుంటాం కదూ? కానీ కొన్నిసార్లు వాటితో ఎలా ఆడాలో తెలియక గాబరాపడిపోతాం. అలా ఇబ్బంది పడిన ఓ నేస్తం.. ఇంకెవ్వరూ అలా పడకూడదని ఓ యూట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశాడు. ఇంతకీ ఆ వివరాలేంటో చూద్దామా!

అమెరికాకు చెందిన ర్యాన్ కాజీకి 13 సంవత్సరాలు. తనకు తొమ్మిదేళ్లు ఉన్నప్పుడే అమ్మానాన్నల సాయంతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. మొదట్లో అందులో రకరకాల బొమ్మల అన్‌బాక్సింగ్, వాటితో ఆడే విధానంతో వీడియోలు పోస్ట్ చేయడం మొదలుపెట్టాడు. 'ఎలా ఆడాలో చూపించడం కోసం ఒక ఛానలా?' అనుకుంటున్నారా. కానీ దానితోనే బోలెడు డబ్బులు, పేరు సంపాదించాడీ నేస్తం. అంతేకాదు.. యంగెస్ట్ మిలియనీర్‌గా కూడా నిలిచాడు. ఇంకా తన చెల్లెళ్లతో కలిసి సైన్స్ ప్రయోగాలు, స్టేట్ మ్యాప్‌ల గురించి మనలాంటి నేస్తాలకు అర్థమయ్యేలా చక్కగా వివరిస్తుంటాడు. ఒకవైపు ప్రయోగాలు, బొమ్మల విశేషాలు చెబుతూ వీడియోలు తీయడం కష్టమవుతుంది కదా! అందుకే వీడియోలు తీయడం, పోస్ట్ చేయడం.. ఛానల్ మేనేజింగ్ మొత్తం ర్యాన్ వాళ్ల అమ్మానాన్నలే చూసుకుంటారట. ప్రస్తుతం తన యూట్యూబ్ ఛానెల్‌కు 3.98 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

హాయ్! బుజ్జీ

ఇప్పటి వరకు తన వీడియోలకు దాదాపు 6,160 కోట్ల వ్యూస్ వచ్చాయి. మరో విషయం ఏంటంటే.. గత ఏడాది తన ఛానల్ మీద 'టైటాన్ యూనివర్స్ అడ్వెంచర్' అని ఒక సినిమా కూడా తీశారు.. దాన్ని అమెరికాలో సుమారు 2వేల థియేటర్లలో ప్రదర్శించారట. అదే కథని పుస్తకంగా కూడా రాశారు తెలుసా! ★

రాయగలరా?

కింద కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని జత చేయండి చూద్దాం.

కూత	బాట	వారం	పువ్వు
పంట	భాష	పిల్ల	పాల
పట్టు	గులాబీ	బడి	వరి
గురు	కుక్క	చెరకు	కోయిల
పిట్ట	తోట	మాతృ	దుస్తులు



వరద గాయం.. దారి మాయం

ఇటీవల వర్షాలకు వచ్చిన వరదలతో ముక్త్యాల రోడ్డు కోతకు గురై సగం కొట్టుకుపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రోజూ వేల వాహనాలు.. ఆంధ్ర, తెలంగాణలోని వివిధ ఫ్యాక్టరీలకు భారీ వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం



బస్టాండ్ కిటకిట

వరుస సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి విద్యాలయాలు, కార్యాలయాలు పునః ప్రారంభం నేపథ్యంలో గమ్యానికి చేరేందుకు ప్రజలు భారీగా బెజవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు తరలివచ్చారు. దీంతో ఆదివారం ప్రాంగణమంతా కిటకిటలాడింది. రద్దీకి తగినట్లు సర్వీసులు లేకపోవడంతో.. బస్సులు వస్తే చాలు జనం ఎగబడి.. సీట్ల కోసం ఇబ్బంది పడ్డారు.
- ఈనాడు, అమరావతి

దసరాకు.. కొత్త క్యూలైన్లు

నమూనాలను పరిశీలించిన ఈవో ★ కొండ కింద నుంచి ఆలయం వరకు

ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 02 వరకు 11 రోజులు నిర్వహించే దసరా వేడుకలకు ఈసారి సరికొత్త క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా గాలి, వెలుతురు బాగా తగిలేలా.. ఈ నూతన క్యూలైన్లు ఉండనున్నాయి. ఇంద్రకీలాద్రి కొండ దిగువన వినాయక ఆలయం నుంచి ఎగువన ఆలయం వరకు మీదుగా రెండు కిలోమీటర్లకు పైగా క్యూలైన్లలో భక్తులు నడిచి వచ్చి ఏటా ప్రధాన ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుంటారు. మరోవైపు హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు కుమ్మరిపాలెం సెంటర్ వద్ద క్యూలైన్లలో ప్రవేశించి.. మాడేర్కర్ మీదుగా ఆలయానికి చేరుకుంటారు. ఈ రెండు మార్గాల్లో గత 15 ఏళ్లకుపైగా.. ఇనుప స్తంభాలను పాతి.. వాటికి ఇనుప తీగలతో చేసిన మెష్‌ను చుట్టి క్యూలైన్లను నిర్మిస్తున్నారు. ఈసారి వాటికి వీడ్కోలు పలుకుతున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న శీనానాయక్

ఈసారి ఆధునిక క్యూలైన్ల ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే లక్షల మంది తరలి వచ్చే సింహాచలం గిరి ప్రదక్షిణ సమయంలో ఈ క్యూలైన్లనే వాడుతున్నారు.

సాఫీగా దర్శనానికి సాగేలా..

దసరా వేడుకలకు కనీసం 12-15 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తుల కోసం కొండ దిగువ నుంచి పైన క్యూలైన్లలోనే ఏటా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గోతులు తీసి రాడ్లను పాతి.. వాటికి ఇనుప తీగలతో చేసిన మెష్‌ను చుట్టి క్యూలైన్లను కడుతుంటారు. ఎంత పక్కాగా వీటిని ఏర్పాటు చేసినా.. అక్కడక్కడా మెష్ మొనదేలిన గజాలు బయటకొచ్చి భక్తులకు గుచ్చుకుని గాయాలవుతుంటాయి. ఈ మెష్ లోపల నుంచి నడుస్తూ వేలాది తరలివచ్చే సమయంలో భక్తులకు ఒక్కోసారి ఊపిరి కూడా సరిగా అందదు. అందుకే

పటిష్ఠం.. భక్తులకు సౌకర్యం..

ఇప్పటివరకూ ఆలయంలో వేస్తున్న ఇనుప మెష్ క్యూలైన్లకు ఇక సమానమైన వెడల్పు అనేది ఉండేది కాదు. వినాయక ఆలయం వద్ద మూడు అడుగుల వెడల్పు ఉంటే.. వచ్చే కొద్దీ కొన్నిచోట్ల రెండు అడుగులు.. మరికొన్ని చోట్ల ఎక్కువ వెడల్పు ఉంటుంది. దీంతో భక్తులు నడిచేందుకు ఇబ్బంది అయ్యేది. తాజాగా ఇనుప ఫ్రేములతో ఆరంభం నుంచి చివర వరకు ఒకేలా వెడల్పు ఉంటుంది. ఒక భక్తుడు నడిచే సమయంలో పక్కన మరొకరికి సరిపోయేంత స్థలం ఉంటుంది. పైగా.. ఇనుప ఫ్రేములను పటిష్ఠంగా, వాటి మధ్యలో మొత్తం ఖాళీగా ఉండడంతో భక్తులు క్యూలైన్లలో ఉన్నా.. బయట ఉన్నట్లే గాలి, వెలుతురు ఉంటాయి. ఈ క్యూలైన్ల నమూనాలను సి.వి. రెడ్డి ఛారిటీస్ వద్ద ఆదివారం ఏర్పాటు చేయగా.. ఈవో పరిశీలించారు. మార్పులు సూచించారు. భక్తులకు సౌకర్యం, భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నామని ఈవో శీనానాయక్ తెలిపారు.

ఆహ్లాదమెక్కడ.. అవినీతి ఇక్కడ!

భవానీ ద్వీపం, బరంపార్కు ఆదాయానికి గండి ★ అభివృద్ధి పేరుతో ఏళ్లుగా రూ.కోట్లు కరిగించారు

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, భవానీపురం

☛ హరిత బరంపార్కు, భవానీ ద్వీపంలో రూ. లక్షల విలువైన సామగ్రిని పర్యాటక శాఖ ఉన్నతాధికారి, ఒక యూనిట్ మేనేజర్ కలిసి అనుచరులకు కారుచౌకగా కట్టబెట్టారు. టెండర్ల విధానంలో విక్రయిస్తే రూ.లక్షల్లో సొమ్ము సమకూరేది.

☛ గత పదేళ్లలో బరంపార్కు మరమ్మతులకే రూ.కోట్లు కేటాయించారు. అయినా ఆ యూనిట్ నష్టాల్లోనే ఉంది. మరమ్మతులూ అరకొరగానే చేపట్టి గుత్తేదారులకు బిల్లులు చెల్లించారు.

☛ ఇటీవల వరదలకు భవానీ ద్వీపంలో కూలిన చెట్లను కొట్టించేందుకు.. గుత్తేదారుకు రూ.17 లక్షలు చెల్లించారు. కొందరు అధికారుల అండతో ఆ దుంగలను మాయం చేశారు. పైగా.. ఆ దుంగలను నది ఒడ్డున ఇసుకలో పూడ్చామని చెబుతున్నారు.

అద్భుతమైన.. ప్రకృతి రమణీయమైన ప్రదేశాలుండీ.. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా..



పర్యాటకుల తాకిడి మాత్రం భవానీద్వీపం, బరంపార్కులకు పెరగడం లేదు. పర్యాటకాభివృద్ధి పేరుతో రూ.కోట్లను కరిగేస్తున్నారే తప్ప చిత్తశుద్ధితో ఏదీ చేయకపోవడమే కారణం. కూర్చున్న చెట్టునే నరుక్కునేలా ఉంది.. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థలోని కొందరు ఉద్యోగుల తీరు. వీరి పొరబాట్లతో సంస్థ నష్టాల్లోకి వెళ్లి.. మనుగడే ప్రశ్నార్థకమైంది. అందుకే ప్రైవేటు సహకారంతో సంస్థను గాడిన పెట్టేలా తాజాగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏళ్లుగా పర్యాటక యూనిట్లలో కొందరు అధికారులు పాతుకుపోవటం, ఆదాయానికి గండి కొట్టడమే నష్టాలకు కారణం.

దుర్గగుడికి వచ్చినోళ్లను రప్పించినా..

విజయవాడ నగరానికి పర్యాటకులు, సందర్శకులు భారీగా వస్తుంటారు. దుర్గగుడికి నిత్యం వేలల్లో వస్తారు. గుడి చెంతనే ఉన్న భవానీద్వీపం, బరంపార్కుకు వీరిని రప్పించినా.. ఆదాయం భారీగా ఉంటుంది. కానీ.. వైకాపా ఏలుబడిలో ఆ ప్రయత్నమే లేదు. గత తెదేపా ప్రభుత్వంలో భవానీ ద్వీపంలో ఆహారోత్సవాలు, బోటులో అల్పాహారంతో.. నదీవిహారం, రకరకాల ఈవెంట్లు చేపట్టినా.. తర్వాత అవన్నీ ఆగిపోయాయి. రూ.కోట్లతో సమకూర్చిన మ్యూజికల్ ఫౌంటైన్‌నూ పట్టించుకోకుండా వదిలేశారు.

హరిత బరంపార్కుకు ఏటా రూ.4 కోట్లపైనే ఆదాయం వచ్చేది. నిరుడు 2.5 కోట్లకు పరిమితమైంది. భవానీ ద్వీపం పరిస్థితీ ఇంతే.

కొన్నేళ్లుగా ఊసేలేదు..

వీటిని తిలకించేలా గతంలో ప్రత్యేక ప్యాకేజీలు ఉండేవి. విజయవాడ నుంచి తిరుపతి, శ్రీశైలం, ఇతర ఆలయాలను తిలకించేలా ప్యాకేజీలుండేవి. కొన్నేళ్లుగా వీటి ఊసేలేదు. కృష్ణా నదిలో బోటింగ్ కోసం భవానీ ఘాట్ వద్ద రూ.5 కోట్లతో జెట్టీ నిర్మాణం మొదలుపెట్టినా.. వైకాపా హయాంలో ఆపేశారు.

మరమ్మతులకు రూ.కోట్లు..

హరిత బరంపార్కు హోటల్, భవానీద్వీపంలో కాటేజీల మరమ్మతులకు రూ.కోట్లు ఖర్చు పెట్టినా.. పనులు సరిగా చేయలేదు. నిరుడు రెండింటిలో మరమ్మతులకు రూ.10 కోట్లు వెచ్చించారు. మరమ్మతులకే ఆదాయమంతా కరిగించేసినా.. ఆదాయ వృద్ధి ఊసేలేదు.

మళ్లీ వరద ఉద్ధృతి..!

ఎగువ నుంచి పెరిగిన నీటి ప్రవాహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎగువన వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తూ కృష్ణాలో విలీనం అవుతున్నాయి. ఫలితంగా ప్రకాశం బ్యారేజీ వద్ద ఆదివారం వరద ప్రవాహం మళ్లీ ఉద్ధృత రూపం దాల్చింది. పల్నాడు, తెలంగాణలోని మూసీ నది, తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని ఖమ్మం-ఎన్టీఆర్ జిల్లాల్లోని వాగులు, వంకల వరదంతా కృష్ణా నదికే చేరుతోంది. బ్యారేజీకి ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 2.52 లక్షల క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2.49 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. తర్వాత క్రమేపీ వరద ప్రవాహం పెరిగింది. పులిచింతల నుంచి మధ్యాహ్నం వరకు 2.98 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా.. రాత్రి 7 గంటలకు 1.93 లక్షలకు తగ్గించారు. మూసీ నుంచి 5,000, పాలేరు నుంచి 9,535, కీసర (మునేరు) నుంచి 56,504 క్యూసెక్కులు వస్తోంది. బుడమేరు (వెలగలేరు) నుంచి ఎలాంటి ప్రవాహం లేదు. సాయంత్రం 6 గంటలకు బ్యారేజీ వద్ద 35 గేట్లను 8 అడుగులు, మిగతా 34 గేట్లను 7 అడుగులు మేర ఎత్తారు. (ఒక గేటు మూసి ఉంది.)

బ్యారేజీ వద్ద ఆదివారం (క్యూసెక్కుల్లో..)

సమయం	రాక	పోక
ఉదయం 6	2,52,034	2,49,000
మధ్యాహ్నం 12	2,78,249	2,75,215
రాత్రి 8 గంటలు	2,85,392	2,82,358



ప్రకాశం బ్యారేజీ నుంచి కడలికి తరలిపోతున్న కృష్ణమ్మ



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం

సముద్రంలోకి 2.85 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు.

బందరు కాలువ కట్టివేత: కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు 3,034 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 2,518, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 516 క్యూసెక్కులు ఇస్తున్నారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ 1,000, కేఈబీ 702, ఏలూరు కాలువలకు 816 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. బందరు కాల్వకు నీటి సరఫరాను నిలిపివేశారు.

శాంతించిన మునేరు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఈనెల 16న ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చిన మునేరు ఆదివారానికి శాంతించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు మునేరులో గురువారం నుంచి వరద ఉద్ధృతి పెరిగిన విషయం విదితమే. క్రమంగా పెరుగుతూ వచ్చిన వరద శనివారానికి ఉగ్రరూపం దాల్చి 31 వేల క్యూసెక్కులకు చేరడంతో లింగాల వంతెనపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి క్రమంగా వరద తగ్గుతూ 9 వేల క్యూసెక్కులకు చేరడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. లింగాల వంతెనపై వాహనాల రాకపోకలను అనుమతించారు.

రవాణా భత్యం.. చదువుకు ఊతం

జిల్లాలో 6,439 మంది విద్యార్థుల గుర్తింపు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



వాహనాల కోసం మాగల్లు విద్యార్థుల ఎదురుచూపు

☆ నందిగామ మండలం మాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు... 3 నుంచి 5 కి.మీ. దూరంలోని రామిరెడ్డిపల్లి, కొండూరు, సోమవరం, పల్లగిరి గ్రామాల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు ఆటోలు, బస్సుల్లో వస్తారు. జొన్నలగడ్డ జడ్పీ పాఠశాలకు గుమ్మడిదుర్రు, వెల్దుర్తిపాడు, రామిరెడ్డిపల్లి నుంచి సుమారు 40 మంది ఆటోల్లో వస్తున్నారు.

☆ మైలవరం మండలం వెల్వడం జడ్పీ ఉన్నత పాఠశాలకు 5 కి.మీ. దూరంలోని తోలుకోడు నుంచి సుమారు 20 మంది విద్యార్థులు ఆటోల్లో వస్తారు. దూరంగా ఉన్న పాఠశాలలకు ఆటోలు, ఇతర వాహనాల్లో బడులకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ప్రభుత్వం అలాంటి విద్యార్థులకు ఏడాదికి రూ.6 వేల చొప్పున రవాణా ఛార్జీలు ఇవ్వబోతోంది.

తమ ఊళ్లలో పాఠశాలలు లేక..

☆ సొంత ఊళ్లలో ప్రభుత్వ పాఠశాలలు లేక కొంతమంది విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదువుకుంటున్నారు. విద్యార్థులకు బడి దూరం కావడమే కాకుండా రవాణా ఖర్చులు తల్లిదండ్రులకు భారమవుతున్నాయి. ఫలితంగా కొందరు పిల్లలను బడి మాన్పించేస్తున్నారు.

☆ ఎన్టీఆర్ జిల్లాలోని 880 ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో 88,598 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 183 పాఠశాలలకు చెందిన 6,439 మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్నట్టు గుర్తించామని సమగ్రశిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త జి.మహేశ్వరరావు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున పది నెలలకు రూ.6 వేలు ప్రభుత్వం చెల్లించనుంది. నగదును ప్రతి రెండు నెలలకు ఒకసారి రూ.1200 చొప్పున ఇవ్వనున్నారు.

☆ చదువుతున్న పాఠశాల.. విద్యార్థి ఊరు దూరం ఆధారంగా రవాణా ఛార్జీలు ప్రభుత్వం ఇవ్వనుంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు కి.మీ. అంతకంటే ఎక్కువ దూరం నుంచి వస్తే, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు 3 కి.మీ. అంతకంటే ఎక్కువ దూరం వస్తేనే లబ్ధికి అర్హులు. రవాణా ఛార్జీలు ఇవ్వడం వల్ల బడి మానేసే విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాకు 130 బార్లు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఏపీ ఎక్సైజ్ రూల్స్ 2025 ప్రకారం న్యూ బార్ పాలసీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాకు 2025-28 సంవత్సరానికి 130 బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీలకు జనాభా ప్రాతిపదికన వీటిని కేటాయించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 117, కొండపల్లి మున్సిపాలిటీ 8, జగ్గయ్యపేట మున్సిపాలిటీ 2, తిరువూరు నగర పంచాయతీ 1, నందిగామకు 2 చొప్పున బార్లు కేటాయించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 18న ప్రకటిస్తారు. 26వ తేదీ సాయంత్రం 5 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ పద్ధతిలో స్వీకరిస్తారు. 28న ఉదయం 8 గంటలకు కలెక్టర్ లాటరీ తీస్తారు. అదే రోజు ఎంపికైనవారిని ప్రకటిస్తారు.

గీత కులాలకు 10 శాతం: బార్ పాలసీలో భాగంగా గీత కులాలకు 10 శాతం బార్లను కేటాయించారు. జిల్లాలో గౌడ్ కులస్థులకు 3, గౌడ కులస్థులకు 7 దుకాణాలు రిజర్వ్ చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో రిజర్వ్ చేసిన బార్ల వివరాలను కలెక్టర్ ప్రకటిస్తారు. 20న దీనిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. 29 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తారు. 30న కలెక్టర్ లాటరీ తీసి బార్లు కేటాయిస్తారు.

కలల ఇళ్లు.. కనుల నీళ్లు!

✦ ఎన్టీఆర్ గృహ కల్ప లబ్ధిదారుల ఇక్కట్లు
✦ సర్వే పూర్తి అయినా జమ కాని బిల్లులు...

ఈనాడు, అమరావతి



గుడివాడ మండలం దొండపాడులో ఇటీవల అధికారులు చేస్తున్న ఈ ఇంటి నిర్మాణం 2014-19 తెదేపా ప్రభుత్వ పాలనలో మొదలుపెట్టారు. ప్రారంభంలో కొంత మొత్తం బిల్లు జమవగా.. ఆ తర్వాత వైకాపా ఏలుబడిలో పైసా రాలేదు. దీంతో ఇలా అసంపూర్తిగా నిలిచింది.



పెనుగంచిప్రోలువాసి సునీతకు మంజూరైన గృహమిది. ప్రభుత్వం నుంచి రూ.60 వేల వరకు బిల్లులు రావాల్సిన నేపథ్యంలో నిర్మాణం ఇలా అసంపూర్తిగా వదిలేశారు. అప్పులు చేసి ఈ దశకు తీసుకొచ్చారు.

ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారులకు బకాయిలు కష్టాలు తీరలేదు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లు బిల్లుల చెల్లింపునకు నీళ్లొదలగా... కూటమి సర్కారు రావడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే సర్వే చేసింది. ఈక్రతువు ముగిసి ఏడాది దాటినా ఇప్పటికీ బిల్లులకు మోక్షం దొరకలేదు. నగదు జమకాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి సర్కారు వేగంగా బిల్లులు ఇవ్వాలని కోరుతున్నారు.

గాలికొదిలిన వైకాపా... 2014-19 తెదేపా పాలనలో ఎన్టీఆర్ గృహ కల్ప పథకం ద్వారా పేదల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేసింది. ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.50 లక్షల చొప్పున నాలుగు దశల్లో చెల్లించారు. ఉమ్మడి జిల్లాలో 40,910 నిర్మాణాలకు మొత్తం రూ.398.3 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.343.05 కోట్లు అప్పటి తెదేపా ప్రభుత్వమే చెల్లించింది. 2019లో వైకాపా ప్రభుత్వం రావడంతో ఈ పథకాన్ని పూర్తిగా గాలికొదిలేసింది. ఐదేళ్లలో చెల్లించాల్సిన పైసా విదల్చలేదు.

సర్వే చేసినా జాప్యమేల... గృహ నిర్మాణ సంస్థ అధికారులు క్షేత్రంస్థాయిలో సర్వే చేసి మొత్తం 27,353 మంది లబ్ధిదారులకు బిల్లులు జమ చేయాలని నిర్ణయించారు. ఇదంతా జరిగి చాలా కాలమైనా... ఇప్పటికీ బిల్లుల జమపై స్పష్టత లేదు. అవనిగడ్డ, పామర్రు, పెడన, నందిగామ, గుడివాడ తదితర నియోజకవర్గాల్లో అత్యధికంగా లబ్ధిదారులకు బకాయిలు రావాల్సి ఉంది. నందిగామ పరిధిలో 2,042 మందికి రూ.5.73 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 5-10 శాతం మంది లబ్ధిదారులు బిల్లులు రాక మధ్యలోనే నిర్మాణం ఆపేశారు.

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
మొత్తం గృహాలు	18,481	22,429
బిల్లులు రావాల్సినవారు	12,733	14,620
చెల్లించాల్సిన బిల్లులు	201	197.3
ఇప్పటి వరకు చెల్లింపు	175.35	167.7
బకాయిలు (రూ.కోట్లలో)	25.78	29.6

☛ నందిగామ మండలవాసి యమునకు 2015లో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని నిర్మాణం మొదలుపెట్టారు. రూ.1.50 లక్షలకు గాను.. అప్పట్లోనే రూ.1.20 లక్షలు అందాయి. ఐదేళ్ల వైకాపా పట్టించుకోలేదు. రూ.30 వేలు నేటికీ రాక తల్లడిల్లుతున్నారు.

త్వరలోనే బిల్లులు జమవుతాయని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల హౌసింగ్ పీడీలు విజయకుమారి, పోతురాజు తెలిపారు.

వరదల వేళ మరింత అప్రమత్తం

వత్సవాయి, న్యూస్‌టుడే: తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలతో మూడు రోజులుగా వస్తున్న వరదల విషయంలో జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. భారీగా వరద పారుతున్న మునేరును నందిగామ ఆర్డీవో బాలకృష్ణతో కలిసి కలెక్టర్ ఆదివారం లింగాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కాజ్‌వేపై నడుచుకుంటూ వరద ఉద్ధృతిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వరదల నేపథ్యంలో జిల్లాలో ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు చెప్పారు. కృష్ణానది, కట్టలేరు, మునేరుకు వస్తున్న భారీ వరదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశామన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తుండడంతో మునేరుకు శనివారం 31 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా కాజ్‌వేపై శనివారం రాత్రి వాహనాల రాకపోకలను నిలిపేశామన్నారు. మరో రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులకు సూచనలు చేసినట్లు చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. కచ్చితమైన సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలుపుతున్నట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఆర్ఐ జనార్దన్, మునేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ, మునేరు డీఈ జీవీ రఘు, ఏఈ రామనరసింహారావు, తొండపు జనార్దన్, సీహెచ్ మౌళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టర్ దృష్టికి సమస్య

వరద ఉద్ధృతికి పోలంపల్లి డ్యాం వద్ద కట్టలు తెగి సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పి.బాలాజీ.. కలెక్టర్ లక్ష్మీశ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పోలంపల్లి డ్యాం వద్దకు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, అక్కడి రైతులతో ఉన్న సమస్య పరిష్కరిస్తామన్నారు.

రెండింతలన్నారు.. రెంటికీ చెడ్డారు!

‘యుపిక్స్’లో వెలుగు చూసిన కొత్త కోణం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

పెట్టిన సొమ్ముకు ఏడాదిలోనే రెట్టింపు ఇస్తామనేసరికి ఆశ పడ్డారు. మొదటి ఏడాది టంచన్‌గా డబ్బులు రావడంతో గురి కుదిరింది. మూడో ఏడాదికి రూ.లక్షలు చేతికి రావడంతో ఆశ ఎక్కువైంది. బంధువులు, స్నేహితులతో కలిసి రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టారు. నాలుగో ఏట నుంచి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అయిదో సంవత్సరం నాటికి వారికి రావాల్సిన సొమ్ములు రూ.వందల కోట్లకు చేరాయి. చివరికి రాకపోవడంతో మోసపోయామని పోలీసులను ఆశ్రయించారు. హాలీవుడ్ సినిమాల్లో యానిమేషన్స్ వర్క్స్‌లో పెట్టుబడులు పెడితే ఏడాదిలోనే రెట్టింపు ఆదాయం ఇస్తామని ‘యుపిక్స్’ సంస్థ ప్రజలను నిట్టనిలువునా ముంచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తవ్వుతున్న కొద్దీ పోలీసులకు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. నష్టపోయిన వారు ఎంత మంది ఉన్నారో.. లాభాలు తీసుకున్న వారూ అంతే ఉన్నారని లెక్కలు తేలింది. ఇలా అక్రమంగా లాభాలు తీసుకున్న వారిపై పోలీసులు దృష్టి పెట్టారు.

2022 వరకు చేతినిండా డబ్బులే

యుపిక్స్ సంస్థ 2019లో రెట్టింపు స్కీమ్ తీసుకువచ్చింది. తొలి ఏడాది చాలా మంది రూ.లక్షల్లోనే పెట్టుబడులు పెట్టారు. రెండో ఏడాదికి రెట్టింపు డబ్బులు ఇవ్వడంతో.. వచ్చిన ఆ సొమ్మునూ ప్రజలు మళ్లీ పెట్టుబడులుగా పెట్టారు. రూ.లక్ష.. రెండేళ్లలో రూ.4 లక్షలు అయ్యేసరికి అత్యాశకు పోయారు. ఇలా వచ్చిన రూ.4 లక్షలు పెట్టుబడులుగా పెట్టిన వారు కోకొల్లలు. 2022 వరకు పెట్టిన డబ్బుల్లో వచ్చిన లాభాలను చాలా మంది తీసేసుకున్నారు. పెట్టుబడులు రూ.లక్షల నుంచి రూ.కోట్లకు పెరిగాయి. చాలా మంది తమకు వచ్చిన రెట్టింపు సొమ్ములో సగాన్ని మళ్లీ పెట్టుబడులుగా పెట్టారు. అయితే నిర్వాహకులు తిరిగి చెల్లించడంలో ఆలస్యం చేశారు. దీంతో బకాయిలు రూ.వందల కోట్లకు చేరాయి.



సత్యనారాయణపురంలోని యుపిక్స్ కార్యాలయం

ఒకే వ్యక్తి రూ.40 లక్షల పెట్టుబడి

యుపిక్స్‌లో చాలా మంది మొదట్లో రెండు లేదా మూడు లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. ఈ స్కీమ్ ప్రాధాన్యతను గుర్తించిన ఒక వ్యక్తి.. ఒకే మొత్తంలో రూ.40 లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. ఏడాదిలోనే అది రూ.80లక్షలు అయింది. కానీ అతని చేతికి వచ్చింది మాత్రం శూన్యం. ఇలా 2022 సంవత్సరం తర్వాత మొత్తం 344 మందిలో.. దాదాపు 100 మందికి పైగా మోసపోయిన వారు ఉన్నారని పోలీసులు చెబుతున్నారు.

తవ్వే కొద్దీ.. అరాచకాలెన్నో....

ఈ కేసు దర్యాప్తు చేసిన సిట్ అధికారులు విస్తుపోయే నిజాలు గుర్తించారు. నిందితుల్లో ఒకరైన మిట్టపల్లి రాజేంద్రబాబు రూ.71.18 కోట్లు లబ్ధి పొందారు. పేరం మాల్యాద్రి రూ.10కోట్లు, కోతూరు వేణుగోపాలరావు రూ.27.26కోట్లు పంచేసుకున్నారు. పోలీసులు ఈ సొమ్ములను రికవరీ చేసే పనిలో పడ్డారు. 2019 తర్వాత ప్రధాన నిందితుడు కిరణ్‌తో పాటు మిగిలిన నిందితులు కొనుగోలు చేసిన ఆస్తులను పోలీసులు గుర్తించారు. సిట్ దర్యాప్తును ముందుగానే అంచనావేసిన నిందితులు.. తమ పేరిట ఉన్న ఆస్తులను వేరే వారికి బదలాయించారు. ఇలా నలుగురైదుగురి చేతులు మారినట్లు పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. లాభాలు స్వీకరించిన వారి వివరాలను సేకరించారు. ఆ సొమ్ములు వెనక్కి ఇవ్వాలని.. లేని పక్షంలో కేసులు తప్పవని స్పష్టం చేస్తున్నారు. నష్టపోయిన వారి డబ్బులు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆధారాలను గుర్తించిన పోలీసులు.. న్యాయస్థానం ద్వారా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నామరూపాల్లేవ్

మండలంలోని వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారికి భారీ గండిపడింది. బుధ, గురువారం కురిసిన వర్షాలకు కట్లేరుకు వరద నీరు పోటెత్తడంతో వినగడప వంతెన వద్ద రాకపోకలు నిలిచిన సంగతి తెల్సిందే. నాలుగు రోజులుగా ప్రయాణాలు నిలిపేయగా మరో వారం రోజుల వరకు రాకపోకలు పునరుద్ధరించే సూచనలు కన్పించడం లేదు. ఆదివారం కూడా వంతెన వద్ద వరద నీరు ఉద్ధృతంగానే ప్రవహిస్తోంది. మళ్లింపు రోడ్డుకు వరద తాకిడితో పడిన గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చితేనే ప్రజలు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. అప్పటి వరకు కట్లేరులో వరద తగ్గినా పాదచారులు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి. - న్యూస్‌టుడే, గంపలగూడెం


వినగడప వంతెన వద్ద మళ్లింపు రహదారికి ఏర్పడిన భారీ గండి నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

వరద ముంపు.. వెంటనే తొలగింపు

నగరంలో 42 ప్రాంతాల్లో 42 బృందాల ఏర్పాటు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

కొద్దిపాటి వర్షం పడితే నగరం జలమయం అవుతోంది. భారీ వాన పడితే పరిస్థితి చెప్పనవసరం లేదు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రజలు రహదార్లపైకి రాలేని స్థితి నెలకొంటుంది. నగర వాసుల అవస్థలు వర్ణనాతీతం. ఆ సమస్య పరిష్కరించడానికి, ముంపు బారి నుంచి వెంటనే ఉపశమనం కలిగించడానికి నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. వర్షాకాల ప్రతి స్పందన బృందాలు (మాన్‌సూన్ రస్పాన్స్ టీమ్స్) ఏర్పాటు చేసింది. ఆయా బృంద సభ్యులు మూడు నియోజకవర్గాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు.

★ ముందుగా వర్షం పడినప్పుడు నగరంలో నీరు ఎక్కువ నిల్వ ఉండే 42 ప్రాంతాలను గుర్తించారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాల ముఖ్య అధికారుల పర్యవేక్షణలో వార్డు సచివాలయాల ప్లానింగ్, ఎమినిటీస్, శానిటరీ సెక్రటరీలతో 42 బృందాలు సిద్ధం చేశారు. ఆ బృంద సభ్యులు 24 గంటలు విధులు నిర్వహించేలా కేటాయించిన ప్రాంతంలోనే ఉండేలా ప్రత్యేకంగా గుడారాలు ఏర్పాటు చేశారు. 10 నిమిషాల్లో వరద బయటికి పంపేలా ప్రణాళిక రూపొందించారు.


బృందాల కోసం గుడారాలు

గుర్తించిన ప్రాంతాలు ఇవీ.. పశ్చిమ : లోబ్రిడ్జి, దుర్గగుడి దిగువ, విద్యాధరపురం హెడ్‌వాటర్ వర్క్స్ పక్కన, కుమ్మరిపాలెం సెంటర్, వీఎంసీ మెయిన్ ఆఫీసు అండర్ పాస్ ప్రాంతాలు

మధ్య: ప్రకాశం రోడ్డు, విజయ టాకీస్ సెంటర్, ఆంజనేయ స్వామి గుడి, వేముల శ్యామలాదేవి రోడ్డు, ప్రజా వైద్యశాల, సత్యనారాయణపురం స్వర ఆస్పత్రి, భాను నగర్, లోటస్ ల్యాండ్ మార్క్, రామ మందిరం రోడ్డు, వ్యాకరణం రోడ్డు, గాంధీ నగర్ ఎన్ఆర్‌పీ రోడ్డు, సింగ్‌నగర్ ఆర్‌యూబీ, పటేల్‌నగర్, ఎల్‌బీ నగర్ అంతర్గత రహదారులు, రాజీవ్ నగర్ కట్ట అంతర్గత రోడ్డు, కండ్రిక, సింగ్‌నగర్ మెయిన్ రోడ్డు, నూజివీడు రోడ్డు (బర్మా కాలనీ), బందరు రోడ్డు (రాఘవయ్య పార్కు ప్రాంతం), రామవరప్పాడు రింగ్, మధురానగర్ ఆర్‌యూబీ ప్రాంతాలు

తూర్పు: పుల్లేటి కట్ట డ్రెయిన్ సమీప ప్రాంతాలు, బాయన బాపూజీ రోడ్డు, ఆయుష్ ఆస్పత్రి రోడ్డు, జాతీయ రహదారి పైవంతెన పక్కన, రమేష్ ఆస్పత్రి కూడలి, డీవీ మానర్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ఎంజీ రోడ్డు కేఎఫ్‌సీ ప్రాంతం, బెంజి సర్కిల్, పటమట లంక అండర్ పాస్, మార్గ కృష్ణయ్య, నిర్మల కాన్వెంట్ రోడ్డు, ఆటోనగర్ గేట్, ఆకాశవాణి, ఏపీఐఐసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ఎయిర్‌పోర్టు కారిడార్

అందుబాటులో వాహనాలు.. ఆయా బృందాలకు 24 ఎయిర్‌టెక్ యంత్రాలు, 10 గుల్పర్లు, ఒక సూపర్ సక్కర్, 69 ఆయిల్ ఇంజిన్లు, 21 జేసీబీలు, 9 లాంగ్‌ఆర్మ్ పొక్లెయిన్లు అందుబాటులో ఉంచారు.


వాన నీరు సేకరించే ఎయిర్‌టెక్ యంత్రాలు

'వడ్డీలతో వేధించారు.. మానసికంగా హింసించారు'

అందుకే చనిపోవాలని నిర్ణయించుకున్నా ✴ వివాహిత సెల్ఫీ వీడియో.. ఆపై బలవన్మరణం

తాడేపల్లి, న్యూస్‌టుడే: వడ్డీ వ్యాపారుల వేధింపుల కారణంగా తాడేపల్లిలోని నులకపేట వాసి కృష్ణప్రియ ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె చనిపోవడానికి ముందు తన ఆవేదనను సెల్ఫీ వీడియోలో రికార్డు చేయగా.. ఆలస్యంగా అది వెలుగులోకి వచ్చింది. ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆ వీడియోలోనే జరిగిన పరిణామాలను నాలుగు పేజీల్లో లేఖగా రాసి కృష్ణప్రియ ప్రదర్శించారు. వీడియోలో ఆమె చెప్పిన మాటలు, లేఖలోని అంశాలను చూస్తే.. 'నా పేరు అద్దంకి కృష్ణప్రియ. నా భర్తపేరు కృష్ణతేజ. మేము నులకపేటలో నివాసం ఉంటున్నాం. మా వారు దుర్గాఘాట్‌లో పురోహితులుగా చేస్తారు. నేను చనిపోవాలని నిర్ణయం తీసుకున్నాను. దానికి కారణం.. విజయవాడ దుర్గాఘాట్‌లో వడ్డీ వ్యాపారం చేసే దుక్కా వేణు, దుక్కా శ్రీను, బాజి ప్రసాద్. ఈ ముగ్గురి వల్ల నేను చనిపోవాలని నిర్ణయం తీసుకున్నాను. దానికి కారణం పోలీసు వారికి రాసి ఇస్తున్నాను.' అంటూ లేఖను వీడియోలో ఆమె చూపించారు.

లేఖలోని సారాంశమిది.. వీడియోలో కృష్ణప్రియ చూపించిన లేఖలోని విషయాలను ఇలా ఉన్నాయి.. 2016లో దుర్గాఘాట్‌లో వడ్డీ వ్యాపారం చేసే దుక్క వేణు, దుక్క శ్రీనివాస్ అనే అన్నదమ్ముల దగ్గర తన భర్త రూ.50 వేలు అప్పుగా తీసుకున్నారని.. అందుకు గాను ఖాళీ చెక్కు, ప్రామిసరీ నోటుపై సంతకాలు పెట్టించి వారు తీసుకెళ్లారని ప్రస్తావించారు. 2017లో అప్పులో రూ.15 వేల వరకు చెల్లించామని పేర్కొన్నారు. గతంలో తన భర్త ఊరులో లేనప్పుడు వేణు, శ్రీను, రామకృష్ణ, విశ్వనాథన్ రవి అనే వాళ్లు ఇంటికి వచ్చి వడ్డీ కట్టలేదని గొడవ చేశారని.. వారి వేధింపులపై తన భర్త తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 13న తాను విజయవాడ వెళ్లిన సమయంలో వడ్డీ వ్యాపారులు వేధింపులకు పాల్పడ్డారని.. వారి మాటలు భరించలేకపోతున్నానని పేర్కొన్నారు. తన చావుకు ఆ ముగ్గురు వడ్డీ వ్యాపారులే కారణమని పేర్కొన్న ఆమె.. 'బుజ్జి నన్ను క్షమించు. నావల్ల కావడం లేదు. నేను భరించలేకపోతున్నాను. అందుకని ఈ నిర్ణయం తీసుకున్నాను. ఐలవ్‌యూ బుజ్జీ, మిస్‌యూ బుజ్జీ అంటూ లేఖలో రాశారు. తన శవాన్ని తన భర్తకే అప్పగించాలని, హోంమంత్రి అనిత, పోలీసులు తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ సెల్ఫీ వీడియో అంశాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లగా వారు ధ్రువీకరించారు.

ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడండి

చిట్టినగర్, న్యూస్‌టుడే: మైజర్‌పేట కొండ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని.. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 14న మైజర్‌పేట, పెద్దిరాజు వీధి కొండ ప్రాంతంలో రిటైనింగ్ గోడ జారిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు పడినప్పుడు అప్రమత్తమై ప్రజలతో సమన్వయం చేసుకుని ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులకు చెప్పారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో మైకుల ద్వారా ప్రచారం చేయించారు. గోడకూలి నష్టపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌తో పాటు సర్కిల్-1 ఈఈ శ్రీనివాసరావు, డీఈ మాధవి, ఏఈ జాస్మిన్, కృష్ణనాయక్, శానిటరీ అధికారి కృష్ణ, సచివాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కీసరలో సమీక్ష

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే: వరద పరిస్థితి అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కీసర మునేటి వంతెన వద్ద అధికారులతో కలిసి వరద పరిస్థితిని సమీక్షించారు. నీటిపారుదల శాఖ అధికారులు.. కలెక్టర్‌కు వరద పరిస్థితి వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటలు నీట మునిగిన ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉప తహసీల్దారు వేమూరి మానస, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.


పశ్చిమ బైపాస్‌పై వాహనాల మళ్లింపు

గొల్లపూడి, న్యూస్‌టుడే: వరుస సెలవుల నేపథ్యంలో విజయవాడ నగరానికి వచ్చి వెళ్లే వాహనాల సంఖ్య పెరిగింది. దీంతో నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తాత్కాలికంగా విజయవాడ పశ్చిమ పశ్చిమ బైపాస్ రహదారి మీదకు మళ్లించారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను గొల్లపూడి వద్ద పశ్చిమ బైపాస్‌కు మీదకు పంపించారు. అలాగే ఏలూరు, రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే వాహనాలను చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ మీదకు మళ్లించారు. దీంతో పశ్చిమ బైపాస్‌పై వాహనాలు సజావుగా వెళ్తుండగా విజయవాడలో ట్రాఫిక్ సమస్య కొంత పరిష్కారమైంది.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

సమస్యలపై 91549 70454కు ఫోన్ చేయండి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎరువుల లెక్కలు పక్కాగా ఉండాలి. ఇవి పక్కదారి పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి. లక్ష్మీశ హెచ్చరించారు. ఎరువుల సరఫరాపై ఏవైనా ఫిర్యాదులు లేదా సమాచారాన్ని అందించదలచిన వారు విజయవాడ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454కు ఫోన్ చేయవచ్చని రైతులకు సూచించారు. ఈ నంబర్‌ను ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో ఎరువులు సమృద్ధిగా ఉన్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని వివరించారు. కిలో ఎరువు కూడా పక్కదారి పడకూడదని స్పష్టం చేశారు. సాగు అవసరాల మేరకే ఎరువులు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల లెక్కలకు సంబంధించి విజిలెన్స్, అగ్రికల్చర్ రికార్డులతో లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు.


టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ

అందుబాటులో 6,388 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో 6,388 టన్నుల యూరియాతో పాటు, డీఏపీ, ఎంఓపీ, ఎస్.ఎస్.పి. కాంప్లెక్స్.. ఇలా మొత్తం 23,820 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే వాటిని వినియోగించాలని సూచించారు. నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

మరో మూడు రోజుల పాటు వర్షాలు

రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని లక్ష్మీశ పేర్కొన్నారు. వరదలు, వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నదిలో వెళ్లే మార్గాలు, వాగులు వంకల వద్ద బాగా కన్పించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటూ.. నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్. ఇలక్కియా, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, డీఏవో విజయకుమారి, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారంపై విచారణ ముమ్మరం

విద్యాధరపురం: ప్రకాశం బ్యారేజీ పటిష్టతపై అసత్య ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానల్‌పై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. బ్యారేజీ 67వ గేటు విరిగిపోయిందని.. దీంతో భారీగా వరద ముప్పు సంభవించే అవకాశం ఉందని సుమన్ టీవీ యూట్యూబ్ ఛానల్‌లో అసత్య ప్రచారం చేశారని ఇరిగేషన్ ఏఈ రాజేష్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రజలను ఆందోళనకు గురి చేయడం ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో సైబర్ క్రైం పోలీసుల సహకారం తీసుకుంటున్నట్లు సమాచారం. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు దీనిని తీవ్రమైన నేరంగా పరిగణించినట్లు తెలిసింది. అసత్య ప్రచారం వెనక ఎవరు ఉన్నారో విచారణలో తెలుతుందని పశ్చిమ ఏసీపీ దుర్గారావు చెప్పారు. ఎలాంటి ఆధారాలు, అధికారుల వివరణ లేకుండా అసత్య సమాచారం ప్రసారం చేయడంపై చట్టపరమైన చర్యలకు న్యాయ సలహాలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)


వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 520 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

వీఆర్ సిద్ధార్థ ప్రిన్సిపల్‌కు అవార్డు

కానూరు, న్యూస్‌టుడే : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ విశ్వ విద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ అట్లూరి వెంకటరత్నప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మక ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్- 2024 అవార్డు వచ్చినట్లు విశ్వ విద్యాలయం ఉప కులపతి పి.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లెలోని మదనపల్లి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎస్‌టీఈ న్యూదిల్లీ అధ్యక్షుడు ప్రతాప్‌సింహ కాకాసాహెబ్ దేశాయ్, జేఎన్‌టీయూ అనంతపురం ఉప కులపతి హెచ్. సుదర్శనరావు అవార్డు అందించినట్లు చెప్పారు. 30 ఏళ్ల ఆయన ఇంజినీరింగ్ కళాశాలలో ఆచార్యులుగా, పరిశోధకుడిగా, ప్రిన్సిపల్‌గా విశిష్ట సేవలు అందించినట్లు చెప్పారు. గతంలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉన్నారని, ప్రస్తుతం విశ్వ విద్యాలయానికి ప్రో వైస్ ఛాన్సలర్‌గా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, డైరెక్టర్ బావినేని పాండు రంగారావు, డీన్లు రాజేశ్వరరావు, జీఎన్ స్వామి అభినందించారు.


రత్నప్రసాద్‌కు ధ్రువపత్రం అందిస్తున్న ప్రతాప్‌సింహ కాకాసాహెబ్ దేశాయ్, ఉప కులపతి సుదర్శనరావు

చిత్ర కళతో సృజనాత్మకత పెంపు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : చిత్ర కళ వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అమరావతి బుద్ధ విహార్ ప్రధాన కార్యదర్శి మేడసాని శుభాకర్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, అమరావతి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 'రంగ్ తరంగ్' చిత్రకళా పోటీలు నిర్వహించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు 'జాతీయ చిహ్నాలు', 6, 7 తరగతులు 'భారతదేశ స్మారక చిహ్నాలు', 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'భిన్నత్వంలో ఏకత్వం' అంశాలపై పోటీలు పెట్టారు. బహుమతి ప్రదానోత్సవంలో శుభాకర్ మాట్లాడుతూ.. పిల్లలు వారి సృజనాత్మకతతో, ఓపికతో అద్భుతమైన చిత్రాలు వేశారని కొనియాడారు. చిత్ర కళను కొనసాగించాలని సూచించారు. రోటరీ క్లబ్ మిడ్ టౌన్ కార్యదర్శి నాగ వసంత్ కుమార్ మాట్లాడుతూ.. పిల్లలను ప్రోత్సహిస్తున్న సంస్థలను, నిర్వాహకులను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాగులూరి త్రినాధాచారి శిష్య బృందం చేసిన జానపద నృత్యాలు అలరించాయి. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ ప్రతినిధులు అనుమకొండ సునీల్ కుమార్, అరసవల్లి గిరిధర్, శ్రావణ్‌కుమార్, అమరావతి బాలోత్సవం ప్రతినిధి యు.వి.రామరాజు, కవి అనీల్ డ్యానీ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులతో శుభాకర్, రామరాజు, వసంత్ కుమార్ తదితరులు

స్వచ్ఛ చల్లపల్లి సేవలో వైద్య బృందం

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ సుందర చల్లపల్లిని గుంటూరు మెడికల్ కళాశాలలో చదువుకున్న 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థుల బృందం కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, కార్యకర్తలతో కలిసి 3563వ రోజు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొని సేవ లందించారు. జాతీయ రహదారిపై కాసానగర్ వద్ద మొక్కలు నాటారు. చల్లపల్లి స్వాగత ద్వారం వద్ద నూతనంగా నిర్మించిన మోడరన్ బారికేడ్స్‌ను వైద్య బృందం ప్రారంభించింది. 11 సంవత్సరాలుగా చేస్తున్న సేవలు వెలకట్టలేనివని వారంతా కొనియాడారు. హైదరాబాద్, నల్గొండ, పాలకొల్లు, విజయవాడ, గుంటూరులకు చెందిన 22 మంది వైద్యులు బృందంలో ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.


చల్లపల్లిలో జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతున్న వైద్యులు

పాత్రికేయుల సమస్యలపై రాజీలేని పోరాటం

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచెల జయరాజ్ అన్నారు. యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివంగత మణికొండ చలపతిరావు 1957లో స్థాపించిన యూనియన్.. 68 ఏళ్ల ప్రస్థానంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు పాత్రికేయులు అనుభవిస్తున్న అన్ని ప్రయోజనాలు యూనియన్ కృషి వల్లే సాధ్యమయ్యాయని తెలిపారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కె.బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చావా రవి, దారం వెంకటేశ్వరావు, దాసరి నాగరాజు, విజయభాస్కర్, జి.రఘురామ్, రామారావు, పి.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా కబడ్డీ లీగ్ పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమటలోని సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 'యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025' కబడ్డీ లీగ్ టోర్నీలో ఆదివారం మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. మూడో రోజైన ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో వైజాగ్ కమెండోస్ జట్టు 51-39 తేడాతో కృష్ణా డిఫెండర్స్ జట్టుపై, కృష్ణా డిఫెండర్స్ జట్టు 46-39 తేడాతో తిరుపతి రైడర్స్ జట్టుపై, భీమవరం గార్డెయిన్స్ జట్టు 51-47 తేడాతో కాకినాడ క్రాకెన్స్ జట్టుపై, కర్నూలు నైట్స్ జట్టు 45-28 తేడాతో విజయనగరం నింజాస్ జట్టుపై, అమరావతి క్రషర్స్ జట్టు 44-35 తేడాతో వైజాగ్ కమెండోస్ జట్టుపై విజయం సాధించాయి. ఉత్తమ రైడర్‌గా నాగబాబు, ఉత్తమ డిఫెండర్‌గా శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక బహుమతులు గెలుపొందారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి భారత మాజీ కబడ్డీ క్రీడాకారుడు, ద.మ.రైల్వే విజయవాడ డివిజన్ వెల్ఫేర్ అధికారి ఎన్.అర్జునరావు, శాప్ పాలకమండలి సభ్యుడు పేరం రవీంద్రనాథ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక బహుమతులు అందజేశారు.


తలపడుతున్న వైజాగ్ కమెండోస్, కృష్ణా డిఫెండర్స్ క్రీడాకారులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

? ఎస్వీఎస్ నగర్‌లోని కొబ్బరితోట సమీపంలో మురుగు కాలువ పూడుకుపోయి నీరు కదలడం లేదు. -రమేష్, మైలవరం ✔ కార్మికులను పంపి పూడిక తొలగిస్తాం : రఫీ, కార్యదర్శి - న్యూస్‌టుడే, మైలవరం

? స్థానిక పినపాక రోడ్డులోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరంతా రహదారిపైకి చేరి తీవ్ర అవస్థలు పడుతున్నాం. తక్షణమే మురుగు కాలువల్లో పూడిక తీయించి నీరు పారేలా చర్యలు చేపట్టాలి. -టి.వాసుదేవరావు, స్థానికుడు ✔ సిబ్బందితో తక్షణమే పారిశుద్ధ్య చర్యలు నిర్వహింపజేస్తాం. - బసవలింగేశ్వరరావు, కార్యదర్శి –న్యూస్‌టుడే, జి.కొండూరు



? రెడ్డిగూడెం పంచాయతీలోని 1 వార్డులో సిమెంట్ రహదారులపై వర్షం నీరు నిలిచి బురదకయ్యలుగా మారుతున్నాయి. - సత్యనారాయణ, స్థానికుడు ✔ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -ఎస్.రామారావు, పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? విస్సన్నపేట గ్రామ పంచాయతీ 7వ వార్డు షాదీఖానా సమీపంలో డ్రెయినేజీ లేక మురుగు రోడ్డుపై నిలిచిపోతోంది. - ఎం.భాస్కరరావు, స్థానికుడు ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కచ్చా కాలువ తవ్వించి మురుగు పారేలా చూస్తాం. - హరి కృష్ణ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి –న్యూస్‌టుడే, విస్సన్నపేట

స్పందనకు వందనం

★ పట్టణంలోని 7వ వార్డులోని డ్రెయినేజీల్లో పిచ్చి మొక్కలు పెరిగి, మట్టి పేరుకుపోయి మురుగు నిలిచి పోతోందని స్థానికుడైన ఆర్.ధనుంజయ్ మేమున్నాం మీకు తోడుగాకు తెలిపిన సమస్య పై అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

★ పట్టణంలోని 1వ వార్డులో మురుగు నీరు, చెత్త నిలిచి దోమల బెడద ఎక్కువగా ఉండటంతో స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

-న్యూస్‌టుడే, తిరువూరు టౌన్



450 మందికి కంటి వైద్యపరీక్షలు



వైద్యసేవలు అందిస్తున్న వైద్యుడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బూరుగగూడెం గ్రామంలో ఆదివారం రెడ్డికుంట గ్రామానికి చెందిన ఆకుల సుబ్రహ్మణ్యం, అతని కుమారుడు సూర్యకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 450 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 350 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో పనాశరెడ్డి, రామినేని వీరాస్వామి నాయుడు పాల్గొన్నారు.

చెరువు కాలువకు నీటి విడుదల

చందర్లపాడు, న్యూస్‌టుడే: బొబ్బెళ్లపాడు సాగునీటి చెరువు నుంచి కాలువకు ఎన్ఎస్పీ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు ఆదివారం నీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి నీరు చేరుకొని కళకళలాడుతుంది. దీంతో ఆయకట్టు రైతుల అవసరాల నిమిత్తం నీటిని సరఫరా చేస్తున్నారు. మేకల సుధాకర్, కట్టా సోమేశ్వరరావు, బి.రామకృష్ణ, షేక్ సైదా, పి. భాస్కరరావు పాల్గొన్నారు.

నవనీత కృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అధికారులు, అర్చకులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు శనివారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి, ఉట్టికొట్టే వేడుక పూర్తయ్యాక ఉభయ దేవేరుల సమేత నవనీత కృష్ణుని ఉత్సవ ప్రతిమలను రథంలో ఆశీనులను చేసి మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కదలని నీరు.. కలవరమే చూడు

చేలల్లోనే తిష్ఠ వేసిన వరద

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

భారీ వర్షాలు తెరపిచ్చినా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల్లో గత నాలుగు రోజులుగా వరి, మొక్కజొన్న, అపరాల పంటలు నీటిలోనే ఉన్నాయి. పంట పొలాల నుంచి మురుగు నీరు నెమ్మదిగా వెళుతోంది. ఈలప్రోలు, జూపూడి, దాములూరు, కొటికలపూడి, మూలపాడు, చిలుకూరు, గుంటుపల్లికి గ్రామాలకు చెందిన దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా పంటలు ముంపు బారిన పడ్డాయి.

పెట్టుబడి నష్టమే..

మురుగు కాలువలు అధ్వానంగా ఉండడంతో వర్షపునీరు వేగంగా బయటకు వెళ్లటం లేదు. దీంతో వరి పైరు ప్రస్తుతం కుదుళ్లు ఏర్పడుతుండడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. నాలుగైదు రోజులు వరిపైరు నీటిలో ఉంటే కుళ్లిపోతుందని ఆవేదన చెందుతున్నారు. వరికి ఎకరాకు పెట్టుబడి కింద రూ.12 వేల నుంచి రూ.15 వేలు పెట్టామని వాపోతున్నారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.20 వేల వరకు సాగు ఖర్చులు కింద వ్యయం చేశామని.. పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు ఆవేదన చెందుతున్నారు.



ఈలప్రోలులో చెరువును తలపిస్తున్న వరి చేను

ప్రభుత్వం ఆదుకుంటే మేలు - గోపాలరావు, ఈలప్రోలు

నేను పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. పంట మొత్తం నీట మునిగింది. ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడి పెట్టాం. నేను ఎదుర్కొన్న నష్టానికి పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకుంటే ఎంతో మేలు.

నివేదికలు పంపిస్తాం - రజని: మండల వ్యవసాయాధికారిణి

పంట భూముల నుంచి నీరు పూర్తిగా బయటకు వెళ్లిన తర్వాత నష్టం అంచనా వేయిస్తాం. అనంతరం ఆయా వివరాలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తాం.

పూడికలు తీయాలి: రాజారావు, చిలుకూరు

నేను ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఉపాధి హామీ కింద మురుగు కాలువల్లో పూడికలు తీసేవారు. ఈ ఏడాది పనులు జరగలేదు. దీంతో పై నుంచి వచ్చే నీరు పోయే మార్గం లేక పొలంలోనే నిలిచిపోయాయి. అధికారులు స్పందించి తక్షణమే మురుగు కాలువల్లో పూడికలు తీయిస్తే బాగుంటుంది.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 67.54 లక్షల నిధులతో నిర్మించిన కలగర పంచాయతీలోని గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం నూతన భవనాలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రహదారుల అధ్వాన దుస్థితిని స్థానిక రైతులు, ప్రజలు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్వాన దారులను పరిశీలించారు. స్థానిక పంచాయతీ, సచివాలయ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్ ప్రసాద్, సర్పంచి దేశిరెడ్డి రమ, గ్రామ కార్యదర్శి మధు, వీఆర్వో జయరాజు, ఎన్ఆర్ఐ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బైపాస్ రోడ్డులో వినాయకస్వామి గుడి సమీపంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్వాయి పాపన్న విగ్రహం సోమవారం ఉదయం 10గంటలకు ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో చలనచిత్ర నటుడు సుమన్ పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని కులాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

జాతీయ రహదారిని పరిశీలించిన అధికారులు

నందిగామ గ్రామీణం: ఐతవరం వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని ఆదివారం సాయంత్రం అధికారులు పరిశీలించారు. గత ఏడాది మునేటి వరద జాతీయ రహదారిపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. ప్రస్తుతం మునేటికి వరదనీరు పెరగడంతో ముందు జాగ్రత్తగా తహసీల్దార్ ఎన్.సురేష్‌బాబు, ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఐతవరం పోలీసులు ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రస్తుతం మునేటి వరదనీరు పెరిగే అవకాశం ఉండటంతో వరద నీరొస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. వరద ప్రభావిత గ్రామాల్లో పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

దుర్గగుడి నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన కందుల లక్ష్మణరావు రూ.1,00,116 విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థాన సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఏఈవో వెంకటరెడ్డి వారికి విరాళం రసీదు, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రైతు ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పాలకులు రైతు ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. విస్సన్నపేట పీఏసీఎస్ ఛైర్మన్ కంభంపాటి ఇబ్రహీమ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని సమస్యలు ముట్టుముడుతున్నాయని, విత్తనం తయారు చేసినప్పుడే కంపెనీలు నకిలీ విత్తనాలు తయారుచేస్తున్నాయన్నారు. దీంతో అన్నదాత నష్టపోవడంతో పాటు ఉత్పత్తులు పెరిగిపోతున్నాయన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు వంద శాతం రాయితీ కల్పించాలని కోరారు. అనంతరం ఛైర్మన్‌తో బ్యాంకు అధికారులు, సిబ్బంది ప్రమాణ స్వీకారం చేయించారు. కలగర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా దొడ్డ నరసింహారెడ్డి (అన్న బాబు)తో సంబంధిత అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వి.లక్ష్మీ ప్రసాద్, తెదేపా నాయకులు నెక్కలపు వెంకటేశ్వర రావు, నెక్కలపు శ్రీనివాసరావు, రాయల సుబ్బారావు, నాదెళ్ల నాగమణి, బ్యాంకు సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.



ఇబ్రహీమ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

వావిలాల(తిరువూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అన్నదాతలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు నూతనంగా నియమితులైన సభ్యులు కృషి చేయాలని శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వావిలాల పీఏసీఎస్ ఛైర్మన్‌గా చేకూరి పట్టాభిరామన్న, సభ్యులుగా బి.అచ్యుతరావు, బి.మాధవి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. తెదేపా నాయకులు డి.వెంకటేశ్వరరావు, ఎస్.కృష్ణమోహన్‌రావు, సీహెచ్.రాజేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, డి.లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

స్వర్గపురిలో షెడ్ నిర్మాణానికి సాయం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరులో పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో నిర్మించిన స్వర్గపురిలో నూతన షెడ్ నిర్మాణ నిమిత్తం పట్టణానికి చెందిన బెస్ట్‌ఫ్రెండ్స్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళం ఆదివారం అందజేశారు. తోసా సభ్యుల ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సౌజన్యంతో స్వర్గపురి నిర్మించి భౌతికకాయాల తరలింపునకు వాహనం కూడా ఏర్పాటు చేశారు. తాజాగా విరాళం అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



నగదు అందజేస్తున్న బెస్ట్‌ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులు

కార్యాలయ నిర్మాణానికి..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పుట్రేల రోడ్డులో నిర్మిస్తున్న తెదేపా కార్యాలయానికి చంద్రుపట్ల గ్రామానికి చెందిన ఎం.రెడ్యా, ఆదివారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సమక్షంలో కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావుకి రూ.50,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

“ గండి పూడ్చండి.. నీరు నిలపండి



ముసగపాడు సమీపంలో పులివాగుపై నిర్మించిన చెక్ డ్యాంకు గతేడాది వరదల సమయంలో చిన్నపాటి గండి పడి నీరంతా పక్కన పొలాల మీదుగా ప్రవహించి ముంపునకు గురి చేసింది. నీటిని నిల్వ చేసేందుకు దీన్ని నిర్మించగా వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తమ పంటలను సాగు చేసుకునేవారు. నాలుగు రోజుల కిందట కురిసిన వర్షాలకు గండి మరింత పెద్దదై చుక్క నీరు కూడా నిలవకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నీటి పారుదలశాఖ అధికారులకు పలుమార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేదంటున్నారు. తక్షణమే గండిని పూడ్చి రైతుల పంటలు నాశనం కాకుండా అవసరమైనప్పుడు నీటిని అందించేలా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

“ పక్కకు చూశారో.. పడిపోతారు

రాయనపాడు నుంచి పైడూరుపాడు గ్రామానికి వెళ్లే చెరువు కట్ట రహదారి కుంగిపోయి. .కోతకు గురవడంతో రాకపోకలు ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కట్ట మార్గం మరింత అధ్వానంగా మారింది. ఇటీవలే ఈ మార్గానికి మరమ్మతులు కూడా చేపట్టారు. కాని కొన్నాళ్లకే రహదారి ఇలా కుంగిపోవడంతో ఇబ్బందిగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో కింద పడిపోతున్నారు. ఇప్పటికైనా మరింత పటిష్ఠంగా ఉండేలా ఆ రోడ్డుకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గొల్లపూడి



రాయనపాడు వద్ద కుంగిన చెరువు కట్ట రహదారి

“ తవ్వి వదిలేస్తే ఎలా..?

మండలంలోని పినపాక గ్రామంలో జేజేఎం పనులు అస్తవ్యస్తంగా నిలిచాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ కృష్ణా జలాలను అందించేందుకు గాను పైపులైన్ ఏర్పాటుకు పనులు ప్రారంభించి నెలలు కావస్తున్నా అసంపూర్తిగా వదిలేయడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇష్టానుసారంగా పైపులైన్ పరిచేందుకు అంతర్గత రహదారులను తవ్వి సరిగా పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారులు తవ్విన చోట పూర్తిగా పూడ్చి రాకపోకలకు అవస్థలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



పినపాకలో అస్తవ్యస్తంగా నిలిచిన జేజేఎం పనులు

విలేకరులమని డబ్బు వసూలు చేసిన వారిపై కేసు

మైలవరం, న్యూస్‌టుడే: విలేకరులమని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిపై స్థానిక పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే సుధాకర్ తెలిపారు. మైలవరం మండలం పొందుగలకు చెందిన జి.అశోక్, మైలవరానికి చెందిన జే.ప్రకాష్‌లు ఈనెల 12వ తేదీన రాత్రి మండలంలోని జంగాలపల్లిలో గల నాగ రుక్మిణి అనే మహిళ ఇంటికి వెళ్లారు. తాము విలేకరులమని చెప్పి మీ ఇంట్లో రేషన్ బియ్యం ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. పోలీసులకు పట్టించకుండా ఉండాలంటే తమకు రూ.20 వేలు ఇవ్వాలని బెదిరించారు. వారి బెదిరింపులకు భయపడి రూ.8వేలు ఫోన్‌పే ద్వారా, మరో రూ.12 వేలు నగదు రూపేనా చెల్లించారు. వారి బెదిరింపులకు భయపడి తాము డబ్బులు ఇచ్చామని, రక్షణ కల్పించాలంటూ శనివారం సాయంత్రం సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

పవన్‌కుమార్ మృతదేహం గుర్తింపు

కాకర్ల(తిరువూరు), న్యూస్‌టుడే: పుదుచ్చేరి విహారయాత్రకు వెళ్లి అక్కడి సముద్రంలో అలల తాకిడికి గల్లంతై మృతి చెందిన మండలంలోని కాకర్లకు చెందిన తాళ్లూరి పవన్‌కుమార్(23) మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించారు. మృతదేహానికి అక్కడి పోలీసులు పోస్టుమార్టం పూర్తి చేయించి బంధువులకు అప్పగించగా అర్ధరాత్రికి స్వస్థలమైన కాకర్లకు చేరుస్తారని బంధువు రవిశంకరప్రసాద్ తెలిపారు. గుడివాడ నుంచి ఉపాధ్యాయులైన తల్లిదండ్రులు వెంకటనర్సయ్య, భవాని ఇక్కడకు చేరుకుంటారని, సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు.

కారు అద్దాలు పగలగొట్టిన దొంగ అరెస్టు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్వీఎస్ నగర్‌లో మూడు రోజుల కిందట ఓ ఇంట్లోకి చొరబడి సీసీ కెమెరాలను తొలగించి, కారు అద్దాలను పగలగొట్టిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక దేవుని చెరువులో నివసించే బట్ట సురేష్ వ్యసనాలకు బానిసై ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించి శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కే సుధాకర్ తెలిపారు.

ముత్యాలమ్మకు బోనాలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: శ్రావణమాసం పురస్కరించుకుని రుద్రవరం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మతల్లి దేవాలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో ఆలయానికి వచ్చి పొంగళ్లు, నైవేద్యాలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో భాజపా నాయకుడు ఆర్.రఘునాథరెడ్డి, ఉప సర్పంచి బి.వి.కృష్ణారెడ్డి, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



రెడ్డిగూడెం: పూజలు చేస్తున్న మహిళలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గ్రామ దేవత ముత్యాలమ్మకు గ్రామస్థులు బోనాలు సమర్పించారు. అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, ఆభరణాలు, వేప మండలంతో అలంకరించారు. మహిళలు పూలు, పండ్లు, గాజులు, చీరలు, జాకెట్లు, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. తూర్పు ఎస్సీ వాడ, వడ్డెర సామాజిక వర్గీయులు మేళతాళాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు.



గంపలగూడెంలో పూజలందుకున్న అమ్మవారు

‘దురుసుగా మాట్లాడడం తగదు’

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తండాల్లో గిరిజనుల తాగు నీటి సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వారిపై ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు దురుసుగా మాట్లాడటం సబబుకాదని జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు హితవు పలికారు. కిడ్నీ వ్యాధి ప్రభావితమైన ఎ.కొండూరు మండల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా శుద్ధజలాలు అందించేందుకు ప్రభుత్వం రూ.1.60 లక్షలు కేటాయించిందని ఆదివారం ఇచ్చిన ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఆ నిధులతో తండాలకు రోజు 27 ట్యాంకర్ల శుద్ధజలాలు సరఫరా చేయాల్సి ఉండగా ఆ మేరకు జరగడం లేదన్నారు. ఫలితంగానే పలు తండాల్లో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడిందనేది నిజమన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-95 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువు విశ్రాంత హెచ్ఎం ఎ.రవికుమార్ దంపతులను సత్కరించారు. అంతర్జాతీయ ఏషియన్ ఆటల పోటీల్లో పతకాలు సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థి ఆర్.రమణయ్యను సన్మానించారు. హెచ్ఎం ఎం.క్రిష్టోఫర్, సాయిబాబా కమిటీ అధ్యక్షుడు వి.నారాయణరావు, ఎస్ఎంసీ అధ్యక్షుడు ఎ.ఆంజనేయులు, ఎస్.దేవసహాయం పాల్గొన్నారు.



విశ్రాంత హెచ్ఎం రవికుమార్ దంపతులను సత్కరిస్తూ..

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఆరోగ్యశాఖ సిబ్బంది వారికి అవగాహన కల్పించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని సూచించారు. ఏ.కొండూరు మండలంలోని రేపూడి తండాను ఆదివారం ఆమె సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాల వివరాలు, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య శిబిరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి మలేరియా వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలని.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పక్కకాలువల్లో క్లోరిన్ పిచికారీ చేయించారు. ఆమెతో పాటు జిల్లా మలేరియా అధికారి డా.మోతీబాబు, వైద్యారోగ్యశాఖ అధికారులు డా.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాలువలో క్లోరిన్ పిచికారీ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

గురువులకు సత్కారం



సన్మానం అందుకున్న గురువులతో పూర్వ విద్యార్థులు

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని అమ్మిరెడ్డిగూడెం ఏబీఎం ఉన్నత పాఠశాలలో 2005-2006లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులు పీవీ.కుసుమాకరం, టి.లిల్లీపుష్పం, బి.జె.సుందరరావు, ఎస్.మల్లికార్జునరావు, ఎ.విజయకుమారిని శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. జె.హనుమంతరావు, ఎం.వినోదబాబు తదితరులు పాల్గొన్నారు.



అందరూ నివసించే ఇళ్లు, పనిచేసే కార్యాలయాలు, రోడ్ల నిర్మాణానికి వినియోగించే సిమెంటు ఉత్పత్తికి సున్నపురాయి కావాలి. వాహనాల్లో పోసే పెట్రోల్ తయారీకి అతి ముఖ్యమైన పెట్రోలియం అన్వేషణలో డ్రిల్లింగ్ కోసం బెరైటీస్ ఉపయోగిస్తారు. టీవీలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లను ఉత్పత్తి చేసే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో మైకా కీలకం. ఇళ్లకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలంటే ప్రధానంగా బొగ్గు ఉండాలి. వీటితోపాటు అనేక రకాల ఖనిజాలు ఆంధ్రప్రదేశ్‌లో పుష్కలంగా లభిస్తున్నాయి. అతి పురాతన శిలల భూస్వరూపాలతో ఉన్న రాష్ట్రంలో బొగ్గు నుంచి బంగారం వరకు భిన్న రకాల ఖనిజాలు, పెట్రోలియం మొదలు యురేనియం దాకా విలువైన ఇంధనాలు విస్తారంగా ఉన్నాయి. ఆస్‌బెస్టాస్, గ్రానైట్ లాంటి ఖనిజాల నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో ఆధిక్యాన్ని ఏపీ కొనసాగిస్తోంది. రాష్ట్ర ఆదాయానికి, పారిశ్రామికాభివృద్ధికి దోహదకారిగా, సుస్థిర ప్రగతి సాధనకు భరోసాలుగా ఉన్న ఈ సహజవనరుల లభ్యత, విస్తరణ గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. జిల్లాలు, ప్రాంతాల వారీగా ఉన్న ఖనిజాలు, వాటి ప్రాధాన్యాలను తెలుసుకోవాలి.

సుస్థిర ప్రగతి సాధనకు భరోసాలు!

ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ వనరులు

భూమి లోపల సహజసిద్ధంగా లభ్యమయ్యే రాతి సమ్మేళనాలే ఖనిజ వనరులు. వీటిని తవ్వి వెలికితీయాలి. అవి పునరుద్ధరించ సాధ్యం కాని సహజ వనరులు. రకరకాల ఖనిజాలు, ఆ శిల సముదాయంలో మిళితమై ఉంటాయి. ఏపీలో 90 రకాలకుపైగా ఖనిజ వనరులు లభ్యమవుతుంటే, వాటిలో 49 రకాలను తవ్వి తీస్తున్నారు. ఏపీ భూమి ప్రాంతంలో విస్తరించి ఉన్న రాయలసీమ జిల్లాలతో పాటు కృష్ణా, గోదావరి బేసిన్‌లలో ఖనిజ సంపద లభ్యత ఎక్కువ.

◆ 1961లో ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటైంది.

◆ ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజాన్వేషణ, తవ్వకంలో ప్రధానంగా మూడు సంస్థలు కృషి చేస్తున్నాయి. 1) జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2) ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ 3) రాష్ట్ర ప్రభుత్వ గనులు, భూ విజ్ఞానశాస్త్ర డైరెక్టరేట్.

ఆంధ్రప్రదేశ్ భూగర్భ స్వరూపం


ఆస్‌బెస్టాస్

రాష్ట్ర భూభాగం వివిధ శిలలతో ఏర్పడింది. అందులో రకరకాల ఖనిజ వనరులు మిళితమై ఉన్నాయి. రాయలసీమ పీఠభూమిలో అతిప్రాచీన శిలలు విస్తరించి ఉన్నాయి.

1) ఖాండలైట్ శిలలు: ఇవి పురాతన శిలా సముదాయం. శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు ఉన్నాయి. వీటిలో లభించే ఖనిజాలు - క్రోమైట్, బాక్సైట్, మాంగనీస్, సిలిమనైట్.

2) ధార్వార్ శిలలు: రెండు వేల మిలియన్ సంవత్సరాల నాటివి. నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఉన్నాయి. వీటిలో అభ్రకం, రాగి లభిస్తాయి. చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బంగారం దొరికే క్వార్ట్జ్ శిలలు వీటిలోనే ఉన్నాయి.

3) కడప శిలలు: కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిలో సున్నపురాయి, బెరైటీస్, సీసం, పలకరాళ్లు లభిస్తాయి.

4) కర్నూలు శిలలు: కర్నూలు, అనంతపురంల్లో ఉన్నాయి. సున్నపురాయి, ఆస్‌బెస్టాస్ లభ్యమవుతాయి.


5) దక్కన్ నాప శిలలు: భూమి లోపలి పొరల్లో మాగ్మా చల్లబడి ఏర్పడ్డాయి. రాయలసీమలో విస్తరించి ఉన్నాయి. వీటిలో గ్రానైట్ లభిస్తుంది.

6) గోండ్వానా శిలలు: గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో బొగ్గు నిక్షేపాలు ఉంటాయి.

7) రాజమండ్రి శిలలు: ఖాండోలైట్ శిలల రకానికి చెందినవి. తీరం వెంట సున్నపురాయి మట్టితో సముద్రభాగంలో ఏర్పడ్డాయి. ఇవి భూభాగం పైకి లేవడంవల్ల తీరభాగంలో ఏర్పడ్డాయి. వీటిలో పెట్రోలియం, సహజవాయు నిక్షేపాలున్నాయి.

జనరల్ స్టడీస్ - ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ

> విశాఖ సాగర తీరంలో చమురు, సహజ వాయువుకు అనువైన లోయలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటికి విశాఖ - సంకల్ప్‌గా నామకరణం చేశారు.


ఎన్ఐఓ

ఏపీలో లభించే ఖనిజాలను ప్రధానంగా 4 రకాలుగా వర్గీకరించవచ్చు

1) లోహ ఖనిజాలు: లోహ సంబంధ లక్షణాలు కలిగినవి. ఇవి రెండు రకాలు..
ఎ) ఫెర్రస్ ఖనిజాలు: ఇనుమును కలిగినవి. ఉదా: ఇనుము, మాంగనీస్, కోబాల్ట్, నికెల్.
బి) నాన్‌ఫెర్రస్ ఖనిజాలు: ఇనుము లేనివి. ఉదా: రాగి, సీసం, తగరం, జింక్, బాక్సైట్, బంగారం, వెండి.

2) అలోహ ఖనిజాలు: లోహ లక్షణాలు లేనివి. ఉదా: బెరైటీస్, జిప్సం, సున్నపురాయి, ఆస్‌బెస్టాస్, డోలమైట్ మొదలైనవి.

3) శిలాజ ఇంధనాలు: మండించినప్పుడు శక్తిని విడుదల చేసేవి. ఉదా: బొగ్గు, పెట్రోల్, డీజిల్, సహజవాయువు తదితరాలు.

4) అణు ఇంధన ఖనిజాలు: థోరియం, యురేనియం, ప్లుటోనియం మొదలైనవి.

> జీఎస్ఐ ఇటీవల నల్లమల అటవీ ప్రాంతంలో అతిపెద్ద వజ్ర సంపద నిల్వలను గుర్తించింది.

ఇంధన ఖనిజాలు


బొగ్గు: గోదావరి పరీవాహక ప్రాంతంలోని గోండ్వానా శిలల్లో దొరుకుతుంది. ఏపీలో బిట్యుమినస్ రకం బొగ్గు ఉంది. అల్లూరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో నిక్షేపాలను కనుక్కున్నారు. ఏలూరు జిల్లా చింతలపూడి, శెట్టివారిగూడెం ప్రాంతాల్లోనూ జీఎస్ఐ గుర్తించింది. రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తి చేయడం లేదు.

పెట్రోలియం, సహజవాయు నిక్షేపాలు: కృష్ణా-గోదావరినదీ పరీవాహక ప్రాంతాలు (కేజీ బేసిన్) పెట్రోలియం, సహజ వాయువులకు ప్రసిద్ధి. 1979, డిసెంబరు 19న లింగబోయిన చర్ల వద్ద మొదటగా పెట్రోలియాన్ని కనుక్కున్నారు.

లోహ ఖనిజాలు

ముడి ఇనుము: ఇది 4 రకాలు. 1) మాగ్నటైట్ 2) హెమటైట్ 3) లియోటైట్ 4) సిడరైట్. రాష్ట్రంలో ఎక్కువగా హెమటైట్ రకం లభిస్తుంది. చిత్తూరు, అనంతపురం, కృష్ణా, కడప, కర్నూలు జిల్లాల్లో ఇనుము నిక్షేపాలున్నాయి. అనంతపురంలోని ఓబులాపురం, సిద్ధాపురం; కడపలోని పెండ్లిమర్రి ప్రాంతాలు ఇందుకు ప్రసిద్ధి.

రాగి: దీని మూలఖనిజాలు చాల్కోపైరేట్, చాల్కోజైట్. ఇది మంచి విద్యుత్తు వాహకం. విద్యుత్తు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. పల్నాడు-అగ్నిగుండాల, సత్యసాయి జిల్లా-మదిగుబ్బల, కడప-జంగంరాజుపల్లె, నంద్యాల-గనికాల్వ, నెల్లూరు-గరిమెనపెంటలో రాగి నిక్షేపాలు ఉన్నాయి.


మాంగనీస్

మాంగనీస్: ఇనుము-ఉక్కు పరిశ్రమలో ఉపయోగిస్తారు. బ్యాటరీలు, పెయింట్స్ తయారీలోనూ వాడతారు. మాంగనీస్ నిక్షేపాలు కోడూరు (శ్రీకాకుళం), గరివిడి (విజయనగరం)లో ఉన్నాయి. దేశ మాంగనీస్ నిక్షేపాల్లో 20 % శ్రీకాకుళం జిల్లాలోనే లభ్యం.

బాక్సైట్: ఇది అల్యూమినియం లోహానికి మూల ఖనిజం. విశ్వఖనిజమని కూడా అంటారు. ఏపీలో బాక్సైట్ నిక్షేపాలు తూర్పుకనుమల్లో ఖాండోలైట్ శిలలతో ఏర్పడిన ఎత్తయిన కొండల పైభాగాల్లో శిరోవేష్ట రూపాలుగా ఉన్నాయి. అల్లూరి జిల్లా అటవీ ప్రాంతం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఎక్కువగా ఉన్నాయి.

క్రోమైట్: స్టెయిన్‌లెస్ స్టీల్ తయారీలో ఉపయోగిస్తారు. కర్నూలు, కృష్ణా జిల్లాల్లో ఉత్పత్తి అవుతోంది.

సీసం (లెడ్): ఆటోమొబైల్స్, విద్యుత్తుపరికరాలు, విమానయాన పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. నంద్యాల, కడప, చిత్తూరు జిల్లాల్లో నిల్వలు ఉన్నాయి.

బంగారం: నోబుల్ మెటల్ అంటారు. ధార్వార్ శిలల్లో లభిస్తుంది. సత్యసాయి జిల్లాలోని రామగిరి గోల్డ్‌మైన్స్ దేశంలోనే మొదటి బంగారు గని. బంగారు నిక్షేపాలు నంద్యాల, కర్నూలు జిల్లాల్లో, చిత్తూరులోని పెద్దపర్తికొండ, మాలప్ప కొండ వద్ద ఉన్నాయి.

అలోహ ఖనిజాలు

సున్నపురాయి: సిమెంటు తయారీకి ఉపయోగిస్తారు. కర్నూలు, అనంతపురం-తాడిపత్రి,నంద్యాల-డోన్, బేతంచర్ల, నందికొట్కూర్, కృష్ణా-జగ్గయ్యపేటల్లో గనులున్నాయి. ఉత్పత్తిలో రాష్ట్రానిది మూడో స్థానం.

డోలమైట్: ఇనుము, ఉక్కు కర్మాగారాల్లో, డిటర్జెంట్‌ల్లో ఫిల్లర్లుగా వాడతారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో లభ్యం.

ఆస్‌బెస్టాస్ (రాతినార): ఉత్పత్తిలో దేశంలోనే మొదటి స్థానం. సిమెంటు రేకులు, అగ్నిసహన వస్త్రాలు, క్లచ్‌ప్లేటింగ్, బ్రేక్‌లైనింగ్‌ల తయారీకి వాడతారు. కడప-పులివెందుల, బ్రాహ్మణపల్లి, నంద్యాల-డోన్, కర్నూలులో గనులున్నాయి.



వజ్రాలు: కార్బన్ స్వచ్ఛమైన స్ఫటిక రూపమే వజ్రం. కింబర్లైట్ రాతి పొరల్లో లభిస్తుంది. వజ్రాలు అనంతపురం జిల్లా వజ్రకరూర్, కృష్ణానది లోయలోని కొల్లూరు, మల్లవరంప్రాంతాల్లో లభిస్తాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జొన్నగిరి, వజ్రగిరిల్లోనూ దొరుకుతాయి.

బెరైటీస్: ముగ్గురాయి అంటారు. పెట్రోలియం తవ్వకంలో డ్రిల్లింగ్ మడ్‌గా వాడతారు. నిల్వల్లో ఏపీది ప్రథమస్థానం. మంగంపేట(అన్నమయ్య), కర్నూలు, నంద్యాల జిల్లాల్లో లభిస్తోంది.

అభ్రకం (మైకా): ఉత్పత్తిలో ఏపీది మొదటి స్థానం. కార్లు, విమానాలు, ఎలక్ట్రికల్ వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. తిరుపతి జిల్లా గూడురులోని షాగని దీనికి ప్రసిద్ధి.

గ్రాఫైట్: ఏలూరు, అల్లూరి, శ్రీకాకుళం జిల్లాల్లో నిల్వలున్నాయి. పెన్సిళ్లు, బ్యాటరీల తయారీలో ఉపయోగిస్తారు.

గ్రానైట్: నిల్వల్లో ఏపీది మొదటి స్థానం. ప్రకాశం జిల్లాలో అత్యంత విలువైన బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ లభిస్తుంది.

రాక్ ఫాస్ఫేట్: ఖాండోలైట్ శిలలకు చెందింది. విశాఖ, అల్లూరి జిల్లాల్లో నిల్వలు ఉన్నాయి.

జిప్సం: తిరుపతి జిల్లాలో లభిస్తుంది. సిమెంటు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తయారీకి వాడతారు.

అణు ఇంధన ఖనిజాలు

యురేనియం: యురేనియం ముడిధాతువు పిచ్‌బ్లెండ్. 'ఎల్లో కేక్' అంటారు. కడప జిల్లా తుమ్మలపల్లి క్షేత్రంలో యురేనియం తవ్వి తీస్తున్నారు.

ఇల్మనైట్: ఈ ఖనిజం నుంచి టిటానియం వస్తుంది. శ్రీకాకుళం, విశాఖ జిల్లా తీరప్రాంతాల్లో లభిస్తుంది. విశాఖ తీరంలో జిర్కోన్, ఇల్మనైట్‌లు దొరుకుతాయి. భీమునిపట్నం, చింతలపల్లి, ముక్కాము ఇసుక దిబ్బల్లో మోనజైట్ దొరుకుతుంది.

బెరిల్: అతి క్లిష్టమైన సిలికేట్. ఈ ధాతువు రాగి, నికెల్, ఇనుము, అల్యూమినియం లాంటి ధాతువులతో మిశ్రమంగా ఏర్పడుతుంది. ప్రధానంగా గూడూరులోని అభ్రకం గనులు, కృష్ణాజిల్లా తిరువూరు, మన్యంజిల్లా కురుపాంలో లభిస్తుంది. బెరిల్ రాళ్లమధ్యలో మరకతం (ఎమరాల్డ్) దొరుకుతుంది. బెరిల్ నుంచి బెరీలియం లభ్యమవుతుంది. దీన్ని యుద్ధట్యాంకులు, తుపాకులు, ట్యూబ్‌లైట్ల తయారీకి ఉపయోగిస్తారు.

పుల్లరిన్: అత్యంత ఖరీదైన లోహం. మంగంపేటలోని బెరైటీస్ గనుల వ్యర్థాల నుంచి లభిస్తుంది. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ల తయారీకి, క్షిపణులపై రాడార్లు గుర్తించకుండా వాడే పూత కోసం వాడతారు.


రచయిత: మంద సతీష్

దరఖాస్తు చేశారా?




☛ ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలు (262)
చివరి తేదీ: 18.08.2025

☛ యూపీఎస్సీ ఈపీఎఫ్‌ఓలో అకౌంట్ ఆఫీసర్లు (230)
చివరి తేదీ: 18.08.2025

కరెంట్ అఫైర్స్

◆ 'ఇండియా: 5000 ఇయర్స్ ఆఫ్ హిస్టరీ ఆన్ ది సబ్ కాంటినెంట్' పుస్తకాన్ని ఇటీవల ఎవరు రచించారు?
జ: ప్రముఖ అమెరికన్ చరిత్రకారిణి ఆడ్రీ ట్రష్కే



◆ ఇటీవల ఏ దేశం బాలీవుడ్ నటి

మాదిరి ప్రశ్నలు

కత్రినా కైఫ్‌ను పర్యాటక రంగానికి సంబంధించి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది? జ: మాల్దీవులు

◆ ఇటీవల ఏ నగరం అధికారికంగా భారతదేశ 'చిరుత పులి రాజధాని' గా అవతరించింది? (ముంబయి నగరాన్ని అధిగమించి ఈ నగరం ఈ ఘనత సాధించింది. తాజా సర్వే ప్రకారం ప్రస్తుతం ఈ నగరం చుట్టుపక్కల ఉన్న అడవులు, పొదల్లో 80 నుంచి 85 చిరుతలు నివసిస్తున్నట్లు అంచనా.) జ: బెంగళూరు

◆ ఆయుష్ రంగంలో పెట్టుబడిదారులను ఆకర్షించడానికి, మార్గనిర్దేశం చేయడానికి భారత ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన పోర్టల్ ఏది?
జ: ఆయుష్ నివేష్ సారథి

మరింత సమాచారం

ఫోన్‌ను వదలకుండా వాడుకోవచ్చు!

డిజిటల్ స్కిల్స్



ఎప్పుడూ ఆ ఫోన్ వదలవా? పుస్తకాలు అసలు పట్టుకోవా? ఇలాంటి కేకలు ఇళ్లలో తరచూ వినిపిస్తుంటాయి కదా? కానీ అదే పెద్దలు.. ఈ ఫోన్ సరిపోతుందా..ఇంకా మంచిది కొందామా..ఆ ఫోన్‌లో చూసి అన్నీనేర్చుకో.. అనే పరిస్థితి రావాలంటే 'కొలాబరేటివ్ లెర్నింగ్' చేయాలి. అంటే ఫోన్‌ను పరీక్షల ప్రిపరేషన్‌కు, అనేక రకాల విద్యాఉద్యోగ సమాచారాల అప్‌డేట్లను తెలుసుకోవడానికి వినియోగించడమే. ఇందులో కాంపిటీటివ్, అకడమిక్ పరీక్షలకు సిద్ధమవడం, సోషల్ మీడియాను చదువుకు వాడటం, చక్కటి కెరియర్‌ను నిర్మించుకోవడంపై అవగాహన పెంచుకోవడం ఉంటాయి. ఆ నైపుణ్యాల వివరాలకు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయండి.

అమాంతం ముంచెత్తే ఆపదలు!



దేశానికి తీవ్రమైన నష్టాలను మిగులుస్తున్న విపత్తులే వరదలు. భారత నైసర్గిక స్వరూపం, రుతుపవన వాతావరణం, వర్షాకాలంలో మహోగ్రంగా మారే నదులు, చుట్టూ ఉన్న సముద్రాల్లో పుట్టే తుపానులు, పట్టణీకరణ, అడవుల నిర్మూలన తదితరాలన్నీ వరదలకు కారణాలే. అప్రమత్తమయ్యేలోపే అమాంతం ముంచెత్తే ఈ వైపరీత్యాలు ప్రాణ, ఆస్తి నష్టాలతో పాటు ఆర్థిక, అనారోగ్య సమస్యలకూ కారణమవుతున్నాయి. మౌలిక సదుపాయాలను, పర్యావరణ వ్యవస్థను చెల్లాచెదురు చేస్తున్నాయి. ఏటా సవాలు విసురుతున్న ఈ వరదల స్వరూప స్వభావాలు, తీవ్రతను పెంచుతున్న కారకాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశ వ్యాప్తంగా ప్రభావిత ప్రాంతాలు, తరచూ విపత్తులకు మూలంగా మారుతున్న నదులు, ప్రభుత్వపరంగా ఈ ప్రమాదాలను పసిగట్టి హెచ్చరించే వ్యవస్థలు, ఆపదలను ఎదుర్కోవడానికి ఉన్న సంస్థాగత నిర్మాణాలు, చేపట్టాల్సిన నియంత్రణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలి.


విపత్తు నిర్వహణ

వరదలు - కారణాలు, ప్రభావాలు

1. భారత్‌లో భౌగోళికంగా ఎన్ని మిలియన్ హెక్టార్ల భూమికి వరద ముప్పు ఉంది?
   1) 40 2) 50 3) 60 4) 70
2. వరదల లక్షణాలు?
   1) ఇవి గంటల సమయం తీసుకుని క్రమంగా ఏర్పడవచ్చు.
   2) ఆనకట్టలు తెగిపోవడం వల్ల రావొచ్చు.
   3) భారీ వర్షాల కారణంగా సంభవించవచ్చు.
   4) పైవన్నీ
3. నీరు తన సాధారణ స్థితి లేదా ప్రవాహానికి మించిన స్థాయిలో ప్రవహిస్తే ఏది సంభవిస్తుంది?
   1) అధిక వర్షం 2) వరదలు
   3) తుపానులు 4) భూపాతాలు
4. దేశంలో వరదలకు ప్రధాన కారణాలు?
   1) రుతుపవన కాలాల్లో కురిసే వర్షాలు.
   2) ఒండ్రుతో పూడుకుపోయే నదీ వ్యవస్థలు.
   3) హిమాలయ పర్వతశ్రేణులు.
   4) పైవన్నీ
5. వరదలకు దారితీసే ప్రధాన కారణాలు?
   1) భారీ వర్షాలు
   2) మురుగునీటి కాలువల్లో అడ్డంకులు ఏర్పడటం
   3) భూపాతాలు 4) పైవన్నీ
6. వేటి నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాల వల్ల వరదలు సంభవిస్తాయి?
   1) కాలువలు 2) ఆనకట్టలు
   3) డ్యామ్‌లు 4) పైవన్నీ
7. వరదలకు సహజ కారణాలు?
   1) సముద్రాల్లో బలమైన పోటుపాట్లు
   2) సునామీలు, చక్రవాతాలు, తుపానులు.
   3) 1, 2 4) ఏదీకాదు
8. ఆకస్మిక వరదలు వేటివల్ల ఏర్పడతాయి?
   1) కుంభవృష్టి 2) తుపానులు
   3) 1, 2 4) ఏదీకాదు
9. ఆకస్మిక వరదలకు దారితీసే కారణాలు?
   1) నీటి ప్రవాహ రేటు అధికంగా ఉండటం
   2) నేల పారగమ్యత తక్కువగా ఉండటం
   3) 1, 2 4) ఏదీకాదు
10. కేంద్ర జలసంఘం వరదలను ఎన్ని కేటగిరీలుగా వర్గీకరించింది?
    1) 3 2) 4 3) 5 4) 6
11. నదీ మట్టం హెచ్చరిక స్థాయికీ, ప్రమాద స్థాయికి మధ్య ప్రవహిస్తున్నప్పుడు ఉండే వరద పరిస్థితిని ఏమంటారు?
    1) నిమ్న వరద దశ 2) మధ్యస్థ వరద దశ
    3) అధిక వరద దశ 4) అసాధారణ వరద దశ
12. నదీ మట్టం ప్రమాద స్థాయిని దాటి, అత్యధిక వరద మట్టానికి 0.50 మీటర్లకు దిగువన ఉండే దాన్ని ఏమంటారు?
    1) నిమ్న వరద దశ 2) మధ్యస్థ వరద దశ
    3) అసాధారణ దశ 4) అధిక వరద దశ
13. ఏదైనా వరద ముందస్తు సూచన కేంద్రం వద్ద నదీ నీటి మట్టం, దాని అధిక వరద మట్టానికి చేరుకున్నప్పుడు ఏమంటారు?
    1) నిమ్న వరద దశ 2) అసాధారణ వరద దశ
    3) మధ్యస్థ వరద దశ 4) అధిక వరద దశ
14. వరద వైపరీత్య మ్యాపులను ఎవరు రూపొందిస్తారు?
    1) సర్వే ఆఫ్ ఇండియా
    2) జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
    3) వాతావరణ శాఖ 4) పర్యాటక శాఖ
15. భారతదేశంలో ఏ నది వల్ల ఎక్కువగా వరదలు వస్తాయి?
    1) గోమతి
    2) బ్రహ్మపుత్ర
    3) కావేరి
    4) గోదావరి



16. వరదలు సంభవించడానికి ప్రధాన కారణం?
    1) అధిక ఉష్ణోగ్రత 2) గాలిలో తేమ
    3) తుపానులు 4) భారీ వర్షపాతం
17. భారతదేశంలో ఏ నెలల్లో వరదలు సంభవించే అవకాశం ఉంది?
    1) మే - అక్టోబరు 2) జూన్ - సెప్టెంబరు
    3) జూన్ - డిసెంబరు 4) ఏప్రిల్ - జూన్
18. వరద ముందస్తు హెచ్చరిక కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) న్యూదిల్లీ 2) బెంగళూరు
    3) చెన్నై 4) విజయవాడ
19. వరద నిర్వహణ కార్యక్రమాన్ని ఏ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రవేశపెట్టారు?
    1) 10వ 2) 9వ 3) 11వ 4) 12వ
20. జాతీయ వరద నిర్వహణ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 1954 2) 1960 3) 1964 4) 1972
21. మనదేశంలో 12% భూభాగం ఏ విపత్తుకు గురవుతోంది?
    1) తుపానులు 2) వరదలు
    3) భూకంపాలు 4) అగ్నిపర్వతాలు
22. భారత జల కమిషన్ వేటికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది?
    1) సునామీ
    2) వరదలు
    3) భూకంపాలు
    4) తుపానులు
23. ఈశాన్య భారతదేశంలోని ఏ నదీ పరివాహక ప్రాంతాలు అత్యధిక వరదలకు గురవుతాయి?
    1) బ్రహ్మపుత్ర 2) గంగా
    3) మేఘన 4) పైవన్నీ
24. దేశంలో తీవ్ర వరద ముప్పు ఉన్న జిల్లాలెన్ని?
    1) 54 2) 39 3) 52 4) 60
25. ఆంధ్రప్రదేశ్‌లో తరచూ వరదలకు గురయ్యే ప్రాంతాలు?
    1) పెన్నా డెల్టా ప్రాంతం
    2) ఉత్తర కోస్తా ప్రాంతాలు
    3) కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలు
    4) సువర్ణముఖి నదీలోయ ప్రాంతాలు
26. బ్రహ్మపుత్ర నది వరదలకు ఎక్కువగా ప్రభావితమయ్యే రాష్ట్రం?
    1) అరుణాచల్ ప్రదేశ్ 2) అస్సాం
    3) పశ్చిమ బెంగాల్ 4) మణిపుర్
27. వరద వైపరీత్యాన్ని అధ్యయనం చేయడానికి భారతదేశాన్ని నాలుగు ప్రాంతాలుగా విభజించారు. అందులోని రెండు ఏవి?
    1) వాయవ్య నదీ ప్రాంతం
    2) మధ్య భారత్, దక్కను ప్రాంతం
    3) 1, 2 4) ఏదీకాదు
28. బ్రహ్మపుత్ర నదీ ప్రాంతం గరిష్ఠంగా ఎంత వర్షాన్ని పొందుతుంది?
    1) 6,350 మి.మీ. 2) 2,250 మి.మీ.
    3) 1,250 మి.మీ. 4) 1,470 మి.మీ.
29. గంగానదీ ప్రాంతంలో వరదలకు కారణమయ్యే నదులు?
    1) యమునా 2) సోన్
    3) ఘాగ్రా 4) పైవన్నీ
30. గంగానదికి ఏ దిక్కున ఉన్న ఉపనదుల వల్ల అత్యధిక నష్టం కలుగుతోంది?
    1) తూర్పు 2) ఉత్తర 3) దక్షిణ 4) పడమర
31. వరద హెచ్చరికలను ఎవరు జారీ చేస్తారు?
    1) కేంద్ర జల సంఘం
    2) సాగునీరు, వరద నియంత్రణ శాఖ
    3) జలవనరుల శాఖ 4) పైవన్నీ
32. కిందివాటిలో వరదలు పెరగడానికి కారణాలు ఏవి?
    1) ప్రధాన నదులు, ఉపనదుల్లో వచ్చే వరదలు కలవడం
    2) క్రమక్షయాల వల్ల నదీ భూతలాల్లో పూడిక పేరుకోవడం
    3) 1, 2 4) ఏదీకాదు
33. వరదలను అరికట్టడానికి ఉన్న నియంత్రణ చర్యలు ఏవి?
    1) వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్
    2) రిజర్వాయర్లు
    3) ఇంజినీరింగ్ కట్టడాల నిర్మాణం 4) పైవన్నీ
34. వరదల నిర్మాణాత్మక ఉపశమన చర్యలు?
    1) సహజ సిద్ధమైన జల సంబంధ పరివాహకాలు
    2) వరద నియంత్రణ చర్యలు అమలు చేయడం
    3) 1, 2 4) ఏదీకాదు
35. జాతీయ జల అకాడమీ ఎక్కడ ఉంది?
    1) పుణె 2) హైదరాబాద్
    3) మంగళగిరి 4) ముంబయి



36. ఇస్రో వరద నిర్వహణకు ఏ రకమైన సేవలు అందిస్తోంది?
    1) ఫ్లడ్ డామేజ్ అసెస్‌మెంట్
    2) ఫ్లడ్ హజార్డ్ మ్యాపింగ్
    3) 1, 2 4) ఏదీకాదు
37. వరదల సమయంలో భవనాలకు నష్టం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు?
    1) నదీ ఒడ్డులు, వాలుల పక్కన నివసించరాదు.
    2) నదీ ఒడ్డులు/సముద్ర తీరాలకు 250 మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించుకోవాలి.
    3) 1, 2 4) ఏదీకాదు
38. వరదల హెచ్చరికలు వచ్చినప్పుడు ఏం చేయాలి?
    1) అధికారులు ఇచ్చే వరద హెచ్చరికల కోసం వేచి ఉండాలి.
    2) డ్రైఫుడ్, తాగునీరు, వెచ్చదనాన్ని ఇచ్చే దుస్తులు సిద్ధంగా ఉంచుకోవాలి.
    3) 1, 2 4) ఏదీకాదు
39. వరదల సమయంలో ఎలా ఉండాలి?
    1) ప్రభుత్వ ఆదేశాలు అనుసరించాలి.
    2) విద్యుత్తు సరఫరా ఆపివేయాలి, ఓపెన్ వైర్లు తాకొద్దు.
    3) వదంతులను నమ్మొద్దు అలాగే, వాటిని వ్యాప్తి చేయొద్దు.
    4) పైవన్నీ
40. వరదల తర్వాత చేయాల్సింది?
    1) క్లోరినేట్ చేసిన నీటిని తాగాలి.
    2) సురక్షిత ఆహారాన్ని తీసుకోవాలి.
    3) నిలిచి ఉన్న నీటిలో కీటకనాశులను పిచికారీ చేయాలి.
    4) పైవన్నీ
41. 2025, ఆగస్టు 5న ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో వచ్చిన వరదలకు తుడుచు పెట్టుకుపోయిన గ్రామం?
    1) ఒర్సావి
    2) ధరాలి
    3) బరేత్
    4) బాన్



42. 2025, ఆగస్టు 5న సంభవించిన విపరీత వరదలకు కారణమైన నదీ ప్రవాహం?
    1) భగీరథ 2) యమునా
    3) ఖీర్‌గంగా 4) అలకనంద

సమాధానాలు

1-1; 2-4; 3-2; 4-4; 5-4; 6-4; 7-3; 8-3; 9-3; 10-2; 11-1; 12-4; 13-2; 14-2; 15-2; 16-4; 17-2; 18-1; 19-3; 20-1; 21-2; 22-2; 23-4; 24-2; 25-3; 26-1; 27-3; 28-1; 29-4; 30-2; 31-4; 32-3; 33-4; 34-3; 35-1; 36-3; 37-3; 38-3; 39-4; 40-4; 41-2; 42-3.

వసుంధర

vasundhara@eenadu.in

అనవసరంగా ఆ కాలేజీలో చేరా!

? అమ్మానాన్నలు ఎప్పుడూ గొడవపడతారు. నాకన్నీ అమరుస్తారు కానీ... ప్రేమగా మాట్లాడరు. దానివల్లేమో నేనూ ఎవరితోనూ త్వరగా కలవలేను. నాన్న స్నేహితుడి కూతురే నా ఫ్రెండ్. తను నాలా కాదు. ఆమెను ఇంట్లో అందరూ ప్రేమగా చూసుకుంటారు. తనకోసమే ఇంటర్ ఆమె చదివే కాలేజీలో చేరా. నా పరిస్థితి తెలిసీ క్లాసులో జోకులేస్తోంది. అది చూస్తే అనవసరంగా తనతోపాటు చేరాననిపిస్తోంది. - ఓ సోదరి

● ఇంట్లో అమ్మానాన్నల మధ్య సఖ్యత లేకపోతే నలిగిపోయేది పిల్లలే. కావలసినవన్నీ ఇస్తే చాలు... ప్రేమ చూపించినట్టే అని పెద్దవాళ్ళు భావిస్తుంటారు. కానీ పిల్లలు ఆశించేది ఆప్యాయత, అభిమానం, కొంత సమయం. అవే లేనప్పుడు ఎన్ని కొనిచ్చినా, ఎంత డబ్బు ఖర్చుపెట్టినా, పిల్లలు సంతృప్తి చెందరు. ఈ విషయాన్ని చాలామంది పెద్దలు విస్మరిస్తారు. నీ విషయానికి వస్తే నీ స్నేహితురాలి మీద మానసికంగా చాలా ఆధారపడుతున్నావు. నిన్ను తను అర్థం చేసుకోవాలనీ, నీకు అండగా ఉండాలనీ కోరుకుంటున్నావు. కానీ, ఆ అమ్మాయీ వయసులో చిన్నదే, నీ మానసిక స్థితిని అర్థం చేసుకునేంత పరిణతి ఉండకపోవచ్చు కదా? కాబట్టి, సందర్భం చూసి నీ బాధని చెప్పు, తన తోడ్పాటు నీకు అవసరమనే విషయాన్ని తెలియజెయ్యి. తనలో మార్పు రావచ్చు. రాకపోయినా నష్టం లేదు. నీ అనుభవాలే నిన్ను రాటు దేలుస్తాయి. ఒకరి మీద ఆధారపడకుండా నిన్ను నీవు మలుచుకోగలుగుతావు. మంచి పుస్తకాలను స్నేహితులుగా చేసుకో. నీ అభిరుచులను గుర్తించి వాటిలో నైపుణ్యం సంపాదించుకో. అనవసరమైన వాటి నుంచి దృష్టి మరల్చితే, ఉన్నతంగా వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోగలుగుతావు.

మాకు మాత్రం సరదాలొద్దా?

? మేమిద్దరం అమ్మాయిలమే. మానాన్న చాలా క్రమశిక్షణగా ఉంటారు. ఉదయం లేవడం దగ్గర్నుంచి రాత్రి నిద్రపోవడం వరకు అన్నీ సమయానికి జరగాలంటారు. చదువు విషయంలోనూ పక్కాగా ఉంటారు. కానీ ఆయన మాత్రం సిగరెట్లు, మందు తాగుతారు. స్నేహితులతో సరదాగా గడుపుతారు. మమ్మల్ని మాత్రం మా ఫ్రెండ్స్‌తో పంపరు. చిన్నప్పట్నుంచీ ఇంతే. డిగ్రీకి వచ్చాం. మాకు మాత్రం సరదాలొద్దా? - ఓ సోదరి



డియర్ వసుంధర

డా. స్వాతి పైడిపాటి, మానసిక నిపుణురాలు

● పిల్లలని క్రమశిక్షణలో పెంచడం తల్లిదండ్రుల బాధ్యత. అందుకు సహకరించడం మీ కర్తవ్యం. మంచి భవిష్యత్తు, నడవడిక అలవడాలంటే కొంత కఠినంగా ఉండటం అవసరమే. కాకపోతే, పిల్లలకు ఆటపాటలూ కావాలి. క్రమశిక్షణకు, పిల్లలకిచ్చే స్వేచ్ఛ మధ్య కొంత సమతుల్యం ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలి. అది లేనప్పుడే, నీలాంటి పిల్లలకు బాధగా అనిపిస్తుంది. అంతేకాకుండా, పిల్లలకి ఒకటి చెప్పి పెద్దవాళ్లు మరోలా ప్రవర్తిస్తే, అదీ ప్రతికూల ప్రభావాలకు దారి తీసి, క్రమశిక్షణ మాకేనా, వాళ్లకి అక్కర్లేదా అని ఆలోచించడం మొదలుపెడతారు. నువ్విక్కడ గమనించాల్సింది ఏంటంటే... నాన్నకి చిన్నతనంలో ఎవరూ సరైన మార్గనిర్దేశం చేసుండకపోవచ్చు. అందుకే ఆయన తనలా మీరు ఉండకూడదని ఎక్కువ క్రమశిక్షణగా పెంచుతున్నారేమో! నాన్నతో చక్కటి అనుబంధాన్ని ఏర్పరచుకొని, ఆయనలో మీ ఇద్దరిపట్ల నమ్మకాన్ని పెంచుకునేలా ప్రవర్తించండి. ఆ తరువాత మెల్లగా మీ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, అందరి పిల్లల్లాగా, మీకున్న చిన్న చిన్న ఆశలు, కోరికలు చెప్పి, అవి నెరవేర్చుకునేలా ఆయన్ని ఒప్పించండి. ఏ విషయంలోనైనా పరిధి దాటి ప్రవర్తించమనే నమ్మకాన్ని కలిగించండి. అప్పుడు మీ సరదాల గురించీ మీ నాన్న ఆలోచిస్తారు.



నిర్మల

ఆనందాల్ని వండి పెడతాం!

పండుగలకో, వేడుకలకో... బంధువులూ, స్నేహితులూ అంతా ఒక చోట చేరటం, ఇష్టమైనవి వండుకుని తినటం, కబుర్లు చెప్పుకోవటం, నవ్వులు, ఆటపాటలు... ఆ మధుర జ్ఞాపకాలు తలచుకుంటేనే మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది కదా! మరి, ఆ ఫీల్ ఇప్పుడు ఉందా? అంటే... ఈ బిజీ జీవితాల్లో దానికి చోటెక్కడిది? అనేవారే ఎక్కువ. అందుకే, ఆ సంస్కృతిని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు సామాజిక కార్యకర్త, ఫిలాసఫిస్ట్ **జోగు నిర్మల**. 'కైండ్‌నెస్ కిచెన్' ప్రారంభించి సరికొత్త జీవన విధానానికి శ్రీకారం చుట్టారీమె. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

ఆన్‌లైన్ ఆర్డర్లు, యాప్‌ల్లో సినిమాలు... ఇప్పుడు ఇవే ట్రెండ్. ఇక స్నేహితులూ, బంధువులను కలవాలంటే, పెద్ద ప్రణాళికే వేయాలి. జీవితాల్లో సహజత్వం లేకుండా పోయింది. అందుకే, ఒకప్పటి ఆ సంస్కృతిని తిరిగి తీసుకురావాలన్నది నా ప్రయత్నం. అందులో భాగంగానే మావారు నరేష్‌తో కలిసి 'కైండ్‌నెస్ కిచెన్' ప్రారంభించా. ఆప్యాయత, ఆనందం, ప్రేమను ఇతరులకూ పంచాలి. అందుకు ఆహారం కంటే మంచి మాధ్యమం ఏముంటుంది? పైగా, మన భావోద్వేగాలూ వంటపై ప్రభావం చూపిస్తాయి. ఎలాంటి భావోద్వేగాలతో వండుతామో అవే ఆహారంలోకి వస్తాయి. కాబట్టి, మంచి ఫీలింగ్‌తో అందరూ కలిసి తినేలా చేయాలన్నదే మా లక్ష్యం.

మట్టి ఇల్లు కట్టుకున్నాం...

మాది తెలంగాణలోని నిజామాబాద్. తాతయ్య ముంబయిలో స్థిరపడ్డారు. నేనూ అక్కడే పుట్టి పెరిగా. ఫిలాసఫీలో మాస్టర్స్ చేశా. 20ఏళ్లుగా అనేక సామాజిక సమస్యల పరిష్కారాల దిశగా పని చేస్తున్నా. ఎన్జీవోలతో కలిసి సహజ ప్రసవం, తల్లిపాల దానం, మెన్‌స్ట్రువల్ హైజీన్, వాతావరణ మార్పులు, మానవ విలువలు... వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. నా భర్త నరేష్‌ది కూడా తెలంగాణనే. అయితే, పాప పుట్టుక మా ఆలోచనల్ని మార్చేసింది. బిజీ జీవితాలు.... అర్థం లేదనిపించింది. రెండేళ్లు బ్రేక్ తీసుకుని వివిధ ప్రదేశాలకు వెళ్లాం. ముంబయి వదిలి, తమిళనాడులోని ఆరోవిల్లేలో ఓ మట్టి ఇల్లు నిర్మించుకుని ఉంటున్నాం. ఇది ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీ. అక్కడికి వెళ్లాక జీవితాన్ని కొత్త కోణంలో చూడటం ప్రారంభించా. ఒకప్పటి సామాజిక విధానాలను అలానే పాటించటం కాదు, అందులోని లోటుపాట్లు అర్థం చేసుకొని ముందుకెళ్లాలి అని గ్రహించా. అందుకే, మా పాప, బాబు ఇద్దరినీ ఇంట్లోనే(హోమ్ స్కూలింగ్)చదివిస్తున్నా. ఇదేకాదు... మొదట్లో మా కమ్యూనిటీలో వారానికో, రెండు వారాలకోసారో అందరం కలిసి వండుకుని తినేవాళ్లం. దీన్ని చూసి తెలిసిన వాళ్లు ఇలాంటివి మా దగ్గరా ఏర్పాటు చేయొచ్చు కదా... అని అడిగేవారు. అందుకు అంగీకరించాం. క్రమంగా, మహిళా గ్రూపులూ, సొసైటీలూ ఆహ్వానించటం మొదలుపెట్టాయి. ప్రస్తుతం వరంగల్, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి... ఇలా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం.



వృథానే ఉండదు...

కైండ్‌నెస్ కిచెన్ కార్యక్రమాలన్నీ జీరో వేస్ట్ కాన్సెప్ట్‌తో చేసేవే. ఒకరికొకరు సహకరించుకుంటూ వంట చేసుకోవటం, అరటాకుల్లో వడ్డించుకుని కింద కూర్చొనే తినటం వంటివి తప్పక పాటిస్తాం. ప్రోగ్రామ్‌లో పాల్గొనే సభ్యుల సంఖ్య 25- 30కంటే ఎక్కువ కాకుండా చూసుకుంటాం. అందులోనూ, వీగన్ ఆహారానికే మా ప్రాధాన్యత. పదిహేను రోజులకోసారి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆటపాటలు, నైపుణ్యాలను పంచుకోవటం... వంటి అనేక యాక్టివిటీలూ జరుపుతుంటాం. ఈ పుడమి అందరిదీ. ఇక్కడున్న వనరులను తరవాతి తరాలకు అలానే అందించాల్సిన బాధ్యత మనదే. అందుకు తగ్గ జీవనశైలిని ఎంచుకోవటం మన చేతిలోనే ఉంది.

టెక్నాలజీ రంగంలో అడుగు పెట్టడానికి మహిళలకు ఎలాంటి అడ్డంకులూ లేవు. అందుకే ఎంట్రీ లెవెల్‌లో అధిక శాతం ఉంటున్నారు. అక్కణ్నుంచి వాళ్లను ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లేలా కంపెనీలు ప్రణాళికతో ఉండాలి. మా సంస్థలో... మొదటిసారి మేనేజర్ అయినవాళ్లకి వివిధ కేస్‌స్టడీస్‌ని వివరిస్తూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేలా శిక్షణ ఇస్తున్నాం. అదే సమయంలో సీనియర్లతో సమావేశాల్ని ఏర్పాటుచేస్తూ పరోక్షంగానూ నేర్చుకునేందుకు సాయపడుతున్నాం.



- ఎం.ఎస్.వినూతా రావు, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్, హెచ్‌సీఎల్ టెక్

'తుఫాన్' సైదమ్మ!



చదివింది ఐదో తరగతి. చిన్నతనంలోనే వివాహం. ఆర్థిక ఇబ్బందులు అడ్డం పడుతున్నా ఆత్మవిశ్వాసంతో సాగి కుటుంబానికి చోదక శక్తిగా ఎదిగింది **పగిళ్ల సైదమ్మ**. ఈమెది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి. భర్త లింగయ్య. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. భర్త ఓ ప్రైవేటు కంపెనీలో, ఈమె ఇళ్లలో పనిచేసేవారు. తర్వాత ఫైనాన్స్ తీసుకుని తుఫాన్(వ్యాన్) వాహనాన్ని కొనుగోలు చేసి నడిపారు లింగయ్య. ఆ తరుణంలో అనారోగ్యానికి గురవడంతో డ్రైవర్‌ను పెట్టి వాహనం నడిపించారు. వాళ్లు నమ్మకంగా ఉండటంలేదనీ... డ్రైవింగ్ స్కూల్లో చేరి శిక్షణ తీసుకుని, తానే వ్యాన్ నడపడం మొదలుపెట్టింది. ఆరేళ్లుగా ఉప్పల్-తిరుమలగిరి మధ్య వ్యాన్ నడుపుతోంది. ఉదయం మూడింటికే లేచి ఇంటి, వంటపనులు పూర్తి చేసి అయిదింటికల్లా బండి తీస్తుంది. గతేడాది వరకూ నెలకు రూ.40 వేల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం అది సగానికి పడిపోవడంతో ప్రయాణికుల్ని శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలకు తీసుకువెళ్తుంటుంది. 'మొదట్లో వాహనం ఎక్కడానికి భయపడేవారు. కానీ ఒకసారి నా డ్రైవింగ్ చూశాక వాళ్లకి భయం పోతుంది. పోలీసులు, రవాణా శాఖల అధికారులు వాహనాన్ని తనిఖీ చేసిన ప్రతిసారీ మెచ్చుకోవటం ఉత్సాహాన్నిస్తుంది' అని చెప్పే సైదమ్మ... రాయితీపైన వాహనాన్ని ఇప్పించాలని అధికారుల్ని కోరుతోంది. అవకాశమిస్తే ఆర్టీసీ బస్సు నడిపిస్తానంటోంది.

– తాళ్లపల్లి సోమన్న, తుంగతుర్తి

మీకు తెలుసా?



ప్రపంచ ఆర్థిక సంఘం 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్–2025'లో భారత స్థానం 131. 2024కంటే రెండు స్థానాలు కిందకు వెళ్లింది. ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం- ఉపాధి, విద్య, ఆరోగ్యం- జీవన ప్రమాణాలు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ఇండెక్స్‌ని నిర్ధారిస్తారు. ఏడాదిగా రాజకీయాలు మినహా మిగతా అన్ని విభాగాల్లో భారతీయ మహిళలు పురోగతి సాధించారు.

మార్పు కోరుకుంటే...



'చిన్నదానికే అలసిపోతున్నా... ఆరోగ్య సూత్రాలు పాటించాలి. రోజూ మెట్లు ఎక్కి దిగాలి. ఎలాగైనా రెండున్నర లీటర్ల నీళ్లు తాగాలి... రేపటి నుంచి ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లాలి. వ్యాయామాలూ, యోగా చేయాలి'... మూడు పదుల వయసొచ్చాక ఇలా అనుకోని మహిళలు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. కానీ ఇవన్నీ ఎంతవరకూ పాటిస్తున్నారా అని చూస్తే, ఒకట్రెండు రోజులే. తర్వాత యథాస్థితికి వచ్చేస్తారు. మళ్లీ ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడో, అనారోగ్యం పలకరించినప్పుడో దీని మీదకు ధ్యాస మళ్లేది. అలవాట్లూ, అభిరుచులూ... మంచివైనా, చెడ్డవైనా ఒకేసారి ఉప్పెనలా వస్తే, మనసూ, శరీరం రెండూ మార్పునకు సిద్ధంగా ఉండవు. పర్యవసానంగా చేయాలనుకున్న పనులన్నీ 2-3 రోజులకు పరిమితం అవుతాయి. అలా కాకుండా, జీవనశైలిలో మార్పులు చేసుకోవాలనుకున్నప్పుడు నెమ్మదిగా మీరు కోరుకుంటున్న అలవాట్లని చొప్పించి చూడండి. తప్పక విజయం సాధిస్తారు. ఉదాహరణకి... రోజూ మెట్లు ఎక్కి దిగాలి అనుకుంటే, మొదటిరోజు ఒక్క ఫ్లోర్ ఎక్కి దిగండి. దీన్నో వారంపాటు కొనసాగించండి. అప్పుడు శరీరం, మనసు మీరివ్వాలనుకుంటున్న శ్రమకు అలవాటు పడతాయి. తర్వాత మీకు నచ్చినట్లుగా సంఖ్య పెంచుకుంటూ వెళ్తే సరి. మిగతా విషయాల్లోనూ అంతే, నీళ్లు తాగాలనుకున్నప్పుడు ముందు లీటర్‌కి ప్రణాళికలు వేసుకుని, పక్కాగా అమలుచేసుకుంటే, తర్వాత మీ లక్ష్యం సులువుగా పూర్తవుతుంది. పాతికేళ్లుగా ఒకే విధమైన జీవితానికి అలవాటు పడిన ప్రాణాన్ని మార్చాలంటే... ఈ మాత్రం సమయం ఇవ్వక తప్పదు. ఎంతైనా ఆరోగ్యం మహాభాగ్యం కదా! అన్నింటిలో ప్రణాళికాబద్ధంగా, వ్యూహాత్మకంగా ఉండే మనం... దీన్లో మాత్రం ఎందుకు వెనకబడాలి? ప్రయత్నిస్తారుగా!



మొక్కల్ని పెంచాలని ఉన్నా... వాటి ఎదుగుదలకు రసాయనిక ఎరువులే వాడాలేమో అన్న పరిస్థితి చాలామందిని వెనకడుగు వేసేలా చేస్తుంది. ఆ బాధ లేకుండా వీటికి ప్రత్యామ్నాయంగా వాడగలిగే సేంద్రియ ఎరువులు గురించి తెలుసుకుందామా!

ఇంటి మొక్కలకు... సేంద్రియ ఎరువులు!



కంపోస్ట్... వంటింటి వ్యర్థాలతోనే కంపోస్ట్ తయారు చేసుకోవచ్చు. ఓ డబ్బా తీసుకుని మొదట పొరగా కార్బన్ కోసం బ్రౌన్ వేస్ట్... అంటే ఎండిన ఆకులూ కొమ్మలు, బ్రౌన్‌పేపర్ వంటివి వేయాలి. తర్వాత లేయర్‌లో నైట్రోజన్‌ని విడుదల చేసే కూరగాయలు- పండ్ల తొక్కలు, కాఫీ పొడి వంటివాటిని పేర్చాలి. చివరగా కాసిని నీళ్లు చల్లి మూత పెట్టేయాలి. దీన్ని రోజుకొకసారి తెరిచి కర్రతో తిప్పుతూ ఉంటే... 2-3నెలలకు కంపోస్ట్ సిద్ధమవుతుంది. ఇది మొక్కకు అవసరమైన పోషకాల్ని నెమ్మదిగా విడుదల చేస్తూ మట్టిని సారవంతంగా మారుస్తుంది.

వ్యర్థాలతో... ఆవుపేడ, కోళ్ల వ్యర్థాలు వంటివి మొక్కలకు అందిస్తే... నేలను సారవంతం చేయడంతోపాటు మట్టిలో తేమను నిలుపుతాయి. ముఖ్యంగా వాటి ఎదుగుదలకు కీలకమైన నైట్రోజన్, పొటాషియం వంటి తగినంతగా లభిస్తాయి. అయితే, అలాగని అతిగా వాడితే ఆకులు మాడి పోయినట్లు అవుతాయి. దాన్ని గమనించుకుని నెలరోజులకు ఒకసారి అందిస్తే చాలు.

చేప పొట్టు- ఎమల్షన్... ఫిష్ మీల్ లేదా ఎమల్షన్ రెండూ చేప పరిశ్రమలోని ఉప ఉత్పత్తులే. వీటిల్లో ఫిష్‌మీల్ సాధారణంగా పౌడర్ లేదా గ్రాన్యూల్స్ రూపంలో ఉంటుంది. దీన్ని మట్టిలో కలుపుతారు. ఫిష్ ఎమల్షన్ అనేది నీటిలో కరిగించిన ద్రవం... దీన్ని నీటిలో కలిపి పిచికారీ చేస్తారు. ఈ రెండు ఉత్పత్తుల్లోనూ నైట్రోజన్, పొటాషియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి వేర్లు ఎదుగుదలలో కీలకంగా పనిచేస్తాయి. చీడపీడలనూ ఎదుర్కొంటాయి.

సోయాబీన్ మీల్... సోయా ఉప ఉత్పత్తుల నుంచి ఇది తయారవుతుంది. స్లో రిలీజింగ్ ఫెర్టిలైజర్ కావడంతో భూమిలోకి పోషకాలు నెమ్మదిగా విడుదలవుతాయి. మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతాయి.

బోన్ మీల్... ఎండబెట్టి, పొడిచేసిన ఎముకలతో తయారుచేసిన ఈ మీల్‌లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన వేర్ల పెరుగుదలకు అవసరమైన పోషకం. దీన్ని దుంపలు, వేరు కూరగాయల్ని నాటడానికి ఎక్కువగా వాడతారు. పోషకాల లోపంతో బాధపడే మొక్కలకూ ఎరువుగా వినియోగిస్తారు.

వీటితో పాటు కూరగాయలను ఉడకబెట్టిన నీరు, కోడిగుడ్డు పెంకులు, బియ్యం కడిగిన నీళ్లు, టీ కాఫీ పొడులు, అరటి పండు తొక్కలు, పుల్లటి మజ్జిగ-బెల్లం మిశ్రమం వంటివన్నీ ఎరువులుగా వేయొచ్చు.

ముఖానికి మొక్కజొన్న!

ఈ కాలంలో దొరికే మొక్కజొన్నతో ఆరోగ్యమే కాదు... అందాన్నీ సొంతం చేసుకోవచ్చు. అదెలాగంటారా?

నలుగు: మృతకణాలు పేరుకుపోతే చర్మం మెరుపు తగ్గుతుంది. ఇలాంటప్పుడు కప్పు తాజా మొక్కజొన్న పిండిలో, చెంచా తేనె, అరచెక్క నిమ్మరసం కలిపి ఒంటికి రాయండి. కాసేపాగి నీళ్లతో తడిపి... నలుగులా రుద్దుకుంటే మురికి వదిలిపోతుంది. చర్మం నున్నగా మెరిసిపోతుంది.

క్లెన్సింగ్: కప్పు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకోవాలి. దానికి కాస్త గులాబీ నీరు, చెంచా తేనె కలిపి ముఖానికి ప్యాక్ వేయండి. అరగంటయ్యాక శుభ్రం చేసుకుంటే చర్మం తాజాగా కనిపిస్తుంది.



ఫేస్‌ప్యాక్: తక్కువ సమయంలో ముఖం కాంతిమంతంగా మారాలంటే... గుప్పెడు పచ్చి మొక్కజొన్న గింజల్ని మెత్తగా రుబ్బుకుని అందులో కాస్త పాలపొడి, చెంచా పంచదార కలపాలి. దీన్ని ముఖానికి రాసుకుని 20 నిమిషాలయ్యాక నీళ్ల చల్లి మృదువుగా రుద్దుతూ శుభ్రం చేసుకుంటే సరి.



ఐరాస... మెచ్చిన నాయకురాలు!



సమస్య ఏంటో అందరికీ తెలుసు. కానీ, కొందరే పరిష్కారాల దిశగా ఆలోచిస్తారు. అలాంటి వారికే గుర్తింపు కూడా దక్కుతుంది. కర్ణాటకకు చెందిన బీబీ ఫాతిమా స్వయం సహాయక బృందం, ఆ కోవకి చెందినదే. ఈ బృందానికి నాయకురాలు **బీబీ జాన్**. కర్ణాటక, ధారవాడ జిల్లాలోని తీర్థ గ్రామం తనది. ఈ బృందం సహజ సమృద్ధి నెట్‌వర్క్‌లో భాగం. 2018లో 15 మందితో ఏర్పాటైంది ఈ ఎస్‌హెచ్‌జీ. అయితే, లీడర్‌గా తనకంటూ ప్రత్యేకత ఉండాలనుకున్న బీబీ జాన్... ఎకో ఫ్రెండ్లీ వ్యవసాయ పద్ధతులు పాటించడంపై దృష్టిపెట్టింది. ఆ గ్రామంలో కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను నిర్వహించటం, మిల్లెట్ సాగుని ప్రోత్సహించటం, దేశీయ పంట రకాలను సంరక్షించటం, మహిళా వ్యాపారులకు సాధికారత కల్పించటం వంటివెన్నో చేశారు. అంతేకాదు, సుమారు 30 గ్రామాల్లో సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా మిల్లెట్ ఆధారిత మిశ్రమ పంట వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రత్యేకించి ఆడవాళ్లు నిర్వహిస్తోన్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌నూ నడుపుతోందీ బృందం. పశువులు, ఉద్యానవనాల పెంపకం... ఇలా అనేక వాటిపై గ్రామాల్లో అవగాహన కల్పించింది. వీటన్నింటివల్లా ఆయా గ్రామాల్లోని వారికి పోషకాహార భద్రత పెరగటమేకాదు, స్థిరమైన ఆదాయమూ లభించిందట.

'జీవవైవిధ్య నోబెల్' అందుకుని...

గ్రామాల్లో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు 'బీబీ ఫాతిమా' తీసుకొచ్చిన ఈ పరిష్కారాలు ఆ బృందానికి గుర్తింపునిచ్చాయి. 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్', 'విమెన్ అండ్ యూత్ లీడర్‌షిప్ ఫర్ నేచర్ బేస్డ్ క్లైమేట్ యాక్షన్' అనే థీమ్‌తో నిర్వహించిన పోటీలకు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించేలా చేశాయి. మొత్తం 103 దేశాలకు చెందిన 700 మందిపై గెలుపొంది, బయోడైవర్సిటీ కన్జర్వేషన్‌లో నోబెల్ బహుమతిగా భావించే... ప్రతిష్ఠాత్మక 'ఈక్వేటర్ ఇనిషియేటివ్' అవార్డు గెలుచుకుంది ఫాతిమా. దీని ద్వారా సుమారు రూ. 8.5 లక్షల నగదు బహుమతినీ అందుకోనుంది.


అనుబంధాల పొదరింటికి... ఫెంగ్ షుయ్!

స్వీట్ హోమ్





చాలామందికి మూగజీవులంటే ఇష్టమే. వాటితో సరదాగా ఆడుకుంటూ, చూస్తూ ఆనందిస్తుంటారు కూడా. అయితే, కొందరు జంతుప్రియులు మాత్రం... ఇంకాస్త ముందుకెళ్లి ఇంట్లోని వస్తువులూ వాటి రూపంలోనే ఉండాలని కోరుకుంటున్నారు. అలా వచ్చిందే యానిమల్ థీమ్ ఇంటీరియర్. అందులో ఒకటే ఈ జిరాఫీ థీమ్ కూడా. సోఫా, పోపుల డబ్బా పెట్టుకునే స్టాండ్, వంటపాత్రల మీద, సింక్ ఫాసెట్, గడియారం, వాటర్ బాటిల్... ఇలా ఇంట్లోని ప్రతి వస్తువులోనూ ఆ రూపం కళ్లముందు ఉండేలా చూసుకుంటున్నారు. వాటి ప్రత్యేకమైన రూపాన్ని చూస్తూ ప్రకృతితో కనెక్ట్ అయి ఉన్నామన్న ఫీలింగ్ పొందుతున్నారు. అంతేకాదు, చైనీయుల ఫెంగ్ షుయ్ సంప్రదాయం ప్రకారం... ఈ జిరాఫీ రూపం సంపదనూ, అదృష్టాన్నీ, అవకాశాలనూ తెస్తుందనీ, సానుకూల ఆలోచనలు కలిగిస్తుందనీ, బంధాలను బలపరుస్తుందనీ నమ్మకమూ ఉందట. అందుకే, కేవలం ఇళ్లు, కార్యాలయాల అలంకరణలో దీన్ని భాగం చేయటమేకాదు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు... లాంటి శుభకార్యాలకు బహుమతిగానూ అందిస్తున్నారు చాలామంది. మరి ఈ జిరాఫీ థీమ్ వస్తువులు మీకెలా అనిపించాయి?



తెరుచుకున్న శబరిమల ఆలయ ద్వారాలు

ఈటీవీ భారత్: కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్పస్వామి ఆలయం తలుపులు తెరుచుకున్నాయి. చింగం మాస పూజల కోసం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయ తలుపులు తెరిచారు. ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి సమక్షంలో ఆలయ దీపాలను, అగ్ని (పవిత్ర అగ్నిగుండం)ని వెలిగించారు. భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వేల మంది భక్తులు ఈ వేడుకను తిలకించారు. చింగం మాస పూజలు పూర్తయ్యే వరకు పడిపూజ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుంది. సెప్టెంబరు 20న పంబా నది ఒడ్డున 'గ్లోబల్ అయ్యప్ప సమ్మేళనం' భారీఎత్తున నిర్వహిస్తామని దేవాదాయ శాఖ మంత్రి వి.ఎన్.వాసవన్ ప్రకటించారు. ఇంత పెద్దఎత్తున సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి అని, ఇది చరిత్రాత్మక కార్యక్రమంగా నిలవనుందని తెలిపారు. వివిధ దేశాల నుంచి 3,000 మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నట్లు తెలిపారు.



కాల్చి చంపడంలో ఉక్రెయిన్ సైనికుడి ప్రపంచ రికార్డు

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్ స్నైపర్ యూనిట్ సైనికుడు ఒకరు ప్రపంచ రికార్డు బద్దలు కొట్టినట్లు కీవ్ పోస్ట్ పత్రిక ప్రకటించింది. 13,000 అడుగుల కంటే ఎక్కువ దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపినట్లు పేర్కొంది. ఇంత దూరం నుంచి గురిచూసి కాల్చడం ఓ ప్రపంచ రికార్డు. స్థానికంగా తయారు చేసిన ఎలిగేటర్ 14.5 ఎంఎం రైఫిల్‌ను వాడి పోక్రొవ్స్క్ ప్రాంతంలో ఇద్దరు రష్యన్ సైనికులను నేల కూల్చినట్లు మీడియా పేర్కొంది. ఇందుకు కృత్రిమమేధ, డ్రోన్ సాయం తీసుకున్నారు. ఆగస్టు 14న ఈ ఘనత సాధించారని మిలిటరీ జర్నలిస్టు యూరి బుట్సోవ్ వెల్లడించారు. పుతిన్-ట్రంప్ అలాస్కాలో భేటీ కావడానికి ఒక్క రోజు ముందు ఈ రికార్డు నెలకొల్పడం గమనార్హం. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలో రష్యా దాడులు గణనీయంగా పెరిగాయి. ఈ పట్టణంలో దాదాపు 60,000 మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గతంలో అత్యధిక దూరంలో లక్ష్యాన్ని ఛేదించిన రికార్డు కూడా 58 ఏళ్ల ఉక్రెయిన్ స్నైపర్ పేరిటే ఉంది.



పని ప్రదేశాల్లో ఉద్యోగులతో వేళాకోళాలు వద్దు

దిల్లీ: పని ప్రదేశాల్లో వేళాకోళాలు, వెటకారాలు, వెలివేసినట్లు ప్రవర్తించడం వంటి చర్యలు ఉద్యోగి సామర్థ్యాలు కుంచించుకుపోయేలా చేస్తాయని, ప్రాజెక్టుల్లో భారం మోపే ఆస్కారం ఉంచే ప్రాయని ఓ అధ్యయనంలో తేలింది. ఐఐఎం లఖ్‌నవూ నిర్వహించిన ఈ పరిశోధన కోసం సుమారు 400 మంది నుంచి సమాచారం సేకరించారు. ఆ వివరాల ప్రకారం.. "పని ప్రదేశాల్లో సృజనాత్మకతను నిశ్శబ్దంగా నాశనం చేస్తాయి. ఉద్యోగి తన భావాలను స్వేచ్ఛగా వెల్లడించే వాతావరణం ఉండాలి. ప్రస్తుతం చాలా సంస్థల్లో ఉద్యోగులు తమ భావాలను వెల్లడించలేకపోతున్నారు. ఈ ఆలోచన పనిచేసేచోట నవ్వుకు వర్కాక్ మాత్రమే యాజమాన్యానికి చెబుతున్నారు" అని ఐఐఎం లఖ్‌నవూ ప్రొఫెసర్ ప్రియాంక చౌహాన్ తెలిపారు. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రతి సంస్థ ప్రత్యేక విధి విధానాలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. కోపెన్‌హేగెన్‌లో జరిగిన 'అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ 85వ సదస్సు'లో ఈ అధ్యయనానికి 'బెస్ట్ పేపర్ ఇన్ ప్రొసీడింగ్స్' అవార్డు దక్కింది.



రాధాకృష్ణన్ ఎంపికను స్వాగతించిన ఎన్డీయే పక్షాలు

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడాన్ని కూటమి నేతలు స్వాగతించారు. ఆయా నేతల స్పందన.. వారి మాటల్లోనే..

నిరంతరం సమాజసేవే..

"సుదీర్ఘ ప్రజాజీవితంలో రాధాకృష్ణన్ తన అంకితభావం, వినయంతో ప్రత్యేకంగా నిలిచారు. వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు నిరంతరం సమాజసేవ, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడంపై దృష్టిసారించారు."

- ప్రధాని నరేంద్ర మోదీ

ఎగువ సభ గౌరవాన్ని పెంచుతారు

"రాధాకృష్ణన్ అనుభవం ఎగువసభ గౌరవాన్ని పెంచడంతోపాటు, కొత్త మైలురాళ్లు చేరుకోవడానికి దోహదం చేస్తుందని విశ్వసిస్తున్నా."

-హోంమంత్రి అమిత్‌షా

నిజాయతీపరుడు

"ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి నుంచి మంచి వ్యక్తిని ఎంపికచేశారు. ఆయన విశ్వాసపాత్రుడు. నిజాయతీపరుడు."

-మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



ఫలితాల గురించి పట్టించుకోకుంటేనే..

జీవితంలో మీరు ఎంతగా విజయవంతమవుతారన్నది.. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోగల సత్తాపై ఆధారపడి ఉంటుంది. మీరు ఎంత ఆనందంగా ఉంటారన్నది.. ఫలితాల గురించి పెద్దగా పట్టించుకోకుండా ఉండగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

– నావల్ రవికాంత్, ఇన్వెస్టర్

జీఎస్టీ సంస్కరణలకు సహకరించండి

- రాష్ట్రాలకు ప్రధాని మోదీ పిలుపు



దిల్లీ: తదుపరి తరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలను దీపావళికి ముందే అమల్లోకి తీసుకొచ్చేందుకు సహకరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. ప్రతిపాదిత సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. అదేవిధంగా చిన్న, భారీ వ్యాపారులకూ మేలు చేస్తుందన్నారు. దేశ రాజధాని దిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీని తగ్గించేందుకు దాదాపు రూ.11 వేల కోట్లతో నిర్మించిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్టులను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జీఎస్టీ చట్టాన్ని మరింత సరళీకరించాలని, పన్ను రేట్లను సవరించాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉందని మోదీ తెలిపారు. "సంస్కరణలు సుపరిపాలన పురోగతిని సూచిస్తాయి. ఈ కారణంగానే నిరంతర అభివృద్ధికి మేం ప్రాధాన్యం ఇస్తాం. సమీప భవిష్యత్తులో ప్రజల జీవన పరిస్థితులు, వ్యాపార కార్యకలాపాలు మరింత సులభతరంగా, సౌకర్యవంతంగా మార్చడం లక్ష్యంగా జీఎస్టీలో సంస్కరణలను తీసుకొస్తున్నాం. వచ్చే దీపావళికి ప్రజలు పండుగను మరింత సంతోషంగా జరుపుకొనేలా ఈ సంస్కరణలు రెట్టింపు ప్రయోజనాలను కలిగిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రతిపాదిత ముసాయిదాను కేంద్రం అన్ని రాష్ట్రాలకు పంపిందన్నారు.

అంబేడ్కర్ భావాలకు ద్రోహం చేశారు

ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నప్పుడు తిరోగమన చట్టాలను కొనసాగించాయని మోదీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని నృత్యం చేసేవారు దానిని తుంగలో తొక్కారని, బీఆర్ అంబేడ్కర్ భావాలకు ద్రోహం చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

జమ్మూలో మరోసారి గర్జించిన మేఘాలు

- ఆకస్మిక వరదలతో కథువాలో ఏడుగురి మృతి



భారీ వర్షాలతో కథువాలో ఇళ్ల సమీపంలో ప్రవహిస్తున్న వరద నీరు

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో మరోసారి మేఘ విస్ఫోటం(క్లౌడ్ బరస్ట్) విలయం సృష్టించింది. ఆకస్మికంగా కురిసిన వర్షాలతో శనివారం రాత్రి కథువా జిల్లాను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. ఈ ఘటనలో ఐదుగురు చిన్నారులు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కిశ్త్వాడ్ జిల్లాలోని చశోతీలో వరదలు బీభత్సం సృష్టించి మూడురోజులు కూడా గడవక ముందే మరోసారి మేఘ విస్ఫోటం చోటుచేసుకోవడం గమనార్హం. దీనివల్ల రాజ్‌బాగ్‌లోని జోధ్‌ఘాటీ గ్రామం, జంగ్‌లోట్‌లోని బాగ్రా గ్రామాల్లో చాలా వరకు మట్టిఇళ్లు, దుకాణాలు, రోడ్లు తుడిచిపెట్టుకుపోయాయి. జమ్మూ-పఠాన్‌కోట్ రైలు మార్గం ధ్వంసమైంది. దీంతో స్థానిక రైళ్లను అధికారులు రద్దుచేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. జోధ్ ఘాటీలో ఓ తండ్రి.. ఇద్దరు మైనర్లు సహా ఐదుగురు మృతిచెందారు. అటు బాగ్రా గ్రామంలో తల్లి(39), కుమార్తె(9)లు ప్రాణాలు కోల్పోయారు. అధికార యంత్రాంగం సహాయక చర్యల్ని ముమ్మరం చేసింది. మరోవైపు గాయపడిన ఆరుగురిని రక్షించి ఆసుపత్రికి తరలించింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా బగాఢా, చంగ్డా, దిల్వాన్ హట్లీ గ్రామాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కథువాలో పరిస్థితిపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కేంద్రమంత్రి అమిత్ షా అడిగి తెలుసుకున్నారు. కిశ్త్వాడ్ జిల్లాలోని చశోతీ ఆకస్మిక వరద ఘటనలో మృతిచెందిన వారి సంఖ్య 61కి చేరుకుంది.

భారత్‌కు తిరిగొచ్చిన గగన యాత్రికుడు

శుభాంశు శుక్లాకు దిల్లీలో ఘనస్వాగతం • నేడు మోదీతో భేటీ

దిల్లీ: యాక్సియం-4 మిషన్ ద్వారా రోదసి యాత్ర పూర్తిచేసుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. దిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ ఘన స్వాగతం పలికారు. శుభాంశు భార్య కామ్నా శుక్లా, కుమారుడు కియాష్‌లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చిన ప్రజలు డ్రమ్స్ వాయిస్తూ, త్రివర్ణ పతాకాన్ని ఊపుతూ సందడి చేశారు. శుభాంశు వెంట మరో వ్యోమగామి ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారు.

అంతరిక్ష యాత్ర కోసం శిక్షణ పొందుతూ ఏడాదిగా శుభాంశు శుక్లా అమెరికాలో ఉన్నారు. జూన్ 25 నుంచి జులై 15 వరకూ ఆయన రోదసి యాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే. భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరిన ఆయన.. మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను నిర్వహించారు. భూమికి తిరిగి వచ్చినప్పటి నుంచి అమెరికాలోనే ఉంటున్నారు.



దిల్లీ విమానాశ్రయంలో శుభాంశు శుక్లాతో దిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్రమంత్రి జితేంద్రసింగ్

నేడు లోక్‌సభలో ప్రత్యేక చర్చ

శుక్లా.. సోమవారం ప్రధాని మోదీతో భేటీ అవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 23న దిల్లీలో జరిగే జాతీయ అంతరిక్ష దినోత్సవంలో శుక్లా పాల్గొంటారు. 'ఐఎస్ఎస్‌కు భారత తొలి వ్యోమగామి' అనే అంశంపై సోమవారం లోక్‌సభలో చర్చకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఉప రాష్ట్రపతి ఎన్నికకు 'ఇండియా' ఉమ్మడి అభ్యర్థి!

నేడు చర్చించనున్న విపక్ష కూటమి

దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించే అంశంపై విపక్ష 'ఇండియా' కూటమి నేతలు సోమవారం చర్చించే అవకాశం ఉంది. కూటమి పార్లమెంటరీ పక్ష నేతలు.. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం సమావేశం కానున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అధికార ఎన్డీయే కూటమి తన అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను ఎంపిక చేసిన నేపథ్యంలో ఈ భేటీ జరుగుతోంది. ఆయన తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడం వల్ల.. ఆ రాష్ట్రంలోని అధికార డీఎంకే నుంచి కూడా ఆయనకు మద్దతు రావొచ్చని భాజపా అంచనావేస్తోంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏకాభిప్రాయం సాధించేందుకు విపక్ష పార్టీలతో ఎన్డీయే కూటమి మాట్లాడుతుందని భాజపా అధ్యక్షుడు జె.పి.నడ్డా పేర్కొనడం ఇక్కడ గమనార్హం. ఈ నేపథ్యంలో విపక్షాలు ఎలాంటి వైఖరిని అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయేతర నేపథ్యం నుంచి వచ్చిన అభ్యర్థిని ఉమ్మడిగా బరిలోకి దించుతామని ఇండియా కూటమి నేతలు ఇప్పటికే ప్రకటించారు.

మీరొక్కరే ట్రంప్ వద్దకు వెళ్లొద్దు

- మేమూ తోడుగా వస్తాం
- జెలెన్‌స్కీకి అండగా ఐరోపా నేతలు



కీవ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీకి ఒంటరిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని పంపేందుకు ఐరోపా నేతలు భయపడుతున్నారు. ఫిబ్రవరిలో ట్రంప్‌ను కలిసేందుకు అమెరికా వెళ్లిన జెలెన్‌స్కీకి వైట్‌హౌస్‌లో చేదు అనుభవం ఎదురైన సంగతి తెలిసిందే. మూడో ప్రపంచయుద్ధం వచ్చేలా చేయొద్దంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ ఆ భేటీలో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో ఈసారి జెలెన్‌స్కీకి తోడుగా బ్రిటన్ ప్రధాని స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ తదితర ఐరోపా నేతలూ అమెరికాకు వెళ్లనున్నారు. వారు కూడా జెలెన్‌స్కీ, ట్రంప్ మధ్య సోమవారం జరిగే సమావేశంలో పాల్గొననున్నారు. ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు అలాస్కా వేదికగా ట్రంప్, పుతిన్ మధ్య రెండున్నర గంటలకు పైగా జరిగిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. అయితే ఆ సమావేశంలో ట్రంప్ అనుసరించిన మెతక వైఖరి ఐరోపా నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా దొనెట్స్క్ ప్రాంతాన్ని ఉక్రెయిన్ వదులుకోవాలని పుతిన్ చేసిన డిమాండ్ చర్చనీయాంశమవుతోంది. సోమవారం జరిగే సమావేశంలో పుతిన్ ప్రతిపాదనలను ముందు పెట్టి ఎక్కడ జెలెన్‌స్కీపై ట్రంప్ ఒత్తిడి తెస్తారోనన్న భయం ఐరోపా నేతల్లో నెలకొంది. దీంతో జెలెన్‌స్కీతో తాము కూడా వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.

ఆ రెండూ వదులుకుంటేనే శాంతి

- ట్రంప్‌తో భేటీలో స్పష్టం చేసిన పుతిన్

న్యూయార్క్: యుద్ధం ముగించాలంటే ఉక్రెయిన్ తటస్థత పాటించాలని, నాటోకు దూరంగా ఉండాలని తొలి నుంచీ రష్యా డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ ప్రధాన అంశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా వేదికగా జరిగిన సమావేశంలో పుతిన్ ప్రస్తావించారు. దీంతోపాటు మరో కీలక డిమాండ్‌ను కూడా రష్యా అధ్యక్షుడు పెట్టారు. అదే రానున్న రోజుల్లో ఉక్రెయిన్‌లో శాంతి ఏర్పడుతుందా..? యుద్ధం కొనసాగుతుందా..? అన్న విషయాన్ని నిర్ణయించనుంది.

మూడు గంటలకు పైగా డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో శాంతి నెలకొనాలంటే తూర్పు ఉక్రెయిన్‌లోని డాన్‌బాస్ ప్రాంతంలోని దొనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాలను ఉక్రెయిన్ వదులుకోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పష్టం చేశారు. దొనెట్స్క్‌లోని 70 శాతం ప్రాంతం మాస్కో అధీనంలో ఉంది. లుహాన్స్క్‌లో వందశాతం ఇప్పటికే రష్యా దళాలు ఆక్రమించేశాయి. ఈ డిమాండ్‌ను గతంలోనూ జెలెన్‌స్కీ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో సోమవారం వాషింగ్టన్ డీసీలో జెలెన్‌స్కీ భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పుతిన్ లేవనెత్తిన ఈ కీలక డిమాండ్‌ను జెలెన్‌స్కీ దృష్టికి ట్రంప్ తీసుకెళ్లనున్నారు.





ట్రంప్ ఒప్పించగలరా..!

పుతిన్‌తో సమావేశానంతరం ట్రంప్ స్వరం మారింది. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి మాస్కో అంగీకరించకపోతే రష్యాపై ఆంక్షల పిడుగు పడనుందని హెచ్చరిస్తూ వచ్చిన ట్రంప్.. అలాస్కా భేటీ అనంతరం మెత్తబడ్డారు. తాత్కాలిక కాల్పుల విరమణతో పెద్దగా ప్రయోజనం లేదని.. శాశ్వత శాంతితోనే రెండు దేశాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఒప్పందం కుదుర్చుకోవడమే ఉక్రెయిన్ ముందున్న మార్గమని తెలిపారు. రష్యా శక్తిమంతమైన దేశమన్న విషయాన్ని కీవ్ గుర్తుంచుకోవాలని కూడా తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగే సమావేశంలో జెలెన్‌స్కీని పుతిన్ డిమాండ్లకు ట్రంప్ ఒప్పించగలరా అన్నది కీలకం కానుంది.

మెనూ.. లోకేషన్. గిఫ్ట్.. అంతా బహిర్గతం

న్యూయార్క్: పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుంది అమెరికా పరిస్థితి. డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్ అలాస్కా వేదికగా సమావేశమవుతున్న వేళ.. ప్రతి అంశమూ రహస్యంగా ఉంటుందని, అమెరికా, రష్యా అగ్రనేతలు ఏ గదిలో సమావేశమవుతారో.. వారికి రక్షణగా ఎవరుంటారో.. వారేం తింటారో.. తదితర అంశాలన్నీ మూడో కంటికి తెలియకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారని అంతా భావిస్తారు. కానీ జరిగింది వేరు. సమావేశానికి సంబంధించిన సమస్త సమాచారం అలాస్కాలో ఓ హోటల్‌లో ప్రింటర్ దగ్గర 8 పేజీల్లో కనిపించింది. ప్రింటర్ దగ్గర ప్రింట్లు తీసుకున్న అమెరికా విదేశాంగ శాఖ అధికారులు ఆ పేజీలను అక్కడే మరిచిపోయారు. ఈ విషయాన్ని 'హోటల్ కెప్టెన్ కుక్'లో బస చేసిన అతిథులు తెలిపారు. ఈ 8 పేజీల్లో షెడ్యూళ్లు, ప్రభుత్వ అధికారుల ఫోన్ నంబర్లు, పుతిన్, ట్రంప్ సమావేశమయ్యే సైనిక స్థావరంలోని గదుల నంబర్లు తదితర వివరాలన్నీ ఉన్నాయి. అంతేకాదు.. అందులో పుతిన్‌కు 'అమెరికన్ బాల్డ్ ఈగల్ డెస్క్ స్టేట్యూ' బహుమతిగా ట్రంప్ ఇవ్వాలనుకుంటున్నారన్న విషయం కూడా ఉంది. మిగతా పేజీల్లో అమెరికా, రష్యా అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు ఉన్నాయి. సంయుక్త విలేకరుల సమావేశం జరిగే సమయానికి సంబంధించిన వివరాలూ ఉన్నాయి. ఈ భద్రతాలోపంపై వైట్‌హౌస్ స్పందించలేదు.

గాజా పౌరులకు వీసాలు నిలిపివేసిన అమెరికా

ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గాజా ప్రజలపై మరో పిడుగు పడింది. ఇకపై గాజా ప్రజలకు వీసాలు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన అనేకమంది చికిత్స కోసం యూఎస్‌కు వస్తున్నారని ట్రంప్ యంత్రాంగానికి ఫిర్యాదు అందడంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తాత్కాలిక వైద్య-మానవతా వీసాలను జారీ చేయడానికి ఉపయోగించే ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా గాజా ప్రజలకు అన్ని రకాల వీసాలు నిలిపివేస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది.

ప్రోత్సాహకాలపై ఎంప్లాయిస్ యూనియన్ హర్షం

ఈనాడు, అమరావతి: స్త్రీ శక్తి పథకం ద్వారా వచ్చిన ఆదాయానికి అనుగుణంగా కండక్టర్, డ్రైవర్‌కు ప్రోత్సాహకాలు చెల్లించేలా ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు నిర్ణయించడం పట్ల ఎంప్లాయిస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. 'డబుల్ డ్యూటీ చేసిన సిబ్బందికి, ఆన్‌కాల్ డ్రైవర్లకు చెల్లించే మొత్తాన్ని సంస్థ పెంచింది. ప్రస్తుతం డ్యూటీకి మించి తిరిగే ప్రతి కిలోమీటరుకు రూ.3 చొప్పున విధులు ముగిసిన వెంటనే చెల్లిస్తుంది. ఒరిజినల్ గుర్తింపుకార్డుకు బదులు.. జిరాక్స్ కాపీ చూపినా అనుమతించేలా అధికారులు ఉత్తర్వులు ఇవ్వాలి' అని పేర్కొంది.

సీపీ రాధాకృష్ణన్‌కు పవన్‌కల్యాణ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఖరారైన మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ఖరారు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

స్వాతంత్ర్యం వద్దన్న ఆరెస్సెస్‌పై ప్రశంసలా!: ఖర్గే

సాసారాం (బిహార్): భాజపాకు మాతృసంస్థ అయిన ఆరెస్సెస్‌పై మోదీ ఎర్రకోట పైనుంచి ప్రశంసలు కురిపించారని, బ్రిటిషర్ల నుంచి భారత్ స్వాతంత్ర్యం పొందడాన్ని వ్యతిరేకించిన సంస్థపై ప్రధాని మాటలు విని మన స్వాతంత్ర్య సమరయోధులు సమాధుల్లో అసౌకర్యంగా కదిలి ఉంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఆదివారం బిహార్‌లోని సాసారాం నుంచి ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఖర్గే మాట్లాడారు. మహాత్మున్ని వ్యతిరేకిస్తూ, అరెస్టుల నుంచి తప్పించుకోడానికి బ్రిటిషర్లను శరణు వేడిన ఆరెస్సెస్ నేతలు భారత స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్ర ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక వయోజన ఓటుహక్కు వద్దని, మహిళలు సాధికారత పొందితే మిమ్మల్ని తొలగిస్తారంటూ నెహ్రూను సైతం హెచ్చరించిన చరిత్ర ఆరెస్సెస్ నేతలదని తెలిపారు. గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ అనుచరులుగా మారిపోయారని, ఈసీ 'ప్రమాదకరమైన' మోదీ సర్కారుకు ఏజెంటుగా మారి ప్రతిపక్షాలను వేధిస్తున్నట్లు ఖర్గే ధ్వజమెత్తారు. బిహార్‌లోని నీతీశ్ ప్రభుత్వం తమ హామీలను కాపీ కొడుతోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు.

భోజ్‌పురి పాట పాడిన లాలూ

అనారోగ్యంతో ఉన్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ బలహీనమైన స్వరంతో కుర్చీలో నుంచే మాట్లాడారు. తనదైన శైలిలో సంప్రదాయ భోజ్‌పురి పాటలోని ఒక చరణాన్ని పాడి సభలోని అభిమానులను ఉర్రూతలూగించారు. "రాహుల్, ఖర్గే, తేజస్వీ జిందాబాద్" అంటూ లాలూ తన ప్రసంగం ముగించారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భాజపా పాలనలో దేశ పరిస్థితి ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉందన్నారు. వాతావరణం వేడిగా ఉండటంతో వేదికపై సీనియర్ నేతలు ఖర్గే, లాలూ మాట్లాడుతున్నపుడు గ్లాసుల్లోకి నీరు నింపి వారికి అందించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఉదాత్త ప్రవర్తనకు పలువురి ప్రశంసలు లభించాయి. నడక, వాహనం ద్వారా రెండు పద్ధతుల్లోనూ మిశ్రమ విధానంలో సాగే ఈ యాత్ర సెప్టెంబరు 1న పట్నాలో ముగియనుంది.



బిహార్‌లోని సాసారాంలో ఖర్గేను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటున్న లాలూ. చిత్రంలో రాహుల్ గాంధీ

ఈసీ అసమర్థత బయటపడింది: కాంగ్రెస్

దిల్లీ: బిహార్ ఓట్ల సవరణపై ప్రతిపక్షాల ఆరోపణలను నిరాధారమని ఆదివారం మీడియా సమావేశంలో పేర్కొన్న ఎన్నికల సంఘం (ఈసీ) తన అసమర్థతను, పక్షపాత ధోరణిని మరోమారు బయటపెట్టుకొందని కాంగ్రెస్ పార్టీ దుయ్యబట్టింది. అధికార, ప్రతిపక్షాల మధ్య తాము ఎటువంటి తారతమ్యం చూపడం లేదన్న ఈసీ వాదనలు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొంది. "రాహుల్ గాంధీ లేవనెత్తిన ఏ ప్రశ్నకూ సీఈసీ అర్థవంతమైన వివరణ ఇవ్వలేదు. ఈసీ సమాచారం ఆధారంగానే రాహుల్ సందేహాలు వ్యక్తం చేశారు. దయచేసి, దర్యాప్తు చేయండి. మమ్మల్ని బెదిరించవద్దు. ఇంతకూ బిహార్‌లో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలు బహిర్గతం చేయాలని ఆగస్టు 14న సుప్రీంకోర్టు నిర్దేశించిన స్ఫూర్తి మేరకు ఈసీ వ్యవహరిస్తుందా? దేశం యావత్తు ఎదురుచూస్తోంది" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' ద్వారా పేర్కొన్నారు. బిహార్‌లో తాము ప్రారంభించిన యాత్ర రాజకీయ కార్యక్రమం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే రాజ్యాంగబద్ధమైన పోరాటమని చెప్పారు.

బందీల విడుదలకు కృషి చేయండి

- ఆ దిశగా హమాస్‌తో ఒప్పందం చేసుకోండి
- ఇజ్రాయెల్ పౌరుల డిమాండ్

జెరూసలెం: గాజాలోని హమాస్ ఉగ్రవాదుల చేతిలో బందీలుగా ఉన్న పౌరుల విడుదలకు కృషి చేయాలంటూ ఇజ్రాయెల్ పౌరులు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఉగ్రసంస్థతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఆదివారం ప్రజలు భారీ సమ్మెకు దిగారు. దీంతో దేశమంతటా ట్రాఫిక్ స్తంభించింది. వ్యాపార కార్యక్రమాలు నిలిచిపోయాయి. నిరసనలో భాగంగా బృందాలుగా ఏర్పడిన పౌరులు రాజకీయ నేతల ఇళ్ల ముందు, సైనిక ప్రధాన కార్యాలయం, జాతీయ రహదారులతో పాటు దేశంలోని పలు కూడళ్లలో ఆందోళనలు నిర్వహించారు. రోడ్లపై మంటలు వెలిగించారు. నిరసనలకు మద్దతుగా పలు రెస్టారెంట్లు, థియేటర్లు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జలఫిరంగులు ఉపయోగించారు. మొత్తం 32 మందిని అరెస్టు చేసినట్లు వారు వెల్లడించారు. తాజా ఆందోళనకు బందీల కుటుంబ సభ్యులతో కూడిన బృందమొకటి, హమాస్ ఉగ్రవాదుల కారణంగా నష్టపోయిన కుటుంబ సభ్యులకు చెందిన మరో బృందం నేతృత్వం వహించాయి. హమాస్ ఉగ్రవాదులపై దాడుల ఉద్ధృతిని పెంచాలన్న ఇజ్రాయెల్ ప్రభుత్వ ప్రణాళికలపై నిరసనకారులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వ చర్య కారణంగా గాజాలో బందీలుగా ఉన్న 50 మంది ప్రాణాలు మరింత ప్రమాదంలో పడతాయని వారు భావిస్తున్నారు. బందీల మృతదేహాలపై విజయం సాధించలేమని వారు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఆ 50 మందిలో కేవలం 20 మందే జీవించి ఉంటారని అంచనా.



బందీల విడుదలకు డిమాండ్ చేస్తూ జెరూసలెంలో ప్రజల ఆందోళన



శ్రీకాళహస్తీశ్వర శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎస్ విజయానంద్. చిత్రంలో రచయిత చక్రవర్తి, ఇతర అధికారులు

శ్రీకాళహస్తీశ్వర శతకం పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎస్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ ముఖ్య కార్యదర్శి కేఆర్‌బీహెచ్‌ఆర్ చక్రవర్తి రచించిన 'శ్రీకాళహస్తీశ్వర శతకం' పుస్తకాన్ని సీఎస్ విజయానంద్ తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. అష్టదిగ్గజ కవుల్లో ఒకరైన ధూర్జటి రాసిన ఈ శతకానికి ఆధ్యాత్మిక, పౌరాణిక, చారిత్రక, సాంఘిక సాహిత్య వివరాలతో చక్రవర్తి వ్యాఖ్యానం రాశారని వక్తలు వివరించారు. రాష్ట్ర సాంస్కృతికశాఖ, విశాలాంధ్ర పబ్లికేషన్స్ సంయుక్తంగా దీన్ని ముద్రించాయి. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకులు ఆర్.మల్లికార్జునరావు, విశాలాంధ్ర పబ్లికేషన్స్ ప్రతినిధి మనోహర్ నాయుడు, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి జీవీ సాయిప్రసాద్, న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి కర్రి కృష్ణారావు, విజయవాడ నగర డీసీపీ ఎస్‌వీడీ ప్రసాద్, వైద్యారోగ్యశాఖ సంయుక్త సంచాలకులు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాక్‌లో 200 మంది గల్లంతు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో భారీ వర్షాల కారణంగా వరదలు, కొండచరియలు విరిగిపడటంతో గల్లంతయిన వారి సంఖ్య 200లకు పెరిగింది. 327 మంది మృతిచెందారు. ప్రావిన్సులో సోమవారం నుంచి గురువారం వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. కాగా జూన్ 26 నుంచి కురుస్తున్న వానల కారణంగా పాకిస్థాన్‌లో 650 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.



పసి ముద్దుకూ ఓ హద్దుంది!



వెండి గిన్నెలో వేడి పాల బువ్వ తీసుకుని దాని ఉఫ్ ఉఫ్ అని ఊదుతూ పసి బిడ్డలకు తినిపిస్తాం.. కదూ.. ఆప్యాయకరమైన ఈ దృశ్యం వెనక చిన్న చిన్న అపాయాలూ ఉన్నాయి. చిన్నారి ఆరోగ్యానికి హాని చేసే కొన్ని నిజాలూ ఉన్నాయి... చిన్నారులను ఎడాపెడా ముద్దు చేయడం.. వారికి వాడే పాల సీసాల విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలంటున్నారు నిపుణులు.

పిల్లలను ముద్దు పెట్టుకోవడం.. తినిపించేటప్పుడు ఆహారాన్ని ఊదడం.. ఇవన్నీ తల్లిదండ్రులు ఎంతో ప్రేమతో చేసే అతి సాధారణ పద్ధతులు. కానీ ఇవే పిల్లల్లో దంతక్షయానికి, నోటి అనారోగ్యానికి కారణమవుతాయని చెబుతున్నారు వైద్యులు. భారత్ సహా యూకే, అమెరికా తదితర దేశాల్లో జరిగిన వేర్వేరు అధ్యయనాల్లో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నోటి ఆరోగ్యం చుట్టూ ఉన్న వారిపై కూడా ప్రభావం చూపుతుంది. దంతక్షయం (క్యావిటీ) అనేది తనంతట తానుగా అంటువ్యాధిగా వ్యాప్తిచెందదు. కానీ దానికి కారణమయ్యే సూక్ష్మజీవులు మాత్రం లాలాజలం ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయి. ముఖ్యంగా పిల్లలు, కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు దగ్గరి సంబంధం కలిగి ఉంటారు కాబట్టి.. మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు నిపుణులు.

నోటి ముద్దు... పాల సీసా!



- పిల్లల దంతాలు మృదువైన ఎనామిల్‌ను కలిగి ఉంటాయి. బ్యాక్టీరియా దాడికి త్వరగా గురవుతాయి. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నుంచి స్ట్రెప్టోకాకస్ మ్యూటాన్స్ బ్యాక్టీరియా పిల్లలకు సంక్రమిస్తే.. అది వారి నోటిలో స్థిరపడి, క్యావిటీలకు దారి తీస్తుంది. సాధారణంగా పిల్లలకు ఆహారం తినిపించేటప్పుడు.. వేడి చల్లార్చడానికి నోటితో ఉఫ్.. ఉఫ్.. అని ఊదుతుంటారు. అలా ఊదినప్పుడు లాలాజల బిందువులు ఆహారంపై పడే అవకాశం ఉంటుంది. అలా ఆహారంపై పడిన లాలాజల బిందువుల్లోని బ్యాక్టీరియా నేరుగా చిన్నారుల నోట్లోకి చేరిపోతుంది.
- పెద్దవారు తిన్న ప్లేట్లోనే పిల్లలకు పెట్టినా.. తాము ముద్ద తింటూ.. చిన్నారులకు మరో ముద్ద పెడుతున్నా...వారు తాగిన గ్లాసుతో నీళ్లు తాగించినా సూక్ష్మక్రిములు పిల్లలకు వ్యాప్తి చెందుతాయి.
- పిల్లల బుగ్గపై ముద్దు పెట్టినప్పుడు అక్కడ లాలాజలం తడి కొంత ఉండిపోతుంది. పిల్లలు తమకు తెలియకుండానే బుగ్గను తుడుచుకుని.. ఆ చేతిని నోట్లో పెట్టుకున్నప్పుడు ఆ లాలాజలం తడిలోని బ్యాక్టీరియా పిల్లల్లోకి చేరుతుంది.
- మరి చిన్నతనంలో బ్యాక్టీరియా రావడానికి మరో కారణం.. పాలసీసా. పిల్లలు పాల సీసా నోటి దగ్గర పెట్టి.. వాళ్లు తాగుతున్నారు కదని.. పెద్దవారు తమ పనులు చేసుకుంటూ ఉంటారు. పిల్లలు పాలను తాగడం ఆపేసినా సీసా నుంచి బయటకు వచ్చిన పాలు నోట్లో నిలిచిపోతాయి. ఇలాంటప్పుడు పిల్లల నోటిని శుభ్రం చేయకుంటే వదిలిన సూక్ష్మక్రిములు పెరుగుతాయి.
- సాధారణంగా చిన్నారుల్లో ఆర్నెల్ల వయసు వచ్చాక దంతాలు రావడం ప్రారంభమవుతుంది. రెండున్నరేళ్ల వయసుకు పూర్తిస్థాయిలో పాల దంతాలు వస్తాయి. వాటిపై నల్లటి మచ్చలు కనిపిస్తే మాత్రం వెంటనే దంత వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. పాల పళ్లే కదా ఎలాగూ పోతాయి కదాని కొందరు తల్లిదండ్రులు దంతాలపై మచ్చలున్నా పట్టించుకోరు. కానీ ఆ మచ్చలు ఇన్‌ఫెక్షన్‌గా మారి శాశ్వతంగా దుష్ప్రభావం చూపుతాయి.

ఇలా చేయాలి...

- తల్లిదండ్రులు తమ నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా పిల్లలకు బ్యాక్టీరియా సంక్రమణను తగ్గించవచ్చు.
- చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు లేదా పానీయాలను పిల్లలకు పట్టించడం తగ్గిస్తే బ్యాక్టీరియా పెరుగుదలను అరికట్టవచ్చు.
- చెంచాలు, గరిటెలు, టూత్‌బ్రష్‌లను పిల్లలకు షేర్ చేయొద్దు.
- ఆరు నెలలకు ఒకసారి దంతవైద్యునితో చెకప్ చేయించడం ద్వారా క్యావిటీలను ముందుగానే గుర్తించవచ్చు.

నల్లని మచ్చల దశలోనే చికిత్స..

-డాక్టర్ వికాస్‌గౌడ్, దంత వైద్యనిపుణులు

ఒక్కసారి స్ట్రెప్టోకాకస్ మ్యూటాన్స్ బ్యాక్టీరియా శరీరంలోకి చేరితే.. ఇన్‌ఫెక్షన్ తీవ్రరూపం దాల్చితే.. యాంటీ బయాటిక్స్ మందులను ఇవ్వడం ద్వారా దాన్ని నియంత్రించవచ్చు గానీ.. పూర్తిగా సూక్ష్మక్రిములను నాశనం చేయడం సాధ్యం కాదు. అందుకే పిల్లలకు తమంతట తామే దంతాలను శుభ్రం చేసుకునే వయసు వచ్చాక.. రోజుకు రెండుసార్లు పళ్లను శుభ్రం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఎందుకంటే.. 12 గంటలకు పైగా దంతాలను శుభ్రం చేయకపోతే.. బ్యాక్టీరియా వృద్ధి ఎక్కువగా ఉంటుంది. అందుకే ముందుగా తల్లిదండ్రులే ఉదయం లేచిన తర్వాత.. రాత్రి పడుకునే ముందు.. అలా రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకుంటే.. పిల్లలు అది చూసి ఆచరిస్తారు. రాత్రిపూట పళ్లు శుభ్రం చేసుకుంటే.. అంతకంటే దంతాల ఆరోగ్యానికి మేలు మరోటి ఉండదు.

- ఈనాడు, హైదరాబాద్

క్రీడా కోటాలో డీఎస్సీ ఉద్యోగానికి మామూళ్లు?

- శాప్ నుంచి చేస్తున్నామంటూ పలువురికి ఫోన్ కాల్స్

ఈనాడు, అమరావతి: 'హలో.. నేను శాప్ నుంచి మాట్లాడుతున్నా. మీరు స్పోర్ట్స్ కోటాలో దరఖాస్తు చేశారు కదా? ఉద్యోగం వస్తే లైఫ్ టైం సెటిల్‌మెంట్. ప్రశాంత జీవితం. ఫైనల్ లిస్టులో మీ పేరుండాలంటే కొన్ని ఫార్మాలిటీస్ ఉంటాయి. ఆలోచించుకోండి' అంటూ డీఎస్సీ క్రీడా కోటా కింద దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. తాము శాప్ అధికారులమని, సంబంధిత శాఖలో పలుకుబడి ఉందంటూ వీరి పరిచయం చేసుకుంటున్నారు. డబ్బులిస్తే చాలు, అంతా చక్కబెట్టేస్తామని నమ్మబలుకుతున్నారు. రూ.10-15 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. కొందరు క్రీడాకారులు ఉద్యోగం వస్తుందనే ఆశతో ఒప్పందాలు కూడా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా మామూళ్ల వసూళ్లపై ఇప్పటికే శాప్‌కు ఫిర్యాదులు అందాయి. కొందరు అభ్యర్థులు ఆడియో, వీడియో రికార్డుల్ని పంపించారు. అసలు క్రీడా కోటాలో దరఖాస్తు చేసిన క్రీడాకారుల ఫోన్ నంబర్లు థర్డ్ పార్టీకి ఎలా చిక్కాయన్నది తేల్చాల్సి ఉంది. క్రీడాకారులందరి వివరాలు శాప్‌లోని ఓ కీలక విభాగంలో ఉన్నాయి. ఆయా క్రీడాసంఘాల వద్ద కూడా అటూఇటుగా సమాచారం ఉంది. శాప్‌లోని కొందరు సిబ్బంది, కొన్ని సంఘాల ప్రతినిధులు కుమ్మక్కై అభ్యర్థుల ఫోన్ నంబర్లను బయటి వ్యక్తులకు ఇచ్చారనే ఆరోపణలున్నాయి. వారే శాప్ పేరు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది.

తుది దశకు ఎంపిక ప్రక్రియ: మెగా డీఎస్సీలో క్రీడా కోటా కింద 421 పోస్టుల భర్తీ చేయనున్నారు. రాత పరీక్ష లేకుండా ఆటల్లో ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం శాప్ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇప్పటికే ప్రాథమిక జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. సోమవారం తుది జాబితాను రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలనకు పంపనున్నారు.

జెన్యూనిటీ సర్టిఫికెట్లకూ లంచాలు!

అభ్యర్థులు సమర్పించిన క్రీడా ధ్రువపత్రాలు సరైనవో, కావో నిర్ధారించుకోవడానికి ఆయా సంఘాల నుంచి నేరుగా శాప్‌కు జెన్యూనిటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి. కానీ కొన్ని సంఘాలు దీని కోసం రూ.2-3 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. డబ్బులివ్వడానికి నిరాకరించిన అభ్యర్థులకు జెన్యూనిటీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా గడువు తేదీ వరకూ ఇబ్బందులు పెట్టాయి. చాలా మంది అభ్యర్థులు విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చి ఈ విషయమై అధికారులు ముందు వాపోయారు. లాభం లేకపోవడంతో కొన్ని సంఘాలకు అందాల్సిన సెటిల్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

మా దృష్టికి వచ్చింది

ఫేక్ ఫోన్‌కాల్స్ వ్యవహారం మా దృష్టికి కూడా వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసేవారి మాటల్ని నమ్మొద్దు. వాటిపై నేరుగా మాకు ఫిర్యాదుచేయాలని అభ్యర్థులను కోరుతున్నాం. అత్యంత పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా డీఎస్సీ టీచర్ పోస్టుల ఎంపిక ఉంటుంది. – ఆర్.వెంకటరమణనాయక్, శాప్ పరిపాలనాధికారి

విద్యార్థులకు రూ.1.74 కోట్ల ఉపకార వేతనాలు



విద్యార్థినికి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న చంద్రమౌళీశ్వరరెడ్డి దంపతులు

దుత్తలూరు, న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివి ప్రతిభ చాటిన 97 మంది విద్యార్థులకు సీడ్స్ స్వచ్ఛంద సంస్థ, యువ అన్‌స్టాపబుల్ సహకారంతో రూ.1.74 కోట్ల ఉపకార వేతనాలు మంజూరుచేశారు. దుత్తలూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పత్రాలను సంస్థ వ్యవస్థాపకులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి విద్యార్థులకు అందజేశారు. తన సొంత గ్రామంలో చంద్రమౌళీశ్వరరెడ్డి ఇలాంటి సంస్థను నెలకొల్పి ఎందరో పేద విద్యార్థులకు బాసటగా నిలవడం ప్రశంసనీయమని విశ్రాంత ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, ఎంఈవో వెంగయ్య పేర్కొన్నారు.

పిల్లలతో ఎప్పుడూ ఇలా అనకండి



తల్లిదండ్రుల మాటలు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. కాబట్టి కొన్ని మాటలను చిన్నారులతో ఎప్పుడూ అనొద్దు. అవేంటంటే..

- 'ఇతరుల్లా ఉండు' - ఇది అభద్రతా భావాన్ని పెంచుతుంది.
- 'ఏడవడం ఆపు' - భావోద్వేగాలను దూరం చేస్తుంది.
- 'నేను చెప్పిందే చెయ్యాలి' - అనుబంధాన్ని దెబ్బతీస్తుంది.
- 'నువ్వు దేనికీ పనికిరావు' - స్వీయ విలువను తెలుసుకోలేరు.
- 'నువ్వెప్పుడూ గెలవలేవు' - ఆత్మవిశ్వాసాన్ని చంపేస్తుంది.

– సుమిత్ శర్మ, వైద్యుడు

సెటిల్‌మెంట్ల కోసమే.. చికిత్స ముసుగులో బయటకు!

- ప్రియుడు శ్రీకాంత్‌ను జైలు నుంచి రప్పించిన నెల్లూరు 'లేడీ డాన్'

ఈనాడు, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అరాచకశక్తిగా వ్యవహరిస్తున్న లేడీ డాన్.. తన ప్రియుడు, వైన్‌షాపు మేనేజర్ హత్య కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న దోషి అవిలేలి శ్రీకాంత్‌ను గతేడాది డిసెంబరులో చికిత్స పేరిట జైలునుంచి బయటకు తీసుకొచ్చి సెటిల్‌మెంట్లు చేయించినట్లు సమాచారం. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలోనే అతని చేయి విరిగిందని, ఆ నిజం బయటకు రాకుండా తొక్కిపెట్టేందుకు రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు కథ అల్లారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తమ కస్టడీలోని ఖైదీకి రోడ్డు ప్రమాదంలో గాయాలైతే ఎస్కార్ట్ సిబ్బంది పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? కేసు ఎందుకు నమోదు కాలేదు? అనేది చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు 'లేడీ డాన్' కొంతమంది ఉన్నతాధికారులను ప్రభావితం చేసి, వారిద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి చెప్పించి ఈ ఘటనపై కేసు లేకుండా చేసుకున్నారని సమాచారం.

ప్రమాదం జరిగుంటే.. ఆ వాహనమెక్కడ?

అవిలేలి శ్రీకాంత్ అనారోగ్యానికి గురయ్యాడంటూ, చికిత్స కోసమని ఎస్కార్ట్ సిబ్బంది గతేడాది డిసెంబరు 17న నెల్లూరు జైలు నుంచి తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్విమ్స్ వద్ద ఆటో దిగుతుండగా వెనక నుంచి ఓ బైక్ వచ్చి శ్రీకాంత్‌ను ఢీకొట్టిందని, దాంతో అతని ఎడమ చేయి విరిగిందని అప్పట్లో చెప్పారు. స్విమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగం లేకపోవడంతో శ్రీకాంత్‌ను రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యురాలు.. అడ్మిషన్ రిజిస్టర్ బుక్‌లో మెడికో లీగల్ కేసు (ఎమ్మెల్సీ)గా నమోదు చేశారు. నిబంధనల ప్రకారం ఎస్కార్ట్‌గా వెళ్లిన సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలోని పోలీసు అవుట్ పోస్టుకు సమాచారమిచ్చి, స్థానిక పోలీసు స్టేషన్‌లో దీనిపై కేసు నమోదు చేయించాలి. కానీ ఎస్కార్ట్ సిబ్బంది అసలు ఫిర్యాదే ఇవ్వలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వారు ఫిర్యాదివ్వలేదని సమాచారం. ఎస్కార్ట్ సిబ్బంది చెప్పినట్లుగా నిజంగానే శ్రీకాంత్‌ను ద్విచక్రవాహనం ఢీకొడితే ఆ వాహనం ఎవరిది? దాని నంబరు ఏంటి? అనేది ఎందుకు చెప్పట్లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఓ హోటల్‌లో సెటిల్‌మెంట్!

నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి శ్రీకాంత్‌ను స్విమ్స్‌కు తరలించే క్రమంలో ఎస్కార్ట్ సిబ్బంది అతన్ని తిరుపతిలోని ఓ హోటల్ వద్దకు తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. అక్కడే అతను లేడీడాన్ అయిన తన ప్రియురాలితో కలిసి ఓ సెటిల్‌మెంట్ చేశాడని, ఆ క్రమంలోనే ప్రత్యర్థుల దాడిలో శ్రీకాంత్ చేతికి గాయమైందన్న ఆరోపణలున్నాయి. అయితే, దీనిపై ఇప్పటివరకూ సమగ్ర విచారణే జరగలేదు. చేతికి గాయమైన తర్వాత రెండు రోజుల పాటు రుయాలో చికిత్స పొందిన శ్రీకాంత్‌ను అక్కడి నుంచి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. దాదాపు నెలన్నర పాటు చికిత్స పేరిట ఆసుపత్రిలో ఉంటూనే శ్రీకాంత్ సెటిల్‌మెంట్లు చేయడం, లేడీ డాన్‌తో ఆసుపత్రి పడకపైనే సరసాలు ఆడటం, సన్నిహితంగా గడపడం చేశారు. వీటన్నింటినీ నిలువరించాల్సిన ఎస్కార్ట్ సిబ్బంది.. పూర్తిగా వారికి దాసోహమైపోయి ఈ అక్రమ కార్యకలాపాలకు సహకరించారు.

జైల్లో శ్రీకాంత్.. బయట లేడీ డాన్

శ్రీకాంత్ జైల్లో ఉన్నా.. అక్కడినుంచే ఆదేశాలు జారీ చేస్తూ తన గ్యాంగ్‌ను నడిపిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. ఈ దందాలను అతని ప్రియురాలైన లేడీ డాన్ చక్కబెడుతున్నారని సమాచారం. ఇందుకోసం ఓ స్వచ్ఛంద సంస్థ ముసుగు వేసుకోవడంతో పాటు గత ప్రభుత్వ హయాంలో వైకాపా ముఖ్య నాయకులు, పెద్దల అండదండలతో కొంతమంది ఉన్నతాధికారులను తన వలలో వేసుకున్నారని ఆరోపణలున్నాయి. అందమైన యువతులను వారి వద్దకు పంపించి, ఆ దృశ్యాల్ని రహస్యంగా చిత్రీకరించి వారిని ఆమె గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి.

సమగ్ర విచారణకు హోం మంత్రి అనిత ఆదేశం

'లేడీ డాన్', ఆమె ప్రియుడు శ్రీకాంత్‌కు పెరోల్ జారీ వ్యవహారంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సమగ్ర విచారణకు ఆదేశించారు. 'బొటిక్ నడిపే ఆమె.. పోలీసులనే శాసించారు' శీర్షికన ఈనాడు పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. వైకాపా హయాంలో ఆ మహిళ ఎలా చెలరేగిపోయారు? ఎక్కడెక్కడ, ఎలా సెటిల్‌మెంట్లు, దందాలకు పాల్పడ్డారు? శ్రీకాంత్‌కు పెరోల్ జారీ వెనక ఆమె ప్రమేయం ఏంటి? తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పోలీసు, జైళ్ల శాఖాధికారులను ఆదేశించారు.

జాషువా ఘాట్ అటకెక్కినట్లేనా!

మహాకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారకార్థం చేపట్టిన నిర్మాణాలు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిరాదరణకు గురయ్యాయి. పలు రచనలతో సామాజిక చైతన్యం రగిలించిన ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కవి చక్రవర్తి జాషువా సంస్మరణార్థం కళా ప్రాంగణం, ఘాట్‌ల నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం 2016లో నిధులు కేటాయించింది. కొంతమేర నిర్మాణమూ చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చి నిధులు ఆపేసి, నిర్మాణం అటకెక్కించింది. ఇప్పుడు ముళ్ల చెట్ల మధ్య అసంపూర్తిగా జాషువా ఘాట్ మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం నిర్మాణాలను పూర్తి చేసి జాషువా రచనలు అందరికీ అందుబాటులోకి తేవాలని సాహితీవేత్తలు కోరుతున్నారు.

– ఈనాడు గుంటూరు; న్యూస్‌టుడే, జిల్లా పరిషత్తు



ఆర్‌జేడీ కార్యాలయ ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న జాషువా కళా ప్రాంగణంలో పెరిగిన చెట్లు



జాషువా సమాధి వద్ద నిలిచిపోయిన ఘాట్ నిర్మాణం, పగిలిపోయిన శిలాఫలకం

రాష్ట్రంలో 60 వేల సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి: హోం మంత్రి అనిత



అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో పోలీస్‌స్టేషన్ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 60 వేల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హెటిరో మందుల పరిశ్రమ యాజమాన్యం సీఎస్ఆర్ పథకం కింద రూ.2.50 కోట్లతో నిర్మించే నూతన పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో కలిసి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అనిత మాట్లాడారు. "రాష్ట్రంలో లక్ష కెమెరాలు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. బస్టాండ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, వసతిగృహాలు ఇతర ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. వీటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించడం ద్వారా నేర నియంత్రణ, నిందితులు తప్పించుకునే వీల్లేకుండా చర్యలు చేపడుతున్నాము. మహిళల రక్షణలో భాగంగా శక్తి యాప్, వాట్సప్ ఈ గవర్నెన్స్ ఉన్నాయి. పోలీసింగ్ విభాగంలో దేశంలోనే మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. మొదటి స్థానానికి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో పోలీసుశాఖకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ సమస్యలన్నింటినీ ఇప్పుడు పరిష్కరిస్తున్నాం. ఇందులో భాగంగానే నెల రోజుల్లో అన్ని పోలీస్‌స్టేషన్లకు కొత్త వాహనాలను అందుబాటులోకి తెస్తాం" అని తెలిపారు. డీఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు.

మా ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతే మిగులు జలాలపై చర్చ



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతే.. మిగులు జలాలపై ఇరు రాష్ట్రాల ప్రతినిధులు చర్చించి, న్యాయబద్ధంగా కేటాయింపులు జరపాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఏపీలోని విశాఖ నగరంలో ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆదివారం ఉదయం గవర్నర్ బంగ్లా వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'స్టాప్ ఓట్ చోర్' కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. ''నీళ్లు, నియామకాల కోసమే ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. బీడు భూములను సాగులోకి తెచ్చుకోవడంతోపాటు పలు ప్రాజెక్టులను ప్రారంభించాం. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. మా అవసరాలు తీరకుండా దిగువ ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే నీటి కేటాయింపుల సమస్యలు వస్తాయి'' అని పేర్కొన్నారు.

గవర్నర్ చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు

తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శ

చెన్నై(సైదాపేట), న్యూస్‌టుడే: తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవికి, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య అభిప్రాయభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఆదివారం ధర్మపురిలో పలు కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేసే విమర్శలపై తనకు ఆందోళన లేదన్నారు. రాజకీయాల్లో అవన్నీ సహజమేనన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నియమించిన గవర్నర్ రవి.. వారికంటే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్‌భవన్‌లో ఉండి అధికార డీఎంకేకు వ్యతిరేకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం ప్రతిపాదించిన బిల్లులను ఆయన ఆమోదించరని, తమిళగీతాన్ని అగౌరవపరుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్య, శాంతిభద్రతలు, మహిళల భద్రతపై నిరాధార ఆరోపణలు చేసి భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడు దేశంలోనే అగ్ర రాష్ట్రమని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. దీంతో ప్రజావేదికలపై గవర్నర్ అసహనం వెళ్లగక్కుతున్నారని విమర్శించారు.

తమిళనాడు మంత్రి పెరియసామి నివాసంలో ఈడీ సోదాలు

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తమిళనాడు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డీఎంకే డిప్యూటీ సెక్రటరీ జనరల్ పెరియసామి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనిఖీలు చేసింది. దిండుక్కల్‌లోని గోవిందపురం దురైనగర్‌లో ఉన్న మంత్రి గృహంతో పాటు సీలప్పాడిలోని ఆయన కుమారుడు, పళని ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్, కుమార్తె ఇందిర ఇళ్లు, ఇతర ప్రాంతాల్లోనూ ఈడీ అధికారులు సోదాలు చేశారు. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు సుమారు 15 గంటల పాటు కొనసాగాయి. ఆస్తులు, పెట్టుబడుల పత్రాలు, కంపెనీ బ్యాంకుఖాతాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 2008లో హౌసింగ్‌బోర్డు గృహాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని అప్పటి గృహనిర్మాణ శాఖ మంత్రి పెరియసామిపై ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించి అన్నాడీఎంకే హయాంలో అవినీతి నిరోధక శాఖ కేసు నమోదుచేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలూ ఆయనపై వచ్చాయి.

పాపను కారులో మరిచి దర్శనానికి వెళ్లిన తల్లిదండ్రులు

- కాపాడిన మహానంది ఆలయ సిబ్బంది, కానిస్టేబుల్





చిన్నారిని ఎత్తుకున్న రికార్డు అసిస్టెంట్ ఈశ్వర్, కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో తల్లిదండ్రులు ◆కారులోపల చిక్కుకున్న చిన్నారి

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి వెళ్లిన తల్లిదండ్రులు.. కారులో పాపను మరిచిపోయారు. శ్వాస ఆడక ఏడుస్తున్న చిన్నారిని స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఆలయ సిబ్బంది, పోలీసులు ఆ పాపను ప్రాణాపాయం నుంచి రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని బీజాపూర్‌కు చెందిన రాజు తన భార్య, పిల్లలు, మరికొందరు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం కారులో మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం వెళ్లారు. తమ వాహనాన్ని నంది సర్కిల్లో నిలిపారు. ఇందులో తమ ఏడాదిన్నర వయసున్న చిన్నారి నిద్రిస్తోంది. చిన్నారిని భర్త తీసుకొస్తాడని భార్య.. తన భార్య తీసుకెళ్లిందనుకొని మూత్రవిసర్జనకు వెళ్లిన భర్త వేర్వేరుగా దర్శనానికి వెళ్లిపోయారు. దీంతో చిన్నారి కారులోనే ఉండిపోయింది. కారు అద్దాలన్నీ మూసి ఉండి, తలుపులు లాక్ పడిపోవడంతో చిన్నారికి ఊపిరాడక, చెమటలు పోసి నిద్రలేచి ఏడుస్తోంది. కారులో చిన్నారిని స్థానికులు గమనించి దేవస్థానం సమాచార కేంద్రంలోని రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వర్, పొరుగుసేవల ఉద్యోగి నాగార్జునరెడ్డికి తెలిపారు. వారు వెళ్లి.. కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు చెప్పగా.. ఆయన రాయితో కారు అద్దాలు పగులగొట్టి చిన్నారిని బయటకు తీశారు. ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న పాపకు సమాచార కేంద్రంలో సపర్యలు చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. దేవస్థానం మైకుల ద్వారా ప్రకటించగా 15 నిమిషాల తర్వాత తల్లిదండ్రులు వచ్చి ఆ పాపను తీసుకువెళ్లారు. చిన్నారిని కాపాడేందుకు కానిస్టేబుల్ చంద్రశేఖర్ చూపిన చొరవను హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశంసించారు.

'గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీని ఆహ్వానించండి'

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం ఆగస్టు 20న నిర్వహించే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీని కూడా ఆహ్వానించాలని ఏపీజీడబ్ల్యూఎస్ఈ జేఏసీ అధ్యక్షుడు మధుబాబు యారాడ ఓ ప్రకటనలో కోరారు. రిజిస్టర్డ్ సంఘాలనే ఈ భేటీకి ఆహ్వానించడంతో 1,30,000 మంది ఉన్న గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇందులో పాల్గొనే అవకాశం లేకుండా పోయిందని వివరించారు. దీంతో వారు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. ఏపీజీడబ్ల్యూఎస్ఈ జేఏసీ ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులకు కూడా చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

పదేళ్లలో 126 నుంచి 18 జిల్లాలకు..

- తగ్గిపోయిన మావోయిస్టుల ప్రభావం
- 'గాలింపు.. అభివృద్ధి' పేరిట కేంద్రం బహుముఖ వ్యూహం
- రాష్ట్రాలకు రూ.వేల కోట్లు మంజూరు



ఈనాడు, హైదరాబాద్: దేశంలో వామపక్ష తీవ్రవాదం కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహం అనుసరిస్తోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఒకపక్క ఉద్ధృత గాలింపులు.. మరోపక్క రూ.వేల కోట్లు వెచ్చించి విస్తృత అభివృద్ధి పనులు చేపడుతోంది. ఫలితంగా గత పదేళ్లలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 18కి చేరింది. ఈ మేరకు ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నివేదిక విడుదల చేసింది. వామపక్ష తీవ్రవాదం కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యల గురించి ఇందులో వివరించింది.

2015లో మొదలు: వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం 2015లో జాతీయ విధానం తీసుకొచ్చింది. శాంతిభద్రతల అంశం రాష్ట్రాల పరిధి కాబట్టి మావోయిస్టులతో పోరాడేందుకు వాటికి అవసరమైన సాయం చేయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం మొదలుపెట్టింది.

గాలింపులోనూ సాయం: మావోయిస్టుల గాలింపు కోసమయ్యే ఖర్చునూ కొంతవరకు భరిస్తోంది. దీనిలో భాగంగా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే దాదాపు 50 వేల మంది కిపైగా కేంద్ర పారామిలిటరీ బలగాలను వినియోగిస్తున్నారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, మహారాష్ట్ర సి-60 తరహాలో దాదాపు అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక కమాండో వ్యవస్థలతోపాటు మావోయిస్టుల సమాచారం సేకరించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. వీటి కోసం సంబంధిత రాష్ట్రాలకు రూ.1,740 కోట్లు మంజూరు చేసింది.

పునరావాసం..నష్టపరిహారం: సెక్యూరిటీ రిలేటెడ్ ఎక్స్‌పెండిచర్(ఎస్ఆర్ఈ) పథకం కింద పదేళ్లలో రూ.3,364.32 కోట్లు మంజూరు చేసింది. లొంగిపోయిన మావోయిస్టులకు ఉపాధి కల్పించడం, కాల్పుల్లో మరణించిన సాధారణ ప్రజల కుటుంబాలకు సాయం చేసేందుకు ఈ నిధులను వినియోగిస్తున్నారు.

గిరిజనుల్లో విద్యా వికాసం: గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు 46 ఐటీఐలు, 49 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ప్రారంభించింది. 179 ఏకలవ్య గురుకులాలు, 5,899 పోస్టాఫీసులు, 1,007 బ్యాంకు శాఖలు, 937 ఏటీఎంలు ఏర్పాటు చేసింది. మౌలిక వసతులు కల్పించేందుకు స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ పథకం కింద రూ.3,769 కోట్లు కేటాయించింది.

రవాణా.. సమాచార వ్యవస్థలకు: ఆయా గ్రామాల్లో రోడ్ రిక్వైర్‌మెంట్ ప్లాన్(ఆర్ఆర్‌పీ) పథకం పేరుతో 14,928 కి.మీ. మేర రోడ్లు వేసింది. సమాచార వ్యవస్థ మెరుగుపరిచేందుకు టెలికాం సేవల కోసం రూ.8,640 కోట్లు మంజూరు చేసింది. కొత్తగా 70 ఇండియన్ రిజర్వ్ బెటాలియన్లు మంజూరు చేయడంతోపాటు 621 ఎటాక్‌ప్రూఫ్ పోలీస్‌స్టేషన్లు నిర్మించింది.

ఛాంపియన్

నా ఉద్దేశం అది కాదు


అశ్విన్

చెన్నై: ఈ ఏడాది ఐపీఎల్ మధ్యలో బ్రెవిస్‌ను సీఎస్కే జట్టులోకి తీసుకోవడంపై తాను చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. దక్షిణాఫ్రికా ఆటగాడి బ్యాటింగ్ గురించి మాట్లాడాలనుకున్నాను తప్ప.. అతడి ధర గురించి కాదని అన్నాడు. బ్రెవిస్ కోసం చెన్నై అదనంగా చెల్లించిందనే అర్థం వచ్చేలా అశ్విన్ తన యూట్యూబ్ చానల్లో మాట్లాడడం చర్చకు కారణమైన సంగతి తెలిసిందే. దీంతో అశ్విన్ వివరణ ఇచ్చాడు. "బ్రెవిస్ బ్యాటింగ్‌పై మాట్లాడాలన్నదే నా ఉద్దేశం. ఐపీఎల్‌లో అతడు అందుకున్న మొత్తం గురించి మాట్లాడాలనుకోలేదు. ఐపీఎల్‌లో ప్రతి ఆటగాడికి ఫ్రాంఛైజీ, టోర్నమెంట్‌తో ఒప్పందం ఉంటుంది. ఏదైనా తప్పుంటే కాంట్రాక్ట్‌ను ధ్రువీకరించరు" అని అన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో మధ్యలో చెన్నై.. గాయపడ్డ గుర్జన్‌ప్రీత్ సింగ్ స్థానంలో బ్రెవిస్‌ను జట్టులోకి తీసుకుంది. నిబంధనల ప్రకారం గుర్జన్‌ప్రీత్ (రూ. 2.2 కోట్లు)కు ఇవ్వాల్సిన ఫీజునే బ్రెవిస్‌కూ ఇవ్వాలి. కానీ చెన్నై అతడికి అదనంగా డబ్బులు ఇచ్చిందన్నట్లు అశ్విన్ మాట్లాడడంతో సీఎస్కే వివరణ ఇచ్చింది. నిబంధనల ప్రకారమే బ్రెవిస్‌తో రూ.2.2 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నామని స్పష్టం చేసింది. ఫ్రాంఛైజీ ఎలాంటి తప్పూ చేయలేదని అశ్విన్ కూడా చెప్పాడు. అనేక మంది సందేహాలు వ్యక్తం చేయడంతో వివరణ ఇవ్వాల్సి వస్తోందని అన్నాడు.

సూర్య.. నిలుస్తాడా?

ఈనాడు క్రీడావిభాగం

పగ్గాలు అందుకున్న నాటి నుంచి ఒక్క సిరీస్ కూడా ఓడిపోని కెప్టెన్‌ను ఎవరైనా తప్పించాలని చూస్తారా? కానీ భారత సెలక్టర్లు, కోచ్ మాత్రం ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఏడాది భారత టీ20 జట్టు సారథ్య బాధ్యతలు అందుకుని విజయవంతంగా నడిపిస్తున్న సూర్యకుమార్ యాదవ్‌పై రాబోయే రోజుల్లో వేటు పడొచ్చని వార్తలు వస్తున్నాయి. మూడు ఫార్మాట్లకూ ఒకే కెప్టెన్ ఉండాలన్న ఉద్దేశంతో సూర్యను తప్పించాలని చూస్తున్నట్లుగా తెలుస్తోంది. వచ్చే నెలలో జరిగే ఆసియా కప్‌లో సూర్యనే కెప్టెన్‌గా కొనసాగొచ్చు కానీ.. ఆ తర్వాత తన హోదాను నిలబెట్టుకోవాలంటే అతనీ టోర్నీలో తనదైన ముద్ర వేయాల్సిందే.

నిరుడు టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ శర్మ టీ20లకు గుడ్‌బై చెప్పేయడంతో అతడి స్థానంలో సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు సెలక్టర్లు. సూర్య పగ్గాలందుకున్నాక జట్టు ప్రదర్శన మెరుగ్గానే ఉంది. టీ20 ప్రపంచ ఛాంపియన్ హోదాకు తగ్గట్లే వరుసగా విజయాలు సాధిస్తోంది. రోహిత్, కోహ్లి దూరమైనప్పటికీ ఆ ప్రభావం జట్టుపై పడలేదు. పొట్టి కప్పు విజయం తర్వాత సూర్య సారథ్యంలో శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమ్ఇండియా.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. తర్వాత సొంతగడ్డపై బంగ్లాదేశ్‌ను 3-0తో చిత్తు చేసింది. దక్షిణాఫ్రికాలో సైతం భారత జట్టు అదరగొట్టింది. బలమైన ప్రత్యర్థిపై 4 మ్యాచ్‌ల సిరీస్‌లో 3-1తో విజయం సాధించింది. ఈ ఏడాది ఆరంభంలో సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుంది. సూర్యకు కెప్టెన్‌గా ఇంత ఘనమైన రికార్డున్నప్పటికీ.. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కోచ్ గౌతమ్ గంభీర్ పొట్టి క్రికెట్లో కెప్టెన్సీ మార్పు దిశగా ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. టీమ్ఇండియాకు వేర్వేరు ఫార్మాట్లలో వేర్వేరు కెప్టెన్ల విధానం అంతగా కలిసి రాదన్న ఉద్దేశంతో ఒకే సారథిని ఎంపిక చేయాలని భావిస్తుండడమే ఇందుకు కారణమట. టెస్టు సారథిగా తన తొలి సిరీస్‌లోనే అదరగొట్టిన శుభ్‌మన్ గిల్‌కు మూడు ఫార్మాట్ల సారథ్య బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. వన్డే కెప్టెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ ఎంతో కాలం అంతర్జాతీయ క్రికెట్లో కొనసాగేలా లేడు. రోహిత్ తప్పుకోగానే అతడి స్థానంలోకి శుభ్‌మన్ రావడం లాంఛనమే. ఇక టీ20ల్లో సూర్య కెప్టెన్సీ రికార్డు బాగున్నప్పటికీ.. భవిష్యత్ దృష్ట్యా శుభ్‌మన్ వైపే సెలక్టర్లు, కోచ్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.


సూర్యకుమార్

ప్రతికూలతలు లేకపోలేదు

సూర్య కెప్టెన్సీ రికార్డు బాగున్నప్పటికీ.. అతడికి కొన్ని ప్రతికూలతలు లేకపోలేదు. కెప్టెన్ అయ్యాక జట్టు వరుస సిరీస్ విజయాలు సాధించింది కానీ.. వాటిలో సూర్య ప్రదర్శన గొప్పగా లేదు. బ్యాటర్‌గా ఉన్నప్పుడు అదరగొట్టిన సూర్య.. సారథ్య బాధ్యతలు అందుకున్నాక 15 మ్యాచ్‌లు ఆడి 18.42 సగటుతో 258 పరుగులే చేయగలిగాడు. అందులో రెండు అర్ధశతకాలు మాత్రమే ఉన్నాయి. టీ20ల్లో కెప్టెన్ ప్రభావం తక్కువ అని, గత ఏడాది కాలంలో జట్టు విజయాలకు సమష్టి ప్రదర్శనే కారణమని, అందులో సూర్య ఘనత తక్కువనే వాదనా వినిపిస్తోంది. దీనికి తోడు సూర్యకు 34 ఏళ్లు వచ్చేశాయి. టీ20లంటే కుర్రాళ్ల ఆట అనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ దిశగా కుర్రాడైన శుభ్‌మన్‌కే కెప్టెన్సీ అప్పగిస్తే బాగుంటుందనే చర్చ జరుగుతోంది. అయితే శుభ్‌మన్‌కు ప్రస్తుతం టీ20 జట్టులో చోటు లేదు. అతణ్ని టెస్టులు, వన్డేల్లో కీలక ఆటగాడిగా పరిగణిస్తూ వచ్చారు. అయితే ఐపీఎల్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా సత్తా చాటిన శుభ్‌మన్‌ను టీ20 జట్టులోకి ఎంపిక చేయకుండా ఉండడంలో ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆసియా కప్‌నకు గిల్‌ను ఎంపిక చేస్తారా లేదా అన్నది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. ఒకవేళ ఎంపిక చేసినా ఇప్పుడే కెప్టెన్‌గా నియమించకపోవచ్చు. సూర్యనే ఈ టోర్నీలో జట్టును నడిపించవచ్చు. అయితే ఆసియా కప్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా సూర్య తనదైన ముద్ర వేయాల్సి ఉంది. అతను రెండు విధాలా సత్తా చాటి జట్టుకు కప్పు అందిస్తే.. అతణ్ని తప్పించలేని పరిస్థితి తలెత్తుతుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకు కూడా సారథిగా కొనసాగే అవకాశముంది. లేదంటే మాత్రం శుభ్‌మన్‌కు పగ్గాలు ఇచ్చేయక తప్పదు.

గుకేశ్‌పైనే కళ్లన్నీ

సింక్వెఫీల్డ్ చెస్


గుకేశ్

సెయింట్ లూయిస్ (అమెరికా): సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీని ఆరో స్థానంతో ముగించిన భారత చెస్ స్టార్ దొమ్మరాజు గుకేశ్.. మరో పోటీకి సిద్ధమయ్యాడు. సోమవారం ఆరంభమయ్యే సింక్వెఫీల్డ్ క్లాసికల్ టోర్నీలో అతడు బరిలో దిగుతున్నాడు. ప్రస్తుతం ఫామ్‌లో లేకపోయినా.. తనకు పట్టున్న క్లాసికల్ ఈవెంట్లో గుకేశ్ సత్తా చాటే అవకాశాలున్నాయి. మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద కూడా ఈ టోర్నీలో ఆడుతున్నాడు. ఫాబియానో కరువానా, లెవోన్ అరోనియన్, సామ్ సావియాన్ (అమెరికా), మాక్జిమ్ లాగ్రెవ్, అలీ రెజా ఫిరౌజా (ఫ్రాన్స్), డుడా జాన్ (పోలెండ్), నాదిర్‌బెక్ అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్) ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. ప్రజ్ఞానంద, అరోనియన్, కరువానాల నుంచే గుకేశ్‌కు గట్టి పోటీ ఎదురు కానుంది. క్లాసికల్ చెస్‌కు ఇప్పటికే దూరమైన ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఈ టోర్నీలో ఆడట్లేదు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా అయిదో అంచె టోర్నీగా సింక్వెఫీల్డ్ కప్ జరుగుతోంది. ఈ టూర్ స్టాండింగ్స్‌లో గుకేశ్ (16) కన్నా ప్రజ్ఞానంద (20)నే ముందంజలో ఉన్నాడు. ప్రస్తుతం ప్రజ్ఞానంద అయిదు.. గుకేశ్ ఎనిమిదో స్థానాల్లో కొనసాగుతున్నారు. లాగ్రెవ్ (ఫ్రాన్స్, 28) అగ్రస్థానంలో ఉన్నాడు. అయిదు టోర్నీల తర్వాత టాప్-4లో నిలిచే క్రీడాకారులు సావోపాలోలో జరిగే ఫైనల్ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధిస్తారు.

శ్రేయస్, జితేశ్‌కు అవకాశం!


శ్రేయస్

ఆసియాకప్‌కు భారత జట్టు


జితేశ్

ముంబయి: ఆసియాకప్ టీ20 టోర్నమెంట్లో పాల్గొనే భారత జట్టులో శ్రేయస్ అయ్యర్, జితేశ్ శర్మ చోటు దక్కించుకునే అవకాశం ఉంది. ఈ కప్‌లో ఆడే జట్టును అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ మంగళవారం ఎంపిక చేయనుంది. గతేడాది జులైలో కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రేయస్, జితేశ్ టీ20 జట్టులోకి రాలేదు. డిసెంబర్ 2023లో శ్రేయస్ చివరిగా పొట్టి ఫార్మాట్లో కనబడగా.. గతేడాది జనవరిలో జితేశ్ ఆఖరిగా ఆడాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలవడంలో జితేశ్ కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో ధ్రువ్ జురెల్ స్థానంలో అతడు జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే సంజు శాంసన్ రూపంలో ప్రధాన వికెట్‌కీపర్ టీ20 జట్టులో ఉన్నాడు. పని భార నిర్వహణలో భాగంగా ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో మూడు టెస్టులే ఆడిన పేసర్ బుమ్రా ఆసియాకప్ జట్టుకు సెలక్టర్లు ఎంపిక చేస్తారా లేదా అన్నది ఆసక్తికరం. మహ్మద్ షమి గాయంతో అందుబాటులో లేకపోవడంతో ఒక పేసర్ స్థానం ఖాళీగానే ఉంది. అయితే ఫిట్‌నెస్‌ను అంచనా వేసిన తర్వాతే బుమ్రాపై సెలక్టర్లు నిర్ణయం ప్రకటించొచ్చు. ఐపీఎల్-18లో సత్తా చాటిన పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా రేసులో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అనూహ్యమైన ప్రదర్శన చేసిన శుభ్‌మన్ గిల్‌కు టీ20 జట్టులో స్థానం లభిస్తుందో లేదో స్పష్టత లేదు. ప్రస్తుత భారత జట్టు కూర్పులో గిల్‌తో పాటు ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు కూడా స్థానం కష్టమే. గంభీర్ కోచ్‌గా ఎంపికైన తర్వాత 15 టీ20ల్లో 13 గెలిచిన భారత జట్టునే ఆసియాకప్‌నకు కూడా కొనసాగించొచ్చని సమాచారం. ఆసియాకప్ ముగిసిన వెంటనే స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఉండడంతో గిల్, జైస్వాల్‌లను ఎర్రబంతి క్రికెట్‌పైనే దృష్టి సారించాలని బోర్డు కోరినట్లు సమాచారం. సెప్టెంబర్ 28న ఆసియాకప్ ఫైనల్ ఉండగా.. వెస్టిండీస్‌తో తొలి టెస్టు అక్టోబర్ 2న మొదలు కానుంది.

ఛెత్రి ఎందుకు లేడంటే..


ఖాలిద్ జమీల్

బెంగళూరు: నేషన్స్ కప్ జాతీయ శిబిరానికి స్టార్ స్ట్రైకర్ సునీల్ ఛెత్రిని ఎంపిక చేయకపోవడంపై భారత ప్రధాన కోచ్ ఖాలిద్ జమీల్ వివరణ ఇచ్చాడు. కీలకమైన ఆసియాకప్‌నకు నేషన్స్ కప్ సన్నాహక టోర్నీ మాత్రమేనని అన్నాడు. కోచ్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జమీల్ శుక్రవారం నేషన్స్ కప్ కోసం 35 మంది ప్రాబబుల్స్‌ను ప్రకటించాడు. ఇందులో ఛెత్రి లేడు. అయితే సింగపూర్ (అక్టోబరు 9, 14)తో ఆసియాకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల కోసం ఛెత్రి జట్టులోకి రావొచ్చని జమీల్ అన్నాడు. "ఆసియాకప్ క్వాలిఫయర్స్‌కు నేషన్స్ కప్ సన్నాహక టోర్నీ మాత్రమే. అందుకే ఛెత్రిని శిబిరంలోకి తీసుకోలేదు. ఇతర ఆటగాళ్లను కూడా ఆడించి చూడాలనుకుంటున్నా. దీని గురించి ఛెత్రితో మాట్లాడాను. అతడిలాంటి ఆటగాడు జట్టులో ఉండడం ఎప్పుడైనా సంతోషాన్నిచ్చే విషయమే. ఛెత్రికి తలుపు ఎప్పుడూ తెరిచే ఉంటుంది. అతడు భారత ఫుట్‌బాల్‌లో దిగ్గజం. నా ఫేవరెట్ ఆటగాళ్లలో ఒకడు. భారత ఫుట్‌బాల్‌కు అతడు ఆదర్శం" అని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) విడుదల చేసిన ప్రకటనలో జమీల్ పేర్కొన్నాడు. నేషన్స్ కప్‌లో గ్రూప్-బిలో ఉన్న భారత్.. ఈ నెల 29న తజికిస్థాన్‌తో తలపడుతుంది. సెప్టెంబరు 1న ఇరాన్‌తో, సెప్టెంబరు 4న అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడుతుంది.

ఆసీస్‌కు ఊరట విజయం


అలీసా హీలీ 137 నాటౌట్

బ్రిస్బేన్: ఇండియా-ఎ మహిళలతో వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా-ఎ జట్టుకు ఊరట విజయం దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్ 2-0తో ఇప్పటికే ఇండియా-ఎ సొంతమవగా.. నామమాత్రమైన చివరి పోరులో ఆసీస్-ఎ 9 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆదివారం టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇండియా-ఎ 47.4 ఓవర్లలో 216 పరుగులకు ఆలౌటైంది. సియానా జింజర్ (2/50), తాలియా మెక్‌గ్రాత్ (3/40), ఎల్లా హేవార్డ్ (2/43), అనిక లియరాడ్ (2/16) విజృంభించి ఇండియా-ఎను కట్టడి చేశారు. ఇండియా-ఎ జట్టులో షెఫాలి వర్మ (52; 59 బంతుల్లో 7×4), యాస్తిక భాటియా (42; 54 బంతుల్లో 5×4) మాత్రమే చెప్పుకోదగ్గ పరుగులు సాధించారు. అనంతరం అలీసా హీలీ (137 నాటౌట్; 85 బంతుల్లో 23×4, 3×6) అజేయ సెంచరీతో సత్తాచాటడంతో ఆసీస్-ఎ ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి, 22.1 ఓవర్లు మిగిలివుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. తాలియా విల్సన్ (59; 51 బంతుల్లో 8×4) కూడా రాణించింది.

స్పిన్‌కు ఎదురొడ్డి నిలిస్తేనే..: భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యం ఇచ్చే వన్డే ప్రపంచకప్‌లో గెలవాలంటే స్పిన్‌కు ఎదురొడ్డి నిలవాల్సిందేనని ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ అలీసా హీలీ అభిప్రాయపడింది. సెప్టెంబర్ 30న ఆరంభమయ్యే టోర్నీలో ఎనిమిదోసారి విజేతగా నిలవాలనే లక్ష్యంతో ఆసీస్ బరిలో దిగుతున్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. "తాజాగా మా సొంతగడ్డపై భారత్-ఎ స్పిన్ బౌలర్లను ఎదుర్కోవడంలో ఆసీస్ బ్యాటర్లు తడబడ్డారు. వచ్చే నెల మొదలయ్యే ప్రపంచకప్‌లోనూ కంగారూ జట్టు స్పిన్‌కు ఎదురొడ్డి నిలవక తప్పదు. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో రెండు ఎండ్‌ల నుంచి స్పిన్నర్లనే ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని అలీసా తెలిపింది. 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన చివరి వన్డే ప్రపంచకప్‌లో ఆసీస్ విజేతగా నిలిచింది. వచ్చే నెల 30న భారత్ వేదికగా మొదలయ్యే 2025 ప్రపంచకప్‌ను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఆ జట్టు ఉంది. 1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022 ప్రపంచకప్‌ల్లోనూ ఆస్ట్రేలియా టైటిల్ సాధించింది.

యుఎస్ ఓపెన్‌లో మాయ


మాయ

దిల్లీ: భారత యువ టెన్నిస్ సంచలనం మాయ రాజేశ్వరన్ జూనియర్ గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేయనుంది. 2025 యుఎస్ ఓపెన్ బాలికల సింగిల్స్‌లో ఆమె బరిలోకి దిగనుంది. 16 ఏళ్ల మాయ.. జూనియర్ బాలికల ర్యాంకింగ్స్‌లో 55వ స్థానంలో ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముంబయిలో జరిగిన డబ్ల్యూటీఏ ఈవెంట్లో సెమీఫైనల్ చేరడం ద్వారా ఆమె వెలుగులోకి వచ్చింది. యుఎస్ ఓపెన్‌లో భారత్ తరఫున క్రిష్ త్యాగి కూడా ఆడుతున్నాడు. భారత్‌లో ప్రస్తుతం అత్యుత్తమ ర్యాంకు జూనియర్ టెన్నిస్ ప్లేయర్ అతడే. బాలుర ర్యాంకింగ్స్‌లో 47వ స్థానంలో ఉన్నాడు. మరోవైపు హితేశ్ చౌహాన్, అర్జున్ రాఠి, రెథిన్ ప్రణవ్ సెంథిల్ కుమార్, అర్ణవ్ బాలుర అర్హత రౌండ్లో పోటీపడనున్నారు.

బుమ్రా కోహినూర్ వజ్రం


ఆకాశ్ చోప్రా

దిల్లీ: టెస్టు సిరీస్‌ల్లో అన్ని మ్యాచ్‌లు ఆడలేకపోతే జస్‌ప్రీత్ బుమ్రాను మొదటి ప్రాధాన్య ఎంపికగా పరిగణించొద్దన్న సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యల్ని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా తప్పుబట్టాడు. ఇంగ్లాండ్‌తో అండర్సన్- తెందుల్కర్ ట్రోఫీలో బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడాడు. గతంలో బుమ్రా కెప్టెన్సీ అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన మంజ్రేకర్.. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత పేసర్ మ్యాచ్‌లను ఎంచుకుని ఆడడంపై విమర్శలు గుప్పించాడు. భారత్ గెలిచిన రెండు టెస్టుల్లోనూ బుమ్రా ఆడలేదని గుర్తుచేశాడు. "నిజాయతీగా చెప్పాలంటే బుమ్రా అన్ని టెస్టులు ఆడతాడని అనుకోవట్లేదు. ఎంపిక చేసుకున్న మ్యాచ్‌ల్లోనే అతను బరిలో దిగొచ్చు. అది సరైనదా? కాదా? లేదా నైతికమా? అనైతికమా? అన్నది చర్చ కాదు. బుమ్రా లాంటి ఆటగాడు అందుబాటులో ఉన్నప్పుడు అతడికి వీలైనప్పుడే ఆడించండి. బుమ్రాతో బౌలింగ్ కూర్పును సులువుగా సర్దుబాటు చేసుకోవచ్చు. ఒకవేళ బుమ్రా బ్యాటర్ అయ్యుండి.. ఓపెనర్‌గా లేదా నాలుగో నంబరులో ఆడుతూ.. రెండు మ్యాచ్‌ల్లోనే అందుబాటులో ఉంటానంటే అప్పుడు సమస్య అవుతుంది. బౌలర్ల విషయంలో అలాంటి ఇబ్బందేమీ ఉండదు. మూడు లేదా నాలుగు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో బౌలర్లను మారుస్తూ ఉండాలి. బుమ్రా లాంటి బౌలర్ మరొకరు లేరు. అతను 24 క్యారెట్ల బంగారం.. కోహినూర్ వజ్రం. బుమ్రాను ముందస్తు రిటైర్మెంట్ వైపు బలవంతంగా నెట్టొద్దు. అతను ఎంత సుదీర్ఘ కాలం ఆడితే అంతగా రాటుదేలుతాడు" అని చోప్రా పేర్కొన్నాడు.

బాబర్, రిజ్వాన్‌లకు నిరాశ

ఆసియా కప్ జట్టులో చోటు గల్లంతు


రిజ్వాన్, బాబర్

లాహోర్: పాకిస్థాన్ సీనియర్ బ్యాటర్లు బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్‌లకు నిరాశ ఎదురైంది. ఆసియా కప్, ముక్కోణపు సిరీస్‌ల కోసం ఎంపిక చేసిన పాకిస్థాన్ టీ20 జట్టులో బాబర్, రిజ్వాన్‌లకు చోటు దక్కలేదు. రెండు టోర్నీల కోసం 17 మందితో కూడిన పాక్ జట్టును పీసీబీ ఆదివారం ప్రకటించింది. సెప్టెంబరు 9న యూఏఈలో ఆసియా కప్ (టీ20) ప్రారంభంకానుంది. ఆసియా కప్‌కు సన్నాహకంగా ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 7 వరకు షార్జాలో అఫ్గానిస్థాన్, యూఏఈలతో జరిగే ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాక్ బరిలో దిగనుంది. 2021 పొట్టి కప్పులో భారత్‌పై జట్టును గెలిపించిన ఘనత బాబర్, రిజ్వాన్ సొంతం. ఏ ప్రపంచకప్‌లో అయినా భారత్‌పై పాక్‌కు అదే తొలి విజయం. అయితే గత కొంతకాలంగా వీళ్లిద్దరూ పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉన్నారు. 2024 డిసెంబరులో చివరిసారిగా వీరిద్దరు టీ20ల్లో ఆడారు. ఆసియా కప్ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీతో ఈ ఇద్దరూ పునరాగమనం చేస్తారని వారి అభిమానులు ఆశించారు. కానీ వీరికి పాక్ సెలక్టర్లు మొండిచేయి చూపించారు. బ్యాటింగ్‌కు సంబంధించిన కొన్ని అంశాల్లో మెరుగవ్వాల్సిందిగా బాబర్‌ను కోరినట్లు పాక్ చీఫ్ కోచ్ మైక్ హెసన్ తెలిపాడు. **పాక్ జట్టు:** సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రవూఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుసేన్ తలత్, ఖుష్‌దిల్ షా, మహ్మద్ హారిస్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయిమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షహీన్ షా అఫ్రిది, సుఫియాన్ మొకిమ్

చంద్రగిరి.. చారిత్రక సిరి!



రాజామహల్

ఓ దేశం గొప్పతనం.. జాతి సంస్కృతిని చాటి చెప్పడంలో అలనాటి కోటలు, సంపద కీలకభూమిక పోషిస్తాయి. వీటి ద్వారా ఆయా ప్రాంతాల చారిత్రక వైభవాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేయవచ్చు. అలాంటిదే తిరుపతి జిల్లాలోని చంద్రగిరి కోట. అబ్బురపరిచే కొండల నడుమ 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోటకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడి ఓ ఎత్తయిన కొండపై చంద్రుడు తపమాచరించి, శివుడిని ప్రసన్నం చేసుకొని వరాలు పొందడంతో దానికి 'చంద్రగిరి'గా పేరొచ్చిందని పురాణ గాథ ప్రచారంలో ఉంది. క్రీ.శ 1000లో చంద్రగిరికి సమీపంలోని నారాయణవనాన్ని పరిపాలించిన ఇమ్మడి యాదవ నరసింహరాయలు ఈ కోటను నిర్మించారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా.. దుర్గం, రాజప్రాసాదాలు, దేవాలయాలు, తటాకాలు, శిలా మండపాలు, బురుజులు, ప్రాకారం, తోరణాలతో విజయనగర సామ్రాజ్యంలో మూడో రాజధానిగా విరాజిల్లింది. 1565లో జరిగిన రాకాసి తంగడి (తళ్లికోట) యుద్ధం, విజయనగర రాజుల పాలనతోపాటు పలు చారిత్రక ఘటనలకు ఇది సాక్ష్యం.



రాణీమహల్



మ్యూజియంలో సందర్శకులు

భవన నిర్మాణ నైపుణ్యాలు

- ఇక్కడి నిర్మాణాలు హంపిలోని వారసత్వ కట్టడ సముదాయాల్లో చేరిన రాణివాసపు 'కమల భవన' శైలిలో ఉంటాయి.
- రెండు ఎత్తయిన రాజ ప్రాసాదాలు..'రాజామహల్', 'రాణీమహల్' నేటికీ ఠీవిగా నిలిచాయి.
- రాజామహల్ పెద్దది, గంభీరమైంది. రాణీమహల్ చిన్నది, మనోహరమైంది.
- రాజామహల్‌లో విశాలమైన 'గవాక్ష మందిరాలు', పైభాగం విమానశైలిలో గోపురాలతో అలంకరించారు.
- ఇందులో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అందమైన ఆర్చీలు, చోళ, విజయనగర సామ్రాజ్యకాలం నాటి ఆధ్యాత్మిక సంపద, యుద్ధ పరికరాలున్నాయి.
- రెండో అంతస్తులో చంద్రగిరి, గుడిమల్లం నమూనా ఆలయం. దస్తావేజులు, ఖజానా రసీదులు, నాణేలు, భూతద్దాలు.. శ్రీమహావిష్ణువు రాజశిల్పాలు, శ్రీకృష్ణదేవరాయలు, వెంకటపతిరాయలు, అచ్యుతరాయల కంచు, శిలాప్రతిమలు దర్బారు హాలులో ప్రదర్శించారు.
- మూడో అంతస్తులో.. శైవ, వైష్ణవ, జైనమతాలకు చెందిన దేవతా ప్రతిమలున్నాయి.

చూడాలని ఉందా..!

శుక్రవారం తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య వెళ్తే.. మ్యూజియం కూడా చూడొచ్చు.

- ఈనాడు డిజిటల్, తిరుపతి

అందం ఆపద కాకుండా..!

అందం కోసం పార్లర్‌కు వెళతాం. హెయిర్ వాష్, ఫేషియల్, మేకప్- ఇవన్నీ నూతనోత్సాహాన్ని నింపుతాయి! కానీ, మనకు అక్కడో ప్రమాదం పొంచి ఉందని తెలుసా?



- హైదరాబాద్‌కు చెందిన 50ఏళ్ల మహిళ ఇటీవల హెయిర్‌కట్ కోసం సెలూన్‌కు వెళ్లారు. హెయిర్ వాష్ చేసే క్రమంలో స్ట్రోక్ వచ్చింది.
- నిజామాబాద్‌కు చెందిన మానస ఐబ్రో థ్రెడింగ్ చేసుకునే క్రమంలో ఇబ్బందికర భంగిమలో ఎక్కువ సేపు మెడను వంచి ఉంచడంతో ఆ ప్రాంతంలో వాపు వచ్చింది.

అందంగా కనిపించేందుకు బ్యూటీపార్లర్లకు వెళ్లి.. అక్కడి నుంచి కొత్త సమస్యలను వెంటబెట్టుకుని ఆసుపత్రుల పాలవుతోన్న వారి సంఖ్య ఇప్పుడు పెరుగుతోంది. తలతిరగడం, మోకాళ్లు పట్టేయడం, స్పృహ కోల్పోవడం నుంచి పక్షవాతం, 'బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్ (బీపీఎస్ఎస్)' వరకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

లక్షణాలు

➤ తీవ్ర తలనొప్పి ➤ తల తిరగడం. ➤ మాట్లాడడంలో ఇబ్బంది ➤ చూపు కనిపించకపోవడం లేదా ఒకరు ఇద్దరుగా కనిపించడం ➤ పరెస్థెసియాస్ - సగం శరీరంలో తిమ్మిర్లు రావడం. ➤ పక్షవాతం, స్పృహ కోల్పోవడం. ➤ శ్వాసకోశ సమస్య ➤ మెడ ప్రాంతంలో వాపు

జాగ్రత్తలు

- హెయిర్ వాష్ చేస్తున్నప్పుడు మెడకు సరైన సపోర్టు ఇవ్వాలి.
- మెడను ఎక్కువగా వెనక్కి వంచొద్దు.
- అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే ఆపేయమని చెప్పాలి.
- బ్యూటీ ప్రొఫెషనల్స్‌కు ఈ స్ట్రోక్‌పై అవగాహన ఉందా లేదా అనేది తెలుసుకోవాలి.
- ఒత్తిడి లేకుండా ఉండేందుకు మెడకింద ఓ మెత్తని వస్త్రం పెట్టుకోవడం మంచిది.

బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్ అంటే...

- మెదడు రక్తనాళాలపై ఒత్తిడి లేదా గాయం వల్ల వచ్చే స్ట్రోక్ ఇది. ముఖ్యంగా మన మెడను వెనక్కు వంచి బేసిన్‌పై ఉంచినప్పుడు మెడ దగ్గరున్న వెర్టిబ్రల్ ఆర్టరీ అనే రక్తనాళం నొక్కుకుపోతుంది.
- కొన్నిసార్లు వెర్టిబ్రల్ ఆర్టరీల గోడల్లో చీలిక వస్తుంది. దీనివల్ల రక్తప్రసరణలో అంతరాయం ఏర్పడి కొన్నిసార్లు స్ట్రోక్‌కు దారితీస్తుంది.
- బీపీఎస్ఎస్ చాలా అరుదుగా సంభవించినప్పటికీ..వస్తే మాత్రం తీవ్రంగా ఉంటుంది.

చికిత్స

- బ్రెయిన్ సీటీ/ఎంఆర్ఐ చేయడం ద్వారా గుర్తిస్తారు. ఒక్కోసారి ఖరారు చేసుకునేందుకు ఎంఆర్ యాంజియోగ్రఫీ చేస్తుంటారు.
- వెర్టిబ్రల్ ఆర్టరీల స్థితిని డాప్లర్ పరీక్ష ద్వారా కూడా గుర్తిస్తారు.
- మెదడుకు రక్త సరఫరా తగ్గడం లేదా ఇస్కీమియా వల్ల కలిగే ఇతర స్ట్రోక్‌ల మాదిరిగానే బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్‌కీ చికిత్స చేస్తారు. ఒక్కోసారి ఆపరేషన్ చేయాల్సి వస్తుంది.

వీరికి ఎక్కువగా..!

92శాతం మందికి తలనొప్పి లక్షణంతోనే సిండ్రోమ్ మొదలవుతుంది. 'అథెరోస్క్లెరోసిస్' అంటే రక్తనాళాల్లో కొవ్వు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడం వంటి జబ్బు ఉన్నవారికి బ్యూటీ పార్లర్ స్ట్రోక్ సిండ్రోమ్ వచ్చే అవకాశం ఎక్కువ. పొగతాగేవారు, రక్తపోటు, మధుమేహం, ఒబెసిటీ, లిపిడ్ స్థాయిలు ఎక్కువున్నవారు, ఎప్పుడూ కూర్చుని పనిచేసేవారు, వివిధ రకాల హృదయ సంబంధిత రుగ్మతలున్నవారు, కరోనరి ఆర్టరీ డిసీజ్ (గుండెకు రక్తాన్ని తీసుకువెళ్లే రక్తనాళాల సమస్య), హైపర్-కాగులబుల్ స్టేట్(రక్తం ఎక్కువగా గడ్డ కట్టడం) వంటి సమస్యలున్నవారికి ఈ సిండ్రోమ్‌తో రిస్క్ ఎక్కువ.

–డాక్టర్ జి.ఎవాంజిలిన్ బ్లెస్సీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్, విజయవాడ

- ఈనాడు, అమరావతి

పుట్టిన ఊరికి గట్టి మేలు తలపెట్టి..





నామాల పురుషోత్తమరావు, అనంత లక్ష్మీకుమారి దంపతులు

పుట్టి పెరిగిన గ్రామం రుణం తీర్చుకోవడానికి రూ.కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన నామాల పురుషోత్తమరావు. ఏడిదలో జన్మించి, అక్కడే చదివిన ఆయన.. పోరస్ ఫార్మా ఇండస్ట్రీస్ స్థాపించి అనేక మందికి ఉపాధి చూపారు. హైదరాబాద్‌లో స్థిరపడిన పురుషోత్తమరావు స్వస్థలంలో ఏ చిన్న సమస్య వచ్చినా ముందుకొచ్చి పరిష్కారం చూపుతున్నారు. గ్రామంలో రూ.5 కోట్లతో పార్కు నిర్మించారు. ఏడిదలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ భవనాన్ని రూ.2.50 కోట్లతో నిర్మించారు. కళాశాలకు ల్యాబ్, గ్రామంలో కచేరి చావడి, కంటి ఆసుపత్రి, రూ.90 లక్షలతో గ్రంథాలయానికి మూడు అంతస్తుల భవనం నిర్మించారు. ఉన్నత పాఠశాల మార్గంలో రూ.20 లక్షలతో సీసీ రహదారి నిర్మించారు. ఏటా టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నారు.

–న్యూస్‌టుడే, ద్వారపూడి



మరమ్మతు కంటే నిర్వహణే చవక

యంత్రం.. ఇల్లు.. బంధం..
ఇలా దేని విషయంలోనైనాసరే ఎప్పుడూ మరమ్మతు (రిపేర్) కంటే నిర్వహణే (మెయింటెనెన్స్) చవక! నిర్వహణ సరిగా లేనిదాన్ని త్వరగా కోల్పోక తప్పదు.
మానవ దేహం కూడా ఇందుకు మినహాయింపేమీ కాదు.
వ్యాయామం, పోషకాహారం మీ శరీర నిర్వహణకు తోడ్పడతాయి.
– శ్రద్ధే కటియార్, వైద్యుడు

ఎక్కడున్నా సరే.. నచ్చింది చదువుకో..



ఉద్యాన వర్సిటీలోని గ్రంథాలయం

ఆర్‌ఎఫ్‌ఐడీ యంత్ర పరికరం

విజ్ఞానశాస్త్ర గ్రంథాలను విద్యార్థులకు అందించే క్రమంలో సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ముందడుగేసింది. వర్సిటీలో ఉన్న పుస్తకాలే కాకుండా ఆన్‌లైన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఉద్యానశాస్త్ర విశేషాలన్నీ తెలుసుకునేలా ఈ-గ్రంథాలయాన్ని నెలకొల్పింది. విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడున్నా వీటిని చదువుకోవచ్చు. ప్రముఖ శాస్త్రవేత్తల పరిశోధనలు-ఫలితాలు, వారి విజయాల వంటివి తెలుసుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా 50 కంప్యూటర్లు ఏర్పాటు చేసి.. వైఫై సౌకర్యం కల్పించారు. విద్యార్థుల కోసం 'మై లాఫ్ట్' పేరిట మొబైల్ యాప్‌ను కూడా రూపొందించారు. విద్యార్థులు పేరు, ఐడీ నంబరు, ఈ-మెయిల్ ద్వారా నమోదు చేసుకుంటే జీవితకాలం ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఆయా పుస్తకాలు, పరిశోధన పత్రాల వంటివాటిని మొబైల్ ఫోన్‌లోనే చదువుకోవచ్చు. వాట్సప్ ద్వారా ఇతరులకు పంపవచ్చు. ప్రింట్ సైతం తీసుకోవచ్చు.

యంత్రసాయంతో పుస్తకాల పంపిణీ

ఈ-గ్రంథాలయంలో భాగంగా వర్సిటీలోని పుస్తకాల పంపిణీకి ప్రత్యేకంగా ఆర్‌ఎఫ్‌ఐడీ అనే కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారానే పుస్తకాలు తీసుకోవాల్సి ఉంటుంది. కోహ అనే లైబ్రరీ సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ముందుగా విద్యార్థులు ఈ-మెయిల్, సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా నమోదు చేసుకుంటే, ఓ కార్డు ఇస్తారు. ఏటీఎంలా.. విద్యార్థులు ఆ కార్డును యంత్రంలో పెడితే వివిధ కేటగిరీలు వస్తాయి. అందులోంచి తమకు కావాల్సిన పుస్తకాన్ని ఎంచుకుంటే అది గ్రంథాలయంలోని ఏ ప్రదేశంలో ఉందో తెలిసిపోతుంది. విద్యార్థి నేరుగా అక్కడికి వెళ్లి సులభంగా తీసుకోవచ్చు. నిర్వాహకులు ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్, వెజిటబుల్స్, ల్యాండ్ స్కేపింగ్, మెడిసినల్ ప్లాంట్స్.. ఇలా పలు రకాలుగా పుస్తకాలను విభజించారు. విశ్వవిద్యాలయం క్యాంపస్‌తోపాటు.. దీని పరిధిలోని ఏడు కాలేజీల్లో చదువుతున్న సుమారు 1200 విద్యార్థులకు ఈ-గ్రంథాలయాన్ని వినియోగించుకోవచ్చు.

–న్యూస్‌టుడే, ములుగు

శ్రీరామ్మూర్తి రూటే సెపరేటు!



అరవై ఏళ్లు వస్తే చాలు.. జీవితం అయిపోయిందని కొందరు భావిస్తుంటారు. ఇంటికే పరిమితమై కాలక్షేపం చేస్తుంటారు. కానీ, ఏలూరు జిల్లా కేంద్రానికి చెందిన మాజేటి శ్రీరామ్మూర్తి మాత్రం 77 ఏళ్ల వయసులోనూ వందల కిలోమీటర్ల దూరంలోని పుణ్యక్షేత్రాలను సైకిల్‌పై వెళ్లి దర్శించుకుంటున్నారు. స్థానికంగా కిరాణా దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న ఆయనకు బాల్యం నుంచే సైకిల్ తొక్కడమంటే ఇష్టం. దీన్ని అలవాటుగా చేసుకున్న శ్రీరామ్మూర్తి.. సైకిల్‌పై ఒంటరిగా తీర్థయాత్రలకు వెళ్లాలని తన 28వ ఏట నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్లకోసారి సైకిల్‌పైనే వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారు. ఇప్పటివరకు శిర్డీ, నాసిక్, త్రయంబకేశ్వర్, కాశీ, తిరుపతి, శ్రీశైలం, భద్రాచలం, అన్నవరం, ఉజ్జయిని, సోమ్‌నాథ్, బద్రీనాథ్, కేదార్‌నాథ్ తదితర క్షేత్రాలను దర్శించుకున్నారు. మరో మూడు నెలల్లో అయోధ్య వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 'నాకు నాలుగు భాషలు వచ్చు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సాయం తీసుకుంటాను. నా పర్యటనలకు దుకాణ యజమానితో పాటు కొంతమంది మిత్రులు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు' అని శ్రీరామ్మూర్తి చెబుతున్నారు. – న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

8 ఏళ్లు రాని మాటలు.. 8 వారాల్లో వచ్చాయ్



బాలుడు అక్షయ్‌తో డాక్టర్ సౌరభ్

జమ్మూ డివిజనులోని కఠువా జిల్లా బధోడీ దుగ్గన్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అక్షయ్‌శర్మకు పుట్టుకతో మాటల్లేవు. కూలీలుగా పనిచేస్తున్న తల్లిదండ్రులు తమ స్తోమత మేరకు వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. ఇక తమ కుమారుడి నోట మాట వినలేమని కుమిలిపోయారు. ఇంతలో ఓ అద్భుతం జరిగి బాలుడు మాట్లాడటం మొదలుపెట్టాడు. అక్షయ్‌కు పుట్టుకతోనే చీలిక అంగిలి సమస్య ఉంది. ఈ బాలుడి గురించి ఆర్మీ డాక్టర్ సౌరభ్ సలూంఖేకు ఓ అధికారి చెప్పారు. ఈ కేసును సవాలుగా తీసుకొన్న సౌరభ్ స్పీచ్ థెరపీ ప్రారంభించారు. 8 వారాలపాటు నిత్యం రెండు మూడు గంటలు అక్షయ్‌కు శిక్షణ ఇచ్చారు. చిన్న చిన్న నోటి వ్యాయామాలతో మొదలుపెట్టి ముక్కు ద్వారా, నోటితో, పెదవి సాయంతో, అంగిలితో పలికే శబ్దాలను చెబుతూ వచ్చారు. సౌరభ్ కృషి ఫలించి అక్షయ్ మాటలు తొలిసారిగా విన్న తల్లిదండ్రులు ఉద్వేగానికి గురై వైద్యుడికి ధన్యవాదాలు తెలిపారు. –జమ్మూ

చిట్టి దూడలు.. బుజ్జి ఆవులు..

అడుగు.. అడుగున్నర ఎత్తు.. ఇంచుమించు అంతే పొడవులో పుడతాయి.. ఎదిగిన తర్వాత కూడా రెండున్నర మూడు అడుగులకు మించని ఎత్తుతో చెంగుచెంగున దూకే బుజ్జిబుజ్జి ఆవులవి. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు ఈ చిట్టి గోవులకు ప్రసిద్ధి. వీటి సంతతి క్రమేణా తగ్గిపోతున్న క్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరిలోని కోనసీమ ప్రాంతం వీటిని అక్కున చేర్చుకుంది. ఇక్కడి పలువురు ఉన్నత విద్యావంతులు, యువకులు పుంగనూరు ఆవులు, దూడల పెంపకం కోసం ప్రత్యేక క్షేత్రాలను ఏర్పాటు చేశారు. మాచవరం, కేశనపల్లి, కె.పెదపూడి, తూర్పుపాలెం, బండారులంక, సమనస, అమలాపురం, గుమ్మిలేరు.. ఇలా సుమారు 25 ప్రాంతాల్లో వీటి పెంపకం కొనసాగుతోంది. ఈ జాతి దూడ ధర రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతుండడం విశేషం. అమలాపురం గ్రామీణ మండలం సమనస గ్రామానికి చెందిన మంచిగంటి మణికంఠ రెండేళ్ల కిందట పుంగనూరు నుంచి నాణ్యమైన ఆవులు, గిత్తలను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారు. పోషణ ఖర్చు పెద్దగా ఉండదని, వాటిపై మక్కువతో పెంచుతున్నామని ఆయన చెప్పారు.

–న్యూస్‌టుడే, అంబాజీపేట



మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన అడబాల లక్ష్మీనారాయణ ఇంజినీరింగ్ చదివారు. ఈయనకు పుంగనూరు జాతి ఆవులు, దూడలు అంటే మహా ఇష్టం. వీటి అభివృద్ధికి నడుం కట్టారు. ఆయన దగ్గర ఆరు ఆవులు, ఆరు దూడలు ఉన్నాయి. వీటిని ఇంకా అభివృద్ధి చేసేందుకు బ్రీడింగ్ ఫామ్ ఏర్పాటు చేశారు.



మాచవరానికి చెందిన వెంకటేశ్వరరావు మినీ పుంగనూరు జాతికి చెందిన దూడలను పోషిస్తున్నారు. ఈయన దగ్గర ఉన్నవి బాగా చిన్నవి. అడుగున్నర పరిమాణంలో ఉన్నాయి.



అంబాజీపేట మండలం కె.పెదపూడికి చెందిన నాగళ్ల సతీష్ ప్రత్యేకంగా గోశాల నిర్మించారు. ఈయన వద్ద ఉన్న ఆవుకు ఇటీవల 16 అంగుళాల దూడ జన్మించింది.

బి ఫర్ బ్యాగ్.. సి ఫర్ క్యాట్!





ఈ యువకుడి వీపున ఉన్న బ్యాగు చూడండి.. అదేదో బ్యాగుపై పిల్లుల బొమ్మలున్నాయి అనుకుంటున్నారా.. అవి బొమ్మలు కాదు.. నిజంగా పిల్లులే. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఉస్మాన్ హైదరాబాద్‌లోని బాలానగర్‌లో సివిల్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. బేగంపేటలో నివసించే ఈయన.. రియాన్, ఇష అనే పేర్లతో ముద్దుగా పిలుచుకునే ఆరెంజ్ పర్షియన్, హిమాలయన్ పర్షియన్ రకానికి చెందిన ఆడ, మగ పిల్లులను పెంచుతున్నారు. వాటిని ఆదివారం ఇలా బ్యాగులో పెట్టుకుని సరదాగా షికారుకు తీసుకెళ్లారు. తెనాలిలోని తమ ఇంట్లో 12 పిల్లులను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

–ఈనాడు, హైదరాబాద్

మణిపుర్ కొండల్లో 'సూర్య'కాంతులు



సేథ్ మొయిరంగ్‌థెమ్

ఇంఫాల్: మణిపుర్‌లోని మారుమూల ప్రాంతాలవి. సూర్యుడు కొండల వెనక్కి జారుకోగానే గ్రామాల్లో చీకట్లు అలముకునేవి. గృహిణులు ఆ లోగానే ఇంటి పనులు ముగించుకునేవారు. చిన్న పిల్లలు కిరోసిన్ దీపాల వెలుతురులో చదువుకునేందుకు ఇబ్బంది పడేవారు. అత్యవసర కేసులకు హాజరయ్యేందుకు ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు డీజిల్ జనరేటర్లపై ఆధారపడేవారు. క్రమక్రమంగా ఇదంతా చరిత్రగా మారుతోంది. ఇటీవల కాలంలో సౌర దీపాలు ప్రకాశిస్తూ ఇక్కడి వారి జీవితాల్లో సరికొత్త కాంతులు నింపుతున్నాయి. దీనంతటికీ కారణంగా తూర్పు ఇంఫాల్ జిల్లాకు చెందిన సేథ్ మొయిరంగ్‌థెమ్ అనే 38 ఏళ్ల యువకుడు. ఆయన స్థాపించిన 'ఎస్ఎన్ఎల్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్' అనే అంకుర పరిశ్రమ ఈ రాష్ట్రంలోని మారుమూల కొండల్లో విస్తరించిన గ్రామాల్లో, బిష్ణుపుర్ జిల్లాలోనివారికి చౌకగా సౌర విద్యుత్తు సౌకర్యం సమకూర్చుతోంది. విద్యుత్తు లేకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులే తనను ప్రేరేపించాయని ఈ యువకుడు చెబుతారు.

ప్రజా జీవితాల్లో మార్పు

సౌర విద్యుత్తు కారణంగా తమ జీవితాల్లో గణనీయమైన మార్పు చోటు చేసుకుందని మారుమూల గ్రామాల్లోని వారు చెబుతున్నారు. ప్రత్యేకంగా మహిళలకు సరికొత్త అవకాశాలు లభిస్తున్నాయి. సౌర విద్యుత్తుతో వారు పొద్దుపోయాక కూడా మెషీన్లపై వస్త్రాలు కుడుతున్నారు. మరమగ్గాలు నడుపుతున్నారు. "గతంలో మేం డీజిల్ జనరేటర్లను వినియోగించేవాళ్లం. వాటి ఏర్పాటు, నిర్వహణ చాలా ఖర్చుతో కూడుకున్నది. ధ్వని భరించలేకపోయేవాళ్లం. ఇప్పుడు సౌర విద్యుత్తుతో రోగులకు చక్కని సేవలు అందించగలుగుతున్నాం" అని ఉఖ్రుల్‌లో ఆరోగ్య కార్యకర్త తెలిపారు.

కుక్కలకు క్యూఆర్ కోడ్



హిమాచల్ ప్రదేశ్‌లోని శిమ్లా మున్సిపల్ కార్పొరేషన్ నగరంలోని అన్ని వీధికుక్కలకు క్యూఆర్ కోడ్, జీపీఎస్ అమర్చాలని తీర్మానించింది. దిల్లీలోని వీధికుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో శిమ్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. కుక్కల మెడలో క్యూఆర్ కోడ్, జీపీఎస్ వంటి స్మార్ట్ ట్యాగ్‌లను అమర్చనున్నారు. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వివరాలు, ఆరోగ్య పరిస్థితి, వయసు వంటి సమాచారం అందులో పొందుపరుస్తారు. కోడ్‌ను స్కాన్ చేసి ఈ వివరాలు తెలుసుకోవచ్చు. జీపీఎస్ సహాయంతో కుక్కల లొకేషన్‌పై నిఘా పెట్టవచ్చు. –ఈటీవీ భారత్



క్వీనీ విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌లను సత్కరించి చెక్కు అందజేస్తున్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అంతర్జాతీయ స్విమ్మింగ్‌లో రాణిస్తున్న తల్లీకుమారులకు సత్కారం

తాడేపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ స్విమ్మర్లైన తల్లీకుమారులు క్వీనీ విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌లను ఆదివారం గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ గోకరాజు గంగరాజు ఆదేశాలతో సంఘం ప్రతినిధులు సత్కరించారు. త్వరలో అమెరికాలో నిర్వహించే పోటీలకు వెళ్తున్న వారికి రూ.25,116 చెక్కు అందజేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగిపల్లి రామకృష్ణ, యార్లగడ్డ వెంకట రమేష్‌కుమార్‌లు మాట్లాడుతూ.. కుమారుడికి ఈతలో శిక్షణ ఇప్పిస్తూ.. ఆమె కూడా ఆసక్తితో నేర్చుకొని పలు రికార్డులు సొంతం చేసుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు గోపాలం సాంబశివరావు, సహాయ కార్యదర్శి రామిరెడ్డి, కోశాధికారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 15 నాటికి బీటెక్ తొలి ఏడాది తరగతులు

అకడమిక్ క్యాలెండర్‌ను సవరించిన ఏఐసీటీఈ

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రస్తుత విద్యాసంవత్సరం(2025-26)లో బీటెక్ ప్రథమ సంవత్సర తరగతులు ప్రారంభించుకునే తుది గడువును అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) నెల రోజులు పొడిగించింది. గతంలో ఆగస్టు 14వ తేదీ నాటికి తరగతులను ప్రారంభించాలని అకడమిక్ విద్యా క్యాలెండర్‌ను జారీ చేసిన ఏఐసీటీఈ...తాజాగా ఆ గడువును సెప్టెంబరు 15వ తేదీ వరకు పెంచింది.



మచిలీపట్నంలో అసంపూర్తిగా వరదనీటి కాలువ పనులు ✦ విజయవాడ బెంజిసర్కిల్‌లో వర్షాలకు రోడ్డుపై నిలిచిన నీరు ✦ విశాఖలోని కాన్వెంట్ కూడలిలో రైల్వే వంతెన కింద వర్షపు నీరు

ఆ పనులు పూర్తయితేనే వరదనీటి వెతలకు విముక్తి

- విజయవాడలో పెండింగ్‌లో 182 కి.మీ. పనులు
- ఐదు నగరాల్లో ఆగిన కాలువల నిర్మాణం
- వైకాపా ప్రభుత్వ హయంలో పట్టించుకోని వైనం
- పూర్తిచేయాలంటే రూ.642 కోట్లు అవసరం

విజయవాడ, గుంటూరులో మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ చెరువుల్లా మారాయి. 24 గంటలకు పైగా అనేక ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపైనే నిలిచిపోయింది. విశాఖలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి అక్కడ అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఈనాడు-అమరావతి: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో రోడ్లు చెరువులుగా మారాయి. నగరాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువల నిర్మాణ పనులు పూర్తిచేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను వైకాపా ప్రభుత్వం పక్కన పడేసింది. ఐదేళ్లలో కిలోమీటరు మేర కూడా పూర్తిచేయలేదు. విజయవాడలో వరద కాలువల నిర్మాణం కోసం కేంద్రం ప్రత్యేకంగా కేటాయించిన నిధులనూ ఇతర అవసరాలకు మళ్లించింది. అందుకే.. నిలిచిపోయిన వర్షపునీటితో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

✦ అమృత్ పథకం కింద 2015లో తొలివిడతగా ఏడు నగరాల్లో 110కిలోమీటర్ల మేర కాలువల నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులను గాలికి వదిలేసింది. శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, అనంతపురం, నెల్లూరులో 31 కి.మీ. మేర పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇవి పూర్తిచేయాలంటే రూ.350 కోట్లకుపైగా అవసరమని అంచనా. తిరుపతి, కాకినాడలోనూ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాకే కాలువల పనులు పూర్తయ్యాయి.

✦ విజయవాడలో అసంపూర్తిగా నిలిచిపోయిన వరద నీటి కాలువల నిర్మాణ పనుల పూర్తికి రూ.292 కోట్లు అవసరమని అంచనా. రూ.461 కోట్లతో మొత్తం 443.71 కి.మీ. పొడవైన వరదనీటి కాలువల పనులు పదేళ్ల క్రితం ప్రారంభమయ్యాయి. అప్పట్లోనే 261 కి.మీ. పనులు పూర్తయ్యాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రూపాయి కూడా ఖర్చుచేయలేదు. 182.71 కి.మీ.ల మేర పనులను నిలిపివేసింది. ప్రస్తుత వర్షాలకు నీరు కిందకు వెళ్లే మార్గం లేక వరద నీరు రోడ్లపైకి వస్తోంది.

మూడు దశల్లో కాలువల నిర్మాణానికి ప్రణాళిక

అసంపూర్తిగా నిలిచిపోయిన వరదనీటి కాలువల పనులు పూర్తిచేసి మిగిలిన నగరాలు, పట్టణాల్లోనూ కొత్త పనులు చేపట్టే దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. ఇందుకోసం పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల నుంచి పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఇటీవల ప్రతిపాదనలు కోరింది. విజయవాడతోపాటు మిగిలిన ఐదు నగరాల్లో అసంపూర్తి పనుల పూర్తికి రూ.642 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. గుంటూరులో వరద నీటి కాలువల నిర్మాణం అనివార్యమని ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు.

తోటకూర ప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారం



తోటకూర ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

హ్యూస్టన్: అమెరికాలోని తెలుగు సమాజానికి తానా తదితర సంస్థల ద్వారా సుదీర్ఘకాలంగా సాహితీ సేవలందిస్తున్న తోటకూర ప్రసాద్‌ను 14వ అమెరికా తెలుగు సాహితీసదస్సు 'జీవన సాఫల్య పురస్కారం'తో గౌరవించింది. ఈ నెల 16, 17 తేదీల్లో హ్యూస్టన్ నగరంలో వంగూరి ఫౌండేషన్, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక వేదిక సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుంచి సాహిత్యాభిమానులు హాజరయ్యారు. సాహితీవేత్త యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు తోటకూర ప్రసాద్‌ను జీవన సాఫల్య పురస్కారంతో గౌరవించారు. సిలికాన్ ఆంధ్ర సీఈఓ రాజు చామర్తి, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్



విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: అఖిలభారత రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 16 నుంచి దిల్లీలోని ఫరిదాబాద్‌లో సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా ఆదివారం సమాఖ్య ఉపాధ్యక్షుడి ఎన్నికకు 29 రాష్ట్రాల ప్రతినిధులు విద్యాసాగర్‌కు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన పదవితో తన బాధ్యత మరింత పెరిగిందని, జాతీయస్థాయిలో జరిగే ఉద్యమాల కార్యాచరణ బాధ్యత కూడా తనపై ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సీపీఎస్ రద్దు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, లేబర్ కోడ్స్ లాంటి అంశాలపై పోరాటాలు చేయాల్సి ఉంటుందన్నారు. తనను ఎన్నుకున్న జాతీయ కార్యవర్గ సభ్యులకు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

సాక్షి ఛానల్, సుమన్ టీవీల్లో తప్పుడు ప్రసారాలు

- వదంతులు, నిరాధార కథనాలతో ప్రజల్లో భయాందోళనలు..
- జలవనరుల శాఖ ఫిర్యాదుతో రెండు వేర్వేరు కేసుల నమోదు

ఈనాడు-అమరావతి: 'అమరావతిని లేపటానికి పొన్నూరును ముంచేశారు' అంటూ సాక్షి టీవీ ఛానల్, 'విరిగిపోయిన ప్రకాశం బ్యారేజీ 67వ గేట్.. భారీ వరదకు విజయవాడ మునిగేలా ఉంది' అంటూ సుమన్ టీవీ తప్పుడు కథనాలతో దుష్ప్రచారం చేయటంపై పోలీసులు ఆదివారం రెండు కేసులు నమోదుచేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయటం, వదంతులతో భయాందోళనలు సృష్టించటం తదితర అభియోగాలపై తాడేపల్లి, విజయవాడ వన్‌టౌన్ పోలీసుస్టేషన్లలో జలవనరుల శాఖ ఫిర్యాదులతో కేసులు పెట్టారు.


గేట్లు మూసి ఉన్నా దుష్ప్రచారం

'రియల్ ఎస్టేట్ మాయలో పడి కళ్లు మూసుకుపోయిన ప్రభుత్వం అమరావతిని బతికించుకోవటం కోసం కొండవీటి వాగు వరదనీటిని కృష్ణా, గుంటూరు, అప్పాపురం ఛానళ్లకు మళ్లించి పొన్నూరులోని పొలాల ముంపునకు కారణమైంది. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అమరావతిని లేపటానికి పొన్నూరును ముంచేశారు' అంటూ సాక్షి ఛానల్‌లో ఈ నెల 16న ఓ కథనం ప్రసారం చేశారు. పొన్నూరు వైకాపా నేత అంబటి మురళీకృష్ణ ఇవే ఆరోపణలు చేయగా.. వాటిని సాక్షి వెబ్‌సైట్‌లో ప్రచురించారు. అమరావతిపై దుష్ప్రచారం కోసమే ఇలా చేశారని గుర్తించిన జలవనరులశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'కొండవీటి వాగు నుంచి వరద నీటిని గుంటూరు ఛానల్‌లోకి అసలు వదల్లేదు. భారీ వరదల కారణంగా ఆ ఛానల్ గేట్లను మూసేశాం. కొండవీటి వాగు వరదనీటిని ఈ నెల 13 నుంచే కృష్ణానదిలోకి ఎత్తి పోస్తున్నాం. భారీ వర్షం వల్ల డ్రెయిన్లలోని నీళ్లే పొలాల్లోకి చేరాయి. కానీ ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా సాక్షి ఛానల్‌లో నిరాధార కథనం ప్రసారం చేశారు' అంటూ గుంటూరు ఛానల్ ఏఈఈ అవినాష్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది.

సుమన్ టీవీ పోస్టును వ్యాప్తి చేస్తూ భయాందోళనలు..

'విరిగిపోయిన ప్రకాశం బ్యారేజీ 67వ గేట్- భారీ వరదకు విజయవాడ మునిగేలా ఉంది' అంటూ సుమన్ టీవీ ఛానల్ ఫేస్‌బుక్ పేజీలో ఈ నెల 15న నిరాధార సమాచారంతో ఓ పోస్టు పెట్టారు. దాన్ని పలువురు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ప్రజల్ని భయాందోళనలకు గురిచేశారు. భాస్కరరెడ్డి ఎలియాస్ చికాగో బాచీ పేరుతో ఉన్న ఎక్స్ ఖాతా ద్వారా ఈ దుష్ప్రచారం చేశారు. 'ప్రకాశం బ్యారేజీ గేటుకు మరమ్మతులు, గ్రీజు కూడా పెట్టలేని కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుందా?' అని పేర్కొన్నారు. వాస్తవంగా 67వ నంబరు గేటు సురక్షితంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆనకట్ట సూపరింటెండెంట్ యూ.సత్య రాజేష్ ఫిర్యాదు మేరకు విజయవాడ వన్‌టౌన్‌లో కేసు నమోదైంది.

విశాఖ ఉక్కులో పలు విభాగాల ప్రైవేటీకరణకు టెండర్లు



విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఈఎస్ అండ్ ఎఫ్ విభాగం

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-ఉక్కునగరం: విశాఖ ఉక్కులోని పలు విభాగాలను ప్రైవేటుకు అప్పగిస్తూ యాజమాన్యం ప్రకటనలు జారీ చేస్తుండడంతో ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ), కోకోవెన్, సింటర్ ప్లాంట్, అగ్నిమాపక విభాగంలో కొన్ని సెక్షన్లను ప్రైవేటుకు అప్పగించారు. ఈ నెల 16న థర్మల్ పవర్ ప్లాంటును అప్పగించేందుకు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోరుతూ టెండర్ పిలిచారు. తాజాగా ఆదివారం రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) పలు విభాగాల ప్రైవేటీకరణకు ఏకంగా 44 టెండర్లు పిలుస్తూ ఈవోఐ జారీచేసింది. టెండర్ దాఖలుకు సెప్టెంబరు 9ని గడువుగా నిర్ణయించారు.

మాధారం గనుల నిర్వహణ సహా..

తెలంగాణలోని మాధారం గనుల నిర్వహణ, ఉక్కు కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్ 1, 2, 3లో కొన్ని సెక్షన్లు, క్యాప్టివ్ పవర్ ప్లాంట్ (సీపీపీ), వైర్ రాడ్ మిల్ (డబ్ల్యూఆర్ఎం), ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈఎండీ), రోలింగ్ మిల్, మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ మిషన్ షాప్ (సీఎంఎస్), ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ అండ్ ఎఫ్) విభాగం, స్టీల్‌మెన్ షాప్ (ఎస్ఎంఎస్), రీఫ్యాక్టరీ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ (ఆర్ఈడీ), క్రేన్స్ తదితర విభాగాలు తాజా జాబితాలో ఉన్నాయి.

'స్త్రీశక్తి'ని స్వాగతిస్తున్నాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన పార్టీ 26వ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడుతూ పథకం అమలుకు 3వేల బస్సులను కొనుగోలు చేయాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకుండా దాటవేయడం సరికాదని విమర్శించారు. త్వరలో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 9 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

జీఎస్‌టీ రేట్ల సవరణతో వాహన ధరలు తగ్గే వీలు!



దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో మార్పులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుత విధానంలో నాలుగు పన్ను శ్లాబ్‌లు (5%, 12%, 18%, 28%) ఉండగా.. ఇకపై రెండు శ్లాబ్‌లు (5%, 18%) మాత్రమే ఉంటాయి. కొన్ని హానికారక వస్తువులపై 40% పన్ను ఉంటుంది. ప్రస్తుతం సంప్రదాయ వాహన రంగం అత్యధిక పన్ను రేటు 28% శ్లాబ్‌లో ఉంది. దీనికి అదనంగా వాహన రకాన్ని బట్టి 1-22% వరకు పరిహార సెస్ విధిస్తున్నారు. ఫలితంగా ఇంజిన్ సామర్థ్యం, పొడవు ప్రకారం.. చిన్న పెట్రోల్ కార్లపై 29% నుంచి ఎస్‌యూవీలపై 50% వరకు పన్ను చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్ వాహనాలపై మాత్రం 5% పన్నే ఉంది. దీపావళికి జీఎస్‌టీ రేట్లు తగ్గితే, అందుబాటు ధర కార్లు వినియోగదార్లను మరింత ఆకర్షిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. పండగ ఉత్సాహానికి ఇది మరింత ఉపకరించనుంది. ప్రస్తుత జీఎస్‌టీ విధానంలో ఇంజిన్ సామర్థ్యం, వాహన పరిమాణానికి సంబంధించిన వర్గీకరణ వివాదాలను కొత్త పన్ను రేట్ల ప్రతిపాదన పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు.

- కార్ల ఇంజిన్ సామర్థ్యం, పొడవుల ఆధారంగా వర్గీకరణ వల్ల తలెత్తుతున్న వివాదాలను పరిష్కరించేందుకు, అన్ని వాహనాలను ఒకే శ్లాబ్‌లో ఉంచే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్కువ జీఎస్‌టీ రేటు వల్ల కార్ల ధరలు తగ్గి.. వాటి గిరాకీ, విక్రయాలు పెరగనున్నాయి. వినియోగం పెంచడమే ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త పన్ను రేట్ల లక్ష్యంగా తెలుస్తోంది.

శాంసంగ్ ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభం



దిల్లీ: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ సంస్థ శాంసంగ్ భారత్‌లో ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించింది. గ్రేటర్ నోయిడాలోని తన ఫ్యాక్టరీలో వీటిని ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం. సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యాక 'శాంసంగ్ తన ఆధునాతన టెక్నాలజీ పరికరాల తయారీ విస్తరణను దేశీయంగా కొనసాగిస్తోంద'ని కేంద్ర ఎలక్ట్రానిక్ అండ్ ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించడం గమనార్హం. ఇప్పటికే ఈ ప్లాంటులో ఫీచర్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వేరబుల్స్, ట్యాబ్లెట్‌లను శాంసంగ్ తయారు చేస్తోంది. ఇప్పుడు ల్యాప్‌టాప్‌ల తయారీని ప్రారంభించడంతో పాటు త్వరలో మరిన్ని రకాల పరికరాల ఉత్పత్తినీ ఇక్కడ చేపట్టాలని భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా చూస్తే, శాంసంగ్ మొబైల్ తయారీ ప్లాంట్లలో రెండో అతిపెద్దది మనదేశంలోనిదే. ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్ తర్వాత మన దేశం నుంచి అత్యధికంగా ఫోన్లను ఎగుమతి చేస్తున్న సంస్థ కూడా శాంసంగ్. పరిమాణం, విలువ పరంగా భారత మొబైల్ విపణిలోనూ శాంసంగ్ రెండో స్థానంలో ఉన్నట్లు మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. ట్యాబ్లెట్‌పీసీ విభాగంలోనూ 15% వాటాతో రెండో అతి పెద్ద సంస్థగా శాంసంగ్ ఉన్నట్లు సైబర్‌మీడియా రీసెర్చ్ వివరించింది.

బెంగళూరులో ఐఫోన్ 17 ఉత్పత్తి



దిల్లీ: తైవాన్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్, తన బెంగళూరు ప్లాంటులో ఐఫోన్ 17 ఉత్పత్తిని ప్రారంభించింది. చెన్నైలో ఒక ప్లాంట్ కలిగిన ఫాక్స్‌కాన్ 2.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.25,000 కోట్ల) పెట్టుబడితో బెంగళూరుకు దగ్గరలో దేవనహళ్లిలో ఈ యూనిట్‌ను నిర్మించిన సంగతి విదితమే. ఈ ప్లాంటులో కార్యకలాపాలను ఐఫోన్ 17 తయారీతోనే ఫాక్స్‌కాన్ ఇటీవల ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

- వందలమంది చైనీస్ ఇంజనీర్లు హఠాత్తుగా తిరిగి వెళ్లిపోవడం కారణంగా, ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభానికి కొంత అంతరాయం ఏర్పడింది. అయితే వేర్వేరు దేశాల నుంచి ఇంజినీర్లను రప్పించడం ద్వారా, ఉత్పత్తి ప్రక్రియ సజావుగా సాగేలా ఫాక్స్‌కాన్ చర్యలు తీసుకుంది.
- 2024-25లో 3.5-4.0 కోట్ల ఐఫోన్లను భారత్‌లో తయారు చేయించిన యాపిల్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీన్ని 6 కోట్లకు పెంచాలని యోచిస్తోంది.
- గత ఆర్థిక సంవత్సరంలో యాపిల్ 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను మనదేశంలో అసెంబుల్ చేసిందని అంచనా.
- 2025 జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయమైన ఐఫోన్లన్నీ భారత్‌లో తయారైనవే అని సంస్థ ముఖ్యకార్యనిర్వహణాధికారి (సీఈఓ) టిమ్ కుక్ జులై 31న జరిగిన బోర్డు సమావేశంలో వెల్లడించారు.
- 2024లో 7.59 కోట్ల ఐఫోన్లు అమెరికాలో అమ్ముడుపోయాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ తెలిపింది.
- మనదేశంలో ఐఫోన్ల సరఫరాలు 21.5% పెరిగి 2025 మొదటి అర్ధభాగంలో 59 లక్షలకు చేరాయని వివరించింది.

విశాఖ ప్లాంటు నుంచి అమెరికా, ఐరోపాలకు 20 ఉత్పత్తులు!

అరబిందో ఫార్మా



దిల్లీ: అమెరికా, ఐరోపాల్లో విక్రయించడానికి 20కు పైగా నూతన ఉత్పత్తులకు అనుమతులు కోరుతూ, దరఖాస్తు చేయనున్నామని.. విశాఖపట్నంలోని యూజియా-వీ ప్లాంట్ నుంచి వీటిని ఎగుమతి చేయనున్నట్లు అరబిందో ఫార్మా ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) సంతానం సుబ్రమణియన్ వివరించారు. ఇప్పటి వరకు బయోలాజిక్స్ సీఎంఓ (కాంట్రాక్ట్ తయారీ) వ్యాపారంపై 30 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టామని, 2027 మార్చికి మరో 100 బి.డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో తమ చైనా ప్లాంట్ లాభ నష్టాలు లేని స్థాయి (బ్రేక్ ఈవెన్)కి చేరే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. '200 కోట్లకు పైగా ట్యాబ్లెట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన చైనా ప్లాంట్‌ను విస్తరిస్తున్నాం. రాబోయే త్రైమాసికాల్లో గణనీయ ఆదాయాన్ని ఈ ప్లాంట్ అందిస్తుంద'న్నారు. 2024 నవంబరులో ప్రారంభమైన ఈ ప్లాంట్‌పై దాదాపు 145 మిలియన్ డాలర్ల (రూ.1,200 కోట్లకు పైగా) పెట్టుబడులు పెట్టారు.

అమెరికాలో త్వరలో ఉత్పత్తి ప్రారంభం

అమెరికాలోని రెండు ప్లాంట్‌లపై దాదాపు 70 మిలియన్ డాలర్ల (సుమారు రూ.600 కోట్లు) పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే వాటిల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సుబ్రమణియన్ వెల్లడించారు.

- భవిష్యత్‌లో స్థిర వృద్ధిని కొనసాగించడంపై ఆశావహంగా ఉన్నామని సుబ్రమణియన్ తెలిపారు. సామర్థ్యాల విస్తరణ, కొత్త ఉత్పత్తుల విడుదల, స్థిరమైన ధరలే ఇందుకు కారణమని. . అమెరికా, ఐరోపా విపణులు మద్దతుగా నిలవొచ్చన్నారు. కొత్త తయారీ కేంద్రాల్లో వాణిజ్య కార్యకలాపాల విస్తరణతో రాబోయే త్రైమాసికాల్లో ఆదాయం వృద్ధి చెందడంతో పాటు మార్జిన్లు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20-21% మార్జిన్ లక్ష్యాన్ని సాధించడంపై ధీమాగా ఉన్నామని అన్నారు.
- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అరబిందో ఫార్మా ఏకీకృత నికర లాభం 10% తగ్గి రూ.824 కోట్లకు పరిమితమైంది. అమెరికాలో విక్రయాలు తగ్గడం, ఏపీఐ వ్యాపార విభాగం నిరాశపరచడం ప్రభావం చూపాయి. మొత్తం కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.7,567 కోట్ల నుంచి రూ.7,868 కోట్లకు పెరిగింది.

వినియోగించిన వంట నూనెతో విమాన ఇంధన ఉత్పత్తి



ఐఓసీ ఛైర్మన్ అరవిందర్ సింగ్

దిల్లీ: సాధారణంగా ఇళ్లు - పెద్ద హోటళ్లలో వంటకు ఒకసారి వినియోగించాక, వంటనూనెను పారపోస్తారు. ఇలా వృథాగా పోకుండా.. వినియోగించిన వంటనూనెతో 'సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్)' ఉత్పత్తి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రిఫైనరీ సర్టిఫికేషన్ పొందిందని కంపెనీ ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. సంప్రదాయ విమాన ఇంధనానికి (ఏటీఎఫ్)కు ప్రత్యామ్నాయంగా వినియోగించే వీలున్న ఇంధనం ఎస్ఏఎఫ్‌ను పెట్రోలియంయేతర ఉత్పత్తుల నుంచి తయారు చేస్తారు. లభ్యతకు అనుగుణంగా ఏటీఎఫ్‌లో దీన్ని 50 శాతం వరకు కలపొచ్చు. 2027 నుంచి అంతర్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే విమాన ఇంధనంలో 1% ఎస్ఏఎఫ్ కలపడాన్ని మనదేశం తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలోనే ఎస్ఏఎఫ్ తయారీకి సంబంధించి హరియాణాలోని ఐఓసీ పానిపట్ రిఫైనరీ, అంతర్జాతీయ సివిల్ ఏవియేషన్ సంస్థ (ఐసీఏఓ) ఐఎస్‌సీసీ కార్సియా సర్టిఫికేషన్‌ను పొందిందని సాహ్నీ వెల్లడించారు. దేశంలో ఈ సర్టిఫికేషన్ పొందిన ఏకైక సంస్థ ఐఓసీనే అని తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి వార్షికంగా 35,000 టన్నుల ఎస్ఏఎఫ్‌ను ఈ రిఫైనరీ నుంచి ఉత్పత్తి చేయాలన్నది తమ లక్ష్యంగా వెల్లడించారు. 2027లో 1% బ్లెండింగ్ నిబంధనలను అందుకోవడానికి ఈ ఉత్పత్తి సరిపోతుందన్నారు.

వృథా వంటనూనె సమీకరణ ఇలా

హోటళ్లు, రెస్టారెంట్లు, హల్దీరామ్ వంటి స్నాక్స్, స్వీట్స్ తయారీ సంస్థల నుంచి ఏజెన్సీలు 'వినియోగించిన వంటనూనె'ను సేకరించి, ఐఓసీ పానిపట్ రిఫైనరీకి సరఫరా చేస్తాయి. ఈ నూనెతో ఎస్ఏఎఫ్‌ను ఉత్పత్తి చేస్తారు.

- రంగుల తయారీలో వినియోగించే బుటైల్ అక్రిలేట్‌ను ఉత్పత్తి చేసేందుకు గుజరాత్‌లోని కొయాలీ రిఫైనరీలో రూ.5,000 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు సాహ్నీ వెల్లడించారు. బీపీసీఎల్ కోచి రిఫైనరీ తర్వాత మన దేశంలో ఇదే పెద్దది. దీని వార్షిక సామర్థ్యం 1,50,000 టన్నులు. ప్రస్తుతం మనదేశం 3,20,000 టన్నుల బుటైల్ అక్రిలేట్‌ను దిగుమతి చేసుకుంటుండగా, ఇది తగ్గిస్తుందన్నారు.
- ఏడాదికి 10,000 టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే యూనిట్‌నూ పానిపట్ రిఫైనరీ వద్ద ఏర్పాటు చేస్తున్నామని.. ఎల్అండ్‌టీ నిర్మిస్తున్న ఈ ప్లాంటు 27 నెలల్లో ప్రారంభమవుతుందని వివరించారు.

పండగ సీజన్‌పై అమెజాన్ ఆశావహం



దిల్లీ: రాబోయే పండగ సీజన్ అమ్మకాలపై అమెజాన్ ఇండియా ఎంతో ఆశావహంగా ఉంది. గత నెలలో ప్రైమ్ డే అమ్మకాలు బలంగా నమోదు కావడం, చిన్న నగరాల నుంచి పెరుగుతున్న గిరాకీ వల్లే.. ఆశావాదం బలపడిందని అమెజాన్ ఇండియా హెడ్ సమీర్ కుమార్ వెల్లడించారు. పండగ సీజన్‌లో లభించే గిరాకీకి అనుగుణంగా వస్తువులు అందించేందుకు కంపెనీ సరఫరా వైపు సంసిద్ధతను పెంచిందని వివరించారు. వివిధ ప్రాంతాల్లో బహుమతి సంప్రదాయాలు, లాభదాయక తగ్గింపులు, కొత్త-కాలానుగుణ ఉత్పత్తులపై వినియోగదార్ల ఆసక్తి వంటి వాటి ద్వారా బ్రాండ్‌లకు పండగ సీజన్ అతి పెద్ద వార్షిక అవకాశాలలో ఒకటిగా ఉందని తెలిపారు.

- జియోస్టార్ ఫెస్టివ్ సెంటిమెంట్ సర్వే 2025 ఎడిషన్ ప్రకారం, 92% మంది భారతీయ వినియోగదార్లు ఈ ఏడాది తమ పండగ వ్యయాలను కొనసాగించాలని లేదా పెంచాలని యోచిస్తున్నారు. ఇది బలమైన వినియోగదార్ల విశ్వాసాన్ని, బ్రాండ్లకు సువర్ణావకాశాన్ని సూచిస్తోంది.
- ప్రైమ్ డే అమ్మకాల గణాంకాలను ప్రస్తావిస్తూ, గతంతో పోలిస్తే మంచి వృద్ధి నమోదు చేశామని సమీర్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా రెండో, మూడో అంచె నగరాల నుంచి మంచి సహకారం లభించిందని తెలిపారు. వినాయక చవితితో పండగ సీజన్ వస్తోందని, ఇప్పటికే సరఫరా వైపు సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు.
- జెన్ జడ్ (15-29 ఏళ్ల) వారి కంటే మిలీనియల్స్ (30-45 ఏళ్లు) ఎక్కువగా వ్యయాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని సర్వే తెలిపింది. మహిళలు దుస్తులు, సౌందర్య, గ్యాడ్జెట్లు, గృహ అలంకరణ తదితర విభాగాల్లో షాపింగ్ చేసేందుకు అధికంగా ఆసక్తి చూపిస్తున్నారు.
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో పండగ సీజన్ ముందస్తు సంకేతాలు కనిపిస్తున్నాయని జెప్టో సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అదిత్ పలీచా ఇటీవల లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశారు. ఈ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో రాఖీ సమయంలో నిమిషానికి 820 రాఖీలను విక్రయించినట్లు తెలిపారు. గత ఏడాది కంటే 2.5 రెట్ల వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నారు.

అధికారిక రుణాలు.. మహిళలకు దూరం

డిజిటల్ పద్ధతులే మేలు చేస్తాయ్

దిల్లీ: బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల నుంచి అధికారిక రుణాలను పొందడంలో పురుషులతో పోలిస్తే మహిళా పారిశ్రామికవేత్తలు ప్రతికూలతలు ఎదుర్కొంటున్నారని గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (జీఐఎం) పరిశోధనలో తేలింది. రుణాలు పొందడంలో లింగ వ్యత్యాసాన్ని ఇది సూచిస్తోంది. ఈ అంతరాన్ని తగ్గించేందుకు డిజిటల్ సాంకేతికత సహాయపడుతుందని సిఫారసు చేసింది. అసంఘటిత రంగంలో.. మహిళలు నేతృత్వం వహిస్తున్న సంస్థల డేటాను అధ్యయనం చేసి, జీఐఎం రూపొందించిన నివేదికను ప్రతిష్ఠాత్మక జర్నల్ 'అప్లైడ్ ఎకనమిక్స్'లో ప్రచురించారు. 2022-23లో నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన అన్ ఇన్‌కార్పొరేటెడ్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ (ఏఎస్‌యూఎస్ఈ) వార్షిక సర్వే నుంచి 4 లక్షలకు పైగా సంస్థలు వివరాలు ఇందుకోసం తీసుకున్నారు.

- ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సేవల డిజిటల్ సాంకేతికతలను ఉపయోగిస్తున్న మహిళల నేతృత్వంలోని సంస్థలు రుణాలు సులువుగా పొందగలుగుతున్నాయని పరిశోధనా బృందం గుర్తించింది.
- 'సామాజికంగా దిగువన ఉన్న వారికి కూడా అధికారిక రుణాలు అందేలా కొత్త ఆర్థిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సృష్టించేందుకు మనం ఎంత సమయం, కృషి, డబ్బును పెట్టుబడిగా పెట్టాలో.. ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడంలోనూ అదే తపన చూపాల'ని జీఐఎం బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవల ప్రొఫెసర్ ఆశయ్ కదమ్ అభిప్రాయపడ్డారు.
- మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి అధికారిక ఆర్థిక సహాయం అందుబాటులో ఉండటం చాలా అవసరమని జీఐఎం సహాయ ప్రొఫెసర్ స్వర్ణ పరమేశ్వరన్ వెల్లడించారు.
- డిజిటల్ సాంకేతికతను వినియోగిస్తే, ప్రభుత్వరంగ సంస్థలతో సమాచారాన్ని సక్రమంగా పంచుకునేందుకు, పలుమార్లు ఆయా సంస్థల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా ఉండేందుకు ఉపకరిస్తుంది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల రుణ మంజూరు విధానాలను కూడా పునఃపరిశీలించి, లింగ అంతరం లేకుండా చూడాలని నివేదిక సూచించింది.

కోడి గుడ్లు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	490	గోదావరి	515
వరంగల్	492	విశాఖపట్నం	515
విజయవాడ	520	చిత్తూరు	553

పసిడి విక్రయించొచ్చు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.99,275 కంటే దిగువన చలిస్తే రూ.98,701-97,941 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. రిస్కు తీసుకునే ట్రేడర్లు రూ.99,484 దిగువన విక్రయించి, కిందకొస్తే కొనుగోలు చేయడం మంచి వ్యూహమే అవుతుంది. ఒకవేళ సానుకూలంగా కదలాడితే రూ.1,01,773-1,02,347 వరకు పెరగొచ్చు. ఇంకా పైకి వెళితే రూ.1,02,811 వద్ద గట్టి నిరోధం ఎదురుకావొచ్చు. రూ.1,00,226 పైన కదలాడితేనే పసిడి సానుకూలంగా చలించే వీలుంది.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు రూ.1,12,672 కంటే దిగువన చలిస్తే రూ.1,09,971 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.1,15,373 కంటే ఎగువన కదలాడితే రూ.1,16,771; రూ.1,18,074 వరకు పెరగొచ్చు.

ప్రాథమిక లోహాలు



- రాగి ఆగస్టు కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.893.95 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.900.45; రూ.905.45 వరకు రాణించొచ్చు.
- సీసం ఆగస్టు కాంట్రాక్టు రూ.181.45 కంటే ఎగువన చలిస్తే రూ.183.50 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ స్థాయికి దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపడం మంచిది.
- జింక్ ఆగస్టు కాంట్రాక్టు రూ.268.60 కంటే ఎగువన మాత్రమే లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిది. రూ.266.55 కంటే కిందకు వస్తే రూ.265.10 వరకు దిగివచ్చే అవకాశం ఉంది.
- అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు రూ.256.85 కంటే పైన కదలాడకుంటే మరింతగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది.

ఇంధన రంగం



- ముడి చమురు సెప్టెంబరు కాంట్రాక్టుకు రూ.5,434 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,256; రూ.5,002 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.5,867 కంటే పైన కదలాడితే రూ.6,122; రూ.6,301 వరకు పెరగొచ్చు.
- సహజ వాయువు సెప్టెంబరు కాంట్రాక్టును రూ.256 దిగువన మాత్రమే షార్ట్ సెల్ చేయడం మంచిది. ఎందుకంటే ఈ స్థాయి ఎగువకు వెళితే రూ.280.95; రూ.289.75 వరకు పెరిగే అవకాశం ఉంది.

వ్యవసాయ రంగం



- పసుపు ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.12,349 కంటే కిందకు వస్తే రూ.12,024; రూ.11,639 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.13,059 కంటే పైకి వెళితే రూ.13,444-13,769 వరకు వెళ్లే అవకాశం ఉంటుంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	1,01,198	99,850	-1.33
వెండి (సెప్టెంబరు)	1,14,291	1,13,976	-0.28
రాగి (ఆగస్టు)	888.45	887.40	-0.12
సీసం (ఆగస్టు)	180.55	180.20	-0.19
జింక్ (ఆగస్టు)	270.35	270.65	0.11
అల్యూమినియం (ఆగస్టు)	254.50	254.90	0.16
ముడి చమురు (ఆగస్టు)	5,520	5,537	0.31
సహజ వాయువు (ఆగస్టు)	266.90	258.30	-3.22
పసుపు (ఆగస్టు)	12,982	12,674	-2.37

ఆశ.. నిరాశల్లో మార్కెట్లు

స్టాక్ మార్కెట్ ఈ వారం

- జీఎస్‌టీ సంస్కరణలు, ట్రంప్-పుతిన్ సమావేశ ఫలితాలపై దృష్టి
- దేశ రేటింగ్ పెంపు సానుకూలం
- ఔషధ షేర్లు రాణించొచ్చు
- విశ్లేషకుల అంచనాలు



దీపావళి కల్లా జీఎస్‌టీ భారాన్ని బాగా తగ్గిస్తామంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటన స్టాక్‌మార్కెట్లకు ఉత్సాహం తెచ్చే అంశమే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన చర్చల సారాంశం వెల్లడికాకున్నా.. సానుకూలంగా ముగిశాయని ఇరు వర్గాలు ప్రకటించడం ఊరట కలిగించే అంశం. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న కారణంగానే మనదేశ ఉత్పత్తులపై ఈనెల 27 నుంచి 25% అదనపు సుంకం వసూలు చేస్తామన్న ట్రంప్.. తాజా పరిణామాల్లో దానిని అమలు చేస్తారా లేదా అన్నది చూడాలి. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ఈనెల 25న రావాల్సిన అమెరికా ప్రతినిధి బృందం పర్యటన వాయిదా పడిందన్న వార్తలు కాస్త ఆందోళన కలిగించేవే. ఈనెల తొలి పక్షంలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు రూ.21,000 కోట్ల అమ్మకాలు జరపడంతో, ఈ ఏడాదిలో ఇప్పటివరకు వీరి పెట్టుబడుల ఉపసంహరణలు రూ.1.16 లక్షల కోట్లకు చేరాయి. మన దేశ రేటింగ్‌ను 'బీబీబీ-' నుంచి 'బీబీబీ'కి ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ సవరించడం సానుకూలాంశం. ఈ నేపథ్యంలో మధ్య నుంచి దీర్ఘకాలానికి మార్కెట్‌పై బులిష్‌గా ఉన్నట్లు సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. స్వల్పకాలంలో కొంత దిద్దుబాటుకూ అవకాశం ఉందని భావిస్తున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- **వాహన** రంగ షేర్లు పరిమిత లాభాలను పొందొచ్చు. రాబోయే నెలల్లో విక్రయాలు పుంజుకుంటాయని కంపెనీలు ఆశాభావంతో ఉన్నాయి. వడ్డీరేట్లు తగ్గినందున, పండగ సీజనులో గిరాకీ రాణిస్తుందన్న అంచనాలున్నాయి.
- **లోహ** షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, వివిధ దేశాలపై అమెరికా యాంటీ డంపింగ్ సుంకం పరిణామాలను పరిశీలించాలి. చైనా బలహీన పారిశ్రామికోత్పత్తి గణాంకాల ప్రభావమూ ఉంటుంది.
- **టెలికాం** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. త్రైమాసిక ఫలితాలు పూర్తయినందున కొత్త సంకేతాల కోసం ఈ షేర్లు ఎదురు చూస్తున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ షేరు ఒక శ్రేణిలో కదలాడొచ్చు.
- అమెరికా-రష్యా, అమెరికా-భారత్ మధ్య చర్చలకు సంబంధించిన వార్తల ఆధారంగా **ఐటీ** షేర్లు కదలాడొచ్చు. నిఫ్టీ ఐటీ సూచీకి 34,365.90 వద్ద మద్దతు, 35,565.80 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు.
- నిఫ్టీ **బ్యాంక్** సూచీ రాణించొచ్చు. గత వారం 55,000 స్థాయి వద్ద బాటమ్డ్ అవుట్ కావడం ఇందుకు నేపథ్యం. భారత సార్వభౌమ రేటింగ్ పెరగడం వల్ల ప్రధాన సూచీల్లో కనిపించే సానుకూలతల నుంచి బ్యాంకు షేర్లకు మద్దతు లభించొచ్చు.
- బలమైన ఆర్థిక ఫలితాలు, మెరుగైన విలువల మధ్య **ఔషధ** షేర్ల లాభాలు కొనసాగొచ్చు. ఫార్మా టారిఫ్‌ల చుట్టూ ఉన్న అనిశ్చితులను, ఫలితాల సరళి పక్కనపెట్టగలిగింది.
- **యంత్రపరికరాల** షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. దేశీయ యంత్రపరికరాలపై టారిఫ్‌ల వల్ల ప్రత్యక్షంగా పరిమిత ప్రభావమే ఉన్నప్పటికీ.. అంతర్జాతీయ గిరాకీపై పడే ప్రభావాన్ని లెక్కగట్టాల్సి ఉంది.
- **ఎఫ్ఎంసీజీ** షేర్లలో లాభాల స్వీకరణకు పరిమిత అవకాశం ఉంది. ఇటీవల వీటి విలువలు మోస్తరు స్థాయికి చేరడం ఇందుకు నేపథ్యం. రుతుపవనాలు, ప్రభుత్వ చర్యల వల్ల వినియోగ గిరాకీ మెరుగుకానుందన్న అంచనాలున్నాయి.
- స్వల్పకాలానికి ప్రభావం చూపే వార్తలు లేనందున **సిమెంటు** షేర్లు చాలా తక్కువ శ్రేణిలో కదలాడొచ్చు. మధ్యకాలానికి మాత్రం 'బులిష్' అంచనాలే ఉన్నాయి. వర్షాల తర్వాత గిరాకీ పెరగొచ్చన్న అంచనాలు గట్టిగా ఉన్నాయి.
- వరుసగా 4 వారాల పాటు బలహీనంగా కదలాడిన నేపథ్యంలో **చమురు-గ్యాస్** షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. కీలక సూచీల్లో సానుకూలతలు కనిపిస్తే చమురు-గ్యాస్ సూచీ 11,500 దిశగా చలించొచ్చు. ఓఎన్‌జీసీ షేరును రూ.273 లక్ష్యంతో కొనుగోలు చేయొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	121.96	126.50	117.00
బజాజ్ ఆటో	8213.50	8312.50	8148.50
ఐషర్ మోటార్స్	5764.00	5828.70	5677.70
హీరో మోటోకార్ప్	4708.10	4807.00	4641.00
ఎం అండ్ ఎం	3265.40	3331.80	3228.80
మారుతీ	12936.00	13036.70	12774.70
టాటా మోటార్స్	664.60	671.80	654.10
టీవీఎస్ మోటార్	3020.30	3069.60	2961.00

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5302.50	5433.50	5232.50
కోల్గేట్ పామోలివ్	2154.00	2194.70	2130.70
డాబర్ ఇండియా	500.90	508.00	495.80
ఇమామీ	582.35	589.40	575.60
హిందుస్థాన్ యునిలీవర్	2480.60	2523.40	2451.80
ఐటీసీ	411.45	416.60	408.50
మారికో	710.55	717.90	701.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	221.33	226.60	217.80
సీజీ పవర్	665.95	680.70	656.70
ఎల్ అండ్ టీ	3677.00	3742.50	3608.90
సీమెన్స్	3169.00	3229.40	3088.00
థెర్మాక్స్	3274.30	3331.20	3235.80

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1991.10	2010.90	1961.30
ఐసీఐసీఐ బ్యాంక్	1427.30	1442.60	1404.40
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	68.77	70.60	67.70
ఇండస్ఇండ్ బ్యాంక్	769.75	785.90	757.70
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1978.20	2000.40	1964.40
పీఎన్‌బీ	106.28	107.70	105.20
ఎస్‌బీఐ	826.55	833.50	815.70

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1083.60	1131.90	1045.90
బయోకాన్	359.25	371.70	352.00
సిప్లా	1564.00	1586.40	1540.80
డాక్టర్ రెడ్డీస్	1260.40	1274.70	1243.10
గ్లెన్‌మార్క్ ఫార్మా	2044.60	2073.90	2002.30
లుపిన్	1961.60	2028.50	1924.30

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	695.25	709.60	680.90
హిందుస్థాన్ జింక్	426.65	437.50	417.10
ఎన్ఎండీసీ	69.40	73.50	66.90
సెయిల్	120.37	125.80	117.50
టాటా స్టీల్	155.30	162.70	151.10
వేదాంతా	430.20	444.30	421.10

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1489.80	1527.70	1466.90
ఇన్ఫోసిస్	1447.70	1491.80	1404.20
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5289.00	5371.30	5206.30
టీసీఎస్	3022.30	3069.20	2995.60
టెక్ మహీంద్రా	1486.70	1545.40	1455.60
విప్రో	246.81	251.90	239.90

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1373.80	1385.50	1364.30
బీపీసీఎల్	318.05	336.50	308.00
హెచ్‌పీసీఎల్	394.35	410.40	385.80
ఐఓసీఎల్	140.13	144.40	137.80
ఓఎన్‌జీసీ	236.94	240.90	232.40
ఆయిల్ ఇండియా	400.75	415.40	389.20

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1782.70	1803.60	1770.20
అంబుజా సిమెంట్స్	578.05	591.00	565.10
ఇండియా సిమెంట్స్	368.90	377.20	358.40
శ్రీ సిమెంట్	30400.00	30793.30	30033.30
అల్ట్రాటెక్ సిమెంట్	12317.00	12526.30	12120.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,873.80	1890.70	1858.30
ఎమ్‌టీఎన్ఎల్	42.36	43.60	41.40
టాటా కమ్యూనికేషన్స్	1694.90	1747.40	1613.80
వొడాఫోన్ ఐడియా	6.15	6.50	5.90

ఈనాడు సినిమా

దర్శకుడిగా షారుక్ తనయుడు



బాలీవుడ్ యాక్షన్ హీరో షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్.. తండ్రి అడుగుజాడల్లో కాకుండా దర్శకుడిగా చిత్రసీమలో అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఆయన 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరుతో ఓ సిరీస్‌ను రూపొందిస్తున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా ఈ సిరీస్ నుంచి ఫస్ట్‌లుక్ పేరుతో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను విడుదల చేసింది. ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ హిందీ చిత్రసీమ ప్రయాణం ఆధారంగా దీన్ని రూపొందిస్తున్నట్లు ఈ వీడియోతో స్పష్టమవుతోంది. యువకథానాయకుడు లక్ష్య, సహేర్, బాబీ డియోల్, మనోజ్ పహ్వా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో షారుక్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు సమాచారం. త్వరలో విడుదల తేదీని అధికారికంగా వెల్లడించనున్నారు.

అందం... అభినయం



ప్రభాస్ కథానాయకుడిగా.. మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజాసాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కథానాయిక నిధి అగర్వాల్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం ఈ సినిమాలోని ఆమె లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. అందంతోపాటు, అభినయానికి అవకాశమున్న కీలక పాత్రలో నిధి సందడి చేయనున్నారని సినీ వర్గాలు తెలిపాయి. తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమైన చిత్రమిది, ఈ సినిమాతో మరింత మంది ప్రేక్షకుల అభిమానం పొందుతానని నిధి చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

నిర్మాతలతో చిరంజీవి భేటీ



తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమాల చిత్రీకరణలు నిలిచిపోయి 14 రోజులైంది. దీంతో పలు సినిమాల విడుదల ప్రణాళికలు పూర్తిగా మారిపోయాయి. వేతనాల పెంపు కోరుతూ కార్మికులు ఆందోళన బాట పట్టడమే ఇందుకు కారణం. కార్మికులు డిమాండ్ చేస్తున్నట్టుగా 30 శాతం కాకపోయినా, రూ. 2 వేల లోపు వేతనాలు ఉన్న కార్మికులకి 25 శాతం వేతనాలు పెంచడానికి ముందుకొచ్చారు నిర్మాతలు. అయితే ఆ పెంపు అమలు కావాలంటే, వర్కింగ్ కండిషన్లకి ఒప్పుకోవాలనే షరతు విధించారు. అందుకు కార్మిక సంఘాలు అంగీకరించకపోవడంతో సమస్య జటిలంగా మారింది. పలు దఫాలుగా చలన చిత్ర వాణిజ్య మండలి, కార్మిక సంఘాలు, నిర్మాతలకి మధ్య చర్చలు కొనసాగినా ఫలితాలు మాత్రం రాలేదు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే అటు నిర్మాతలు, ఇటు కార్మిక సంఘాలు తమ డిమాండ్లపై పట్టు వీడటం లేదు. నిర్మాతలు పెట్టిన కండిషన్లలో రెండింటిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు కార్మికులు. ఈ వివాదంపై జోక్యం చేసుకోవాలని అటు కార్మిక సంఘాలు, ఇటు నిర్మాతలు అగ్ర కథానాయకుడు చిరంజీవిని సంప్రదించారు. ఆయన ఆదివారం నిర్మాతలతో సమావేశం అయ్యారు. మొదట నిర్మాత సి.కల్యాణ్ చిరంజీవి సమావేశం అయ్యారు. తన వంతుగా కార్మికులతో మాట్లాడతానని చిరంజీవి చెప్పారని, ఇరు వర్గాలకి న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఉన్నారని సి.కల్యాణ్ తెలిపారు. వర్కింగ్ కండిషన్లపై నిర్మాతల ప్రతిపాదనల్ని కార్మిక సంఘాలు గతంలో ఒప్పుకున్నా, ఇంకా అమల్లోకి రావడం లేదని, అయితే అవేవీ కష్టమైనవి కాదని, కార్మికుల్ని ఒప్పించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. అనంతరం చిరంజీవిని చిన్న నిర్మాతలు కలిసి చిన్న సినిమాలకి ఎదురవుతున్న ఇబ్బందుల్ని వివరించారు. సోమవారం కార్మిక సంఘాలతో మాట్లాడతానని చిరంజీవి చెప్పారని నిర్మాత నట్టి కుమార్ తెలిపారు. మరోవైపు ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ ఆదివారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో సమావేశమై నిర్మాతలు వేతనాల్ని పెంచాలని డిమాండ్ చేసింది.

సినీ కార్మికుల సమ్మెతో టాలీవుడ్‌లో చిత్రీకరణలు స్తంభించినా.. థియేటర్ల ముందు కొత్త సినిమాల జోరు ఏమాత్రం తగ్గలేదు. మరోవైపు అగ్రతారలతో పాటు కుర్ర హీరోల కోసం తెర వెనుక కొత్త కథలు సిద్ధమవుతూనే ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే చర్చల్లో ఉన్నట్లు తెలుస్తుండగా.. మరికొన్ని కబురు వినిపించడమే తరువాయి అన్నట్లు ఊరిస్తున్నాయి. మరి ప్రస్తుతం ప్రచారంలో వినిపిస్తూ.. అంచనాలు పెంచుతోన్న ఆ కొత్త కలయికలేవి? వాటి విశేషాలేంటి? ఓ లుక్కేద్దాం.

వినిపిస్తారా కొత్త కబురు..!



సాయితేజ్.. మారుతి మరోసారి!

'విరూపాక్ష', 'బ్రో' సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించిన సాయి దుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు'తో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. కె.పి.రోహిత్ తెరకెక్కిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. కానీ, దీని తర్వాత సాయితేజ్ చేయనున్న చిత్రమేదన్నది ఇంకా ఖరారు కాలేదు. అయితే ప్రస్తుతం సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఆయన మరోసారి దర్శకుడు మారుతితో చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీళ్లిద్దరి కలయిక నుంచి 'ప్రతిరోజూ పండగే' లాంటి విజయవంతమైన సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈసారి తేజుతో చేయనున్న చిత్రానికి మారుతి కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరించనున్నట్లు తెలిసింది. దర్శకత్వ బాధ్యతల్ని వంశీకి అప్పజెప్పనున్నట్లు వార్తలొస్తున్నాయి. తను ఆ మధ్య రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు'కు దర్శకత్వం వహించారు. ఇప్పుడు మళ్లీ మారుతి పర్యవేక్షణలో సాయితేజ్ ప్రాజెక్ట్‌తో తిరిగి తెరపైకి రానున్నారు. ఇప్పటికే ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు మొదలయ్యాయని.. త్వరలోనే కొత్త కబురు వినిపించే అవకాశముందని తెలుస్తోంది.

ఇటు రామ్.. అటు చైతూ!

కథానాయకులు రామ్ పోతినేని, నాగచైతన్యల కొత్త సినిమాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. వీరిలో రామ్ - పి.మహేశ్‌బాబుల 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. చైతన్య - కార్తీక్ దండు సినిమా మూడు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు వీళ్లిద్దరి తదుపరి ప్రాజెక్ట్ విషయమై ఆసక్తికర చర్చ సాగుతోంది. రామ్ తన తదుపరి చిత్రం కోసం ఇప్పటికే దర్శకుడు శివ నిర్వాణతో చర్చలు చేసినట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలో ఇది పట్టాలెక్కే అవకాశముంది. మరోవైపు నాగచైతన్య తదుపరి చిత్ర విషయంలో తొలుత కొత్త దర్శకుడు కిశోర్ పేరు బలంగా వినిపించింది. కానీ, ఇప్పుడు కొరటాల శివతో పాటు శివ నిర్వాణ పేర్లు ప్రచారంలో వినిపిస్తున్నాయి. మరి చైతూ 25వ సినిమాకి ఎవరు దర్శకత్వం వహిస్తారన్నది తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

అల్లరి హీరో ఇలా.. కిరణ్ అలా!

కథానాయకుడు అల్లరి నరేశ్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. '12ఎ రైల్వే కాలనీ', 'ఆల్కహాల్' చిత్రాలు చిత్రీకరణ దశలో ఉండగా.. కొత్తగా మరో సినిమా ఖరారైనట్లు తెలిసింది. దీన్ని నూతన దర్శకుడు చంద్రమోహన్ తెరకెక్కించనున్నట్లు సమాచారం. రాజేశ్ దండా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. గతేడాది దీపావళికి 'క' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన 'కె-ర్యాంప్', 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్రాలతో పాటు మరో మూడు కొత్త ప్రాజెక్ట్‌లకు పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. అందులో ఒక దానికి శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. దీన్ని రానా దగ్గుబాటి మరి కొందరు నిర్మాతలతో కలిసి స్వయంగా నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనిపై స్పష్టత రానుంది.

తొలి నాయికా ప్రాధాన్య చిత్రం

నిధి అగర్వాల్ తొలిసారి నాయికా ప్రాధాన్య చిత్రంతో అలరించేందుకు సిద్ధమవుతోంది. ఆమె ప్రధాన పాత్రధారిగా నటిస్తున్న ఈ సినిమాతో నిఖిల్ కార్తీక్.ఎన్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. పుప్పాల అప్పలరాజు నిర్మిస్తున్నారు. ఆదివారం నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. "ఆద్యంతం ఆసక్తిరేకెత్తిస్తూ సాగే హారర్ థ్రిల్లర్ ఇది. గాఢమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. విజువల్‌గా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది. ఇది నిధి కెరీర్‌లో ఓ మైలురాయి అవుతుంది. దసరాకి ఈ చిత్ర టైటిల్‌ను ప్రకటిస్తాం" అని నిర్మాత అప్పలరాజు తెలిపారు.

రాత్రిని అలంకరించిన చంద్రకాంతివి నువ్వు


మోహన్‌లాల్, మాళవిక మోహనన్


మలయాళ హీరో మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో సత్యన్ అంతికాడ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కుటుంబ కథా చిత్రం 'హృదయపూర్వం'. ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. మాళవిక మోహనన్ కథానాయిక. ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం ఓనమ్ పండగ సందర్భంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం ఆదివారం ఈ సినిమాలోని 'వెన్మతి' అనే లిరికల్ పాటని విడుదల చేసింది. జస్టిన్ ప్రభాకరన్ స్వరపరిచిన ఈ గీతాన్ని సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'రాత్రిని అలంకరించిన చంద్రకాంతివి నువ్వు' అంటూ సాగుతున్న ఈ పాటలో మోహన్ లాల్, మాళవికల జోడి ప్రేక్షకులని ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, సంగీత, సిద్ధిఖీ, నిషాన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

బాలన్ మొదలెట్టాడు


చిదంబరం


'మంజుమ్మల్ బాయ్స్' సినిమాతో స్నేహబంధం విలువ తెలుపుతూ.. ప్రేక్షకుల మనసుల్ని హత్తుకున్నారు దర్శకుడు చిదంబరం. ఇప్పుడాయన మరో ప్రాజెక్టుతో సినీప్రియుల్ని అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'బాలన్'. ఆదివారం ఈ సినిమా తిరువనంతపురంలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. 'లైట్స్, కెమెరా.. 'బాలన్'' అనే వ్యాఖ్యతో ఇన్‌స్టా వేదికగా పోస్టర్‌ను పంచుకున్నారు దర్శకుడు. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ ఈ చిత్రానికి రచయిత. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. త్వరలో ఈ చిత్రంలోని నటీనటులు, కథ గురించి పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

స్ఫూర్తి రగిలించే గీతం



విజయ రామరాజు టైటిల్ పాత్రలో నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర తెరకెక్కించారు. శ్రీని గుబ్బల నిర్మించారు. సిజా రోజ్ కథానాయిక. హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 29న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రం నుంచి ఆదివారం అర్జున్ చక్రవర్తి ఆంథమ్‌ను విడుదల చేశారు. "మెరిసిందా ఓ అగ్ని కణి.. కొలిమంతా కాల్చుకునే" అంటూ స్ఫూర్తిని రగిలించేలా సాగిన ఈ పాటకు విఘ్నేశ్ భాస్కరన్ స్వరాలు సమకూర్చగా.. విక్రాంత్ రుద్ర సాహిత్యమందించారు. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేశ్ పాయ్ ఆలపించారు. "ఇది కబడ్డీ నేపథ్యంగా సాగే కథతో రూపొందిన చిత్రం. నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. ఇప్పటికే దీనికి 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్న నమ్మకముంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: ప్రదీప్ నందన్, ఛాయాగ్రహణం: సీహెచ్ జగదీశ్.

ఇండియా డే కవాతులో విజయ్


విజయ్ దేవరకొండ

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూయార్క్‌లో జరిగిన ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే కవాతుకు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ హాజరై, గ్రాండ్ మార్షల్‌గా వ్యవహరించారు. ఈ వేడుకల్లో స్థానిక అమెరికన్స్‌తోపాటు, భారీ సంఖ్యలో ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. అక్కడి ప్రఖ్యాత ఎంపైర్ బిల్డింగ్ మూడు రంగుల విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. ఈ లైటింగ్‌ని స్విచ్చాన్ చేసి ప్రారంభించారు విజయ్ దేవరకొండ. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఎంపైర్ స్టేట్ బిల్డింగ్‌పై మన మూడు రంగులు చూడటం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ప్రవాస భారతీయ సోదరులు మన దేశ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటుతున్నారు. దేశం కోసం వీళ్లు చేస్తున్న ప్రయత్నం చూస్తుంటే గర్వంగా ఉంది. మన పెద్దల త్యాగాలు, వారి కృషి కారణంగానే మనందరం ఇంత ఆనందంగా జీవించగలుగుతున్నాం" అంటూ స్వాతంత్ర్య సమర యోధుల్ని గుర్తు చేసుకున్నారు.

రెండు భాగాలుగా... 'హలగలి'



కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి సిద్ధమవుతున్న మరో పాన్ ఇండియా సినిమా.. 'హలగలి'. డాలీ ధనంజయ, సప్తమిగౌడ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సుకేశ్ నాయక్ దర్శకుడు. కల్యాణ్ చక్రవర్తి ధూళిపాళ్ల నిర్మిస్తున్నారు. యార్లగడ్డ లక్ష్మీశ్రీనివాస్ సమర్పకులు. కన్నడతోపాటు, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో రెండు భాగాలుగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రచార చిత్ర విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కథానాయకుడు డాలీ ధనంజయ మాట్లాడుతూ "హలగలి అంటే కర్ణాటకలో ఓ గొప్ప భావోద్వేగం. బ్రిటిష్ పాలనపై చేసిన తిరుగుబాటులో ఈ ఊరుకి, వీళ్లు చేసిన పోరుకీ ఓ ప్రత్యేకత ఉంది. ఆ కథే ఈ సినిమాతో వెలుగులోకి వస్తుండడం, అందులో నేను భాగం కావడం ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు సుకేశ్ ఎంతో తపనతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రేక్షకులకు ఓ గొప్ప అనుభవాన్ని పంచుతుంది" అన్నారు. కథానాయిక సప్తమిగౌడ మాట్లాడుతూ "చరిత్రలో ఓ కీలకమైన అధ్యాయం ఈ కథ. మన నేల కథ. దర్శకుడు రాసిన విధానం చాలా బాగుంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో నేనొక మాస్ పాత్రలో కనిపిస్తా. ధనంజయతో ఇది నా రెండో సినిమా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక భాగంగా చెప్పే కథ కాదు ఇది. ఈ కథ వెనక ఓ గొప్ప చరిత్ర ఉంది. అందుకే రెండు భాగాలుగా తెరపైకి తీసుకొస్తున్నాం. ఇప్పటికే నలభై శాతం చిత్రీకరణ పూర్తయింది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "హలగలి ఊరిపై ఎంతోమంది పరిశోధనలు చేశారు. కన్నడలో పదో తరగతి పాఠ్యాంశంలోనూ హలగలికి చోటుంది. ఈ సినిమా ప్రయాణంలో మాకు మరిన్ని విషయాలు తెలిశాయి. ఒకొక్క సంఘటన రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంటుంది. డాలీ ధనంజయ ఇందులో ఓ శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు" అన్నారు.

తల్లిదండ్రులు తప్పు చేసినా ఆదరించాల్సిందే

తల్లిదండ్రులు లేక కొందరు అనాథలుగా జీవిస్తుంటారు. చెల్లాదురై, సుధా అనే అన్నాచెల్లెళ్లది కూడా ఇదే పరిస్థితి. వీళ్లిద్దరూ వద్దనుకొని వదిలేసిన ఆ తల్లిదండ్రులు చివరి దశలో పిల్లల దగ్గరకు చేరతారు. అప్పుడు కూడా ఆ అన్నాచెల్లెళ్లు తల్లిదండ్రులను ఆదరిస్తారు. జీవితంలో తల్లిదండ్రులు ఎంత పెద్ద తప్పు చేసినా వారు మన బాధ్యతే అనే సందేశాన్ని పంచుతున్న ఆ కథేంటో మీరూ చూడండి.





సినిమా: 'కోజీ పన్నయ్ చెల్లాదురై'
జానర్: ఫ్యామిలీ డ్రామా
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో

కథాంశం: విడిపోయిన తల్లిదండ్రులతో చిన్నప్పుడే అనాథలు అవుతారు చెల్లాదురై (ఏగన్), సుధా(సత్యదేవి). తర్వాత వాళ్ల అమ్మమ్మ ఆశ్రయం ఇవ్వడంతో ఆమె దగ్గరే పెరుగుతారు. కొన్నాళ్లకు ఆమె కూడా చనిపోతుంది. ఆ తర్వాత తినడానికి తిండి లేక పస్తులుంటూ ఆకలితో బాధపడుతుంటారు. ఇంతలో పెరియసామి(యోగి బాబు) పరిచయమవుతాడు. వాళ్లు అనాథలని తెలుసుకుని కోళ్లఫారంలో చెల్లాదురైకి పని ఇస్తాడు. అలా కష్టపడి దొరికిన ప్రతీ పనిని చేస్తు చెల్లెలికి ఏ లోటు రాకుండా చూసుకుంటాడు చెల్లాదురై. అక్కడే కుండల షాపు పెట్టుకొని శెల్వి(బ్రిగిడ సాగ) చెల్లాదురైని ప్రేమిస్తూ అతడి వెంటే తిరుగుతూ ఉంటుంది. కానీ బాధ్యతల కారణంగా చెల్లాదురై తనని పట్టించుకోడు. అంతలోనే తన చెల్లెలు ఒక వ్యక్తిని ప్రేమించడం.. పెళ్లి చేయాలనుకునే సరికి అనారోగ్య సమస్యలతో తల్లిదండ్రులు మళ్లీ ఇతడి జీవితంలోకి వస్తారు. అలాంటి సమయంలో తన బంధాలను ఎలా నిలబెట్టుకున్నాడో తెలియాలంటే 'కోజీ పన్నయ్ చెల్లదురై' సినిమా చూడాల్సిందే. ఈ సినిమాని ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో శీను రామసామి తెరకెక్కించారు.

- ఇది గ్రామీణ నేపథ్యంలో మంచి భావోద్వేగాలను మేళవించి చూపిన కథ. పరిమితమైన పాత్రలతో బలమైన ఎమోషన్స్‌ని.. ప్రేక్షకులకు అనుబంధాలు, బాధ్యతల విలువను చూపించిందీ సినిమా. తల్లిదండ్రులిద్దరూ అనారోగ్యాలతో తిరిగొచ్చినప్పుడు చెల్లాదురై ఆవేదనకు గురయ్యే సన్నివేశాలు భావోద్వేగ భరితంగా ఉంటాయి. ఈ పాత్ర నిజజీవితంలోనూ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుంది. మొత్తంగా చిన్న కథే అయినప్పటికీ మంచి ఫీల్ గుడ్ మూవీ అనే చెప్పొచ్చు.

ఈనాడు ప్రతిభ

■ e-mail: pratibhadesk@eenadu.net

17

సోమవారం ఆగస్టు 18, 2025

బాట వైశాల్యాలు

ముఖ్యాంశాలు

దీర్ఘచతురస్రాకార, చతురస్రాకార లేదా వృత్తాకార స్థలాల చుట్టూ బయట లేదా లోపల W మీ వెడల్పుతో బాట నిర్మించినట్లయితే ఆ బాట వైశాల్యం కనుక్కోవచ్చు.

దీర్ఘచతురస్రాకార స్థల వైశాల్యం = పొడవు × వెడల్పు = $l \times b$

చతురస్రాకార స్థల వైశాల్యం = భుజం × భుజం = s^2

వృత్త వైశాల్యం = πr^2

కంకణ వైశాల్యం = $\pi(R - r)^2$

$= \pi(R + r)(R - r)$

షేడ్ చేసిన స్థల వైశాల్యాలు:

- సెక్టార్ వైశాల్యం = $\frac{x^\circ}{360} \times \pi r^2 = \frac{lr}{2}$
- త్రిభుజ వైశాల్యం = $\frac{1}{2}$ × భూమి × ఎత్తు
- చతురస్ర వైశాల్యం = భుజం × భుజం
- సమబాహు త్రిభుజ వైశాల్యం = $\frac{\sqrt{3}}{4} a^2$



మైదానం చుట్టూ నిర్మించే మొత్తం బాట ఖర్చు?


ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

1. ఒక దీర్ఘచతురస్రాకార హాలు పొడవు 12 మీ., వెడల్పు 10 మీ. హాలు చుట్టూ 2 మీ. వెడల్పైన ఖాళీ స్థలం ఉంది. అయితే ఆ స్థల వైశాల్యం ఎంత?

1) 52 చ.మీ. 2) 26 చ.మీ. 3) 104 చ.మీ. 4) 78 చ.మీ.

సాధన:



ఖాళీ స్థలం వైశాల్యం = EFGH వైశాల్యం − ABCD వైశాల్యం

$= 16 \times 14 - 12 \times 10$


$= 224 - 120 = 104$ చ.మీ.

సమాధానం: 3

2. 112 మీ. పొడవు, 78 మీ. వెడల్పైన గడ్డి మైదానం లోపల చుట్టూ 2.5 మీ. వెడల్పైన బాటను నిర్మించడానికి చ.మీ.కు రూ.2 చొప్పున మొత్తం ఎంత ఖర్చు అవుతుంది?

1) రూ.925 2) రూ.1850 3) రూ.1000 4) రూ.1500

సాధన:



బాట వైశాల్యం = ABCD వైశాల్యం − EFGH వైశాల్యం

$= 78 \times 112 - 73 \times 107 = 925$ చ.మీ.

చ.మీ.కు రూ.2 చొప్పున అయ్యే ఖర్చు = 925×2 = రూ.1850

సమాధానం: 2

3. ఒక చతురస్రాకార తోట చుట్టూ 2 మీ. వెడల్పైన బాట ఉంది. బాట వైశాల్యం 9680 చ.మీ. అయితే తోట వైశాల్యం ఎంత?

1) 1459264 చ.మీ. 2) 120800 చ.మీ.

3) 123684 చ.మీ. 4) 5968001 చ.మీ.

సాధన: బాట వైశాల్యం

$= (x + 4)^2 - x^2 = 9680$


$x^2 + 8x + 16 - x^2 = 9680$

$8x + 16 = 9680 \Rightarrow 8x = 9664$

$\Rightarrow x = 1208$ మీ.

తోట వైశాల్యం = $x^2 = (1208)^2$

= 1459264 చ.మీ.




సమాధానం: 1

4. 80 మీ. పొడవు, 60 మీ. వెడల్పైన స్థలం చుట్టూ ఒక బాట ఉంది. ఆ బాట వైశాల్యం 1500 చ.మీ. అయితే బాట వెడల్పు ఎంత?

1) 3 మీ. 2) 4 మీ. 3) 5 మీ. 4) 10 మీ.

సాధన:



బాట వెడల్పు = x అనుకుందాం

బాట వైశాల్యం = $(80 + 2x)(60 + 2x) - 80 \times 60 = 1500$

$= 4800 + 160x + 120x + 4x^2 - 4800 = 1500$

$= 280x + 4x^2 = 1500 \Rightarrow 4x^2 + 280x - 1500 = 0$

$= x^2 + 70x - 375 = 0 \Rightarrow x^2 + 75x - 5x - 375 = 0$

$x(x + 75) - 5(x + 75) = 0 \Rightarrow (x + 75)(x - 5) = 0$

$x = -75$ లేదా $x = 5$ (ధనాత్మకం)

సమాధానం: 3

5. ఒక చతురస్రాకార గదికి లోపల 64 చ.మీ. వైశాల్యం ఉన్న వరండా, 2 మీ. వెడల్పైన బాట ఉంది. అయితే గది వైశాల్యం ఎంత? (చ.మీ.లో)

1) 100 2) 81 3) 64 4) 121

సాధన: $x^2 - (x - 4)^2 = 64$


$x^2 - (x^2 - 8x + 16) = 64$

$x^2 - x^2 + 8x - 16 = 64$

$8x = 64 + 16$

$x = \frac{80}{8} = 10$ మీ.

వైశాల్యం = $x^2 = 10^2 = 100$ చ.మీ.



సమాధానం: 1

6. కింది పటంలో ABCD చతురస్ర భుజం పొడవు 14 సెం.మీ. అయితే షేడ్ చేసిన భాగం వైశాల్యం ఎంత? (సెం.మీ.^{2}లో)

1) 36 2) 42 3) 40 4) 38


సాధన: షేడ్ చేసిన వైశాల్యం

= □ వైశాల్యం − షేడ్ చేయని భాగం

$= 14 \times 14 - 4 \times$ సెక్టార్ వైశాల్యం

$= 196 - 4 \times \frac{90}{360} \times \frac{22}{7} \times 7 \times 7$

$= 196 - 154 = 42$ సెం.మీ.^{2}




సమాధానం: 2

7. ఒక వృత్తాకార స్థలం చుట్టూ 3 మీ. వెడల్పైన బాట ఉంది. ఆ వృత్త పరిధి 36π మీ. అయితే ఆ మార్గం వైశాల్యం ఎంత? (చ.మీ.లో)

1) 117π 2) 127π 3) 117π 4) 127π

సాధన:



$\pi(R + r)(R - r)$

$\pi(21 + 18)(21 - 18)$

$= \pi\, 39 \times 3$

$= 117\pi$

సమాధానం: 1



రచయిత

హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

745 Word of the Day

Falter

Telugu meaning: తడబడటం, సంకోచించు

English meaning: The word falter (ఫాల్టర్) is a verb that describes hesitation, losing strength, confidence, or momentum.

Synonyms: Stumble, Flinch

Antonyms: Persist, Continue

Usage: **1.** His voice began to falter as he recounted the painful memory of the accident.

2. The soldier did not falter in his duty, even in the face of grave danger.

కరెంట్ అఫైర్స్



మహిళల 2000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో ఒలింపియన్ అంకిత ధ్యాని జాతీయ రికార్డును నమోదు చేసింది. 2025, ఆగస్టు 15న జరిగిన గ్రాండ్‌స్లామ్ జెరుసలేమ్ అథ్లెటిక్స్ మీట్‌లో ఆమె 6 నిమిషాల 13.92 సెకన్లలో రేసును పూర్తి చేసి స్వర్ణం సొంతం చేసుకుంది. ఈ క్రమంలో పారుల్ చౌదరి (6:14.38) పేరిట ఉన్న రికార్డును తిరగరాసింది.



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే 'స్త్రీశక్తి పథకాన్ని' ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభించారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దీన్ని అమలు చేస్తారు. మొత్తం 11,449 బస్సుల్లో, 8,458 బస్సులు స్త్రీశక్తి కోసం కేటాయించారు.



ప్రపంచంలోనే అత్యధిక రుణభారం ఉన్న దేశంగా అమెరికా నిలిచింది. ఇందులో పావు వంతు మిగతా దేశాలది. అమెరికా ప్రభుత్వం తన రుణ దాతలకు చెల్లించాల్సిన మొత్తం సొమ్ము ప్రస్తుతం 37 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది అమెరికా జీడీపీలో 122 శాతానికి సమానం. ప్రతి మూడు నెలలకు రుణభారం దాదాపు లక్షల కోట్ల డాలర్లు పెరుగుతోంది. 2020లో కొవిడ్ సమయంలో అత్యధికంగా రుణాలు, జీడీపీ నిష్పత్తి 133 శాతానికి చేరింది. ప్రపంచంలోనే ఈ నిష్పత్తి అధికంగా ఉన్న మొదటి 10 దేశాల్లో అమెరికా కూడా ఉంది.



ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా క్యాపిటల్ సహా అగ్రగామి 10 ఆర్థిక సంస్థల రేటింగ్‌ను అమెరికాకు చెందిన ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ పెంచింది. ఇటీవలే ఈ సంస్థ 18 ఏళ్ల తర్వాత భారత సార్వభౌమ రేటింగ్‌ను పెంచింది.


మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నేతాజీ సుభాష్ చంద్రబోస్

స్టడీ - జోన్

సుభాష్ చంద్రబోస్.. ఈ పేరు వినగానే భారత జాతి పులకిస్తుంది. ప్రతి వ్యక్తిలో ఆరాధన భావం ఉప్పొంగుతుంది. సాయుధ పోరాటం ద్వారానే బ్రిటిష్ వారిని మన దేశం నుంచి తరమగలమని ప్రకటించారు. "నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను స్వేచ్ఛను ఇస్తాను" అని యువతలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చారు. "జైహింద్" నినాదంతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపారు. ప్రత్యేక సైన్యాన్ని సమకూర్చుకుని ఆంగ్లేయులతో యుద్ధం చేశారు. దేశ ప్రజలంతా ఆయన్ను 'నేతాజీ'గా పిలుస్తారు. బోస్ ప్రయాణిస్తున్న విమానం 1945, ఆగస్టు 18న ప్రమాదానికి గురికాగా, ఆయన మరణించినట్లు జపాన్ రేడియో ప్రకటించింది. అయితే దీనిపై నేటికీ అనేక అనుమానాలు ఉన్నాయి.

- బోస్ 1897 జనవరి 23న కటక్‌లో జన్మించారు. చిత్తరంజన్ దాస్‌ను ఆయనకు రాజకీయ గురువుగా పేర్కొంటారు.
- 1921లో కాంగ్రెస్‌లో చేరారు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం పిలుపుతో బోస్ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. చౌరీచౌరాలో జరిగిన ఒక హింసాయుత సంఘటన నేపథ్యంలో గాంధీజీ 1922, ఫిబ్రవరి 5న పోరాటాన్ని నిలిపేశారు. ఆ నిర్ణయంతో బోస్ విభేదించారు.
- 1938లో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీజీతో విభేదాల కారణంగా కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి 'అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్' పార్టీని స్థాపించారు. 1940లో ఆ పార్టీ మహాసభ నాగ్‌పుర్‌లో జరిగింది.
- 1939 చివర్లో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. యుద్ధ ప్రక్రియలో బ్రిటిషర్లకు భారతీయులు సహకరించకూడదని బోస్ సూచించారు. బ్రిటిష్ ప్రభుత్వం 1940లో ఆయన్ను అరెస్ట్ చేసి, గృహ నిర్బంధంలో ఉంచింది. బోస్ 1941లో తప్పించుకుని పెషావర్, కాబూల్ మీదుగా జర్మనీలోని బెర్లిన్ చేరారు. అక్కడి నుంచి జపాన్ వెళ్లారు.




- సుభాష్ చంద్రబోస్ 1943, జులైలో రాస్ బిహారీ బోస్ నుంచి భారత స్వాతంత్ర్య సమితి (ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్) బాధ్యతలను, కెప్టెన్ మోహన్ సింగ్ నుంచి భారత జాతీయ సైన్యం బాధ్యత (ఐఎన్‌ఏ)లను స్వీకరించారు. ఆ తర్వాత ఐఎన్‌ఏ పేరును 'ఆజాద్ హింద్ ఫౌజ్'గా మార్చారు. భారత జాతీయ సైన్యాన్ని గాంధీ, నెహ్రూ, ఆజాద్, ఝాన్సీ, బోస్ అనే అయిదు రెజిమెంట్లుగా విభజించారు.
- 1943, అక్టోబరు 21న సింగపూర్‌లో 'ఆజాద్ హింద్' తాత్కాలిక ప్రవాస భారత ప్రభుత్వం ఏర్పాటును ప్రకటించారు. జపాన్‌తో సహా ఎనిమిది దేశాలు దీన్ని అధికారికంగా గుర్తించాయి. 1945, ఆగస్టు 18న బోస్ జపాన్ విమానంలో పైగాస్, ఫార్మోసా మీదుగా టోక్యో బయలుదేరారు. అది మార్గ మధ్యంలో ప్రమాదానికి గురైంది.

జనరల్ స్టడీస్ బయాలజీ

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం

ఎండోప్లాస్మిక్ రెటిక్యులంను తొలిసారిగా ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ సహకారంతో 1940లో గమనించారు. లైట్ మైక్రోస్కోప్‌తో సాధ్యమయ్యే దానికంటే వివరంగా కణసంబంధ నిర్మాణాలను అధ్యయనం చేసేందుకు ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ శాస్త్రవేత్తలకు ఉపకరిస్తుంది. ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌తో పనిచేస్తున్నప్పుడు 1945లో కీత్ ఆర్.పోర్టర్, ఆల్బర్ట్ క్లాడ్, ఎర్నెస్ట్ ఎఫ్.ఫుల్లమ్ అనే శాస్త్రవేత్తలు కణాంగాన్ని కనుకున్నారు.



- ఎండోప్లాస్మిక్ రెటిక్యులం అనే పదాన్ని కీత్ పోర్టర్ 1953లో ఉపయోగించారు. ఈ పదం గ్రీకు పదాలైన ఎండో (లోపల), ప్లాస్మా (సైటోప్లాజం), రెటిక్యులం (నెట్‌వర్క్) అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది.

- ఎండోప్లాస్మిక్ రెటిక్యులం అనే పదాన్ని కీత్ పోర్టర్ 1953లో ఉపయోగించారు. ఈ పదం గ్రీకు పదాలైన ఎండో (లోపల), ప్లాస్మా (సైటోప్లాజం), రెటిక్యులం (నెట్‌వర్క్) అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది.

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం విధులు

- ప్రోటీన్ సింథసిస్ (RER)
- ప్రోటీన్ ఫోల్డింగ్, సవరణ
- నాణ్యత నియంత్రణ
- లిపిడ్ సింథసిస్
- నిర్విషీకరణ
- కాల్షియం నిల్వ
- కార్బోహైడ్రేట్ జీవక్రియ

ఎండోప్లాస్మిక్ రెటిక్యులం నిర్మాణం, ER పనితీరుకు సంబంధించిన వ్యాధులు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Act Apprentice Posts

Railway Recruitment Cell, Mumbai, invites online applications for engagement of Act Apprentices in the designated trades at Workshops/ Units in the jurisdiction of Central Railway. The total no. of posts is 2,418. The application fee is Rs.100. The last date for online applications is 11 September 2025.

SSC Officer Posts

Applications are invited from eligible unmarried men and women candidates for the Short Service Commission (SSC) grant for a course commencing June 2026 onwards at the Indian Naval Academy (INA) Ezhimala, Kerala. The total no. of posts is 260. The last date for online applications is 1 September 2025.

Apprentice Posts

Indian Oil Corporation Limited (IOCL) is inviting applications for the Trade, Technician and Graduate Apprentice posts in the states of Tamil Nadu, Puducherry, Kerala, Telangana, Andhra Pradesh and Karnataka. The total no. of posts is 475. Eligible candidates can apply online before 5 September 2025.

Did You Apply..?

Today (August 18) is the last date for the following Jobs

- 262 Manpower posts in Oil India Limited.

Eligibility: 10th, 10+2, B.Sc (Nursing), Degree.

For more information and other notifications - scan QR code

Active Voice & Passive Voice

Directions (Qs. 1 - 6): *Select the correct Active form of the given sentence.*

1. The homework is being completed by the students.

A) The students complete the homework.
B) The students completed the homework.
C) The students will complete the homework.
D) The students are completing the homework.

2. The letter was written by her yesterday.

A) She was writing the letter yesterday.
B) She wrote the letter yesterday.
C) She writes the letter yesterday.
D) She had written the letter yesterday.

3. The bridge will be inaugurated by the minister tomorrow.

A) The minister inaugurates the bridge tomorrow.
B) The minister inaugurated the bridge tomorrow.
C) The minister will inaugurate the bridge tomorrow.
D) The minister has inaugurated the bridge tomorrow.

4. The match was being watched by thousands of fans.

A) Thousands of fans were watching the match.
B) Thousands of fans are watching the match.
C) Thousands of fans watched the match.
D) Thousands of fans had watched the match.

5. The work has been finished by them.

A) They are finishing the work.
B) They finished the work.
C) They have finished the work.
D) They had finished the work.

6. The thief was caught by the police.

A) The police catch the thief.
B) The police caught the thief.
C) The police have caught the thief.
D) The police will catch the thief.

Directions (Qs. 7 - 12): *Select the correct Passive form of the given sentence.*

7. She writes beautiful poems every evening.

A) Beautiful poems are written by her every evening.
B) Beautiful poems were written by her every evening.
C) Beautiful poems will be written by her every evening.
D) Beautiful poems are being written by her every evening.

SSC Exams

English

8. We are watching a movie in the multiplex.

A) A movie was watched by us in the multiplex.
B) A movie has been watched by us in the multiplex.
C) A movie is being watched by us in the multiplex.
D) A movie is watched by us in the multiplex.

9. The teacher explained the chapter clearly.

A) The chapter was explained by the teacher clearly.
B) The chapter is explained by the teacher clearly.
C) The chapter has been explained by the teacher clearly.
D) The chapter had been explained by the teacher clearly.

10. The committee will announce the results tomorrow.

A) The results are announced by the committee tomorrow.
B) The results have been announced by the committee tomorrow.
C) The results were announced by the committee tomorrow.
D) The results will be announced by the committee tomorrow.

11. She has completed the project successfully.

A) The project is completed successfully by her.
B) The project was completed successfully by her.
C) The project has been completed successfully by her.
D) The project had been completed successfully by her.

12. They were building a new bridge last year.

A) A new bridge is built by them last year.
B) A new bridge was being built by them last year.
C) A new bridge will be built by them last year.
D) A new bridge is being built by them last year.

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert



ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి పరీక్ష .. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)-2026 ప్రకటన వెలువడింది. ఈ పరీక్షను ఐఐటీ గువాహటి నిర్వహించనుంది. ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), ప్రైవేట్ సంస్థలూ ఉద్యోగ నియామకాలకు గేట్ స్కోరు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఈ స్కోరుతో దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశంతోపాటు నెలకు రూ. 12,400 ఉపకార వేతనం లభిస్తుంది. ఈ పరీక్షలో మెరుగైన స్కోరుకు ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకుందాం!

గేట్ గెలుద్దాం!

గేట్ స్కోరు ఆధారంగా ఐఐటీల్లో, ఐఐఎస్సీ బెంగళూరు, వివిధ ఎన్ఐటీలు, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్/ టెక్నాలజీ/ సైన్స్/ ఫార్మసీ/ ఆర్కిటెక్చర్/ హ్యుమానిటీస్ సంబంధిత విభాగాల్లో/ శాఖల్లో మాస్టర్ ప్రోగ్రామ్స్, డైరెక్ట్ డాక్టోరల్ ప్రోగ్రాములు, డాక్టొరల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం లభిస్తుంది. పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు (బీఈ/ బీటెక్/ ఎమ్మెస్సీ తత్సమాన కోర్సు తర్వాత చెల్లుబాటయ్యే గేట్ స్కోరుతో డైరెక్ట్ పీహెచ్‌డీ) మొదటి రెండు సంవత్సరాలకు నెలకు రూ. 37,000, మూడో ఏట నుంచి ఐదో సంవత్సరం వరకు నెలకు రూ.42,000 ఆర్థిక సహాయం అందుతుంది. మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వరంగ సంస్థలు, కొన్ని ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాలకు గేట్ స్కోరు ప్రామాణికం. అందువల్ల ఈ పరీక్ష ప్రాముఖ్యం కొనసాగుతోంది.

గేట్‌లో కొద్ది సంవత్సరాలుగా మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త పేపర్లను ప్రవేశపెట్టడం, సిలబస్‌లో మార్పులు, బీఎస్/ ఎంబీబీఎస్/ బీడీఎస్ విద్యార్థులకూ పరీక్ష రాసే అవకాశం కల్పించడం లాంటివి చూశాం. ఈసారి ఇంజినీరింగ్ సైన్సెస్ (ఎక్స్ఈ) పేపర్‌లో ఎనర్జీ సైన్స్ (ఎక్స్ఈ-1) కొత్త సెక్షనల్ పేపర్‌ను ప్రవేశపెడుతున్నారు.

● గేట్-2026ను అభ్యర్థులు రెండు పేపర్లలో రాసే అవకాశం ఉంటుంది. తమ ఇష్ట ప్రకారం ఒకటి లేదా రెండు పేపర్లు ఎంచుకోవచ్చు. రెండో పేపర్ ఎంపిక .. మొదటి పేపర్ ఎంపికపై ఆధారపడి ఉంటుంది. గేట్ స్కోరు పీజీ ప్రవేశానికి మూడు సంవత్సరాలు, పీఎస్‌యూల్లో నియామకానికి ఒకటి లేదా రెండేళ్లు చెల్లుతుంది.

పరీక్ష విధానం:

గేట్ ప్రశ్నపత్రంలో మొత్తం 100 మార్కులకు 65 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలుంటాయి.

విభాగం-1 (జనరల్ ఆప్టిట్యూడ్):

▼ ఇందులో పది ప్రశ్నలుంటాయి. ఐదు ఒక మార్కు ప్రశ్నలు, మరో ఐదు రెండు మార్కుల ప్రశ్నలు. ఈ విభాగంలోని నాలుగు నుంచి ఐదు ప్రశ్నలు ఇంగ్లిష్ (వెర్బల్ ఎబిలిటీ), మిగతా ప్రశ్నలు క్వాంటిటేటివ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇవ్వొచ్చు.

▼ రోజువారీ వార్తాపత్రికలు చదవడం, క్యాట్ లాంటి ఇతర పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు సాధన చేస్తే ఈ విభాగంలో మంచి మార్కులకు వీలుంది.

విభాగం-2: (సంబంధిత ఇంజినీరింగ్ సబ్జెక్టులు)

▼ ఈ విభాగంలో 55 ప్రశ్నలుంటాయి. ఇందులో 25 ఒక మార్కు ప్రశ్నలు, 30 రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి.

గణితం: 10 నుంచి 15 మార్కులు. అయితే ఈ విభాగంలోని ప్రశ్నలు శుద్ధ గణితంలా ఉండవు. ఇంజినీరింగ్ అప్లికేషన్‌తో ఉంటాయి. ప్రశ్నలు ఆయా రంగాల్లోని నూతన ఆవిష్కరణలను దృష్టిలో పెట్టుకుని అడుగుతారు.

ప్రశ్నలు మూడు రకాలు

ఈ పరీక్షను ఆన్‌లైన్ పరీక్ష విధానంలో కంప్యూటర్ మౌస్‌ను ఉపయోగించి సరైన ఆప్షన్ గుర్తించాలి. ప్రశ్నపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మూడు రకాలుగా ప్రశ్నలు అడుగుతారు.

1. బహుళైచ్ఛిక ప్రశ్నలు: నాలుగు ఆప్షన్లు ఇస్తారు. అందులో ఒకటి మాత్రమే సరైనది. దాన్నే గుర్తించాలి.

2. బహుళ ఎంపిక ప్రశ్నలు: ఇవి కూడా బహుళైచ్ఛిక ప్రశ్నలుగానే ఉంటాయి. కానీ ఇందులో ఒకటి కంటే ఎక్కువ సరైన ఆప్షన్లు ఉంటాయి. ఇచ్చిన నాలుగు ఆప్షన్లలో మూడు సరైనవైతే ఆ సరైన మూడు ఆప్షన్లూ గుర్తించాలి. ఒకవేళ ఒకటే లేదా రెండు సరైన ఆప్షన్లను గుర్తిస్తే ఎలాంటి మార్కులూ ఇవ్వరు.

3. సంఖ్యా సమాధాన ప్రశ్నలు (న్యూమరికల్): ఎలాంటి ఆప్షన్లూ ఇవ్వరు. సమాధానాలు వర్చువల్ కీబోర్డును ఉపయోగించి రాయాలి.

నెగెటివ్ మార్కులతో జాగ్రత్త: గేట్‌లో ఒక తప్పు జవాబుకు 33.33 శాతం రుణాత్మక మార్కులు. అంటే ఒక మార్కు ప్రశ్నకు 1/3, రెండు మార్కుల వాటికి 2/3 చొప్పున మైనస్ మార్కులుంటాయి. న్యూమరికల్ ప్రశ్నలకూ, బహుళ ఎంపిక ప్రశ్నలకూ రుణాత్మక మార్కులుండవు.

సన్నద్ధత వ్యూహం

- అన్ని సబ్జెక్టులకూ ప్రాధాన్యం ఇవ్వాలి. కాకపోతే పరీక్ష సిలబస్‌ను బట్టి ఏయే సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలో నిర్ణయించుకోవాలి.
- పరీక్ష సిలబస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. దీనితోపాటు పరీక్ష విధానాన్ని అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమే.
- గేట్-2026 పరీక్ష ఫిబ్రవరి నెలలో జరుగుతుంది. అంటే.. ఏడు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో సన్నద్ధత పూర్తిచేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ఈ ప్రణాళికలో పునశ్చరణకు కూడా సమయం కేటాయించాలి.

ముందుగానే..

- పరీక్ష సమయానికి చాలా ముందుగానే సన్నద్ధతను మొదలుపెట్టడం వల్ల పరీక్ష ప్రణాళికను, సంబంధిత మెటీరియల్‌ను సమకూర్చుకోవచ్చు. సన్నద్ధత వ్యూహ రచన, సిలబస్‌లో ఉన్న కాన్సెప్ట్స్, విషయాలను ఎక్కువగా సాధన చేసుకోవచ్చు.
- గేట్ ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా సాధన చేయాలి. దీనివల్ల ఏ అంశాలకు, ఏ కాన్సెప్ట్‌లకు ఎలాంటి ప్రాధాన్యం ఇచ్చారో అర్థమవుతుంది. అంతేకాకుండా ఏ అంశాలపై ఎక్కువ దృష్టిపెట్టాలో తెలుస్తుంది.
- గత గేట్ ప్రశ్నపత్రాలతోపాటు ఈఎస్ఈ, ఇస్రో, పీఎస్‌యూల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీనవల్ల ఒక అంశాన్ని ఎన్ని విధాలుగా అడగడానికి అవకాశం ఉందో తెలుస్తుంది.
- ప్రామాణిక పాఠ్య పుస్తకాలు లేదా అధ్యయన సామగ్రి (స్టడీ మెటీరియల్) ఎంచుకోవడం సన్నద్ధతకు ప్రధానం.
- ప్రతి సబ్జెక్టు, ప్రతి చాప్టర్‌కు సంబంధించిన అంశాలను చిన్న చిన్న పట్టికలుగా తయారు చేసుకోవాలి.
- క్లిష్టమైన, సాధారణ, అతి సాధారణమైన అంశాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రతి చాప్టర్, సబ్జెక్టు చదివిన తర్వాత దానికి సంబంధించిన ప్రముఖ విద్యా సంస్థలు అందించే ఆన్‌లైన్ టెస్టులను రాయాలి. సన్నద్ధత పూర్తయిన క్రమంలో మాదిరి ప్రశ్నపత్రాలను (మాక్ టెస్టులు) రాయాలి.
- ఎన్‌టీపీఈఎల్ పాఠాలు విద్యార్థులకు ప్రాథమిక అంశాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడతాయి. అలాగే విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయడానికీ ఉపయోగపడతాయి.
- సన్నద్ధతలో భాగంగా.. గత సంవత్సర ప్రశ్నపత్రాల్లో ఏదేని ఒకటి పరీక్షకు కేటాయించిన సమయంలో రాయాలి. దాంతో ఏ స్థాయిలో ఉన్నారో అభ్యర్థులకు అర్థమవుతుంది. ఎలాంటి మార్పులు అవసరమో తెలుస్తుంది.

గేట్ సిలబస్ 60 శాతమే

నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్‌లో చదివే సిలబస్‌తో పోలిస్తే.. గేట్ పరీక్ష సిలబస్ 60 శాతం మాత్రమే. మొత్తం ఇంజినీరింగ్ బ్రాంచి మూలాలు, నూతన పోకడలు మాత్రమే గేట్ సిలబస్‌లో ఉంటాయి. ఒక పెద్ద కొండ సైతం రోజుకో బండ తొలగిస్తే కొంత కాలానికి మటుమాయమవుతుంది. రోజుకు రెండు నుంచి మూడు గంటలు ఒక్కో కాన్సెప్ట్ అర్థం చేసుకుంటూ ముందుకు వెళితే అందుబాటులో ఉన్న సమయంలో సిలబస్‌ని పూర్తిగా అర్థం చేసుకోవచ్చు.

● చాప్టర్‌వైజ్ టెస్టులు, మాక్ టెస్టులు రాసేటప్పుడు, నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేసినప్పుడు తప్పుగా సమాధానం రాసిన ప్రతి ప్రశ్ననీ సవరించుకోవాలి. వాటిపై ప్రత్యేక శ్రద్ధతో సాధన చేయాలి. దీనివల్ల ఆ తప్పిదాలు పరీక్ష సమయంలో పునరావృతం కాకుండా ఉంటాయి.

● చదివిన అన్ని అంశాలూ గుర్తుంటాయిలే అని భావించి పునశ్చరణను నిర్లక్ష్యం చేయకూడదు. చదివిన ప్రతి అంశాన్నీ తప్పనిసరిగా పునశ్చరణ చేయాలి.

ముఖ్య సమాచారం

అర్హతలు: ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, కామర్స్, సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: గరిష్ఠ పరిమితి లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 25.08.2025.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్/ దరఖాస్తు ప్రక్రియ ముగింపు: 25.09.2025. **పరీక్ష తేదీలు:** 2026 ఫిబ్రవరి 7, 8, 14, 15 **ఫలితాల విడుదల:** 19.03.2026
వెబ్‌సైట్: https://gate2026.iitg.ac.in



– ప్రొ. వై.వి.గోపాలకృష్ణమూర్తి
సీఎండీ, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

దేశ రక్షణలో భాగం కావాలనుకున్నవారికి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌తోపాటు మరెన్నో వేదికలు ఉపాధికి బాటలు వేస్తున్నాయి. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లలో భాగమైన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ఇటీవలే 3588 కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్) పోస్టులకు ప్రకటన వెలువరించింది. వీటికి పదో తరగతి, ఐటీఐ, ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దేహదార్ఢ్య, రాత, వైద్య పరీక్షలతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు లెవెల్-3 వేతనాలు అందుకోవచ్చు.

సరిహద్దులో సేవలందిస్తారా!

ఈ పోస్టులకు పురుషులతోపాటు మహిళలూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీల్లో 3406 పురుషులకు, 182 మహిళలకు కేటాయించారు. ఎంపికైనవారు రూ.21,700 మూల వేతనంతోపాటు అన్ని ప్రోత్సాహకాలూ కలిపి మొదటి నెల నుంచే సుమారు రూ.40,000 జీతం అందుకోవచ్చు. అనుభవం, అర్హతలు, అంతర్గత పరీక్షలతో వీరు లెవెల్-8, ఆపై స్థాయికీ చేరుకోగలరు. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ), రాత పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన, ట్రేడు టెస్ట్, వైద్య పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపడతారు. పలు ట్రేడుల్లో ఖాళీలున్నప్పటికీ అభ్యర్థులు మాత్రం ఏదైనా ఒక పోస్టు/ట్రేడుకే దరఖాస్తు చేసుకోవాలి. రాష్ట్రాలు, ట్రేడుల వారీ ఖాళీలు ప్రకటించారు. సొంత రాష్ట్రంలోని పోస్టులకే పోటీ పడగలరు.

స్టేజ్-1: పీఎస్‌టీ, పీఈటీ

పురుషులు 5 కి.మీ. దూరాన్ని 24 నిమిషాల్లో పరుగెత్తాలి. మహిళలు 1.6 కి.మీ.ని 8.30 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో విజయవంతమైతే స్టేజ్-2కి అనుమతిస్తారు.



బీఎస్ఎఫ్‌లో 3588 కానిస్టేబుల్ నియామకాలు

స్టేజ్-2: పరీక్ష

దీన్ని ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/ హిందీ మాధ్యమంలో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ప్రతి విభాగం నుంచి 25 చొప్పున.. జనరల్ అవేర్‌నెస్/జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథ్స్, ఎనలిటికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్/హిందీ సబ్జెక్టుల్లో ప్రశ్నలు ఉంటాయి. వీటిని పదో తరగతి సిలబస్ స్థాయిలోనే అడుగుతారు. పరీక్షలో అర్హతకు 35 మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలైతే 33 సరిపోతాయి. అర్హులకు స్టేజ్-3కి అనుమతిస్తారు.

స్టేజ్-3: డాక్యుమెంటేషన్

నిర్దేశిత పత్రాలు, సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. పదో తరగతి, ఐటీఐ, ఒకేషనల్, వయసు ధ్రువీకరణ, రిజర్వేషన్ ఉన్నవారైతే కేటగిరీ ప్రకారం.. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు, స్థానికతను తెలిపే సర్టిఫికెట్, ఫొటోలు ఇవన్నీ పరిశీలిస్తారు.

ట్రేడ్ టెస్టు: కొన్ని విభాగాల పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి సంబంధిత ట్రేడు ప్రకారం పరీక్ష నిర్వహిస్తారు.

మెడికల్ ఎగ్జామ్: పై అన్ని విభాగాల్లోనూ అర్హులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులోనూ ఎలాంటి ఇబ్బందీ లేకపోతే పరీక్షలో మార్కుల మెరిట్ ప్రకారం రాష్ట్రాల వారీ ఖాళీలు, రిజర్వేషన్లను అనుసరించి ఉద్యోగానికి ఖరారు చేస్తారు.

సన్నద్ధత

■ ముందుగా పరుగు పందెం నిర్వహిస్తారు కాబట్టి అందులో అర్హత పొందడానికి ఇప్పటి నుంచే శిక్షణ పొందాలి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయించాలి. అలవాటు లేని వారు ప్రారంభంలో ఒక కి.మీ. వేగంగా నడవటం, పరుగెత్తడాన్ని లక్ష్యం చేసుకోవాలి. తర్వాత ప్రతి పది రోజులకూ 500 మీటర్లు చొప్పున దూరాన్ని పెంచుకోవాలి. ఇలా సాధన చేస్తే 3 నెలల్లో 5 కి.మీ. లక్ష్యాన్ని 24 నిమిషాల్లో చేరుకోవడానికి వీలవుతుంది. పోషకాహారం, సరైన నిద్ర, సౌకర్యవంతమైన బూట్లు, పరుగెత్తడానికి అనువైన ప్రాంతం ఇవెంతో ముఖ్యం.

■ పరీక్షలో ప్రశ్నలన్నీ పదో తరగతి స్థాయిలోనే సులువుగానే వస్తాయి. అందువల్ల 8,9,10 తరగతుల సైన్స్, సోషల్, మ్యాథ్స్, ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలు బాగా అధ్యయనం చేయాలి. వీటిని చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలన్నీ నోట్సు రాసి, పరీక్షకు ముందు వాటిని మరోసారి మననం చేసుకోవాలి.

■ జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా వర్తమాన అంశాల నుంచీ ప్రశ్నలు వస్తాయి. 2025 జనవరి నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్యమైన సంఘటనలు గుర్తుంచుకోవాలి.

■ అగ్నివీర్, ఎస్ఎస్‌సీ- కానిస్టేబుల్ జీడీ, ఎంటీఎస్ పాత ప్రశ్నపత్రాలు ఈ పరీక్షకూ ఉపయోగపడతాయి.

■ కనీసం పది మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. వెనుకబడుతోన్న విభాగాల్లో మెరుగవ్వడానికి అదనపు సమయం కేటాయించి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.

ముఖ్య వివరాలు

అర్హత: కొన్ని ట్రేడులకు పదో తరగతి సరిపోతుంది. కొన్ని విభాగాలకు మాత్రం పదో తరగతి తర్వాత నిర్దేశిత ట్రేడుల్లో రెండేళ్ల ఐటీఐ లేదా ఏడాది ఐటీఐ/ఒకేషనల్ కోర్సు అనంతరం ఒక సంవత్సరం పని అనుభవం ఉండాలి. మిగిలిన పోస్టులకు పది తర్వాత ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్-1 సర్టిఫికెట్ అవసరం.
వయసు: 23.08.2025 నాటికి 18-25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో మినహాయింపు ఉంది.
ఎత్తు: పురుషులు 165 సెం.మీ., మహిళలు 155 సెం.మీ. ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.08.2025
ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు లేదు. మిగిలిన వారు రూ.150+ జీఎస్టీ చెల్లించాలి.
పరీక్ష తేదీ: తర్వాత ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

బీఎస్సీనా? ఇంజినీరింగా?

ఇంటర్మీడియట్ (ఎంపీసీ) పూర్తయింది. కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌తో డిగ్రీ.. కెమికల్ ఇంజినీరింగ్.. దేనితో ఉద్యోగావకాశాలు బాగుంటాయి? – సచిన్



శాస్త్రీయ పరిశోధన, బోధన, విద్యా రంగాలపై ఆసక్తి ఉన్నవారు బీఎస్సీ కెమిస్ట్రీనీ, పరిశ్రమల్లో వేగవంతమైన ఉపాధి, అధిక వేతనాలతో ఉద్యోగాలు కోరుకునేవారు కెమికల్ ఇంజినీరింగ్‌నూ ఎంచుకోవడం శ్రేయస్కరం.

■ ఇంటర్మీడియట్ (ఎంపీసీ) తర్వాత ఏం చదవాలనేది మీ దీర్ఘకాలిక/ స్వల్పకాలిక లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. ముందుగా ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం, బోధన, పరిశోధన, పరిశ్రమల్లో ఎలా స్థిరపడాలి అనే విషయంపై స్పష్టత ఉండాలి.

● బీఎస్సీ కెమిస్ట్రీ పట్టభద్రులకు ప్రభుత్వ రంగంలో ల్యాబొరేటరీ టెక్నీషియన్, కెమిస్ట్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ లాంటి ఉద్యోగాలు పరిమితంగా అందుబాటులో ఉంటాయి. ఔషధ సంస్థలు, రసాయన పరిశ్రమలు, పర్యావరణ సంస్థలు, బయోటెక్నాలజీ రంగం, ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాలల్లో చాలా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రారంభంలో వేతనం తక్కువైనా, అనుభవంతో పెరుగుతుంది.

ఉన్నత విద్యావకాశాల విషయానికి వస్తే.. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ/ బయోకెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ/ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ/మెటీరియల్ సైన్స్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్ లాంటి పీజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందవచ్చు. బోధనపై ఆసక్తి ఉన్నవారు బీఈడీ/ డీఈడీ చేసి ఉపాధ్యాయులుగా స్థిరపడవచ్చు. కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసి విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా, పరిశోధన సంస్థలూ, ఫార్మా పరిశ్రమల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడే అవకాశాలున్నాయి. విదేశాల్లో ఇలాంటి అర్హత కలిగినవారికి మరిన్ని ఉద్యోగాలు ఉంటాయి.

● కెమికల్ ఇంజినీరింగ్ ప్రొఫెషనల్ కోర్సు కావడంతో పరిశ్రమల్లో నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పెట్రో రసాయనాలు, ఔషధ పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్, వస్త్ర పరిశ్రమలు, పర్యావరణ నిర్వహణ లాంటి రంగాల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి.

కెమికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తయ్యాక ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, బయో కెమికల్ ఇంజినీరింగ్, పాలిమర్స్, నానో టెక్నాలజీ లాంటి రంగాల్లో ఉన్నత విద్యను కొనసాగించవచ్చు. ప్రభుత్వ రంగంలో ఆయిల్, విద్యుత్, ఎరువుల సంస్థలు, రక్షణ పరిశోధన కేంద్రాల్లో అవకాశాలున్నాయి. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడా, గల్ఫ్ దేశాల్లోనూ కెమికల్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

అప్రెంటిస్‌షిప్

సెంట్రల్ రైల్వేలో 2,418 ఖాళీలు

ముంబయిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ సెంట్రల్ రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు/ యూనిట్లలో వివిధ ట్రేడుల్లో 2,418 యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

ముంబయి క్లస్టర్: ● క్యారేజ్ & వ్యాగన్(కోచింగ్), వాడి బందర్- 258 ● కల్యాణ్ డీజిల్ షెడ్- 50 ● కుర్లా డీజిల్ షెడ్- 60 ● సీనియర్ డీఈఈ (టీఆర్ఎస్) కల్యాణ్- 124 ● సీనియర్ డీఈఈ (టీఆర్ఎస్) కుర్లా- 180 ● పరేల్ వర్క్‌షాప్- 303 ● మాతుంగ వర్క్‌షాప్- 547 ● ఎస్ & టీ వర్క్‌షాప్, బైకుల్లా- 60

భుసావల్ క్లస్టర్: ● క్యారేజ్ & వ్యాగన్ డిపో- 122 ● ఎలక్ట్రిక్ లోకో షెడ్, భుసావల్- 80 ● ఎలక్ట్రిక్ లోకోమోటివ్ వర్క్‌షాప్- 118 ● మన్మాడ్ వర్క్‌షాప్- 51 ● టీఎండబ్ల్యూ నాసిక్ రోడ్- 47

పుణె క్లస్టర్: ● క్యారేజ్ & వ్యాగన్ డిపో- 31 ● డీజిల్ లోకో షెడ్- 121 ● ఎలక్ట్రిక్ లోకో షెడ్, డాండ్- 40

నాగ్‌పూర్ క్లస్టర్: ● ఎలక్ట్రిక్ లోకో షెడ్, అజ్నీ- 48 ● క్యారేజ్ & వ్యాగన్ డిపో- 63 ● ఎంఈఎల్‌పీఎల్ ఏజేఎన్ఐ- 33

షోలాపూర్ క్లస్టర్: ● క్యారేజ్ & వ్యాగన్ డిపో- 55 ● కుర్దువాడి వర్క్‌షాప్- 21

ట్రేడులు: ఫిట్టర్, మెషినిస్ట్, షీట్ మెటల్ వర్కర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, మెకానిక్ మెషిన్ టూల్స్ మెయింటెనెన్స్, కంప్యూటర్ ఆపరేటర్ & ప్రోగ్రామ్ అసిస్టెంట్, మెకానిక్, పెయింటర్.
అర్హత: కనీసం 50 శాతం మార్కులతో 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ. ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా హోల్డర్స్ అర్హులు కాదు.
స్టైపెండ్: నెలకు రూ.7,000.
వయసు: 12.08.2025 నాటికి 15-24 ఏళ్ల మధ్య ఉండాలి.
శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షలతో
దరఖాస్తు ఫీజు: రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.09.2025.
వెబ్‌సైట్: https://rrccr.com/Home/Home

ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో..

భారత ప్రభుత్వ.. కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ సంస్థకు చెందిన ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ 280 ఐటీఐ అప్రెంటిస్‌ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● ఫిట్టర్: 120 ● ఎలక్ట్రీషియన్: 120 ● సీఓపీఏ: 20 ● వెల్డర్: 20

అర్హతలు: ఐటీఐ. ఎన్ఏటీఎస్ పోర్టల్‌లో రిజిస్టరై ఉండాలి.
స్టైపెండ్: నెలకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌లకు రూ.7,700; వెల్డర్, సీఓపీఏలకు రూ.7000.
ఎంపిక: విద్యార్హతల మెరిట్‌తో
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ది ఆఫీస్ ఆఫ్ ది జనరల్ మేనేజర్, హెచ్ఆర్‌డీ, డిసెర్గర్, పశ్చిమ్ బుర్ద్వాన్, పశ్చిమబెంగాల్ చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 26.09.2025.
వెబ్‌సైట్: https://www.easterncoal.nic.in/

ఎన్‌పీసీఐఎల్‌లో 70 ఖాళీలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) వివిధ విభాగాల్లో 70 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్

● ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: 50 ● డిప్లొమా అప్రెంటిస్: 10 ● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 10

అర్హత: పోస్టును అనుసరించి ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ.
వయసు: 02.09.2025 నాటికి ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 25 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
స్టైపెండ్: నెలకు ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,700 - రూ.8,050, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.09.2025.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో
వెబ్‌సైట్: https://www.npcilcareers.co.in/MainSiten/default.aspx

ఐఐసీటీలో మల్టీ-టాస్కింగ్ స్టాఫ్

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ).. 9 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ స్టెనోగ్రాఫర్- 01
● మల్టీటాస్కింగ్ స్టాఫ్- 08

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, టెన్+2/ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం.
వేతనం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.52,755; మల్టీటాస్కింగ్ స్టాఫ్‌కు రూ.35,393. **వయసు:** జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు; మల్టీటాస్కింగ్ స్టాఫ్‌కు 25 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాత పరీక్ష, స్టెనోగ్రాఫీ ప్రొఫిషియెన్సీ టెస్టులతో. **దరఖాస్తు ఫీజు:** రూ.500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/మహిళలు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు: 12.09.2025.
వెబ్‌సైట్: https://www.iict.res.in/

నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీలో..

పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ తాత్కాలిక ప్రాతిపదికన 4 ప్రాజెక్ట్ అసోసియేట్-II ఖాళీల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: లైఫ్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్‌లో మాస్టర్స్/ ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్, ఇంజినీరింగ్ లేదా టెక్నాలజీ విభాగంలో డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం. **వేతనం:** నెలకు రూ.35,000. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.08.2025. **ఇంటర్వ్యూ తేదీ:** 01.09.2025.
వెబ్‌సైట్: https://jobs.ncl.res.in/

ఉద్యోగాలు

హైదరాబాద్-ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో..

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన 3 అకడమిక్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి ఎంటెక్/ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం.
వయసు: 40 ఏళ్లు. **వేతనం:** నెలకు రూ.60,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.300, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: http://career.nirdpr.in//

వాక్-ఇన్

సీసీఆర్‌హెచ్‌లో రిసెర్చ్ ఫెలోలు

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి.. హైదరాబాద్‌లోని జేఎస్‌పీఎస్ జీహెచ్ఎంసీ కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన 6 రిసెర్చ్ ఫెలోల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● సీనియర్ రిసెర్చ్ ఫెలో(లైఫ్‌సైన్స్): 01 ● రిసెర్చ్ అసోసియేట్ (హోమియో): 01 ● సీనియర్ రిసెర్చ్ ఫెలో(హోమియో): 01 ● జూనియర్ రిసెర్చ్ ఫెలో(లైఫ్‌సైన్స్): 01 ● ల్యాబొరేటరీ టెక్నీషియన్స్: 02

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం. నెట్/ గేట్/ ఆర్ఈటీ స్కోరు ఉన్నవారికి ప్రాధాన్యం. **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి రిసెర్చ్ అసోసియేట్, సీనియర్ రిసెర్చ్ ఫెలోలకు 40 ఏళ్లు, జూనియర్ రిసెర్చ్ ఫెలో, ల్యాబొరేటరీ టెక్నీషియన్‌లకు 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.58,000; సీనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.42,000; జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000; ల్యాబొరేటరీ టెక్నీషియన్‌కు రూ.24,000. **ఎంపిక:** రాత పరీక్ష/ ఇంటర్వ్యూలతో **ఇంటర్వ్యూ తేదీలు:** ఆగస్టు 21, 22, 23. **ఇంటర్వ్యూ ప్రదేశం:** జేఎస్‌పీఎస్, గవర్నమెంట్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్, రామాంతపూర్, హైదరాబాద్.
పని ప్రదేశం: జేఎస్‌పీఎస్, గవర్నమెంట్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://www.ccrhindia.nic.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

మార్కెటింగ్

సంస్థ: ఎలిట్రా ఎడ్యుఫై టెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, మార్కెటింగ్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.2,000-25,000
☛ https://shorturl.at/eJbsP

టెలికాలింగ్

(డేటా జనరేషన్ అండ్ లీడ్ ఫిల్ట్రేషన్)

సంస్థ: లీడ్ మైన్స్ మీడియా
నైపుణ్యాలు: మార్కెటింగ్, ఇంగ్లిష్, హిందీ, కన్నడ మాట్లాడటం, రాయడం, మలయాళం మాట్లాడటం లేదా రాయడం
స్టైపెండ్: రూ.8,000
☛ https://shorturl.at/10pQd

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 13

